తెలంగాణా తొలితరం రచయిత

గూడూరి సీతారాం



కానుగచెట్టు

తెలంగాణాతొలితరం రచయిత
గూడూరి సీతారాం
సాహితీ జీవిత స్వర్ణోత్సవ సంచిక

సంపాదకులు :
డా. పత్తిపాక మోహన్

జనవరి 2005
మానేరు రచయితల సంఘం, సిరిసిల్ల
గూడూరి సీతారాం సాహితీ జీవిత స్వర్ణోత్సవ ఆహ్వాన సంఘం

కానుగచెట్టు

గూడూరి సీతారాం

సాహితీ జీవిత స్వర్ణోత్సవ సంచిక

11 జనవరి, మంగళవారం, 2005

ప్రతులకు

కార్యదర్శి,

మానేరు రచయితల సంఘం,

5.4.47, పత్తిపాకవీధి, సిరిసిల్ల-505 301.

సెల్: 9440022075 (రె)08723-233899

గూడూరి సీతారాం
ప్లాట్ నెం. 301, ఠాగూర్ రెసిడెన్సి, బర్కత్‌పురా,
హైదరాబాద్.
సెల్: 9391275757

డి.టి.పి.

- ఎల్లయ్య (పద్మపీఠం)

కె. శ్రీకాంత్ (పత్తిపాక గ్రాఫిక్స్)


బుక్ మేకింగ్

పత్తిపాక గ్రాఫిక్స్ & డిజిటల్స్

విమల టాకీసు రోడ్,

సిరిసిల్ల-505301

వెల : రూ. 30/-



కరీంనగర్ జిల్లా తొలి కథా రచయిత

మానేరు రచయితల సంఘం

గౌరవ అధ్యక్షులు **జి. రాములు**

సుప్రసిద్ధ కథారచయిత

జి. సురమౌళి గార్ల

స్మృతికి...

నివాళి

'మారసం' కార్యవర్గం

గౌరవ ముఖ్య సలహాదారు
జ్ఞానపీఠ అవార్డు గ్రహీత
డా॥ సి. నారాయణరెడ్డి ఎక్స్.ఎం.పి.

గౌరవ సలహాదారులు :
డా॥ జె. బాపురెడ్డి ఐ.ఏ.ఎస్.(రిటైర్డ్), డా॥ తిరుమల శ్రీనివాసాచార్య
బి. విద్యాసాగర్ రావు డి.యస్.పి., జక్కని వేంకటరాజం
డా॥ నలిమెల భాస్కర్, డా॥ వడ్డెపెల్లి కృష్ణ
జూకంటి జగన్నాథం

అధ్యక్షులు:
గూడూరి సీతారాం

ఉపాధ్యక్షులు :
కందేపి రాణీప్రసాద్, పెద్దింటి అశోక్ కుమార్
యెన్నం సత్యం, గరిపెల్లి అశోక్, టి.వి. నారాయణ

ప్రధాన కార్యదర్శి :
డా॥ పత్తిపాక మోహన్

నిర్వాహక కార్యదర్శులు :
యెలగొండ రవి, జిందం అశోక్

కోశాధికారి :
గోనె బాల్‌రెడ్డి

కార్యవర్గ సభ్యులు :
గెంట్యాల భూమేష్,షహనాజ్ ఫాతిమా, గరిపెల్లి నవీన్‌కుమార్,
స్వాధీన్ శుక్ల, అన్నల్‌దాస్ కరుణాకర్, అంకాలపు వీరేశంబాబు

ప్రెస్ ఇంచార్జ్ :
వేముల మార్కండేయులు

ఆహ్వాన సంఘం

గూడూరి ప్రవీణ్ కన్వీనర్

కొక్కుల భాస్కర్
ఎం.డి. సలీం
గోపగాని మదన్ మోహన్
జిందం అశోక్
యెన్నం సత్యం
మద్దికుంట లక్ష్మణ్
గెంట్యాల భూమేశ్

సలహాదారులు

రంగినేని మోహన్‌రావు
కనపర్తి లక్ష్మీనర్సయ్య
డా. వడ్డెపల్లి కృష్ణ
దూడం నాంపల్లి
పత్తిపాక లక్ష్మీరాజం

సంచిక సంపాదక వర్గం

సలహాదారులు

జక్కని వేంకటరాజం

డా. నలిమెల బాస్కర్

జూకంటి జగన్నాథం

డా. జి. లక్ష్మణరావు

తవుటు నాగభూషణం

దూడం నాంపల్లి

డా. గూడూరి రాఘవేంద్ర

సంపాదక వర్గం

గరిపెల్లి అశోక్


కె. రాణీప్రసాద్

ఎలగొండ రవి

టివి నారాయణ

పెద్దింటి అశోక్ కుమార్

గురు శిష్యులు డా. సి. నారాయణరెడ్డి, గూడూరి సీతారాం గార్లు




నిన్న (1961)



నేడు (1998)

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత
డాక్టర్ సి. నారాయణరెడ్డి మాజీ ఎం.పి.
ఎం.ఏ. పిహెచ్.డి. డి.లిట్

అధ్యక్షులు, **ఆంధ్ర సారస్వత పరిషత్తు,**
తిలక్‌రోడ్, హైదరాబాదు-500001, ఫోన్ : 24753724



ఆశీరభినందన

తెలంగాణ తొలితరం కథా రచయితగా గుర్తింపు పొందిన గూడూరి సీతారాం మా హనుమాజిపేటలో పుట్టి పెరిగిన వాడు. విజ్ఞతను, వినయాన్ని మేళవించుకున్నవాడు. ఇప్పటికి అందుబాటులో వున్న కథలు కొన్నే అయినా ఉన్న వాటితోనే తన రచనా పటిమను ఋజువు చేసుకున్నవాడు.

నాకంటే సుమారు పదేళ్ళు చిన్నవాడు. నా బాల్యం నుంచి నా ఆటపాటల్లో, అలవోకగా నేను చెప్పే ఆశు పాఠాల్లో పాల్గొనేవాడు. నా వెంట నడిచొచ్చాడు కాబట్టి అతడు నా అనుచరుడు. నా అభిప్రాయాలను పంచుకున్న వాడు కాబట్టి అతను నా సహచరుడు. మా ఆత్మీయత లోతెంతో ఈ నాలుగు మాటలతో కొలిచి చూపలేను

ఆ రోజుల్లో నన్ను అనుసరించిన యువకులిద్దరు ఒకరు గూడూరి సీతారాం రెండవవాడు కనపర్తి లక్ష్మీనర్సయ్య గూడూరి కథల దారిలో చరించాడు. కనపర్తి కవితా మార్గంలో సాగిపోయాడు.

సీతారాం కథల్లో ప్రధానంగా కనిపించేది పల్లీయ వాతావరణం. అందుకుతోడుగా మట్టిని అంటి పెట్టుకున్న మనుషులు. మధ్యమధ్య తెలంగాణ మాండలిక పదాలు. హాయిగా చదివించే సరళ శైలి. అతడు రాసిన ఎనభై ఐదు కథల్లోంచి కొన్నిటిని ఒక సంపుటి రూపంలో అందిస్తున్నాడు. మానేరు రచయితల సంఘం సారథి, తరుణ కవితానిధి డా. పత్తిపాక మోహన్. సీతారాం సాహితీ జీవిత స్వర్ణోత్సవ సందర్భంగా అందిస్తున్న మంచి కానుక యిది. ఈ సందర్భంలోనే ఒక ప్రత్యేక సంచికను ప్రచురిస్తున్నందుకు సంతోషం. ఆత్మీయుడు గూడూరి సీతారాంకు నా ఆశీరభినందనలు అందిస్తున్నాను.

– డా. సి. నారాయణరెడ్డి



గూదూరి సీతారాం
సాహితీ జీవిత స్వర్ణోత్సవ ఆహ్వాన సంఘం.

గూదూరి ప్రవీణ్
కన్వీనర్,
అధ్యక్షులు, అర్బన్ బ్యాంక్ సిరిసిల్ల

బంగారు పండుగ

నమస్కారం...!

మా సీతన్న కథలురాసి యాభైయేండ్లు పూర్తయిన సందర్భంగా వారి సాహితీజీవిత స్వర్ణోత్సవసభను బంగారు పండుగగా సిరిసిల్లలో నిర్వహిస్తూ ఈ సంచికను వెలువరిస్తున్నాం.

నిన్న కళాసాగర్ సిరిసిల్ల అధ్యక్షులుగా, ఇవ్వాళ్ళ మారసం అధ్యక్షులుగా సిరిసిల్ల ప్రాంతంలో సాహితీ సాంస్కృతిక రంగాల్లో ఆయన చేసిన, చేస్తున్న కృషి ఇవ్వాళ్ళ మన ప్రాంతంలో ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తోంది.

వారు రాసిన కథలు నా చిన్నతనంలో మా ఇంట్లోని పాతఖాతాపుస్తకాల్లో అచ్చయినవాటిని అతికించగా చదివాను. మళ్ళీ ఇవ్వాళ్ళ మారసం పక్షాన డా. పత్తిపాక మోహన్ సంపాదకత్వంలో వెలువడినందుకు సంతోషంగా ఉంది. యాభైయేండ్ల క్రితమే రచయితగా అద్భుతమైన కథలురాసిన మా సీతన్న స్వర్ణోత్సవాన్ని చేయాలని ఆత్మీయులందరం అనుకొని ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నాం.

ఈ ఉత్సవ నిర్వాహణలో ఎందరో ఆత్మీయులు, అభిమానులు పాలుపంచుకుని సహాయ సహాకారాలందించారు. ఈ సందర్భంగా వారికి పేరుపేరున కృతజ్ఞతలు.

గూదూరి ప్రవీణ్



డా. పత్తిపాక మోహన్, ఎం.ఏ., పిహెచ్.డి
కార్యదర్శి & సంపాదకులు
మానేరు రచయితల సంఘం, సిరిసిల్ల
గూదూరి సీతారాం సాహితీ జీవిత స్వర్ణోత్సవ ఆహ్వాన సంఘం

మట్టికథల 'పెద్దబాలశిక్ష'

తెలంగాణా తొలితరం కథారచయిత, పదిహేనేళ్ళ మా మానేరు రచయితల సంఘానికి అధ్యక్షులు, సారథి శ్రీ గూదూరి సీతారాం గారు. పందొమ్మిదవ శతాబ్దం యాభయ్యవ దశకంలోనే ఎనభై అయిదుకు పైగా కథలు, రెండు నవలికలు రాసారు. కొంతకాలం ఆనాటి 'తెలుగుదేశం' పత్రికలో 'లేఖావళి' పేరుతో శీర్షికను నిర్వహించారు. యాభై యేండ్ల క్రితమే తరగని సంపదగా తెలంగాణా బతుకుచిత్రాల కథల్ని అందించిన కథల పెద్దబాలశిక్ష ఆయన. అచ్చమైన..స్వచ్ఛమైన తెలంగాణ బంతిపూల భాషా పరిమళాల్ని ఇంటి పెద్దదర్వాజకు దండగాగుచ్చి కట్టిన మార్గదర్శి. ఈ తరానికి తెలంగాణా సాహిత్య చరిత్రలో ఎన్నెన్నో అలనాటి జ్ఞాపకాల్ని, ముడిసరుకుని అందించిన సాంస్కృతిక వారధి. సిరిసిల్ల పాఠశాల, కళాశాల సాహిత్య సంచిక సంపాదకులుగా రేడియోనటునిగా, కథకునిగా కాలమిస్టుగా, విమర్శకులుగా, తెలంగాణా రచయితల సంఘం, రెడ్డి హాస్టల్ సారస్వత సంఘం వంటి సంస్థల్లో ముఖ్యులుగా పోషించిన భూమిక ఆనాటి సాహిత్య సాంస్కృతిక చారిత్రక వికాసాల్లో ఒక జ్ఞాపకాల దొంతరగా పేర్కొనవచ్చు.

సిరిసిల్ల కళాసాగర్ అధ్యక్షులుగా మారసం సారథిగా సిరిసిల్ల ప్రాంతంలో సాహితీ చైతన్యానికి ఆయన అందిస్తున్న స్ఫూర్తి మరవలేనది. అందర్ని అభిమానించి, ప్రేమించే మనీషి. ఆత్మగల్ల మంచిమనిషి మా సీతారాం గారు. ఆయన కథలు రాసి యాభై యేండ్లు అయిన ముచ్చటను పురస్కరించుకుని చేస్తున్న 'బంగారు పండుగు' ఇది. ఈ సందర్భంగా వారి జీవితం, వ్యక్తిత్వం, సాహిత్యలపై రాసిన వ్యాసాలతో వెలువరిస్తున్న స్వర్ణోత్సవ సంచిక యిది. ఈ 'కానుగచెట్టు' ఇలా సతతహరితమయ్యేందుకు ఎందరో పెద్దలు వదాన్యులు ఆర్థికంగా సహాయం చేసారు. హార్థికంగా స్వాగతించారు. వారందరినీ ఈ సందర్భంగా పేరుపేరున యాదిజేసుకునుడు మా కనీస బాధ్యత.

షుక్రియా

పత్తిపాక మోహన్, సంపాదకుడు



డా. వేముగంటి నరసింహాచార్యులు
అధ్యక్షులు, సాహితీ వికాసమండలి, సిద్దిపేట

ఆనాటి నా జ్ఞాపక రూపకం

అవి తెలంగాణాలో సాహిత్యాభిలాష ముమ్మరిస్తున్న రోజులు 1953 యువ రచయితల సాహిత్య చైతన్యలతిక చిగురించి, మొగ్గదొడుగుతున్న వసంతవేళ. అప్పుడే తెలంగాణా రచయితల సంఘం ఏర్పడి తెలంగాణా ప్రాంతంలో సాహిత్య సభలూ, కవి, కథక సమ్మేళనాలు జరుపుతూ సాహిత్యవ్యాప్తికి కృషి చేస్తూ ప్రజల్లో సాహిత్యాభిరుచిని పెంపొందింప ఉద్యమరూపంలో కృషి సాగిస్తున్న బంగారు కాలం. దాశరథి, నారాయణరెడ్డి, కాళోజీ, రామరాజు మొదలగు కవి పండితులు సాహితీ సభల నిర్వహణలో ప్రముఖ పాత్ర వహిస్తున్న మేలైన కాలమది. అలాంటి శుభవేళలో భూమయ్య వకీలు సారథ్యంలో సిరిసిల్లలో తెలంగాణా రచయితల సభలు ఏర్పాటు చేయబడినవి. ఆ సభలలో సాహిత్యోపన్యాస విన్యాసాలు, కవి సమ్మేళనం జరిగి పద్యగేయగానాలు తెలుగు సరస్వతీ పాదాల రవ్వలమువ్వల సవ్వడి గలగలమంటూ ప్రజల చెవులపండువు చేస్తూ ఆనందాన్ని అమేయంగా అందజేసినవి.

ఆ సాహిత్య సభల సందర్భంలో జరిగిన కథక సమ్మేళనంలో ఒక యువకుడు అచ్చమైన తెలంగాణా మాండలిక పదాల పోహళింపుతో వ్రాసిన కథ చదివి సాహిత్య పరులనూ, సామాన్యజనాన్నీ ఆకర్షించి, ఆనందింపజేశాడు ఆ యువకుడే నేడు ప్రముఖ తెలంగాణా కథా రచయితగా పేరుగాంచిన గూడూరి సీతారాం. విశ్వవిఖ్యాత మహాకవి, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్ డా. సి. నారాయణరెడ్డి గారు జన్మించిన ధన్యభూమిపైన వేములవాడకు సమీపంలోని హనుమాజీపేటలో జన్మించిన భాగ్యశాలి తెలంగాణా మాండలికంలో కథలు వ్రాసి వివిధ పత్రికలలో ప్రచురింపజేసి అఖిలాంధ్ర ప్రజల మన్ననలందుకున్నారు.

సీతారాం గారి కథలలో 1953 సంవత్సరంలో పరిచయమైన శ్రీ సీతారాం నాకు ఆత్మీయ వర్గంలో ఒకరైనారు. ఈనాటి వరకూ నాయందు ఆత్మీయత, ఆదరం చూపిస్తున్నారు.

సీతారాం గారి కథలలో తెలంగాణా పల్లె జీవితం, ప్రజల భాష, భావం, సంభాషణ విధానం చోటు చేసుకున్నాయి. తొలితరం తెలంగాణా కథా రచయితలలో శ్రీ గూడూరి సీతారాం ప్రముఖులుగా రాణించి, ఈనాడు స్వర్ణోత్సవం జరుపుకోవడం అభినందనీయం, ఆనందదాయకం.

– డా. వేముగంటి నరసింహాచార్యులు



ఆచార్య ఎన్. గోపి
కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత,
డీన్, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు

తొలితరం తెలంగాణ కథకుడు సీతారాం

తెలంగాణ సాహిత్య పరిణామం, వికాసంలో మొదటి అధ్యాయం రచించిన కథకునికి నీరాజనం

అవి నిజాం రాష్ట్రానికి బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా ఉన్న రోజులు. అప్పటికింకా ఇప్పటి ఆంధ్రప్రదేశ్ ఏర్పడలేదు. సరే, తెలంగాణ రైతాంగ పోరాటం ముగిసింది. ముగిసిందా? ముగియలేదని చాలామంది వాదన. తెలంగాణ రచయితల సంఘం స్థాపన జరిగి దాశరథి అధ్యక్షుడుగా, సినారె కార్యదర్శిగా సాహిత్య చైతన్యం కోసం ఆరాటపడుతున్న రోజులు. దానికి సిరిసిల్లలో కూడా ఒక శాఖ ఏర్పడింది. సిరిసిల్ల అప్పటికీ ఇప్పటికీ ఉద్యమాల గడ్డ. సిరిసిల్లకు సమీపంలో హనుమాజీ పేట అనే ఊరు. ఆ ఊళ్లో సినారె అనే ఫెనామినా జన్మించి ఉండకపోతే అది తెలంగాణలోని అసంఖ్యాక గ్రామాల్లో ఒకటై ఉండేది. ఆ చిన్న పల్లెలో జ్ఞానపీఠం అందుకునే మొనగాడు ఆవిర్భవిస్తాడనే ఊహకు హేతుబద్ధత లేని రోజులవి. అదే ఊళ్ళో గూడూరి సీతారాం, ఆదిరెడ్డి, కనపర్తి, మిద్దె రాములు పుట్టారు.

ఈ నలుగురూ సినారె అనుయాయులు, మిత్రులు. సినారె సెలవుల్లో వచ్చినప్పుడు వీరికి సాహిత్యప్రోత్సాహం దొరికేది. వీరిలోంచి సీతారాం విశిష్ట కథకుడుగా రూపొందుతాడని అప్పటికి తెలియదు. 1953 నుండి 65 వరకు – అంటే పన్నెండేళ్ళలో 85 కథలు రాసిన ఘనత సీతారాంది. అన్నీ తెలంగాణ ప్రాంత జీవితాల కథలే. మిగతా ప్రాంతాల గురించి తెలిస్తే కదా! అవి వివిధ ప్రాంతాల మధ్య వినిమయం రోజులు కావు. అప్పుడు రేడియోలు లేవు, కరెంటు లేదు, పత్రికలు లేవు, గ్రంథాలయాలు లేవు. అటువంటి పరిస్థితుల్లో సాహిత్యపరంగా వ్యాసంగం చెయ్యాలి. చీల్చుకొని రావాలి. సిరిసిల్ల, వేములవాడలే ఒయాసిస్సులు. శరత్, ప్రేమ్‌చంద్ అనువాదాలు దొరికేవి. మాలపల్లి, నారాయణరావులు కూడా. బయటి విశాల సాహిత్య ప్రపంచానికి ఇలాంటివే కిటికీలు. ఇక ముడిసరకు–ప్రాంతీయంగా ఉన్న చట్టుపక్కల బడుగు బతుకులే. మరి సీతారాం రాసిన అపురూపమైన ఆ 85 కథలు దొరుకుతున్నాయా? లేదు. ఎందుకు? ఎందుకంటే,

అప్పటికి వాటిని భద్రపరచాలన్న 'సోయి' (స్పృహ) లేదు. మళ్ళీ ఇన్నాళ్ళకు 'సీతారాం సాహిత్య స్వర్ణోత్సవం' జరపాలని అభిమానులు తలపెడితే పరిస్థితి నిరాశాజనకం. పాత పత్రికలు, పాతసంచికలు, జ్ఞాపకాల పొరల్లోని చిన్న పత్రికలు ఎక్కడ దొరుకుతయి? సీతన్న (సీతారాంను అందరూ ప్రేమగా పిలుచుకునే పేరు) మన మధ్యనే తిరుగుతున్నాడు. కానీ, ఆయన కథలు ఎక్కడున్నాయో! అయితే, వదిలేద్దామా? ఎందుకు వదిలేస్తాం. మానేరు రచయితల సంఘం, సిరిసిల్లవారు మిత్రుల సాయంతో 14 కథలు సంపాదించగలిగారు. పుస్తక రూపంలో వెలువరించారు కూడా. త్వరలో జరిగే స్వర్ణోత్సవ కార్యక్రమంలో దీనిని ఆవిష్కరిస్తారు. దీనికి మారసం కార్యదర్శి డా. పత్తిపాక మోహన్ చూపుతున్న చొరవ అభినందన పాత్రం.

ఈనాటి తెలంగాణ రెండో సాహిత్య పునరుజ్జీవన పరిస్థితుల్లో ఆనాటి కథలన్నీ ఆణిముత్యాలు. సీతన్నవే కాక సురమౌళి, వట్టికోట ఆళ్వారు స్వామి, ఇరివెంటి కృష్ణ మూర్తి, నెల్లుట్ల కేశవస్వామి, పొట్లపల్లి రామారావు, లోకమలహరి తదితరుల కథలు పుస్తకాలకెక్కినవి ఎన్నో ఉన్నాయి. నెల్లుట్ల కేశవస్వామి చార్మినార్ కథలు కాకుండా ఎన్నో కథలు పత్రికల్లో వచ్చి, గ్రంథ రూపంలో రానివి ఉన్నాయి. వారి బంధువులైనా ప్రయత్నించాలి. స్వర్గీయ ఇరివెంటి కథలను నేనాయన ముఖతః విన్నాను. మహబూబ్‌నగర మాండలికంలో గుబాళించే కథలవి. వీళ్ళందరూ తొలితరం తెలంగాణ కథకులు. తెలంగాణ ప్రజల జీవన మూలాలనూ, మూల్యాలనూ వీటిలో వెతుక్కోవలసి ఉంటుంది. సాహిత్య పరిణామ, వికాస చరిత్రలో ఇవి పరామర్శ గ్రంథాలవుతాయి. ఎందుకంటే, ఆనాడు నిత్యజీవితంలో వారు ఎదుర్కొన్న సంఘటనలు, ఫ్యూడల్ భూస్వాముల దౌర్జన్యాలు, కుల పీడన, గ్రామ పెత్తందార్ల పెద్దరికం, కులపెద్దల పెత్తనం, రజాకార్ల సంఘటనలు-ఇవన్నీ ఆనాటి కథలకు భిత్తిక. ఆ నేపథ్యంలో చదివితే ఇవి ఎంత విలువైన కథలో, ఆనాటి విశ్లేషణలకు అవి ఎంత అవగాహననిస్తాయో తెలుస్తుంది. మరొక సంగతి ఏమిటంటే, తెలంగాణలో మధ్య తరగతే లేదు. ఉన్నవాళ్ళు, లేనివాళ్ళు అనేవి రెండే ఆనాడు.

మధ్యతరగతి జీవితంలోని తీరిక, మాధుర్యం, శిల్ప సంవిధానాలకు తావిచ్చే సంఘటనల కోసం ఈ కథల్లో వెతికి లాభంలేదు. ఎల్లీఎల్లని బతుకుల్లో అందమే ముంటుంది? కడగండ్లు తప్ప. జీవితమంత నిస్సహాయత ఆనాటి కథల్లో కనిపిస్తుంది. అటువంటి నిస్సహాయత లోంచి తిరుగుబాటు రావడం అనివార్యం. పిల్లి పులిగా మారిన క్రమంతో తెలంగాణ చరిత్రను చూడవలసి ఉంటుంది. మరి సీతన్న కథలమాటేమిటి? కీర్తీ కాంక్ష లేని ఈ కథల మారాజు కథలను పరిశీలిస్తే మారుమూల పల్లెలు పట్నం షోకుల్లోకి మారుతున్న తీరు కనిపిస్తుంది. కలిగిన కటుంబమే. కాస్మెటిక్స్ ఊళ్ళోకి ప్రవేశించి ఆ కుటుంబంలోకీ ఆవరించుకుంది. ఆ వ్యామోహంలో పడి భర్తను వదిలెయ్యటం, పౌడర్, సెంటులిచ్చే వాడితో వెళ్ళిపోవటం, గుల్లగా మారి, ఊళ్లోకి తిరిగొస్తే ఏముంది. శేష జీవితం పిచ్చిదానిలా గడవటం. ఇది కథ. ఓ జానపద గీతం ఈ వ్యామోహాన్ని వ్యక్తీకరించింది.

సెన్గసేన్ల నిలుసుని నీవు
సెయిజాపవే పూసలోల్ల రాజమ్మా!
కందిసేన్ల నిలుసుని నీవు
కన్నుగీటవే పూసలోల్ల రాజమ్మా..

అలా కన్ను గీటిన రాజమ్మ తీరే మారిపోయింది. నీ కిరు కిరు చెప్పులకు/నీ వన్నె నడకలకు/నీకు పిల్లలు కారమ్మో/పూసలోల్ల రాజమ్మ-అలా కిర్రు చెప్పులు, వన్నె నడకలు వచ్చిన రాజమ్మను జానపద కవి శపిస్తున్నాడు. నీ నడవడిక ఇలా ఉంటే 'నీకు పిల్లలు పుట్టరు' అన్నాడు. ఈ జానపద గీతాన్ని సినారె సినిమా పాటగా మలిచారు. అది బహుళ ప్రాచుర్యాన్ని పొందింది. ఈ కథ పేరు రాజమ్మ రాజీరికం. ఆమె రాజీరికం అలా తెల్లారిందన్నమాట! నారి గాని బతుకు గీత కార్మికుని కుటుంబంలోని అస్తవ్యస్త పరిస్థితుల చిత్రణ. ఆ బతుకుల్లో మమేకమైతే తప్ప రాయలేని కథ. అలాగే సంచారజాతికి (పిచ్చుకుంట్ల) చెందినవారి జీవన పరిణామం లచ్చి కథ. కులవృత్తిలోంచి రిక్షా లాగుడుకు. ఆ సంధి దశ దారుణం. అతని భార్య లచ్చి కష్టమే ఆధారం. లచ్చిపాత్రను ఉదాత్తంగా చిత్రిస్తాడు రచయిత. ఆ రోజుల్లో కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ జిల్లాల్లోంచి వలసలు ప్రారంభమైన క్రమంలో బొంబాయి ఒక ఆకర్షణ. రంగడు కథ ఈ వలస క్రమాన్ని హృదయవిదారకంగా చిత్రించింది. మారాజు కథ కూడా బొంబాయి వలస కథే. చీకటి గొడుగులు అనేది స్త్రీ స్వాతంత్ర్యాన్ని గురించిన కథ. అప్పుడు రచయిత కోరిన స్వాతంత్ర్యం వేరు.

గూడూరి సీతారాం కథల్లో ఇరవై శాతం పూర్తి మాండలికంలో రాసినవి. పూర్తి మాండలికంలో రాసిన కథలకు అఖిలాంధ్ర సన్నివేశంలో పరిమితి ఉందని సీతన్న గుర్తిస్తున్నాడు. పూర్తి మాండలికానికి పత్రికల్లో అప్పటికీ ఇప్పటికీ అనాదరణ ఉంది ఈ కారణం వల్లే. పాత్రోచిత భాషగా పరవాలేదే. అయితే, శ్రీకాకుళం, విజయనగరం తదితర మాండలిక రచనలను ఆదరించినంతగా తెలంగాణ మాండలికం ఆసక్తికైనా నోచుకోలేదని ఈ రచయితల బాధ. ఈ బాధకు తరుణం పోయిందిప్పుడు. జూకంటి జగన్నాథం అన్నట్లు, " ఈ కథలు అచ్చమైన తెలుగు భాషా సంస్కృతిలోంచి నిజాయతీతో స్వచ్ఛంగా పూసిన మొగిలి రేకులు." సీతన్నా శతాయుస్మాన్ భవ!

– ఆచార్య ఎన్. గోపి

(ఇండియాటూడే సౌజన్యంతో 30 నవంబర్, 2004)



కె. బాపురెడ్డి, డి.లిట్, ఐ.ఎ.ఎస్. (రిటైర్డ్)
'రామచిలుక' ప్లాట్ నం. 10, రోడ్ నం.5, జూబ్లీహిల్స్,
హైద్రాబాదు-500033

మలితరంలో కూడా అగ్రగణ్యుడు కావాలి!

గూడూరి సీతారాంతో నాకు పరిచయం డా. సి. నారాయణ రెడ్డి గారి ద్వారా సుమారు 50 సంవత్సరాల క్రితం కలిగింది. అప్పుడు 'సినారె' పహలాపచ్చీసులో ఉన్నాడు. 'నవ్వనిపువ్వు' పట్ల ఆయనలో విరిసిన గౌరవాభిమాన పూర్వక భావకుసుమాలు యువహృదయాలలో గుబాళిస్తున్న రోజులు. ఆయన, దాశరథి, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, దివాకర్ల వేంకటావధాని వంటి కవి పండితుల ప్రశంసలందుకుంటున్న ప్రౌఢ కవితా సృష్టి చేసిన దశకం అది. నారాయణరెడ్డి గారికి అత్యంత సన్నిహితులుగా, ప్రగాఢమైన ప్రేమాభిమానాలు పెంచుకున్న సాహిత్య పిపాసులవులైన నా వంటి విద్యార్థులలో గూడూరి సీతారాం ముఖ్యులు. ఆయనతోపాటు లక్ష్మారెడ్డి ఆ రోజుల్లో 'ఊహ తెలియంగల లేఖక పాఠకోత్తములు'. అప్పటికి కంప్యూటర్లు, జిరాక్సులు లేవు. గ్రంథ ముద్రణకు ఎంపిక చేసిన సినారె రచనల వ్రాత ప్రతులు సిద్ధం చేయడంలో సీతారాం ఎంతో సహకరించేవారు. మేమందరం నారాయణరెడ్డి గారి కవితా రచనల తొలి శ్రోతలం. ఎప్పటికప్పుడు తన రచనలను రసజ్ఞులకు, విజ్ఞులకు వినిపించి వారి స్పందనను గౌరవించే గొప్ప సంప్రదాయానికి సినారె ఒరవడి పెట్టారు.

మిత్రులు సీతారాం గారి 'స్మిత పూర్వకాభిభాషణం' నాకెంతో ఆనందం కలిగించేది. కథారచన చేస్తూ, ఎంతో జిజ్ఞాసతో ఆధునిక సాహిత్యాన్ని ఆధ్యయనం చేసేవాడు. హృదయుడుగా సద్విమర్శకుడుగా, స్నేహశీలిగా ఆయన సహచరుల మన్ననలందుకున్నాడు. ఆ రోజుల్లో కరీంనగరం జిల్లా నుండి సినారె స్ఫూర్తితో చిగురిస్తున్న రచయితలకు చేదోడువాదోడుగా ఉండేవాడు. నేను తరుచు నా కవితలు ఆయనకు వినిపించడం, ఆయన కథలు చదివి స్పందించడం మరపురాని మధురానుభూతి. ఆయన కథలు, నా గేయాలు 'స్రవంతి' పత్రికలో తరచు ముద్రితమయ్యేవి. మా యిద్దరికి 'తెలంగాణ రచయితల

సంఘం'తో సంబంధం ఉండేది. నేను హైస్కూల్ విద్యార్థిగా ఉన్నప్పుడే నారాయణరెడ్డి గారు నన్ను కరీంనగరం రచయితల సంఘానికి ప్రతినిధిగా నియమించాడు. ఆ రోజుల్లోనే (1952-54) సీతారాం తె.ర.సం. సిరిసిల్ల శాఖను నిర్వహించినట్లు గుర్తు.

సీతారాం నిరాడంబరంగా ప్రవర్తించేవాడు. కథలు వ్రాసే వాడేకాని ప్రచారం కోసం ప్రాకులాడేవాడు కాదు. తెలంగాణ ప్రజల జీవిత విశేషాలే ఆయన కథలకు ఇతివృత్తాలుగా ఉండేవి. తెలంగాణా వాళ్లకు 'తెలుగురాదు' వంటి అపోహలున్న ఆంధ్రప్రదేశ్ అవతరణ కాలంలో, ఆంధ్రపాంతం నుంచి వచ్చిన వారితో దీటుగా తెలుగు మాట్లాడిగలిగిన, రాయగలిగిన వాళ్లుగా ప్రశంసింపబడిన వాళ్లల్లో ఆయన గణనీయుడు. తెలంగాణ మాండలికభాషపై పట్టు ఉన్న దిట్ట ఆయన. ఆ భాష మాట్లాడడం ఏదో లోపంగా కాగ, ఒక ప్రత్యేకతగా భావించేవాళ్లం. వేములవాడకు చెందిన సురమౌళి, చంద్రమౌళివంటి ప్రతిభా సంపన్నులతో మాకు స్నేహసంబంధాలు ఉండేవి. కనపర్తి, వద్దేపల్లి కృష్ణ మొదలైన వాళ్లు కలమెత్తి, గళమెత్తి తెలంగాణాలో ముఖ్యంగా కరీంనగరం ప్రాంతంలో చివురులెత్తిన నూతన సాహిత్య చైతన్యానికి నిదర్శనంగా భాసించేవాళ్లు. మాకు దాశరథి, నారాయణరెడ్డి, కాళోజి వంటి సాహితీమూర్తుల ప్రోత్సాహం లభించేది. నారాయణరెడ్డికి అతి సన్నిహితుడుగా ఉన్న సీతారాం వర్ధమాన రచయితలందరికి అనుసంధానకర్తగా వ్యవహరించేవాడు. కవి సమ్మేళనాలలో, సాహిత్య సభల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొనేవాళ్లం.

గూడూరు సీతారాం సాహితీ జీవిత స్వర్ణోత్సవ సందర్భంలో ప్రచురిస్తున్న ఈ ప్రత్యేక సంచిక ఆయన జీవిత సాఫల్యాలను, వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించడం ముదావహం.

ఈ సందర్భంలో ఆయన అలవోకంగా వ్రాసిన కథలను ఎంతో శ్రద్ధతో సేకరించి, సంపుటీకరించి, ప్రచురించి మానేరు రచయితల సంఘం ముఖ్యంగా డా. పత్తిపాక మోహన్ అభినందనీయులు. ఆయన 1953-65 కాలంలో వ్రాసిన కథలివి. ఆయన తెలంగాణ తొలితరం రచయితగా వ్రాసినవి కావడం ఎంతో ప్రత్యేకతను సంతరించుకున్నవి. చిత్తశుద్ధి, డొక్కశుద్ధి కలిగిన సీతారాం తన రచనా వ్యాసంగాన్ని కొనసాగించి "మలితరం"లో కూడా అగ్రగణ్యుడైన కథా రచయితగా, గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షిస్తున్నాను.

– కె. బాపురెడ్డి



'అవధాన యువకేసరి'
డా. అందె వేంకటరాజము, ఎం.ఎ., పిహెచ్.డి.
రిటైర్డ్ తెలుగు లెక్చరర్
2-3-18, గాంధీరోడ్, కోరుట్ల-505326
జిల్లా : కరీంనగర్, ఫోను : 08725-252190

శుభాకాంక్ష

గేయకవీంద్ర చంద్రు లయి కీర్తిసుధల్ వెదజల్లినట్టి నా
రాయణరెడ్డి గారికి చిరంతనశిష్యుని ప్రాజ్ఞవర్యునిన్
శ్రేయముగా కథల్ రచనచేసి ప్రశస్తి వహించి 'మారసం'
స్థాయిగ నిర్వహించు సరసప్రియమిత్రుని సన్నుతించెదన్.

తొలితరపు కథకుడై కడు
వెలసెను తెలగాణ మందు విబుధులు పొగడన్
పొలుపుగ నిక్కడి బాసకు
పలు కథలన్ మంజులముగ పట్టము గట్టెన్

సరసత్వసౌరభంబులు
కరము గుబాళించు హృదయకమలము, ఆడం
బరరహితార్జన మరుదుగ
వరలెడు గూడూరి హితుని ప్రస్తుతి చేతున్

గూడూరి వంశతిలకుని
ఈడిత కథలను పఠించి హృన్ముద మధరన్
వేడుక తళుకొత్తగకొని
యాడెద నింకెన్నొ రచన లత దొనరింపన్

సారస్యంబగ సాహితీకృషికి మేల్ స్వర్ణోత్సవంబున్ యశ
శ్శ్రీరమ్యంబుగ జేయగాంచు సుకృతిన్ జేజేల గూడూరిసీ
తారామున్ వినుతించుచున్ హృదయమోదంబార దీర్ఘాయుభ
వ్యారోగ్యాది శుభంబులన్ బడయగా ఆకాంక్ష కావించెదన్

– డా. అందె వేంకటరాజము



శ్రీధరరావు దేశ్‌పాండే
ప్లాట్‌నెం. జి.1, వరలక్ష్మీ ఆపార్ట్‌మెంట్,
రోడ్ నెం. 5, అలకాపురి, దిల్‌సుఖ్‌నగర్
హైదరాబాదు-35.

తల్లిభాషకు కథల పాఠశాల సీతారాం

కోస్తా ఆంధ్రా వలస పాలనలో తెలంగాణ అన్ని రంగాలలో వివక్షకు నిర్లక్ష్యానికి గురి అయినట్లుగానే సాహిత్య సాంస్కృతిక రంగంలోనూ అదే వలస విధానం కొనసాగింది. వలస విధానం ఎప్పుడూ స్థానిక భాషా సంస్కృతులను, చరిత్రను ప్రజల స్మృతిలోంచి తొలగించి వలసపాలకుల సాంస్కృతిక ఆధిపత్యాన్ని నెలకొల్పడానికే ప్రయత్నిస్తుంది. ఈ సాంస్కృతిక ఆధిపత్యం వారి రాజకీయ ఆర్థిక ఆధిపత్యాలను సుస్థిరం చేయడానికి దోహదం చేస్తుంది. ఈ సాంస్కృతిక, ఆధిపత్య చర్యలు గత 50 ఏళ్లుగా నిరాఘాటంగా సాగుతూనే ఉన్నాయి. అందుకే హుస్సేన్‌సాగర్ చెరువుకట్టమీది విగ్రహాలన్నీ వారివే. తెలుగు సాహిత్య చరిత్ర అంతావారిదే. సాహిత్య సాంస్కృతిక వలసీకరణకు తాజా ఉదాహరణ హైదరాబాదు సిటీ సెంట్రల్ లైబ్రరీలో విశ్వనాథ విగ్రహన్ని నెలకొల్పడం, వారికి హైదరాబాదులో తెలుగు భాషా సాంస్కృతికి వికాసానికి ఇతోదిక దోహదం చేసిన మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, వట్టికోట ఆళ్వారుస్వామి, కొమర్రాజు లక్ష్మణరావు, దాశరథి కృష్ణమాచార్యులు, కాళోజి మొదలైన తెలంగాణ నైతాళికు లెవ్వరూ కంటికి ఆనకపోవడం యాదృచ్ఛికమని ఎవరూ భ్రమపడనక్కరలేదు. వలస ఆధిపత్య భావజలంలోని తల ఎత్తిన ఆలోచనే అది. అందుకనే హైదరాబాదు భాషా సాంస్కృతిక వికాసంలో ఎటువంటి పాత్ర లేని విశ్వనాథ ఇవాళ హైదరాబాదు నగర కేంద్ర గ్రంథాలయంలో చోటు సంపాదించగలిగినాడు. ఇట్లాంటి విధానపరమైన నిర్లక్ష్యం వివక్షమూలంగా తెలంగాణ తొలితరం సాహిత్యం చాలా మట్టుకు కాలగర్భంలో కలసిపోయింది. కొద్దోగొప్పో మిగిలి ఉన్న సాహిత్యాన్ని తవ్వి తీస్తున్న క్రమంలో ఈనాటి యువసాహిత్యకారుల హృదయానుభూతిలోకి వచ్చినవాడు శ్రీ గూడూరి సీతారాం. ఇంకా జీవించే వున్నాడు. తెలంగాణ సాహిత్య సాంస్కృతికోద్యమం ఊపందుకున్న తర్వాత తెలంగాణ సాహిత్య సాంస్కృతిక మూలాల దేవులాట క్రమం షురు అయ్యింది. పరిశోధకుల సాహిత్య ప్రేమికుల దృష్టి సహజంగానే తమ తొలితరం సాహిత్యకారుల మీదకి మళ్ళింది.

అట్లా ఈ తరం పాఠకులకు తెల్సివచ్చిననాడు గూడూరి సీతారాం.

తెలంగాణ సాహిత్య సాంస్కృతిక పునరుజ్జీవనం ప్రారంభమైనాక గూడూరి సీతారాం కథలు కొన్ని పత్రికల్లో పునర్ముద్రణ పొందినాయి. ఆ తర్వాత ముదిగంటి సుజాతారెడ్డి గారి సంపాదకత్వంలో వెలువడిన 'తొలితరం తెలంగాణ కథలు'లో సీతారాం గారి కథ 'నారిగాని బతుకు' అచ్చయ్యింది. సీతారాం గారిని గురించి కొంత పరిచయం పాఠకులకు కల్గింది. సీతారాం గారు అత్యధిక కథలు తెలంగాణ భాషలోనే రాసారని తెల్సి ఇపుడు మళ్లీ తెలంగాణ భాషలోనే కథలు రాయాలనుకుంటున్న కథకులకు ఎడారిలో ఒయాసిస్సు దొరికిన భావన కల్గింది. 50 ఏళ్లనుంచి అమలవుతున్న విద్యావిధానం వల్ల తల్లి భాష నుంచి పరాయీకరణ చెంది భాషా పలుకుబడులను, నుడికారాన్ని మర్చిపోయిన యువకథకులకు సీతారాం కన్నతల్లి భాషను, నుడికారాన్ని పట్టిచ్చిన ఒక పాఠశాల. తెలంగాణలో అక్షరజ్ఞానం ఉన్నవారు తమ తల్లి భాషని, పలుకుబడులను, సామెతలని, జాతీయాలని పూర్తిగా మర్చిపోయిన పరిస్థితి. ఇపుడు వారి మాట తీరు మారిపోయింది. తాము పరాయీకరణకు గురి అయినామన్న స్పృహకూడా ఇటీవలి తెలంగాణ భాషా సాంస్కృతిక అస్తిత్వ ఉద్యమం తలఎత్తేవరకు లేకుండా పోయింది. ఈ నేపథ్యం లోనే సీతారాం గారి కథల్లో వెల్లివిరిసిన తల్లిభాషను అక్కున చేర్చుకుని కండ్లకద్దుకున్నారు.

పత్తిపాక మోహన్ తదితర మానేరు రచయితల సంఘం మిత్రులు పలుగూ పార వట్టుకోని తవ్వంగ తవ్వంగ ఇగో గీ పద్నాలుగు కథలు బయటపడినయి. తవ్వకం పని ఆపకుండనె ఇప్పటికైదే గివ్విటితోనే ఒక పుస్తకం తీస్కద్దామని తలచి ఈ కథల పుస్తకాన్ని చపాయించిన్రు. ఈ తవ్వకపు పని ఎంత కష్టమైందో ఈపాటికి వాండ్లకు సమజుకచ్చే ఉంటది. కొంచెం ఆరాం దీస్కున్నంక మల్లా మొదలువెట్టక తప్పదు గద.

మన జాతి సాహిత్య చరిత్ర నిర్మాణం కావాలంటే ఈ తవ్వకాలు నిరంతరం జరుగాలె. మన జాతి చరిత్ర ఎందుకు నిర్మాణం గా వాలంటి ఒకటి మన చరిత్ర ఏందో మనం తెల్సుకునేందుకు, రెండు మన జాతి చరిత్ర మన తర్వాత తరాలకు సుగ అందాలె. అందుకు ఈ తవ్వకం పని సాగాలె. ఇపుడు గనుక మనం ఈ పనిజెయ్యక పోతె ఉన్న ఆ కొద్దిపాటి సాహిత్యం గూడా కనుమరుగైపోతుంది. ఈ రానున్న ప్రమాదాన్ని పసిగట్టే ఎందరెందరో తవ్వకం పనుల్లో నిమగ్నం అయినారు. మారసం చిత్తశుద్ధితో చేసినందుకే ఇవ్వాల గూడూరి సీతారాం కథలు మన చేతుల్ల ఉన్నది. రెండేండ్ల కింద సుజాతారెడ్డి గారు ఆపని చేసినందుకు 'తెలంగాణ తొలితరం కథలు' బయటపడినయ. సంగిశెట్టి శ్రీనివాస్ పదేండ్లుగా తవ్వీతవ్వీ తెలంగాణ తొలితరం పత్రిక చరిత్రను (షబ్నవీస్)ని నిర్మించిండు. పనిలో పని ఆ పత్రికల్లో వచ్చిన తొలితరం కథల సూచీ 'దస్త్రం' తయారు చేసిండు. వీళ్లందరి కన్నా ముందే ఎన్నో ఏండ్లుగా తెలంగాణ జానపద కళారూపాలను, జానపద మౌఖిక సాహిత్యాన్ని తవ్వి తీసే పనిలో నిరంతర శ్రామికుడైనాడు జయధీర్ తిరుమలరావుగారు. కె. శ్రీనివాస్, బి.ఎస్.రాములు మొదలైనవారు. ఈ పరిశోధనల్లో

అనేక మరుగున పడిపోయిన తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక, చారిత్రకాంశాలు వెలుగు చూసినాయి. ఇట్లా అన్ని దిక్కులకు పాకి తవ్వకమే ఒక ఉద్యమంగా సాగినపుడు మనజాతి అస్తిత్వాన్ని చూసి గర్వపడగలుగుతాము.

★ ★ ★

ఇగ సీతారాం కథల గురించి చెప్పుకోవాలనుకుంటున్నపుడు ఇంతకు ముందు మన సాహిత్య విమర్శకులు చెప్పిన ముచ్చట్లని మల్లొకసారి మననం చేసుకోక తప్పదు. కోస్తా ఆంధ్రాలో తొలికథ వచ్చిన సమయానికే ఇక్కడా మన దగ్గిరకూడా కథ వచ్చింది. అయితే కథా సాహిత్య వికాసానికి లేదా ఇతర సాహిత్య ప్రక్రియల వికాసానికి గానూ తెలంగాణలో ఉన్న సామాజిక రాజకీయ పరిస్థితులు తీవ్రమైన ప్రతిబంధకంగా నిలచి ఉన్నాయి. అటువైపేమో తెలుగు సాహిత్య వికాసానికి అనువైన పరిస్థితులతో పాటు అక్కడి సాహిత్యకారులకు ఆధునిక ఇంగ్లీషు ఇతర యురోపియన్ సాహిత్యంతో గాఢమైన పరిచయం కారణంగా తెలుగు సాహిత్యంలోకి యూరోపియన్ సాహిత్య ప్రయోగాలు, శైలీ శిల్పాలు నచ్చి చేరినాయి. కోస్తా ఆంధ్రా తొలితరం సాహిత్యవికాసానికి ఇంగ్లీష్ మరియు యూరోపియన్ సాహిత్యం ప్రేరణగా నిలిస్తే హైదరాబాదు రాష్ట్రంలోని తెలుగు సాహిత్యకారులకు ఉర్దూ, హిందీ తదితర భారతీయ భాషా సాహిత్యాలు ప్రేరణగా నిలచినాయి. ముఖ్యంగా ప్రేంచంద్ లాంటి సాహిత్యకారులు తెలంగాణ తొలితరం కథకులకు గొప్ప ప్రేరణనిచ్చారు. ఈ రకంగా రెండు ప్రాంతాల్లో సాహిత్య వికాసం రెండు వేరువేరు దారుల్లో సాగినందునే వాటిని తులనాత్మక అధ్యయనం చేసి సాహిత్యాన్ని అంచనా వేసేటందుకు ఉపయోగించే ప్రమాణాలు, తూనికరాళ్లు తొలితరం తెలంగాణ సాహిత్యాన్ని అంచనా వేసేందకు ఉపకరించవు. గూడూరి సీతారాం కథలను పరిశీలించేటపుడూ ఈ రకమైన దృష్టికోణం ఉంటే తప్ప సీతారాం కథలకున్న చారిత్రక ప్రాధాన్యత, వర్తమాన తెలంగాణ సాహిత్యచర్చలో ప్రాసంగికత అర్థంకాదు.

వర్తమానంలో సాహిత్యం గతంలోకి జారిపోయినపుడు అది చరిత్రగా మారుతుంది. అందుకే గతకాలపు సాహిత్యం సామాజికి చారిత్రక పరిశోధకులకు గొప్ప సోర్స్ మెటీరియల్‌గా పనికిరావడం మనందరికీ తెల్సిందే. ప్రాచీన భారతీయ చరిత్రని నిర్మించడానికి డి.డి. కోశాంబి మహాభారత కథలపై ఆధారపడి విశ్లేషించాడు. గత కాలపు సాహిత్యాన్ని ఆధారం చేసుకొని సామాజిక పరిణామాలను విశ్లేషించడం, చరిత్రలను పునర్‌నిర్మాణం చేయడం మనం ఎరిగినదే. ఎందుకంటె సాహిత్యం ఆనాటి సామాజిక వాస్తవికతకు అద్దం పడతాయి. కొంత వక్రీకరణలు చోటు చేసుకున్నప్పటికీ , కొంత కల్పనకు తావున్నప్పటికీ మౌలికంగా సాహిత్యం ఆనాటి సామాజిక స్థితిగతులకు, రాజకీయ ఆర్థిక పరిణామాలను దర్పణంగా నిలుస్తుందనేది నిస్సందేహం. అందుకే పరిశోధకులు సాహిత్యాన్ని ఆశ్రయించేది. గూడూరు సీతారాం కథలు 1950 దశకంలో అధికంగానూ ఆ తర్వాత 60వ దశకం ప్రథమార్థం వరకు రాసినవిగా తెలుస్తోంది (1953-1965).

సీతారాం కథలురాసేనాటికి హైదరాబాదు రాష్ట్రం నిజాం పాలననుండి విముక్తి చెంది భారతయూనియన్‌లో కల్సిపోయింది. ప్రజలు నైజాం ప్రభుత్వ అణిచివేత, దొరల ఫ్యూడల్ దోపిడీ, వీటికి వ్యతిరేకంగా వీరోచిత సాయుధరైతాంగ, పోరాటం-విముక్తి పేరుమీద యూనియన్ సైన్యాల అరాచకాలు, ఇట్లాంటి అల్లకల్లోల పరిస్థితుల నుండి తేరుకుని సేదతీరుతున్న సమయం. ఆ వెసులుబాటులోంచే సీతారాంలాంటి అనేకమంది కథలు రాయడం మొదలుపెట్టినారు. సీతారాం కథలు గతించిన అల్లకల్లోలాలను గాకుండా అప్పటి వర్తమానాన్నే చిత్రికరించాయి (ఈ సంపుటిలోని 14 కథలు). తను పుట్టింది పెర్గింది గ్రామీణ వాతావరణంలోనే గనుక అనివార్యంగా గ్రామీణ జీవితమే అతనికి కథా వస్తువయ్యింది.

సీతారాం పుట్టిపెర్గిన ప్రాంతం కరీంనగర్ జిల్లా సిరిసిల్ల. చేనేతకు పెట్టింది పేరు. రంగడు, మారాజు, పిచ్చోడు కథల్ని పరిశీలించినపుడు సిరిసిల్ల ప్రాంతం నుంచి ప్రజలు బొంబాయికి వలసపోవడం 1950 దశకం కల్లా ప్రారంభమైందని అర్థమవుతుంది. 1950 దశకానికే సిరిసిల్ల ప్రాంతపు చేనేత కార్మికులకు తమ మగ్గాలపై బతుకు తెరువు కొద్దికొద్దిగా కష్టం మారడం, వాళ్లచూపు బొంబాయికి మళ్లడం ప్రారంభమయ్యింది. హైదరాబాదు రాష్ట్రంలో అప్పటికే వరంగల్లు ఆజంజాహి మిల్లు, హైదరాబాదు డి.బి.ఆర్. మిల్లు ఏర్పాటు కావడంతో చేనేత సంక్షోభానికి బీజం పడింది. ప్రజలకు మిల్లు బట్టలు చౌకగా అందుబాటులో వస్తున్న కాలం గనుక బొంబాయికి వలసలు ప్రారంభమయినాయి. ఈ సామాజిక పరిణామాన్ని సీతారాం కథలు కొంతమేరకు మనకు పట్టిస్తాయి. సీతారాం గార్కి ఈ స్పృహ ఉన్నదో లేదో గాని ప్రజలు బొంబాయికి వలసబోతున్న సామాజిక స్థితిని మాత్రం తన కథల్లో స్పష్టంగానే చిత్రీకరించాడు.

రాజమ్మ రాజీరికం, లచ్చి, నారిగాని బతుకు మొదలైన కథల్లో ఆనాటి తెలంగాణ గ్రామీణ జీవితాన్ని స్పటిక సదృశ్యంగా చూడగలుగుతాను. లచ్చి కథ మళ్లీ వలస కూలీల బతుకు కథనే. బతుకుతెరువు కోసం పట్నం వచ్చిన రంగడు లచ్చిల మధ్య పట్నపు జీవితం పెంచిన ఎడమని అద్భుతంగా చిత్రీకరించాడు. పల్లెలో ఉన్నంత వరకు అన్యోన్యంగా ఒకరికోసం ఒకరు బతికిన లచ్చి రంగడు పట్నం చేరినాక ఒకరికొకరు దూరంగా జరిగిపోతారు. పట్నం మనిషి నుంచి మనిషిని దూరం చేస్తుందన్న సత్యాన్ని సీతారాం ఆనాడే పసిగట్టి కథా వస్తువుగా స్వీకరించడం విశేషం. నారిగాని బతుకు సీతారాం కథల్లో ఆణిముత్యం గౌండ్లోల్ల బతుకు చిత్రం మన కండ్ల ముందు ఆవిష్కృతనువుతుంది. కథ ముగిసే సరికి నారిగాని మీద పాఠకునికి, నారిగానిలాంటి అనేకమంది కల్లుగీత కార్మికుల బత్కుమీద అనంతమైన జాలికలుగుతుంది. ఇప్పటి వర్తమాన పరిస్థితుల్లో గౌండ్లోండ్ల బతుకులు నారిగాని బత్కుకంటె మరింత దిగజారిపోయిన స్థితిని తలుచుకొని విస్మయం చెందుతాము. గ్రామీణ వృత్తికులాల జీవన పరిస్థితులు పతనం చెందుతున్న వాతావణం తొలితరం కథల్ల కనిపిస్తుండడం-ఆ జీవనం గ్లోబలైజేషన్‌తో దారుణం దెబ్బతినడం-ఇదంతా ఒక గొలుసుకట్టు వ్యవహారంలాగా తోస్తున్నది. అయితే వృత్తికులాల

పతనానికి పారిశ్రామిక విప్లవం భారత దేశంలో ప్రవేశించిననాడే బీజం పడినప్పటికే ఇటీవలి పరిణామాలు ఆ పతనాన్ని వేగవంతం చేసినాయని చెప్పవచ్చు. నారిగాని బతుకు గౌండ్ల బతుకు సంక్షోభం దిశగా పయనిస్తుందన్న సూచనని చిత్రించింది.

ఈ సంపుటిలో విభిన్నమన కథ 'స్త్రీ స్వాతంత్ర్యం' ఈ కథ 1953లో తెలంగాణ రచయితల సంఘం, సిరిసిల్ల శాఖ వెలువరించిన 'నినాదం' సంచికలో అచ్చయింది. స్త్రీ స్వాతంత్ర్యానికి సంబంధించి ఒక మేధావి భావజాలానికి అతని ఆచరణకి ఉన్న అంతరాన్ని, అతనిలోని హిపోక్రసీని అత్యంత ప్రతిభావంతంగా చిత్రీకరించాడు ఈ కథలో సీతారాం గారు. 1953 నాటికి తెలంగాణలో సామాజిక వికాసాన్ని దృష్టిపెట్టుకుంటే తెలంగాణ నుంచి ఈ కథా వస్తువుతో కథరావడం అబ్బురపరిచే విషయంగా తోచకమానదు. అందులో సీతారాం గారు గ్రామీణ ప్రాంత రచయిత. అయితే కోస్తా ఆంధ్రా పత్రికల ద్వారా నిషేదానికి గురి అయిన చలం కథలను ఆదరించి అక్కున జేర్చుకొని ప్రచురించిన ఘనత తెలంగాణకు ఉన్నది. ఈ నేపథ్యాన్ని గమనిస్తే 'స్త్రీ స్వాతంత్ర్యం' కథ తెలంగాణ నుంచి 1953 లోనే రావడంలోనే అసహజంగా తోచదు. తెలంగాణలో సామాజిక పునర్వికాసానికి భావజాల రంగంలో వెల్లువెత్తుతున్న నూతన ఆలోచనా ధోరణులకు మచ్చుతునక ఈ కథ.

ఈ సంపుటిలో ఉన్నవి పద్నాలుగు కథలే గనుక ఆనాటి సామాజిక వాస్తవికతని, పరిణామగతిని రేఖామాత్రంగానే అంచనా వేయగలం. సీతారాం గారి మరిన్ని కథా సంపుటాలు వస్తేగాని సమగ్ర విశ్లేషణ సాధ్యంగాదు.

★ ★ ★

వర్తమాన తెలంగాణ సాహిత్య సాంస్కృతికోద్యమంలో భాష ఒక ప్రధానమైన ధార. భాషా అస్తిత్వ వేదనలోంచే తెలంగాణ సాహిత్యకారులను నా మాతృభాష ఏది? నేను నేర్చుకుంటున్న, పలుకుతున్న భాష ఏది? నేను పుట్టిపెరిగిన ఊళ్లోమాట్లాడిని భాష, ఊపిరి తీసుకున్న శ్వాసలేవి? నా బాల్యంలో నా దోస్తులతో ముచ్చటించిన మాటలేవి? అన్నీ ఏమైపోయినయ్? నా తల్లి భాషకు నేనెంత పరాయివాళ్లయిపోయినాను. మొదలైన ప్రశ్నలు ముంచెత్తి ఊపిరి సలపనయకుండా వేధించినయ్.

ఈ అస్తిత్వ వేదన ఒక ఎత్తయితె తల్లిభాషకు జరుగుతున్న అవమానం, అవహేళనలు గుండె రగిలిపోయేలా చేస్తున్నాయి. ఈ 50 ఏండ్ల సమైక్యాంధ్రలో తెలంగాణ భాషకు అవమానం జరగని క్షణం లేదు. అచ్చమైన స్వచ్ఛమైన తెలంగాణ భాష మాట్లాడే ముఖ్యమంత్రి అంజయ్యను ఆయన పదవిలోంచి దిగిపోయేవరకు కోస్తా ఆంధ్ర పత్రికలు ఎంత ఎద్దేవా చేస్తూ రాసినవో ఆత్మాభిమానం గల తెలంగాణవాసులు ఎవరైనా విస్మరించగల్గుతారా? సినిమాల్లో, టీవీ సీరియళ్లలో తెలంగాణ భాష హేళనకు, అవమానాలకు గురి అవుతున్నతీరు, అపహాస్యం చేస్తున్న తీరు ఎంత గర్వించినా తీరేది

కాదు. తెలంగాణ తరగనిగని ప్రజల పాట. తెలంగాణ ప్రజలు తరతరాలుగా ఆపేక్షగా పాడుకుంటున్న పాటలకు అశ్లీల పేరడీలు కట్టి సొమ్ము చేసుకుంటున్న పరిస్థితి.

ఇక భాషా అస్తిత్వ వేదన తెలంగాణ సాహిత్యకారులలో ఎంతగా ఎగిసిపడుతున్నదంటె కవిత్వం, కథలు సమస్త సాహిత్యం తల్లిభాషలోనే రాయాలనుకుంటున్నారు. అద్భుతమైన కవిత్వాన్ని, కథల్ని తమ తల్లి భాషలోనే రాస్తున్నారు. భాషను వెతుక్కుంటున్నారు తమ పలుకు బడుల, నుడికారాలు, సామెతలు, జాతీయాల జాడలు వెతుక్కుంటున్నారు. ఇగో ఇక్కడ్నే సీతారాం కథలకున్న ప్రాసంగికత విలువ తెలుస్తుంది. సీతారాం అత్యధిక కథలు తన తల్లిభాషలోనే రాసినాడు. అందుకే యువతరానికి ఒక గొప్ప ప్రేరణగా నిలుస్తున్నాడు. రాజమ్మ రాజీరికం, రంగడు, లచ్చి, నారిగాని బతకు, మారాజు, పిచ్చోడు మొదలైన కథలు తల్లి భాషలో కథలు రాస్తున్న కథకులకు ఒక పాఠ్యపుస్తకం ఎక్కడా రసభంగం కలుగకుండా, సాఫీగా సాగీ ఆ కథనం తెలంగాణ భాషలో ఉన్న స్వచ్ఛత, తీయదనం, నుడికారపు సొగసులు పాఠకుడి అనుభూతిలోకి వచ్చి కథలు రాసిన సీతారాం గారి పట్ల అవ్యాజమైన ప్రేమానురాగాలు పొంగిపొరలుతాయి. తెలంగాణ భాషలో తెలుగే లేదనే ఆంధ్రులు ఇంకా ఎవరైనా ఉంటే వారికి సీతారాం కథలే జవాబు. ఇంగ్లీషు పదాలే లేకుండా తెలుగు కథ రాడం ఎట్లానో సీతారాం కథలు చెబుతాయి.

పట్టన తెల్లారింది. పొద్దుపొడిసింది. గప్పుడే కొర్రాయోలె ఎండొచ్చింది. రంగడు గట్టిగా పెయ్యి విరిసి లేసిండు. లేత్తలేత్తనే నెత్తికింద వెట్టుకున్న సంచినివట్టుకుని దబదబ నడిసిండు. కొత్త తొవ్వాయె. కోసుకోపారి తొవ్వ సంగతి తెలుసుకున్నా సానమాట్ల తొవ్వదప్పిండు. నెత్తిమీదకి పొద్దొచ్చేయాల్లకు ఆనూరికి జేరిండు. రంగడు సానా పరిషానైండు ఎందో కొత్తూళ్లె అడుగువెట్టినట్లైంది. ఎంత యాదికి జేసుకున్న సిన్నప్పటి ఊరని సత్తె యాదికి రాలె."

ఇది 'రంగడు' అన్న కథలోని ఒక పేరా. ఇంట్లాంటి పేరాలు కథల నిండా అనేకం. మన స్మృతిలోంచి చెరిగిపోయిన అద్భుత పదచిత్రాలు, నుడికారాలు మళ్లీ మనల్ని పలికరించి పులకరింపజేస్తాయి. పట్టన తెల్లారింది. కొర్రాయోలె ఎండోచ్చింది, కావురం వంగుతది. తాత్పర్యం వట్టింద్రు, బుడ్డజెక్కిండు, యాట్టకచ్చింది, అద్దుమరాత్రి, ముసిముసి మబ్బుల బయలెల్లి, గడియారమెంత గొట్టింది, రకము (డబ్బులు) మార్వానం.. ఎన్నెన్ని అచ్చమైన తెలంగాణ పదాలు!

గూడూరి సీతారాం కన్నతల్లి భాషను, నుడికారాన్ని ఈనాటి తరానికి పట్టిచ్చిన పాఠశాల.

– శ్రీధరరావు దేశ్‌పాండే

కె.పి. అశోక్ కుమార్
17-99, శ్రీరాంనగర్ కాలనీ,
అజ్వాల్, సికింద్రాబాదు.

గూడూరి సీతారాం కథలు
తెలంగాణా భాషా సౌందర్యానికి ప్రతీకలు

మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డిల కంట్రిబ్యూషన్‌తో తెలంగాణా కథ మొదలయింది. వారి వారసత్వాన్ని అందిపుచ్చుకున్న నెల్లూరు కేశవస్వామి, వట్టికోట ఆళ్వారుస్వామి తదితరులు తరువాత గూడూరి సీతారాం గారు విస్తృతంగా కథలు రాయడం కనిపిస్తుంది. సమకాలీనులుగా కనిపించే గూడూరు సీతారాం, సురమౌళి, పి. యశోదారెడ్డి గారు ఒకే ప్రాంతం నుండి, ఒకే సమయంలో రాయడం గమనించతగ్గ విషయం. వీరిలో కథలు, గల్పికలను సీతారాం గారు అప్పట్లో విస్తృతంగానే రాసినా వాటిని సంకలన రూపంలో తేకపోవడం వల్ల కొంత, ఆ పాత పత్రికలు అందుబాటులో లేకపోవడం వల్ల మరికొంత గూడూరి సీతారాం గురించి ఎవరికీ తెలియకుండాపోయింది-ముఖ్యంగా ఇటీవలి తరాలకు. ఈనాటికి సంపాదకుడు పత్తిపాక మోహన్ కృషివల్ల వారు సేకరించిన కొద్ది కథలను ఒక సంకలనంగా తీసుకురావడం అభినందించతగ్గ విషయమే.

ఇందులో వున్న కథలన్నీ 1953 నుండి 1960 నాటి నేపథ్యంలో వెలువడినవే. ఇది తెలంగాణ చాలా గడ్డుకాలం. నైజాం పాలనలో వున్న హైదరాబాదు, కొన్ని ముఖ్యమైన ప్రాంతాలు తప్పించి మిగతాభాగం అంతా ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. ఆ ప్రాంతాలన్నీ దొరలు, దేశ్‌ముఖ్‌ల ఇష్టాఇష్టాలకు వదిలివేశారు. వివక్షత, వెట్టిచాకిరిలాంటి నిరంకుశ విధానాలతో ప్రజలను క్రూరంగా అణచివేసిన కాలం అది. కమ్యూనిస్టుల తెలంగాణా విముక్తి పోరాటంతో తెలంగాణ చైతన్యం ఏర్పడింది. భూపోరాటంతో ఊళ్ళలో ఉండలేక దొరలు పట్నం తరలివెళ్లారు. అత్యధిక శాతం భూములు పడావు పడిపోయాయి. నూతన రాష్ట్ర ఆవిర్భావంతో కాంగ్రేస్ నేతలుగా మారిన దొరలు తిరిగి తమ ప్రాంతాలకు చేరుకొని మరింత నిరంకుశంగా తయారయ్యాయి. సరియైన నీటి వసతులు లేవు. వర్షాధార వ్యవసాయం కాబట్టి వచ్చే ఫలసాయం అంతంత మాత్రమే. వ్యవసాయ


నిరుద్యోగిత వల్ల కొంత, కులవృత్తులు కుంచించుకుపోవడం వల్ల కొంత-వ్యవసాయం మీద ఆధారపడివున్న గ్రామీణ వ్యవస్థ కుప్పకూలిపోయింది. తినడానికి తిండి దొరకక ఊర్లో పనులు లేక పట్నాలకు వలసపోయే పరిస్థితి ఏర్పడింది. అప్పుడు గ్రామాల్లో తాండవిస్తున్న దుర్భర దారిద్ర్యాన్ని, నైరాశ్యాన్ని గూడూరి సీతారాం గారు చక్కగా పట్టుకోగలిగేరు. నిజానికి ఆ కాలం ఫ్యూడల్ వ్యవస్థ నుండి పెట్టుబడిదారీ వ్యవస్థలోకి దారితీస్తున్న సంధికాలం అది. ముఖ్యంగా ఆ కాలం నాటి సామాజిక, ఆర్థిక పరిస్థితులను గూడూరి సీతారాం గారు ప్రతిభావంతంగా తమ కథల్లో చిత్రీకరించగలిగారు.

అప్పట్లో చాలామంది బతుకుతెరువుకోసం పట్నం పోవాలని అనుకునేవాళ్లు. ఎలా పోవాలో, ఎక్కడవుండాలో, ఏంచేయాలో కూడా తెలియని అమాయకత్వం, ఆధునిక ప్రయాణ సౌకర్యాల గురించి అవగాహన లేదు. రైలును ఇనుపభూతంలా చూసి జడుసుకునేవాళ్ళు. రైలెక్కి పట్నం పోవుడు విచిత్రమే కదా! తనతోటి రాముడు తనకన్నా ఎంతో మంచి మంచి పనివాడు, అయినా ఏనాడూ ఒక అర్ధరూపాయి కళ్ళ జూడలేదు. రంగడు కూడా నిత్యం కోడికూయకముందే లేచి దీపాలు ముట్టించేంతవరకు పనిచేస్తాడు. కాని ఎన్నడూ డబ్బు చూసిన పాపాన పోలేదు. బొంబాయిలో పనిచేసే రంగడి అన్న రోజుకు ఎనిమిది గంటలే పనిచేయడం, రూపాయలు సంపాదించడం చాలా గొప్పగా భావించిన రంగడు తనుకూడా అన్న వెంటుండి బొంబాయికి వస్తానని పట్టుబట్టగా వద్దని రంగడికి రైలు-ప్రయాణం పట్ల అనవసర భయాలుపెట్టి అతడ్ని వదిలించుకుని వెళ్ళిపోతాడు. చివరకు రంగడుకూడా పట్నం పోవడానికి ఏదో తిప్పలుపడి టికెట్టుకొని స్టేషన్‌లోకి వస్తాడు. స్టేషన్‌లోకి వస్తున్న రైలును చూసిన రంగనికి అన్న మాటలు జ్ఞాపకం వచ్చి దాన్ని తననెత్తుకుపోవడానికి వస్తున్న కామునిభూతంగా భావించి భయపడి ఉరకబోయి కిందపడిపోతాడు. ఆ భంగపాటు ఊర్లో అందరికి గుర్తుండిపోతుంది. దాంతో పట్నం పోవడం ఆషామాషి వాళ్లతో అయ్యేపనికాదనే భావన అక్కడి ప్రజలలో స్థిరపడిపోతుంది. దానిని తగ్గట్టుగా దొరకాడనే లస్కర్ (సికింద్రాబాదు) దాకా పోయి పరేషాన్ అయివస్తే, రంగడు మాత్రం బొంబాయికి పోయిరావ:ం ఒక సాహసయాత్రగా మారిపోతుంది. రైలును చూసి ఎరగని జనానికి ఆ కదిలే యంత్రంపై ఉన్న భ్రమలు, వారి ప్రయాణపు అనుభవాలను కొన్ని కథలు అత్యంత సహజంగా చిత్రించాయి. ఎవర్ని ఎవరూ పట్టించుకుని పట్నపు జీవితంలో భాష రాక, బతుకు తెలియక అయోమయంలో గింజుకునే అమాయకపు గ్రామీణ మనస్తత్వాన్ని ఈ కథల్లో చూడవచ్చు. పట్నం పోయి బాగుపడ్డ వాడెవడూ లేడని, పట్నవాసపు అలవాట్లు మనషులను ఎలా భ్రష్టు పట్టిస్తాయో "లచ్చి" కథ వివరిస్తుంది. ఇందులో కష్టపడి బతుకుదామని ఊరినుండి పట్నమొచ్చిన బిచ్చగాళ్ళను ఆ పట్టణ వాతావరణం ఎలా చెడగొడుతుందో ఇందులో అత్యంత సహజంగా చిత్రీకరించారు. లేని చెడు అలవాట్లతో, భార్యాభర్తల మధ్య పోట్లాటలతో చివరకు కళ్ళు తెరిచినవారు తమ ఊరికే తిరిగి వెళ్ళిపోదామని నిశ్చయించుకుంటారు. పల్లె జీవితానికి, పట్న జీవితానికి

మధ్యవున్న భేదాన్ని ఈ కథలో గుర్తించవచ్చు. దాదాపుగా చాలా కథల్లో రంగడే కథా నాయకుడు. పట్నం పోవడానికి ప్రయత్నించినవాడు, బొంబాయి పోయి వచ్చినవాడు, పట్నంలో బ్రతకలేక వచ్చినవాడు - ఇలా రంగడే అంతలో కనిపిస్తాడు. వాళ్ళతోపాటు భిలాయిలో స్థిరపడ్డ రంగడు స్వస్థలానికి వచ్చి ఆశాభంగం చెందిన కథ మరొకటి. చిన్ననాటి జ్ఞాపకాలను మధుర స్మృతులుగా జీవితాంతం తలచుకునే రంగనికి అవి చెల్లాచెదురైపోతే తట్టుకోలేకపోతాడు. తన చిన్ననాడు దేవతలా ఆదుకున్న దొరసానిలేదు. ఆ వైభవమూ లేదని తెలుసుకుని దిగాలుపడిన రంగడు బాధాతప్త హృదయంతో తిరిగివెళ్ళిపోతాడు. ఇది మనందరికి అనుభవైకవేద్యమే. పుట్టిన ఊరికి దూరమై ఆ ఊరి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ ఎప్పుడో ఓసారి ఊరికి వచ్చి చూస్తే అంతా మారిపోతుంది. ఆ మార్పును చూసి తట్టుకోలేక, తమ పాత అనుభవాలతో బేరీజు వేసుకోలేక బాధపడటం సహజం. ఈ కథలో జరిగింది కూడా అదే. పొట్టకూటికి భిలాయి తరలివెళ్ళిన రంగడు తన ఊరిని, దొరసాని ఆదరణను మరిచిపోలేక వస్తాడు. తన జ్ఞాపకాలలో సజీవంగా వున్న ఆ వ్యక్తి లేదని తెలుసుకున్న తర్వాత ఊరి మీదనే విరక్తి కలుగుతుంది. తను అనవసరంగా ఎందుకొచ్చానా అని బాధపడి తిరిగి వెళ్ళిపోతాడు. సినిమాలు-సినీ వ్యామోహం వల్ల అమాయక స్త్రీల జీవితాలు ఎలా నాశనమవుతాయో 'రాజమ్మ రాజీరికం' కథ తెలియజేస్తుంది. నాగరికతా నాజూకు విశేషాలను అలవాటు పడిన రాజమ్మ మోటుగా కనిపించే భర్తను వదిలి, పుట్టింటికి వచ్చి స్వేచ్ఛగా బ్రతకాలని భావించి, చివరకు రోగాలతో బిచ్చగత్తెగా మారిన దీనగాథ ఇందులో కనిపిస్తుంది. ఊళ్ళలో కులవృత్తులు వారి ఆలోచనా విధానంలో వస్తున్న మార్పులను "నారిగాని బతుకు" లో చూడవచ్చు. గౌండ్లవాళ్ళలో మగాళ్ళు తాళ్ళలోకిపోయి కల్లు గీసుకుని వస్తారు. ఆడవాళ్ళు దుకాణాలలో కూచొని కల్లు అమ్ముతారు. కల్లు తాగినవాళ్ళు ఆడాళ్ళతో సరసాలాడతారు. వాళ్లపై దౌర్జన్యం చేయబోతారు. ఇవేవి నచ్చని నారిగాడు తానే దుకాణంలో కూచొని అమ్మకాలు సాగిస్తాడు. చివరకు కల్లును ఆడోళ్ళతో అమ్మించవద్దంటే తన కొడుకే వినిపించుకోడు. గిరాకీ రావాలంటే, డబ్బులు సంపాదించాలంటే ఆడోళ్ళతోనే కల్లు అమ్మించాలని పట్టుబడతాడు. మనుషుల్లో చోటుచేసుకున్న వ్యాపార దృక్పథాన్ని, విలువల పతనాన్ని ఈ కథలో చక్కగా చిత్రీకరించారు.


ఈ కథలన్నీ అసలు సిసలైన తెలంగాణా మాండలిక భాషా సౌందర్యానికి ప్రతీకలు. కథ, కథనం, సంభాషణలు, వర్ణనలు అంతా మాండలికమే. ఎక్కడా ఒక వ్యావహారిక బాషాపదం, అన్యభాషాపదం లేకుండా లయాత్మకమైన తూగుతో అచ్చ తెలంగాణా మాండలికం పొదుపులున్న ఈ కథలు మాండలిక సాహిత్యంలో ఆణిముత్యాలుగా మిగిలిపోతాయి. మాండలికంతో పాటు వ్యావహారిక భాషలు కూడా కథలు వ్రాయడంలో గూడూరి సీతారాంగారి ప్రతిభ ప్రశంసించదగినది. ముఖ్యంగా యువతరంలో చోటు చేసుకున్న ప్రేమ-పెళ్ళి-వియోగం-అపార్థాలు-అసంతృప్తులు, అన్నింటిని చిన్నచిన్న

కథలుగా, గల్పికలుగా తీర్చిదిద్దడం ఇందులో కనిపిస్తుంది. ఈ కథలన్నింటిలో ప్రత్యేకంగా చెప్పుకోదగినవి 'చీకటి గొడుగులు' 'స్త్రీ స్వాతంత్ర్యం' మిత్రుడి కుటుంబానికి ద్రోహం చేసి తన తప్పేం లేదన్నట్లుగా ఆత్మవంచన చేసుకోవడం 'చీకటి గొడుగులు'లో కనిపిస్తుంది. స్త్రీ స్వతంత్రించి చేసే పనులను ఏ మాత్రం ఆమోదించలేని వాళ్ళే, స్త్రీకి స్వాతంత్ర్యం కావాలని వేదికల మీద, తమ రచనల్లో వాదిస్తుంటారు. అలాంటి కుహనా అభ్యుదయవాది అంతరంగాన్ని వ్యంగ్యాత్మాకంగా 'స్త్రీ స్వాతంత్ర్యం'లో చిత్రీకరించిన తీరు ఆకట్టుకుంటాయి. మొత్తానికి ఈ గల్పికలన్నింటి పై చలం, ధనికొండ హనుమంతరావు, రావూరి భరద్వాజలాంటి ప్రముఖుల ముద్ర, అనుసరణ ధోరణులు కనిపిస్తాయి. తొలితరం రచయితలకు ఉన్న భాషాపరమైన మమకారం కూడా ఈ కథల్లో కొట్టొచ్చినట్లుగా కనిపిస్తుంది. అదే ఈ కథకుడిలో ఉన్న గొప్పతనం, వస్తురీత్యా, శిల్పరీత్యా ఎంతో ఉన్నతస్థాయికి ఎదిగిన ఈనాటి కథతో వీటిని పోల్చుకోవలసిన అవసరం లేదు. ఆనాటి దేశకాలమాన పరిస్థితులకు అనుగుణంగా ఈ కథలను విశ్లేషించినపుడే ఈ కథల గొప్పతనం తెలుస్తుంది. ఈ పుస్తకానికి అనుబంధంగా రచయిత జీవితం-సాహిత్యానికి సంబంధించిన వివరాలు కూడా ఇచ్చివుంటే అది ఈతరం పాఠకులకు స్ఫూర్తిగా నిలిచేది. అయినా ఆ కొరతను పూరించేదిశగా జూకంటి జగన్నాథం గారు తమవంతు ప్రయత్నాన్ని సమర్థవంతంగా చేశారు. సీతారాం గారి రచనలను వెలికితీయడంలో పరిశోధకుడు డా. పత్తిపాక మోహన్ కృషి ప్రశంసనీయం.



సహచర నిజాం కళాశాల విద్యార్థులు, అధ్యాపకులతో గూడూరి సీతారాం (1956-57)

బోయ జంగయ్య
5-7-68/E2, మాన్యంచెలుక,
నల్లగొండ - 508 001.



స్థితప్రజ్ఞుడు సీతన్న

ఆలోచన మేఘాలు ఒరుసుకొని మెరుపు మెరిసినపుడు కవిత్వం వర్షమై కురుస్తుంది. కాని కథ అట్ల కాదు. కథకు వ్యవసాయం అవసరం. మొదట ఓ ప్లాన్, దానిని కాగితం మీద పెట్టడం. శిల్పానికి తగిని శైలిలో రచన కొనసాగించి ఓసారి అన్నీ అమిరినవో లేదో చెక్ చేసుకోవడం జరిగినాక ఓ పేర్చిన బతకమ్మలాగ కథ సిద్ధం అవుతుందని నా అనుభవానికి వచ్చిన సంగతి. ఇక ప్రముఖ రచయితలు అన్నట్టుగా కథలు గాలిలో పుట్టవు. జీవితం నుండి పుట్టుకొస్తాయి. అందుచేత రచయితలు జీవితానికి దగ్గరగా ఉండాలి. జీవితానికి దగ్గరగా ఉండగలిగిన వారే మంచి రచయితలుగా మిగులుతారు. గూడూరు సీతారాం కథల్లోను మనం ఇదే చూస్తాం.

పది మంది గుమి కూడి మాట్లాడకూడదు. కరపత్రాల్ని కూడా ప్రకటించకూడదు, పంచకూడదు. అని నిషేదం ఉన్న రోజుల్లో గూడూరు సీతారాం గారు కథలు రాసారు. అప్పట్లో వెలుబడే పత్రికల్లో అచ్చు అయినయి. ఊర్లు ఊర్లవాడలు, వలసలు ప్రయాణాలు, కులవృత్తులు మొదలగు వాటిని చిత్రించి మనల ఏబదేండ్ల వెనక్కు తీసుకుపోయి అప్పటి స్థితిగతులను మనముందుంచారు. అప్పుడు వాడుకలో ఉన్న యాసను వాడారు. 'నారిగాని బతుకు' కథ చిన్నదైన పెద్దజీవిత ప్రయాణాన్ని తెలుపుతుంది. లోకం దానితీరు, దాని చూపు బాగా చిత్రించబడడం జరిగింది.' నారిగాడు తన జీవిత అనుభవాన్ని ఓ శాసనంగా ప్రకటించాడు. కాని కొడుకు వినలేదు.తను నోరుమూసుకొని మంచాన చేరిండు చివర కథ ముగింపు ఈ కథ చదివి పేజీ తిప్పేటపుడు మాఊరు గుర్తొచ్చింది. మాది పంతంగి. పంతంగిలో ఆరోజుల్లో తాళ్ళు ఎక్కువ. గీత పని ఓ చిన్నపాటి పరిశ్రమ ఉండేది. చాలా చోట్లకు మాఊరు కల్లు వెళ్లేది. ఆ రోజుల్లో వాళ్లు బతికిన బతుకులు నా కళ్ల ముందు కదిలాయి. చెప్పొచ్చేదేమిటంటే కథ చదవగానే పాఠకుని మనసుకు ఏదో ఓ అంశం తన అనుభవాన్ని తట్టాలి. అలా తట్టితేనే అది మంచి కథ.

'లచ్చి' కథ మరో మంచి కథ. బతుకులో వచ్చే ఒడిదొడుకులు అవసరాలు వాటి కోసం పడే పాట్లు ఈ కథలో కళ్లకు కట్టినట్లు చిత్రణ జరిగింది. అవును చుట్టూర ఉన్న జీవితంలో నుండి వచ్చే కథలన్ని ఇట్లాగే ఉంటాయి మరి.

సీతారాం గారి కథల్లో కాల్పనికత తక్కువ జీవితం ఎక్కువ. ఎందుకంటే ఆయన జీవితంలో నుండే వస్తువును తీసుకున్నాడు. గ్రామం. గ్రామాలలోని వాడలు, వాడల్లో ఉండే, జనం ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిని గూర్చిన చర్చలు తగు పరిష్కారాలు వాళ్ల మాటాల్లోనే మలచడం వల్ల కథలు చిక్కగా వచ్చినవి.

'దెబ్బతిన్న అహంభావం' చిన్న కథ అతి సహజంగా నడిచింది. ఈ కథలో అంత యాస లేదు. అతి సాధారణంగా సాగిన ఈ కథను తెలంగాణా పాఠకులే కాకుండా తెలుగు పాఠకులందరు అందుకుంటరు. మాండలికం మీద ఉన్న మమకారంతో పదుగురికి దూరం కాకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంది.

ఏది ఏమైన పత్తిపాక మోహన్ అన్నట్టు సీతారాం గారు కథల మారాజే! ఏరాజమార్గమైనా కాలిబాటతోనే మొదలైనట్టు ఆనాడు ఆయన నడిచిన సన్నని పిల్లబాట కరీంనగర్ నుండి నాలుగు దిక్కుల కథల రహదారులను వేసుకుంది. ఈ వ్యాసం రాస్తున్నపుడు విశాలాంధ్ర ఆదివారం సంచిక వచ్చి వాలింది. సాహితీ మిత్రులు మహారాజు గారు సీతారాం గారి మీద రాసిన కవిత నన్ను ఎంతో కదిలించింది.

బి.ఎస్. రాములు స్నేహం వల్ల కరీంనగర్ ప్రముఖ రచయితలు దాదాపునాకు దగ్గరైనారు. చెయ్యెత్తు మనిషి, చెదరని చిరునవ్వుతో పల్లెవాసి అయిన పాలనురుగు లాంటి కట్టుబొట్టు ఆకుపోకల అలవాటు, కపటం లేని చూపులతో మెత్తగా మాట్లాడే వ్యక్తి, మహారాజు అన్న 'చీకటిని మించిన చీకటిలో' కూడా సీతన్న చిరునవ్వుతో నడవడం మామూలు విషయం అస్సలు కాదు. ఒక్క స్థిత ప్రజ్ఞులే అట్టా నడుస్తారు.

- బోయ జంగయ్య

కె.వి. నరేందర్
జగిత్యాల, కరీంనగర్ జిల్లా
ఫోను : 08724-226466



బంగారు మనిషికి...బంతిపూల దండలు!

బాపూ...

పన్నెండేండ్లు కథావాసం చేసిన నువ్వు ఎంత పొరపాటు చేసినవే... ఇప్పటివరకు పుస్తకమెయ్యకపోవటం పొరపాటు కాదా... ఏ సమీక్షల్లోనో నీ పేరు రాసి.. నారిగాని బతుకు అనో.. చీకటి గొడుగులనో కథల పేర్లు రాసుడే చదివినం గానీ.. ఎన్నేండ్లకు నీ కథలు చదివే భాగ్యం దొరికిందే.. కొత్తకొత్తగా కథలు రాస్తున్నం అంటే... ఎవలైనా కొకు కథలు చదువ్... రావిశాస్త్రి కథలు చదువ్... అని చెప్పినోల్లేగనీ...మన గూడూరి సీతారాం కథలు చదువు... సురమౌళి కథలు చదువు అని చెప్పినోల్లే లేరు...వాల్లయినా ఎట్లచెప్తరు? ఇప్పటిదాకా పుస్తకాలే రాకపాయె... నలుపై ఏండ్లకు పుస్తకమేస్తివి.. గీ పుస్తకం పదేండ్ల కింద వచ్చినా... నీ అడుగు జాడలకు ముద్రలు తయారుచేసెటోల్లం... ఇప్పటికైనా తొవ్వ జూపినవ్...మాకో ఐస్క్రోటు దొరికినట్టు... తెలంగాణా వాకిట్ల పెద్ద బతుకమ్మ నిల్చుండవెట్టినట్టు... దసర పండుగనాడు పాలపిట్ట ఎదురైనట్టు...

పల్లెనిడిసి పెట్టిపోయిన 'రంగడు' మల్లా ఇంటికచ్చినంత సంబురం... 'లచ్చి' లెక్క ఎంత అందమైన కథలు.. ఎంత తెలివైన కథలు... 'నారిగాని బతుకు' లెక్క ఆగమాగమైన తెలంగాణా జీవన చిత్రాల్ని దుర్బినేసి చూపిచ్చినవ్.. 'మారాజు' రంగని బతుకు బయటపడ్డట్టు... 'చీకటి గొడుగుల' కింద 'ఎర్రపువ్వు' పూసినట్టు.. తెలంగాణా కథా సాహిత్యంలో మీ పుస్తకంలో పెద్దముత్తయిదువ లెక్క నిల్చింది.

మీ బంగరు పండుక్కు మేమూ కథా తోరణాలు గుచ్చుతం.. బంతిపూల దండలు కడుతాం...

- కె.వి. నరేందర్



టివి. నారాయణ
సిరిసిల్ల

కతల నేతగాడు సీతన్న


తెలంగాణ తొలితరం కథకులలో గూడూరి సీతారాం ఒకరు. ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో ఇంతకాలం విస్మృతిలో పడిపోయిన అనేక మంది తెలంగాణ రచయితల వలె ఆయన కూడా అనామకంగా మిగిలిపోయారు. ఐదు దశాబ్దాల కిందటే చక్కటి తెలుగు కథలను రాసిన సీతారాం కథాసంపుటి ఆయన డెబ్బై ఏండ్ల వయసులో ఇటీవలే ప్రచురితమైంది. జిల్లాకు చెందిన సీతారాం కరీంనగర్, తెలంగాణ మాత్రమే కాదు యావత్ రాష్ట్రమంతా గర్వించదగ్గ రచయిత. సీతారాం స్వగ్రామం హన్మాజీపేల (వేములవాడ మండలం) ఇప్పటిదాకా సి.నారాయణరెడ్డి పుట్టిన ఊరుగానే ప్రసిద్ధం. ఇకపై అది సీతారాం స్వగ్రామంగా కూడా మరింత ఖ్యాతి పొందన్నునది. హనుమాజీపేట నుంచి సిరిసిల్ల వచ్చి సీతన్నగా అందరి మనసులు దోచుకున్న ఆయన 1953 నుంచి 1965 వరకు ఎనభై కథలు రాశారు. 'పాత కొత్తలు' వంటి రెండు నవలలు రాశారు. ఆనాటి ప్రసిద్ధ తెలుగు పత్రికలో ధారా వాహికలుగా వచ్చాయి. ఏడవ తరగతి చదువుతున్న కాలంలోనే 'నినాదం' అనే పత్రికలో 'స్త్రీ స్వాతంత్ర్యం' అనే పేరుతో కథను రాశారు. విద్యార్థి దశలోనే స్త్రీ స్వేచ్ఛను గురించి కథ రాసిన ఆయన యువతరం అందుకు ఉద్యమించాలని తాపత్రయపడ్డారు. బోయినపల్లి వెంకట రామారావు నిర్వహించిన 'సారస్వతజ్యోతి'లో అదే సంవత్సరం ఒక ఆంగ్ల కథ ఆధారంగా రాసిన 'మూడుప్రశ్నలు' అనే కథను ప్రచురించారు. మాండలికంలో 1957 లోనే 'మారాజు' అన్న కథను అందించారు. సీతారాం 1953 నుంచి 1965 వరకు 85 కథల వరకు కథలు రాశాడు. అవన్నీ కూడా అప్పుడు వచ్చిన పత్రికల్లో అచ్చుకు నోచుకున్నవే. అయితే వాటిలో చాలావరకు ఇప్పుడు దొరకడం లేదు. ఇటీవల సిరిసిల్లలోని మానేరు రచయితల సంఘం (మారసం) చేసిన ప్రయత్నంలో కేవలం 14 కథలను మాత్రం సంపాదించి ప్రచురించగలిగారు. డిసెంబర్‌లో ఈ సంకలనం ఆవిష్కరణకు మారసం ఏర్పాట్లు చేస్తోంది. ఈ సందర్భంగా సీతన్న జ్ఞాపకలు ఆయన మాటల్లోనే...

ఎన్నో కథలు రాశా.. 'పద్మశాలి' పైనే రాయలేక పోయా...

ఎన్నో కతలు రాశాను... పద్మశాలీల మీదనే కథ రాయలేక పోయినా అని అప్పుడప్పుడు బాధిస్తూనే ఉంది. నేను రాసిన కథలన్నీ ఏదో ఒక పత్రికలో అచ్చయినవే. అప్పుడు ఆంధ్రప్రభ, స్రవంతి, ఉషస్సు, నినాదం, తెలుగుదేశం వంటి పత్రకలో అచ్చుకు నోచుకున్నాయి. సినారెది మాది ఒకే ఊరు. ఆయన సహచర్యంతోనే కథకుడినయ్యాను. నారాయణరెడ్డితో పాటు పది మందిమి ఒక జట్టుగా మెదిగే వాళ్ళం. కనపర్తి, చొప్పకట్ల చంద్రమౌళి కవులైతే, నేను కథలు రాసేవాన్ని, ఆదిరెడ్డి గాయకుడిగా, మిద్దె రాములు ఒగ్గుకథ కళాకారుడిగా ఎదిగారు. సాయంత్రం అయితే మా ఊరి పక్క మూలవాగుకు వెళ్ళి గంటల తరబడి సాహితీ కాలక్షేపం చేసే వాళ్ళం. కథలు, కవితలు, జానపద గేయాలతో మూలవాగులో సంబరంగా ఉండేది. చాలా కథలు రాసిన నా దగ్గర కొన్ని ఉన్నాయి. దొరకి కొన్నింటితో 'మారసం' నుంచి కథల పుస్తకాలు వేశాం. వేములవాడలో చదువుకునే కాలంలో గోరా, లవణం ప్రభావంతో 'ఎథీయిస్ట్ బాయ్స్ క్లబ్' మిత్రులతో కలిపి ఏర్పాటు చేశాం. 1956లో సిరిసిల్లలో హెచ్ఎస్‌సి చదివేటప్పుడు 'తరంగిణి' అనే పత్రిక నడిపాను. దాశరథి కృష్ణమాచార్య అధ్యక్షులుగా సినారె కార్యదర్శిగా ఉన్న తెలంగాణ రచయితల సంఘంలో చురుగ్గా పనిచేసే వాడిని. ఆ సంఘం ఉపాధ్యక్షులుగా కూడా కొనసాగాను. అప్పుడే 'నినాదం' అనే పత్రిక కూడా నడపడంతో పాటు 'చిరుగజ్జెలు' అనే చిన్న పుస్తకాన్ని వేశాను. అందులో వట్టికోట ఆళ్వారుస్వామి రచన, సినారె కవిత, నా కథతో పాటు యశోదారెడ్డి నాటిక ఉన్నాయి. అంతేకాక కవితలు, కథానికలతో 'మల్లెమొగ్గలు' అనే 40 పేజీల పుస్తకాన్ని తీసుకొచ్చాను. గ్రామాల్లో తిరిగి జానపద గీతాలను సేకరించడం కూడా చేసేవాడిని. 1961లో నిజాం కాలేజీలో బిఏలో ప్రవేశించినప్పటికే సినారె అక్కడ లెక్చరర్ అయ్యాడు. హైదరాబాద్‌లో దాశరథి, ఆళ్వారుస్వామి వంటి వారందరం ఒకే దగ్గర ఉండే వాళ్ళం. కాళోజీ, నేరెళ్ళ వేణుమాదవ్ అందరూ వచ్చివెళ్ళేవారు. కాళోజీ 'నా గొడవ' మొదటి ప్రచురణ ప్రూపులు చూసినా. సినారె ఆధునికాంధ్ర కవిత్వంపై రాసిన థీసీస్‌ని మూడు కాపీలు చేసి పెట్టింది కూడా నేనే. బి.ఏ. పూర్తి కాగానే బ్యూరో ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ ఉద్యోగం, ప్రొగ్రెస్ అసిస్టెంట్‌గా భువనగిరిలో పోస్టింగ్ ఇచ్చిన తరువాత రెగ్యులర్ అయ్యాక సిరిసిల్ల, వేములవాడ, మెట్‌పల్లి, హుజురాబాద్‌లలో పనిచేశాను. చివరకు సర్పంచ్‌లు, రాజకీయ నాయకులతో తినడం, తాగడం ఇది తప్పా ఇంకో లోకం లేకుండా పోయింది. 1976లో స్నేహితుడు ఎలక్షన్‌లో నిలబడితే ఆఫీసు వదిలి ప్రచారానికి పోయినా. ఇగ ఆ తరువాత ఆఫీసు మొఖం చూడలేదు. తరువాత కథలు, సాహిత్యంతో సంబంధం లేకుండా పోయింది. ఇప్పుడు మానేరు రచయితల సంఘం ద్వారా సాహిత్య కళా రంగాలలో నా వంతు సహకారం అందిస్తున్నాను.

– టివి నారాయణ

(ఇంటూర్వ్యూ, ఆంధ్రజ్యోతి, ఆదివారం 21, నవంబర్ 2004)



డా. కాలువ మల్లయ్య
7-4-163, కాశ్మీర్‌గడ్డ,
కరీంనగర్

మాండలిక కథల 'మారాజు'

స్వాతంత్ర్యానికి ముందు, స్వాతంత్ర్యానంతర సమీప కాలంలో తెలంగాణలో ఓ పీడిత కులంలో పుట్టిన వారికి చదువుకునే అవకాశాలే తక్కువ... దాదాపు మృగ్యం.. కలం బట్టి రచయితగా నిలదొక్కుకోవడం మరీ కష్టం.. అలాంటి సమయంలో 1953 నుంచి 1965 వరకు పది పన్నెండేండ్ల కాలంలో అన్ని ప్రసిద్ధ పత్రికల్లో కథలు, నవలలు రాసిన మొదటి తరం తెలంగాణ కథకుడు గూడూరి సీతారాం.. ఆ రాయడం వట్టి కథలు కాదు... కోస్తాంధ్ర కథ మధ్యతరగతి జీవితాల, అగ్రవర్ణ వస్తువు నుంచి బయటకు రాకుంటే సీతారాం అప్పుడే శ్రామిక కులాల గూర్చి కథలు రాసారు...

అదీ అచ్చమైన తెలంగాణ మాండలికంలోనే.. రాష్ట్రావతరణ తర్వాతి వ్యావహారిక భాష మత్తు సీతారాం కథల్లో కనబడదు.. మాండలికాన్ని రాయాలా వద్దా రాస్తే వేసుకుంటారో వేసుకోరో అన్న సందేహమూ కనబడదు.. తాను చూసిన జీవితాలను, అనుభవించిన బతుకును, తన చుట్టూ జరుగుతున్న శ్రామిక కులాల వారి బతుకు వెతలను వాస్తవికంగా, కళాత్మకంగా చిత్రించారు. తమ ఊరివాళ్ళు, తమ ఇంటింవాళ్లు వివిధ వృత్తులకు సంబంధించిన వాళ్ళు మాట్లాడే భాషలో ఏ దాపరికమూ లేకుండా రాసారు. ఒక్కమాటలో చెప్పాలంటే జీవద్భాషయైన మాండలికాన్ని, ప్రజల భాషను హృదయానికి హత్తుకున్నారు... రచయిత కథనానికి వ్యావహారికం, పాత్రల సంభాషణకు మాండలికం అన్న నియమాల జోలికి పోకుండా మొత్తం కథను మాండలికంలో రాసి మెప్పించిన ప్రజాకథకుడు గూడూరి సీతారాం. మొత్తం కథను మాండలికంలో రాసిన మొట్టమొదటి తెలంగాణ కథకుడు గూడూరి సీతారాం గారే.. రాజమ్మ రాజీరకం, లచ్చి, నారిగాని బతుకు, మారాజు, పిచ్చోడు లాంటి అనేక కథలు ఇందుకు ఉదాహరణలుగా నిలుస్తాయి.

సీతారాం గారు రాసిన కథల భాష తెలంగాణ గ్రామాల్లో శ్రామిక జనాల బాష... ఇతని కథలు కొన్నిట్లో కథనానికి వ్యావహారికం వాడినా వాక్య నిర్మాణంలో మాండలిక పోకడలే కనబడుతాయి.. స్వాతంత్ర్యానికి పూర్వం, ఆ తర్వాతి కాలంలో శ్రామిక జనం

వాడుకలో ఉండి ఆ తర్వాత కనుమరుగయిన అనేక మాండలిక పదాలు ఇతని కథల్లో దర్శనమిస్తాయి. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డా॥ సి. నారాయణరెడ్డి గారి పుట్టిన ఊరయిన హనుమాజి పేటలో పుట్టి పెరిగిన గూడూరి సీతారాం పల్లె పాటను (కవితకు) కాక కథనెన్నుకున్నారు. అవును పత్తిపాక మోహన్ చెప్పినట్టు గూడూరి సీతారాం హనుమాజిపేట నుండి ఎడ్లకచ్చురాల మీద సిరిసిల్లకు వచ్చిన ఆయన తనవెంట తీసుకొచ్చింది మూలవాగు ముచ్చట్లు. మోసుకొచ్చింది అక్కడి జనాల అనుభవాలు.. ఆ వాగొడ్డున ఆడుకుంటూ బాల్యంలో జమచేసుకున్న కప్పెలు, గవ్వలను యాభై ఏండ్ల క్రిందనే ఒక్కొక్క ముల్లెగా విప్పి కథలుగా అందించారు. ఏండ్లైనా అవి ఇప్పటికీ దసన్నపూవులై మెరుస్తున్నాయి... కథల దారెంటపోయే తెలంగాణ రచయితలను కట్ల పువ్వుల్లా తలలూపుతూ పిలుస్తున్నాయి.

ఎప్పుడూ ముఖం మీద చిరునవ్వుతో, వయసు కనబడనీయని ఆరోగ్యంతో ఉండే గూడూరి వారిలో మూర్తీభవించిన సహనం, వినయం ఉట్టి పడుతుంది. సహజమైన వినయశీలతే. ఆతని కథల్లోనూ అదే కనబడుతుంది. సహజత్వం ఉట్టిపడుతుంది.

“సీతారాం, కథలు అచ్చమైన తెలుగుభాషా సంస్కృతిలోంచి నిజాయితీగా, స్వచ్ఛంగా పూసిన మొగిలి పూరేకులు. ఏమీ తెలియని పసివయసులో లగ్గం అయినప్పుడు పోషమ్మ దగ్గర పెండ్లి పిల్లగాడు నోటితో అందుకునే ఆకులు పోకలు” చిన్నపిల్ల కాలువ ఒరవడి. మెట్టుబడిలో ఇటుకపొడితో దిద్దిన బాలశిక్ష. తెలంగాణ విమోచన కొరకు ప్రస్తుత సాహిత్య సాంస్కృతిక రంగాలలో తెలంగాణ కవులు రచయితలు మొత్తం 'తాకత్'ను కూడదీసుకు కదలజారుతూ కదులుతున్న 'జుతాస్'తో గూడూరి సీతారాం కథలు ఒక మూలమలుపు. ఒక చేత్తో పట్టుకున్న ప్లేకార్డు.. గొంతెత్తిన తడి నినాదం. అంటాడు ప్రముఖ కవి జూకంటి జగన్నాథం. ఈరోజు సమధికోత్సాహంతో రచనలు చేస్తున్న తెలంగాణ కవులు, రచయితలు వస్తు సేకరణ, భాష విషయంలో తమ మొదటి తరం రచయితయిన గూడూరి సీతారాం కథలను చదివి నేర్చుకోవాల్సినదెంతో ఉంది. ఆధునిక కథావిర్భావ వికాసాలు, పత్రికల జాడ అంతగా లేని తెలంగాణ ప్రాంతం నుండి ఆ కాలం నాటికి వచ్చిన కథల్లో గూడూరి సీతారాం గారి కథలు ఎన్నదగినవే.

మొదటి తరం నుంచే తెలంగాణ నుంచి మధ్యతరగతి దృక్పథంతో కాక అట్టడుగు జనజీవన సంస్కృతి చిత్రణ నేపథ్యంలోంచి కథలు వచ్చినా సీతారాం కథలు అప్పుడే వృత్తి పరమైన జీవితాలనెన్నుకొని రాయబడ్డవి. అంటే ఇప్పుడు బహుజన కథ, అని చెప్పుకోబడే కథకు అప్పట్లోనే పునాదులు వేసిన ఘనత సీతారాం గారికే దక్కుతుంది. నేను బహుజన కథలో మరే కథలో రాస్తున్నాదనన్న ఎరుకతో సీతారాం గారీ కథలని రాసి ఉండకపోవచ్చు. తన అనుభవ పరిధిలోకి వచ్చిన, తాను చూసిన గ్రామీణ జీవితాలను అక్షరీకరించే క్రమంలో అవి బహుజన కథలయ్యాయి. కరీంనగర్ జిల్లాలోని మానేరు ఒడ్డు ప్రాంతం నుంచి కథకుడిగా ఎదిగిన గూడూరి సీతారాం కథల్నిండా గ్రామీణ జీవితం - పల్లీయుల భాష కనబడుతుంది. స్వాతంత్ర్యానికి ముందు తెలంగాణ గ్రామాల

స్థితిగతులను తెలుసుకోనడానికి ఈ కథలెంతో ఉపయోగపడుతాయి. ముఖ్యంగా వృత్తి పనివారల సంస్కృతీ సాంప్రదాయాలు, జీవిత పరిమళం ఈ కథల్నిండా దర్శనమిస్తుంది.

ఆ పదేళ్ళ కాలంలో అద్భుతంగా కథలు రాసిన ఈ రచయిత అదే ఒరవడిని కొనసాగించి ఉంటే తెలంగాణ కథకు, తెలుగు కథకు మొదటి తరంలోనే బహుజన జీవన పరిమళం అబ్బివుండేది. తెలుగు కథకెంతో మేలు జరిగుండేది. అనేక కారణాలవల్ల గత నలభై ఏళ్లుగా తన కథా రచనను కొనసాగించక పోయిన గూడూరి సీతారాంగారు ఇన్నాళ్ళకైనా దొరికిన కథలతో గూడూరి సీతారాం కథలు పేరుతో కథల సంపుటి తీసుకు రావడం ఆనందింపదగ్గ విషయం. ఈ సంపుటిలో ఉన్న రాజమ్మ రాజేరుకం, రంగడు, లచ్చి, నారిగాని బతుకు, మారాజు, చీకటి గొడుగులు, బస్సు కదిలించి, ఎర్రని పువ్వడు, పెళ్ళీ-ప్రేమ, స్త్రీ స్వాతంత్ర్యం, పిచ్చోడు, అబ్బాయి-అమ్మాయి, అందని ఆకాశం, దెబ్బతిన్న అహంభావం కథలన్నిట్లోనూ తెలంగాణ జీవన పరిమళం గుభాళిస్తుంది. జానపదబాణీ, ఆశు సాంప్రదాయ కథా కథనం కనబడుతుంది. సహజ సిద్ధమైన భాషా శజల్లాపు దర్శనమిస్తాయి. తోలుకపోను రావడం, పట్వ, పొంటె, నిత్తె, ఇసిత్రం, దుంకుడు, దండెకడెం, పడిగెలు లాంటి మాండలిక పదాలు కనపడుతాయి.

కందిసేండ్ల కూసుని నీవు
కన్ను గీటలే పూసలోల్ల రాజమ్మ...!
ఎనగంటి సందునా
మరిగంటి సందువా
మత్తడ బండల్ల, పక్కెట్ల పొందెనే పూసలోల్ల రాజమ్మా...!

ఇలాంటి జానపద బాణీలను పలుకుబళ్ళను తన కథల్లో విస్తృతంగా వాడుకున్నారు సీతారాం. తెలంగాణ మాండలిక పలుకుబల్లు, సామెతలు కథల్నిండా దర్శనమిస్తాయి.

రాచ్చససోంటోల్లు నిండా నూరేండ్లు బతుకుతరు.
గోరెససోంటోల్లు మా యెల్లకే జత్తరు కొర్రాయోలె ఎండచ్చింది...

ఇవన్నీ ఈతని కథల్లోని ప్రయోగాలే.. పల్లెను హృదయం నిండా అలుముకొని, పట్టణీకరణం, పారిశ్రామికీరణంలోని తాత్కాలిక సుఖాలను ఎద్దేవా చేస్తూ, తెలంగాణ నడిబొడ్డు కరీంనగర్ ప్రజల భాషను హృధయానికి హత్తుకొని మొదటి తరంలోనే అద్భుత కథలు రాసిన గూడూరి సీతారాం మాండలిక కథల "మారాజు". అతని కథలన్నీ సంపుటాలుగా రావడంతోపాటు మరిన్ని కథలు రాయాలి.

- డా. కాలువ మల్లయ్య

(ప్రజాతంత్ర సౌజన్యంతో అక్టోబర్ 31, 2004)



డా. ముదిగంటి సుజాతారెడ్డి
2-2-1105/21, తిలక్‌నగర్,
హైదరాబాద్-044

మట్టివాసనల మధుర పరిమళాలు

తెలంగాణా కథా సాహిత్యానికి గొప్ప చరిత్రవుంది. గురజాడ అప్పారావు తొలి కథనాళ్ళ నుంచి తెలంగాణాలో కథ పుట్టి ఎదిగింది. అయితే తెలంగాణా చారిత్రక సామాజిక రాజకీయ నేపథ్యంలోనుంచి ఆ కథ పుట్టింది ఎదిగింది. కాబట్టి తెలంగాణా కథకు వేరే చరిత్ర కన్పిస్తున్నది. అందుకే 1970, 80 దశాబ్దాల్లోనే తెలంగాణా కథ పుట్టిందని అపోహ ఏర్పడింది. తెలంగాణాలో పుట్టిన ప్రాచీన తెలుగు సాహిత్యానికి పట్టిన గతే 1970లకు పూర్వమున్న తెలంగాణా కథకు పట్టింది. శపితమైన అహల్య శిలారూపంగా పడివున్నట్లుగానే తెలంగాణా తొలితరం కథకుల కథలు మరుగున పడిపోయినాయి. ఆఖరికి కథలు వ్రాసిన దగ్గర కూడా ఆ కథలు లేకుండా పోయినయి. అదొక విషాదం! తెలంగాణా కథకు బయటి నుంచి గుర్తింపు రాలేదంటె కొంతపాపం మన దగ్గర కూడా వుంది. మన సంపదను మనం కాపాడుకునే జాగ్రత్త తెలివిడి లేదు. ప్రచారజ్ఞానం అసలే లేదు. మనల్ని మనమే పట్టించుకోకపోతె ఇతరులు మనల్నెందుకు పట్టించుకుంటారు! అందుచేత తెలుగు సాహిత్య చరిత్ర పరిశోధకులు రచయితలు తెలంగాణా సాహిత్యాన్ని ఎంతగా ఉపేక్షచేసి వివక్షతను చూపారు. తెలంగాణా కథలను కథకులను గురించి కూడా అంతే ఉపేక్షను వివక్షతలను చూపటానికి అవకాశం దొరికింది!

తెలంగాణా కథల్లో వున్న ప్రత్యేకతల్లో ఒకటి ఏమంటే చదవటం వ్రాయటం వృత్తిగా గలవాళ్ళే కాక ఎన్నో తరాల నుంచి చదువు అనే నేపథ్యం లేని వాళ్ళ కలాల నుంచి రావటం. వాళ్ళకు వ్రాయాలనే వృత్తిపరమైన ఒత్తిడులు లేవు. అందుకే చదివింది కొంచెమే అయినా వ్రాయాలనే ఆవేశమే వాళ్ళ చేత కథలను వ్రాయించింది. అక్షరబద్ధం చేయాలనే తపన చేతనే వాళ్ళు ఆ కథలను వ్రాసారు. వ్రాయకుండా వుండలేని అశాంతి ఆ కథల సృష్టికి కారకమైంది. కాబట్టి ఆ కథలు జీవితానుభవాల నుంచి మనస్సు హృదయాల కదలికల నుంచి పుట్టాయి. ఇంకోవైపు పరాధీనత్య దాస్యం, నిరంకుశ పాలనలో మగ్గుతున్న జీవనపరిస్థితులు దొరల నిర్బంధాలు దౌర్జన్యాలు, పేదరికం-ఇవన్నీ ఆ కథలకు ఒక ప్రయోజనాన్ని చేకూర్చి తెలంగాణా కథను ఉన్నతంగా నిలబెట్టాయి. ఒక స్వతంత్రమైన

అందమైన శిల్పాన్ని కల్పించాయి. తెలంగాణా కథ ఆంగ్ల కథలను అనుకరించే దుస్థితి నుంచి తప్పి ఆ విధంగా బయటపడింది. మౌలికమైన నిసర్గమైన మట్టి వాసనలతో తెలంగాణా కథ మొదటి నుంచి ఈనాటి వరకు స్వతంత్రంగా అనన్యంగా అనితరలభ్యంగా కొనసాగుతున్నది.

తెలంగాణా కథను చేపట్టి పోషించిన మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, వట్టికోట ఆళ్వారుస్వామి, కాంచనపల్లి, పొట్లపల్లి రామారావు, జి.రాములు, సురమౌళి వంటి కథకుల సరసన నిలిచిన గూడూరి సీతారాం కథనంలో వస్తువులో తనదైన శైలిని సృష్టించుకున్నాడు. కాని దురదృష్టమేమంటే పి.వి. నరసింహరావు, సురమౌళి, వి.ఆర్. అవధాని మొదలైన రచయితల వలెనే సీతారాం తన కథలను మనకందించ లేకపోవటం తలచుకుంటే కండ్లు చెమర్చక మానవు. వాళ్ళు తన వారసత్వాన్ని మనకందించకపోవటానికి కారణం మనపునరుజ్జీవనంలో వున్న లోపమే కారణమనుకోవాలి. మనకు ప్రింటింగ్ ప్రెస్సులను గురించి అచ్చువేసే పనులను గురించి సరైన అవగాహన లేకపోవడమే కావచ్చును.

గూడూరి సీతారాం 1950 దశకంలో తన సామాజిక కుటుంబిక కులాల నేపథ్యంలో గ్రామీణ వాతావరణాన్ని జీవితాన్ని చిత్రిస్తూ మంచి కథాచిత్రాలను సృష్టించాడు. కేవలం దౌర్జన్యాలను తిరుగుబాటులను చిత్రించటమే ఆయన బాట కాదు. వ్యక్తుల జీవితాలను, జీవితసత్యాలను మనకు చిత్రరూపాలుగా అందించాలన్నది ఆయన మార్గం! తపన! ముఖ్యంగా కింది వర్గపు స్త్రీ పురుషుల జీవితాలను 'రాజమ్మ రాజీరికం' కథలో గాని 'రంగడు' కథలోగాని 'నారిగాని జీవితం' కథలోగాని 'లచ్చి' కథలో గాని ఆయన శిల్పం అదే! అది ఫోటోగ్రాపర్ ఒక దృశ్యాన్ని ఫోటో గుంజి మనముందుంచితే మనలో ఎన్ని భావాలు కలుగుతాయో గూడూరి సీతారాం కథలు చదివితే ఆ భావాలు కలుగుతాయి. అయ్యో ఈయన ఫోటోలు ఇంకా మనకు దొరకలేదే అనిపిస్తాయి. ఆ ఫోటోలు గుంజిన కాలంలో వాటికి అంత విలువ వున్నట్లుగా అన్పించి వుండోచ్చు కాని యాభైయేండ్ల తర్వాత ఆ ఫోటోలు ఎన్నో భావాలను జీవితాల పరిచయాలను సామాజిక చరిత్రను మన కండ్ల ముందుంచుతున్నాయి. ఆ ఫోటోలు గుంజిన కాలంలో వాటికంత విలువ వున్నదని అన్పించకపోవటమైనా మన కథకులు వాళ్ళ కథలను భద్రంగా పెట్టుకోక పోవటానికి కారణాలు! కావచ్చును! సరే! కొన్నయినా ఇటువంటి కథలు నిలబడి మనకందాయి మన వారసత్వాన్ని నిలిపాయి అన్న సంతోషం కలిగింది గూడూరి సీతారాం కథల పుస్తకం నా చేతిలోకి వచ్చినప్పుడు.

మామూలు మనుషుల జీవితాలేకాదు మామూలు మనుషుల భాష నన్ను చాలా ఆకర్షించింది. "ఖాయమైనతోనే లగ్గమైతే, ఎంత యాధికి జేసుకున్న సిన్నప్పటి ఊరని సత్తెయాదికి రాలే, దేవునోలె ఆదుకున్నది, అసొంటి తల్లి ఇగ పుడుతదా, పైనపైన తండ్లాడుతుండు, సోకంబెట్టి ఏడ్సిండు, బుదరకించిండు, తోలుకపోను మూడు

సార్లొచ్చింద్రు, సానమాట్ల తొవ్వదప్పిండు–ఇట్లా ఎన్నో తెలంగాణా పదాలు, నుడికారాలు కథల సంపుటిలోని మొదటి రెండు కథల్లో కన్పిస్తాయి! మురిపిస్తాయి! "స్త్రీ స్వాతంత్ర్యం" అనే కథలో కథన శిల్పం కొత్తగా వుంది. వ్రాతలకు చేతలకు మనలో ఎంత వ్యత్సాముంటదో సీతారాం చాల అందమైన కథనంతో చెప్పాడు.

'రాజమ్మ రాజీరికం' కథలో అందమైన రాజమ్మ పౌడర్లు సబ్బులు మొదలైన పూసుకునే సామాన్లు సిన్మాలయేది మోజులో ఎట్లా బతుకును పాడుచేసుకుందో వుంది. అప్పుడే వస్తున్న సబ్బులు యువజనుల మనస్సులను ఎట్లా ఆకట్టుకున్నాయో సీతారాం చిత్రించాడు. కాళోజి "విభూది లేక ఫేస్ పౌడర్" అనే కథను వ్రాసాడు. 'రంగడు' కథలో రంగడు బిలాయికి వలసపోయి స్థిరపడినా తాను పుట్టిన పల్లెటూరును చూడాలనే కోరికను చంపుకోలేక బయల్దేరుతాడు. ఊర్లోని చిన్నాయికి తన సంగతున్నీ పూసగుచ్చినట్లు రెండ్రోజులు విన్పించినంక అతనికి ఇంట్లకెల్లి కాలు బయటపెట్టే పుర్సతయింది. అప్పుడు ఊర్లోకి పోయి తిరిగితే వెంకట్రామయ్య దొర ఇల్లు కనపడలేదు. దొరసాని గుర్తుకు వచ్చింది. దొరసాని చనిపోయిందని ఆమె చచ్చిపోయినంక ఇంటి లచ్చిమే పోయిందని దొర చెడు అలవాట్లతో తినటానికి తిండిలేకుంట అయిందని రంగనికి తెలుస్తుంది. ఒకసారి తనను ఆదరించిన దొరసాన్ని ఒక్కసారి చూడాలని బయల్దేరిన రంగనికి దొరసాని మరణవార్త విని పిచ్చోనోలె అయిపోయిండు. అయితే ఈ కథలోని దొరసాని కడివెండి దొరసాని కాదు. దొరలు దొరసానులందర్నీ ఒక్క మూసలో చిత్రించే ఇప్పటి కథలకన్నీ ఈ కథ విభిన్నం వుంది 'లచ్చి' కతలో బిచ్చగాళ్ళయిన దంపతుల జీవితంలో పట్టణీకరణం తెచ్చిన కష్టాలు వాస్తవికతతో చిత్రింపబడినాయి. బిచ్చగాళ్ళుగా సంతృప్తితో వున్న వాళ్ళు జీవితం పట్నానికి పోవటంతో ఎన్ని మలుపులు తిరిగి శోషణకు గురయ్యారో చాలా సహజంగా పాఠకుల కండ్ల ముందాడుతుంది. 'నారిగాని బతుకు' గౌండ్లవాళ్ళ బతుకులను చిత్రిస్తున్న కథ. ఆ వృత్తిలోని కిందుమీదులను రచయిత తెలంగాణా భాషలో చాలా విధంగా చిత్రించాడు. 'మారాజు, పిచ్చోడు' బొంబాయి పోయి పైసలు సంపాదించాలనే పిచ్చితో వచ్చే కష్టాలను మానసిక వేదనలను చిత్రించే కథలు.

'గూడూరి సీతారాం కథలు' సంకలనములోవున్న 14 కథల్లో 6 కథలు తెలంగాణా భాష నుడికారంలో వ్రాయబడినాయి. మిగిలినయి ప్రామాణిక భాషలో వున్న చిన్నికథలు. 1950 దశకంలో తెలంగాణా రచయితలు ప్రామాణిక భాషలో వ్రాస్తేనే గుర్తింపు వస్తుందనుకున్న రోజులు. అటువంటి దశలో గూడూరి సీతారాం కథలను తెలంగాణా భాషలో యాసలో వ్రాయటానికి పూనుకోవటం సాహసమనే చెప్పాలి. అందులో ఆయన ప్రయోగించిన భాష అచ్చమైన గ్రామీణుల యాస, నుడికారాలకు దగ్గరగా వుంది. పల్లెటూరు మట్టివాసనలను వెదజల్లుతుంది. ఆ మట్టివాసనలే సీతారాం కథలకు ఎక్కడలేని మధుర పరిమళాలను తెచ్చిపెట్టాయి.

– డా. ముదిగంటి సుజాతారెడ్డి



'పద్మఋషి' **కొక్కుల భాస్కర్**, ఎడిటర్
పద్మపీఠం మాసపత్రిక

1-4-43, వెంకంపేట, సిరిసిల్ల, ఫోను : 08723-233889
సెల్ : 9396910003

నూటికి నూరుపాల్లు అచ్చమైన తెలంగాణా కథకుడు

ఉద్యమాలకు ఊపిరి పోసిన గడ్డగానే కాదు, ఉత్తమోత్తమైన ఎందరో సాహిత్యోత్తములైన బిడ్డలకు పురుడు పోసిన ఖిల్లా కరీంనగర్ జిల్లా. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని పలకడంలో ఎంత ఉత్తేజం ప్రతి తెలంగాణీయుడి గుండె గొంతులోంచి ఉట్టి పడుతుందో, ఆనాటి తొలితరం కరీంనగర్ జిల్లా కథ రచయితల గూర్చి ఓమారు గుర్తు చేసుకుంటే మాజీ భారత ప్రధాని పి.వి. నరసింహరావు, గోపగారి రాములు, పి. యశోదరెడ్డి, ముదిగంటి సుజాతారెడ్డి, మలితరంలో కథా రచనలే జీవశ్వాసలుగా యువ రచయితలెందరికో స్ఫూర్తినిస్తున్న సామాజిక తత్వవేత్త బి.ఎస్. రాములు, అల్లం రాజయ్య, తమ్మేటి రఘుత్తమరెడ్డి, కాలువ మల్లయ్య, జూకంటి జగన్నాథం, డాక్టర్ నలిమెల భాస్కర్, బి. దామోదర్ రావు, ఆడెపు లక్ష్మిపతి, కొక్కుల భాస్కర్ మొదలుకొని ఈనాటి యువతరం రచయితలు పెద్దింటి అశోక్, కె.వి. నరేందర్, బెజ్జారపు రవీందర్, బి.వి.ఎన్. స్వామి, బెజ్జారపు వినోద్‌కుమార్, చైతన్య ప్రకాశ్, శ్రీమతి వద్నాల 'సూర్య' లాంటి ఇంకెందరో కథా రచయితలు తెలంగాణ యాస, తెలంగాణ భాషను, జీవన విధానాన్ని ఒక్కొక్క రచయిత తమ కలము నుండి వేల యేండ్లకు సరిపడే కథలను పుట్లకుపుట్లు పండిస్తూంటే 'మేము సైతం కథకులుగా జాతికీర్తికి ఖ్యాతినిస్తు-మేము సైతం సాహిత్యోద్యమ ప్రగతి బాటకు స్ఫూర్తినిస్తూ' అన్న పదాలు అలవోకగా పెదవులపై పాటలుగా గొంతునుండి పొర్లుకు రావాటంలో అతిశయోక్తి కాదు.


ఆనాటి తొలితరం రచయితల్లో ఒకరైనా జ్ఞానపీఠ అవార్డు గ్రహిత సి. నారాయణరెడ్డి గార్కి అత్యంత సన్నిహితులే గాక, వారి స్వగ్రామ వాసి అయినా గూడూరి సీతారాం గారు అందరికి తెలిసినా, వారు కథకుడన్నది కొందరికే తెలుసు.

కట్టులోను, బొట్టులోను, మాటలోను నూటికి నూరుపాల్లు అచ్చమైన తెలంగాణోడుగా చూడడానికి చాలా సాదారణంగా కనిపించే సీతన్న ఏ కోణం నుండి

చూసిన వారు ఓ అసాదారణమైన వ్యక్తి అన్నది ప్రచారంలోకి రాకపోవడానికి కారణం వారిమాటల్లో వినాలనుకుంటే "ఇక అచ్చేమి చేసేదున్నది-రాకేమి జేసుదున్నది" అని అమాయకత్వంగా వినిపించటమే కాదు, ఆ నవ్వులో కూడ మనకు కొట్టొచ్చినట్టుగా కనిపిస్తుంది.

హనుమాజీపేట వాస్తవ్యులైన గూడూరి సీతారాం గారు 1953 నుండి 1965 వరకు కథకుడిగా అప్పుడు పేరున్న ఎన్నో పత్రికలో సుమారు ఎనభై కథలు, రెండు నవలికలు రాశారు. రాయటమే తప్ప అన్ని పత్రికల్లో అచ్చయినా తన కథలను భద్రపరచుకొనేతత్వంతో వారికి పెద్దగా భాదకాకపోయినా, ఆ కథలను ఒక వద్దకు చేర్చాలని, వాటిని భవిష్యత్తు తరాలవారికి అందించాలనే ఆలోచన ప్రయత్నంలో యువ కవి పత్తిపాక మోహన్ ఓ భగీరథ ప్రయత్నం చేసి ఓ 14 కథలను సంపాదించటం 'గూడూరి సీతారాం కథలు'గా ఓ పుస్తకాన్ని ముద్రించటం దిశగా చేసిన ప్రయోగంలో మోహన్ విశ్వామిత్రుడిగానే కనిపిస్తున్నడు.

పుస్తకం ముద్రించటంతోనే అగిపోకుండా ఆనాటి రచయితను మరోమారు అందరికి పరిచయం చేసే యత్నంలో మారసం అధ్వర్యంలో సిరిసిల్లలో గూడూరి సీతారాం సాహితీ జీవితం స్వర్ణోత్సవాన్ని ఏర్పాటు చేసిన ప్రయత్నం అభినందనీయం. జనవరిలో నిర్వహించ తలపెట్టిన సీతారాం గారి 'బంగారు పండుగ' వివిధ ప్రాంతాలనుండి తరలివచ్చే కళాకారులకు, రచయితలకు, గాయకులకు, మేధావులకు, సంబంధితులకు సిరిసిల్లలో సాహితీ 'బతుకమ్మ పండగ' వాతావరణాన్ని సృష్టిస్తుందని అనటంలో అతిశయోక్తి లేదు.



నిజాం కళాశాల సారస్వత సమితి సభ్యులతో సంపాదకులు గూడూరి సీతారాం (1960)

కందుకూరి రమేశ్‌బాబు
హైదరాబాద్

మూలవాగులో పుట్టిన కథకుడు

తెలంగాణ పల్లెటూరు మొహానికి 'పౌడర్' కొట్టుకుంటున్న దశను చిత్రించిన తొలితరం కథకుడు గూడూరి సీతారాం

సెన్గ సేన్ల నిలుచుని నీవు
సేయి జాపవే పూసలోల్ల రాజమ్మా
కన్నుగీటవే నిలుసుని నీవు
కన్నుగీటవే పూసలోల్ల రాజమ్మా!

అంటూ జానపద గీతం ఎత్తుగడతో కొత్త ఒరవడిలో కథ చెప్పిన రచయిత గూడూరి సీతారాం. ఈ ఎత్తుగడ రాజమ్మ రాజీరికం అనే కథలోనిది. యాభయ్యవ దశకంలో రాసిన ఈ కథను ఆయన ఎనభయ్యవ దశకంలో వెతికిపట్టుకున్నారు. ఈ ఒక్క కథనే కాదు. 1953 నుంచి 1963 వరకు ఆయన రాసిన సుమారు ఎనభై కథల కోసం ఆయనింకా అన్వేషిస్తూనే వున్నారు. ఆయనే కాదు, ఈ రచయిత తెలంగాణ తొలితరం కథకుడైనందువల్ల ఆయన కథలను సేకరించి సాహిత్య చరిత్రలో నమోదు చేయడం బాధ్యతగా ఫీలైన వారందరి పరిస్థితీ ఇదే.

విస్మృతమైన తెలంగాణ కథ ఘనతను నలుచెరగులా చాటిచెప్పగలిగి కథకుల్లో ముఖ్యులైన గూడూరి సీతారాం స్వాతంత్ర్యానంతర భారతంలో తెలంగాణ పల్లెటూరు 'స్నో' పెట్టుకుని 'పౌడర్' కొట్టుకుంటున్న దశను చిత్రించారు.

నవనాగరీకపు వ్యామోహాలు, కులవృత్తుల్లో పాలుపంచుకునే ఆలుమగల పరాయీకరణ, ఘర్షణకు ముందరి పల్లెటూరి అంతర్మథనం ఆయన అనేక కథల్లో వస్తువు. ఆయన వచనం తెలంగాణం. ఇక ఆయన ఉపయోగించిన భాషా నుడికారాల సొగసు గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అలాగే ఆయన వాడిన జాతీయాలు, పలుకుబళ్ల గురించి కూడా.

పాట పుట్టిన ఊర్లో ఈ కథకుడు పుట్టాడు మరి. అవును హన్మాజీపేట అనగానే సినారె పాట యాదికొస్తుంది. అదే వాడకట్టులో పుట్టిన కథకుడీయన. "సినారెది మా ఊరే. ఆయన సాహచర్యంతోనే నాలో కథకుడు పుట్టాడు. నా కథలకు శీర్షికలు పెట్టింది కూడా ఆయనే" అని ఒకింత గౌరవం, ఆత్మీయమైన గొంతుతో అన్నారు గూడూరి సీతారాం.

"రెడ్డిగారు (సింగిరెడ్డి నారాయణరెడ్డి) సెలవులకు ఇంటికి వచ్చినప్పుడు సందడే సందడి. సుమారు ఓ డజను మందిమి ఒక జట్టుగా వుండేవాళ్లం. అందులో కనపర్తి చొప్పకట్ల చంద్రమౌళి కవులుగా, నేను కథకుడిగా, ఆదిరెడ్డి మంచి గాయకుడిగా, మిద్దె రాములు ఒగ్గు కథ కళాకారుడిగా ఎదిగారు మరికొందరు వివిధ వృత్తుల్లో యిమిడిపోయారు."

ఆయన జ్ఞాపకాల్లో మూలవాగు మెదిలినట్లుంది. ఒక్కక్షణం ఆగి ఇలా చెప్పారు. "సాయంత్రమైతే చాలు. మా ఊరిపక్కన పారే మూలవాగుకు వెళ్లే వాళ్లం. రెండుమూడు గంటల సాహితీ కాలక్షేపం. మేము రాసిందాన్ని ఆ వాగులో వినిపించేవాళ్లం. రెడ్డిగారు కూడా కొత్తగా రాసింది వినిపించేవాడు. కథలు, కవితలు, జానపద గీతాలతో మూలవాగు పరవళ్లు తొక్కేది. అయితే ఇదంతా సెలవులకు రెడ్డి ఇంటికి వచ్చినప్పుడే. అలా నాలోని కథకుడు పుట్టాడు" చెప్పారు సీతారాం.

తాను రాసిన కథల గురించి చెప్పమన్నప్పుడు ఆయన కొన్ని కథల జిరాక్స్ కాపీలను చూపించాడు. "ఇవి తప్ప నావద్దేమీ లేవు" అన్నారాయన. వాటిని కూడా అతి కష్టంమీద సంపాదించాడట.

"మా రాజు, పిచ్చోడు, లచ్చి, రంగడు, నారిగాని బతుకు, రాజమ్మ రాజరికం, చీకటి గొడుగులు, బస్సు కదిలింది, ఎర్రని పువ్వు, పెళ్లి ప్రేమ, స్త్రీ స్వాతంత్ర్యం, అబ్బాయి అమ్మాయి, అందని ఆకాశం, దెబ్బతిన్న అహంభావం, మేడిపండు, నీకు ఖర్చుపెట్టడం వస్తుందా?-వంటి కథలు మాత్రమే నా వద్ద వున్నాయి. వీటికి ఐదారు రెట్ల కథలు రాశాను. వాటిని దేవులాడాలి" అన్నారు. నవ్వుతూ.

"ఈ కథలన్నీ దాదాపు ఏదో ఒక పత్రికలో అచ్చయినవే. ముఖ్యంగా ఆంధ్రప్రభ, స్రవంతి, ఉషస్సు, నినాదం, తెలుగుదేశం వంటి పత్రికలు అచ్చువేశాయి. 'కొత్తపాతలు' అనే నవలను కూడా రాశాను' చెప్పి జ్ఞాపకాల్లోకి దారితీశారు.

హన్మాజీపేట నుంచి ఐదారు కిలో మీటర్లు నడిస్తే వేములవాడ. ఇటు నడిస్తే సిరిసిల్ల. ఈ రెండు గ్రామాల్లో నా ప్రాథమికోన్నత విద్య గడిచింది. అయితే వేములవాడలో చదువుకునేటప్పుడు 'నాస్తికం' అంటే ఒక గుర్తింపు వుండేది. గోరా గారు, లవణం గారి గురించి గొప్పగా వినేవాళ్లం. అప్పుడు ఐదో తరగతి చదువుతున్నాను. తెలంగాణలో ప్రసిద్ధ కథకుడు సురమౌళిది కూడా వేములవాడ. ఆయన తమ్ముడు చంద్రమౌళి. వారి ప్రోత్సాహంతో నేనూ, మరికొందరు మిత్రులం కలిసి 'ఎథీయిస్ట్ బాయ్స్ క్లబ్' పెట్టాం. అసలే అది వేములవాడ. పూర్తిగా దేవాలయం వాతావరణం, బ్రాహ్మండ్లు, పొద్దున లేస్తే యాత్రికులు. అలాంటి చోట దేవుడు లేడని, వుంటే చూపండని మేమంతా నాస్తిక సంఘం పెట్టడం తలుచుకుంటే ఆశ్చర్యంగా వుంటుంది. అంతేకాదు. ప్రతినెలా ఇరవైపేజీలతో

'విద్యోదయ' అనే రాత పత్రికను కూడా తీసేవాళ్లం. ఒక వార్షిక సంచికను కూడా తెచ్చాం.

సిరిసిల్లలో హెచ్.ఎస్.సి. చదివేటప్పుడు (1956) పాఠశాల ఆధ్వర్యంలో 'తరంగిణి' అనే పత్రిక నడిపాను. దాని వార్షిక సంచికను తెలుగు, ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ భాషల్లో అనేక రచనలతో ప్రచురించాను.

ఆ రోజుల్లో సిరిసిల్లలో భూమయ్య వకీలు వుండేవాడు. 'నారయ ఆంధ్ర భాషానిలయం' అని ఎనకట వుండేదట. దాన్ని ఆయన సహాయంతో పునరుద్ధరించి నాలుగేండ్లు నడిపినం. అలాగే దాశరథి కృష్ణమాచార్య అధ్యక్షులుగా, సినారె కార్యదర్శిగా ఉన్న తెలంగాణ రచయితల సంఘంలో చురుగ్గా పనిచేశాను. ఆ సంఘం ఉపాధ్యక్షులుగా ఉంటూ సిరిసిల్ల శాఖను ఏర్పాటు చేశాను. 'నినాదం' అనే పత్రికను తీశాం. ఇందులో వట్టికోట ఆళ్వారుస్వామి, సినారె, దాశరథి రచనలు ప్రచురించాం. 'చిరుగజ్జెలు' అనే ఒక చిన్న పుస్తకాన్ని ప్రచురించాము. అందులో సినారె కవిత, నా కథ, యశోదారెడ్డి నాటికలున్నాయి. అలాగే కవితలు, కథానికలతో 'మల్లెమొగ్గలు' అనే నలభై పేజీల పుస్తకాన్ని కూడా వెలువరించాం.

పనిలో పనిగా మా చుట్టుపక్కల వున్న వూర్లు తిరుగుతూ జానపద గీతాలను సేకరించడం మరొక అభిరుచి. అలా సేకరించిన యాభై అరవై గీతాలను నేనూ, కనపర్తి కలిసి ఆచార్య బిరుదురాజు రామరాజుకు పంపే వాళ్లం. ఆయన ఆంధ్రప్రభకు అచ్చుకు ఇచ్చేవారు.

1961లో నిజాం కాలేజీలో బి.ఎ.లో ప్రవేశం సంపాదించి హైదరాబాద్ వచ్చాను. అప్పటికే రెడ్డిగారు లెక్చరర్ అయ్యిండు. ఇక్కడికి వచ్చీరాగానే పూర్తిగా సాహిత్య వాతావరణం. కవులు, రచయితలు, కళాకారులతో స్నేహం. స్నేహం కూడా కాదు, పెద్దల సాన్నిధ్యంతో పరిచయం పెరిగింది. మేం హిమాయత్ నగర్‌లోని ఓల్డ్ ఎం.ఎల్.ఎ. క్వార్టర్స్‌లో ఉండేవాళ్లం. ఒక క్వార్టర్‌లో నేను, మరొక క్వార్టర్‌లో రెడ్డి, ఇంకేం, ఆయన ప్రోత్సాహంతో కథలమీద కథలు రాశాను.

ఆ రోజుల్లో నారాయణగూడలో ఇప్పుడున్న కేశవ మెమోరియల్ హైస్కూల్ పక్కన పెద్ద కాంపౌండ్ వాల్ వుండేది. అందులో ఐదు పోర్షన్లుండేవి. దాంట్లో వట్టికోట ఆళ్వారు స్వామి. దాశరథి కృష్ణమాచార్య, బిరుదురాజు రామరాజు, పల్లా దుర్గయ్యలు ఒక్కో పోర్షన్లో వుండేవారు. సాయంకాలం ఐతే చాలు అక్కడికి పోయేది. ప్రసిద్ధ విమర్శకుడు డి. రామలింగం బాపురెడ్డి, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి వంటి వారి పరిచయం కూడా ఇక్కడే కలిగింది. అక్కడికి నేరెళ్ల వేణుమాధవ్ వరంగల్‌నుంచి వచ్చేవారు. అలాగే కాళోజి కూడా.

కాళోజిని అందరూ కాళన్న అనేటోళ్లు. ఆయనకు చిన్నాపెద్దా తేడాలేదు. వారూ గీరూ అనే ప్రసక్తే లేదు. 'అరెయ్ ఇట్రారా?' అంటూ పిలచేవారు. తినడు, తాగడు. అర్జంటు లేదు. ఆయన జీవితంలో ధోతి, నేవుర్ షర్ట్ (నెహ్రూ) ఇస్త్రిరి లేకుండనే

ఏసుకునేటోడు. హైద్రాబాద్ వస్తే దాశరథి, అళ్వారుస్వామి పోర్షన్లలో వుండేవాడు. "వార్నీ, ఏం కథ రాశినవురా. అద గట్లుంటాదిరా?, అని విమర్శించేవాడు. 'అన్నా, ఆ కథ మా వూర్లె అట్లనే జరిగిందే' అంటే "జరిగింది జరిగినట్లు రాస్త రారా? జరిగింది జరిగేపాయె" అనేవారు కాళన్న.

'నా గొడవ' మొదటి ప్రచురణ కూడా నేనే చూసుకున్నాను. ప్రూపులు, గ్రీపులు దిద్ది మూడో కాపీ కాళన్న చేతికిచ్చాను.

ప్రసిద్ధ తెలంగాణ రచయిత, ప్రచురణకర్త వట్టికోట ఆళ్వారుస్వామి నన్ను బాగా ప్రోత్సహించే వారు. అయితే "మీకేందిరా రాజులు.." అని కూడా అప్పుడప్పుడు అనేవాడు. "తిని తిరుగుడు తప్ప ఇంకేం పనుంది?" అనేవాడు. ఆయన వీపుమీదున్న పెద్ద గాయాన్ని చూపించి రజాకార్లను ఎదిరించినందుకు మేమెన్ని ఇబ్బందులు పడ్డామో చెప్పరాదు" అని చెప్పేవారు. నాలుగు పోర్షన్లలో ఆయన పోర్షను మొదటిది. అందులో మాత్రమే సెల్లార్ వంటిది వుండేది. దాన్నిండా ఐదారువేల పుస్తకాలుండేవి. ఆయన వేషం, పద్ధతి అంతా భిన్నం వుండేది. నా కథలు చదివి అభిప్రాయం చెప్పేవారు. సూచనలు చేసేవారు. తాను స్థాపించిన దేశోద్ధారక గ్రంథమాల తరపున వేసిన 'పరిసరాలు' మొదటి సంకలనంలో 'చీకటి గొడుగులు' అనే నా కథను అచ్చేశారు. అప్పుడు దాశరథి కృష్ణమాచార్య ఆకాశవాణిలో ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసేవారు. వారం కొకసారి ఏదో ఒకటి రాసుకుని వెళ్లేవాడిని. ఏది తోస్తే అది రాసిచ్చేవాడిని. ఏదీ లేకుంటే 'డాక్యుమెంటరి సినిమా ఫలానా దాంట్లో నడుస్తుంది. చూసి రివ్యూ రాస్కరాపో' అనేవాడు.

సారస్వత పరిషత్తుకు కూడా వెళ్లేవాడిని. అప్పుడే కొత్త టైప్ రైటర్ తెచ్చిన రోజులు. సురమౌళి టైపిస్టుగా ఉద్యోగం చేయడానికి వచ్చారు. అక్కడే దేవులపల్లి రామానుజరావు గారు కూడా పరిచయం. బాపట్లలో జరిగిన విశారద వంటి పరీక్షలకు నన్ను ఇన్విజిలేటర్‌గా పంపించారు. ఇలాంటి చిరు బాధ్యతలు కూడా దొరికేవి.

అలా ఒక సంవత్సరం గడిచింది. రెండో సంవత్సరం నేనూ, రెడ్డి కలిసి కొంతకాలం రూమ్ తీసుకుని వున్నాం. రెడ్డి అప్పటికింకా ఫ్యామిలీ పెట్టలేదు. కొన్ని రోజులు అబిడ్స్‌లోని సాగర్ టాకీస్ పక్కన రవీంద్ర హోటల్‌ల్లో వున్నాం. ఇద్దరం కలిసి కాలేజీకి వచ్చేవాళ్లం. నిజాం కాలేజీ గేటుదగ్గర రిక్షా ఆపించుకుని నేను దిగేవాడని. అవును మరి, నేను స్టూడెంట్‌ని, రెడ్డి లెక్చరరాయె మరి.

అప్పటికీ ఇప్పటికీ ఆయనకు డబ్బు మీద వ్యామోహం కలగలేదు. ఆయన లావాదేవీలన్నీ నేనే చూసేవాడిని. ఆయన రాత గూడ ఎవరికీ అర్థంకాకుండేది. ఆధునికాంధ్ర కవిత్వంపై ఆయన రాసిన థీసిస్‌ని మూడు కాపీలు చేసి పెట్టింది కూడా నేనే.

బి.ఎ. రోజులు కదా. కాలేజీ వార్షిక సంచికకు సంపాదకులుగా, ముఖ్య సంపాదకులుగా ఉంటూ విద్యార్థుల రచనలని అనేకం ముద్రించాం. అలాగే రెడ్డి హాస్టలు నుండి వెలువడే వార్షిక సంచికకు కూడా ప్రధాన సంపాదకులుగా వున్నాను. బి.ఎ.

పూర్తవగానే బ్యూరో ఆఫ్ ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్‌లో ఉద్యోగం. ప్రోగ్రెస్ అసిస్టెంట్‌గా భువనగిరిలో పోస్టింగ్ ఇచ్చారు. రెగ్యులర్ అయ్యాక సిరిసిల్ల, వేములవాడ, మెట్‌పల్లి, హుజూరాబాద్‌లలో పనిచేశాను. మొత్తం పదహారేళ్లు చేశాను. సర్పంచ్‌లు, రాజకీయ నాయకులు, తినడం, తాగడం, ఇది తప్ప ఇంకో లోకం లేదు. ఆ కాలంలో ప్రభుత్వ పరిపాలన అంతా బ్లాక్ ఆఫీసునుంచే సాగేది. రెవెన్యూ, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్స్ తప్పిస్తే మిగతా విభాగాలన్నీ ఇక్కడే వుండేవి. అన్ని శాఖల వారు నా వద్దకు వచ్చేవారు. ఉద్యోగమే జీవితమైపోయింది. క్రమంగా పవర్ పాలిటిక్స్‌లో పూర్తిగా కూరుకుపోయాను. 1976లో నా స్నేహితుడు ఎలక్షన్లలో నిలబడ్డాడు. ప్రచారం చేశాను. అందుకోసం ఆఫీసుకు లీవ్ పెట్టాను. ఆ తర్వాత ఆఫీసు మొహం చూడలేదు. ఆ తర్వాత వ్యాపారంలో నిమగ్నమైనాను. కథకు, సాహిత్యానికి సంబంధం తెగిపోయిన తీరు ఇది.

ఒక సాయంకాలం కవి మిత్రుడు జూకంటి జగన్నాథం వచ్చి నన్ను ఇంటర్వ్యూ చేసి ఆంధ్రప్రభకు రాసి పంపారు. 'గూడూరి సీతారాం-కథకు రాం రాం' అనేది శీర్షిక" చెప్పారాయన నవ్వుతూ. ఆ తర్వాత పదేళ్లు గడిచాయి. వ్యాపారానికి కూడా 'రాం..రాం..' చెప్పి ఇంటికే పరిమితమయ్యాను. అప్పటినుంచి మానేరు రచయితల సంఘం, కళాసాగర్ వంటి సంస్థల ద్వారా సాహిత్యకళా రంగాల్లో కృషి చేస్తున్న వారిని ప్రోత్సహించడమే పనిగా పెట్టుకున్నాను.

అండ్లదండ్ల కూర

"చాలా కతలు రాశాను గానీ మా పద్మశాలి వృత్తి మీద నేను కథ రాయలేదు. నేతగాళ్ల కులంలో పుట్టి ఎందుకు రాయలేకపోయాను అని అప్పుడప్పుడు అనిపిస్తుంది" అన్నారాయన ఒకింత బాధగా.

"మా ఖార్ఖానాలో నేతగాళ్లు పని చేసుకుంటఉన్నప్పుడు 'ఇయ్యాల కూరేం చేయాలె?' అని ఆడమనిషి వచ్చి అడిగేది. 'అండ్లదండ్ల కూర వండుపో' అని ఆ మగ మనిషి చెప్పేటోడు. ఈ సంభాషణ నన్ను ఆకర్షించింది. అండ్లదండ్ల కూరేంది? అని చాలా సార్లు ఆలోచించాను. ఇగ లాభం లేదని నలుగుర్ని అడిగిన. చెప్పింద్రు. అదే పేరుతోని మా కులవృత్తి మీద కథ రాయాలని చాలాసార్లు అనుకున్న. కుదరలేదు" అన్నారాయన.

ఇంతకీ అండ్లదండ్ల కూరంటే ఏమిటి?

"వండిన అన్నంలకెల్లి కొంచెం అన్నంతీసి దాన్ని కూర లెక్క పోనికేస్తరు. ఉప్పు, కారం, మసాలా ఎప్పట్లెక్కనే వేస్తరు. ఇదే అండ్లదండ్ల కూర. ఈ అన్నాన్నే కూరలెక్క అన్నంల కలుపుకుని తింటరు. ఇగ వేరే కూర వుండదు" చెప్పాడాయన. గూడూరి సీతారాం రాసిన ఏ కథ చదివినా ఇలాంటి అనుభవాలు, మరుగున పడ్డ పదబంధాలు తగులుతాయి.

– కందుకూరి రమేశ్ బాబు

(ఇంటర్వ్యూ, ఆంధ్రజ్యోతి, ఆదివారం అనుబంధంనుండి)

ఆచార్య ఎస్వీ రామారావు, ప్రొఫెసర్ & డీన్ (రిటైర్డ్)
ఉస్మానియా విశ్వవిద్యాలయం
6-3-23/2, న్యూ బోయిగూడ, గాంధీనగర్, హైదరాబాదు.



ఆత్మీయం

ఇప్పుడు గుర్తుకు తెచ్చుకుంటే తెలుస్తున్నది గూడూరి సీతారాంకూ నాకూ ఎన్నో సామ్యాలు ఉన్నాయని. మేమిద్దరం నిజాం కాలేజీ విద్యార్థులం. ఆయన కరీంనగర్ నుంచి అచ్చిండు. నేను పాలమూరు నుంచి వచ్చిన.

అయితే బి.ఏ.లో ఆయన నాకు సీనియర్ విద్యార్థి. అతడు సంపాదకుడుగా ఉన్న నిజాం కళాశాల తెలుగు సారస్వత సంచిక 'విద్యార్థి' (1960)లో నా కథ (మగువ విలువ) అచ్చయింది. సీతారాం తర్వాత నేను ఆ సంచికను సంపాదకుడి నయ్యాను.

అంతేకాదు– మా గురువు గారైన సి. నారాయణరెడ్డి గారికి మేము ప్రియ శిష్యులం. సి.నా.రె. సిద్ధాంత వ్యాసానికి (ఆధునికాంధ్ర కవిత్వము–సంప్రదాయము, ప్రయోగము) అతడు శుద్ధ ప్రతి వ్రాస్తే, అందులోని భాగాలను నేను ఫెయిర్ చేసి పత్రికలకు పంపేవాడిని.

సీతారాం కథలు, లేఖావళి ప్రచురించిన 'తెలుగుదేశం' పత్రికలో 1956లో నేను సినిమా సమీక్షలు వ్రాశాను. వట్టికోట ఆళ్వారుస్వామి, భాస్కర భట్ల కృష్ణారావు, నెల్లూరి కేశవస్వామి వంటి విశిష్ట కథకుల తరానికి చెందిన ఉత్తమ రచయిత గూడూరి సీతారాం.

పత్తిపాక మోహన్ అన్నట్లు 'తెలంగాణా కథకు జీవధాతువుల్ని నింపిన ప్రముఖుడు సీతారాం'. జూకంటి జగన్నాథం మాటల్లో చెప్పాలంటే 'ఆయన కథలు అచ్చమైన తెలుగుజాతి సంస్కృతిలోంచి నిజాయితీగా స్వచ్ఛంగా పూసిన మొగిలిరేకు.'

కాలేజి నుంచి విడిపోయాక – ఎన్నో ఏళ్ళకు – వద్దెపల్లి కృష్ణ అభినందన సభలో – మోహన్ పుణ్యమా అని– సీతారాంను కలిసి ఎంతో సంతోషించాను. అప్పుడు మా ఇద్దరిలో కొట్టవచ్చినట్లు మరో సామ్యం కనిపించింది. ఆయన ముఖంలో నిర్మలంగా వెలిగే చిరునవ్వు.

అందుకే గూడూరి సీతారాం నాకు ఆత్మీయుడు. ఆయన సాహితీ జీవిత స్వర్ణోత్సవం నాకు జరిగినంత ఆనందంగా ఉంది. తమ్ముడు పత్తిపాక మోహన్‌ను మనసారా అభినందిస్తున్నాను.

– ఆచార్య ఎస్వీ రామారావు

కప్పగంతుల మల్లికార్జునరావు

104, కళ్యాణనగర్, వెంచర్ 3,
హైదరాబాద్-18

మన కథకులు 'గూడూరి సీతారాం'

నిజాం నిరంకుశపాలనలో మగ్గిపోయిన తెలంగాణా ప్రాంతంలో కథాప్రక్రియ ఆవిర్భావం ఆలస్యంగా జరిగింది. 1931లో సురవరం ప్రతాపరెడ్డి గారు కథారచనకు శ్రీకారం చుట్టేరు. ఆ తర్వాత వరసలో సురమౌళి, జి.రాములు, పొట్లపల్లి, గూడూరి సీతారాం నిలుస్తారు.

కరీంనగర్ జిల్లా హనుమాజీపేటలో 65 ఏళ్ళ క్రితం జన్మించిన గూడూరి సీతారాం హైస్కూల్లో చదువుతున్నప్పుడే రచనావ్యాసంగం ఆరంభించెరు. పాఠశాల వార్షికసంచికల్లో వ్యాసాలు రాసేరు, సంపాదకత్వం వహించేరు. విద్యార్థి సంఘాల్లో చురుకైన పాత్ర నిర్వహించేరు. తర్వాత తర్వాత సిరిసిల్లలో తెలంగాణా రచయితల సంఘశాఖను ఆరంభించేరు. కవి సమ్మేళనాలను నిర్వహించేరు. గ్రంథాలను ప్రచురింపజేసేరు. అలా రచయితగా, నిర్వాహకుడుగా, కార్యకర్తగా ఎదిగేరు.

గూడూరి సీతారాం గారి మొదటి కథ 'స్త్రీ స్వాతంత్ర్యం' 1953లో ప్రచురితమైంది. ఆ కథ రాసేటప్పటికీ ఆయన ఎనిమిదోతరగతి విద్యార్థి. భర్త సంస్కరణాభిలాష, ఏకుమేకైన భార్య పెడసరిధోరణి–సమాంతరంగా నడిపించడం కథలోని శిల్పం. అంత చిన్నవయసులో అంతటి శిల్పచాతుర్యాన్ని ప్రదర్శించిన సీతారాంగారికి చుట్టూ జరుగుతున్న సంఘటనలూ, ఎంతకూ అర్థంకాని మనుషుల తత్వాలూ, వాటిని చూచి ఏదో తనూ రాయాలన్న తపనా, కథారచయితగా ప్రేరణశక్తులు. 1953 నుంచి 63 వరకూ ఆయన రాసిన దాదాపు 83 కథల్లో చాలా కథలు తెలంగాణా మాండలికంలో వుండటం మరో ప్రత్యేకత. కొన్ని వర్గాల జనం జీవితాలను మనస్తత్వాలతో అనుసంధానించి, సహజంగా చిత్రించడం వల్ల ఆయన కథల్లో విషయవైవిధ్యం కనిపిస్తుంది. తాను రాసినవాటిలో కథానికాశిల్పం కనబడని కథలను ఆయనే 'స్కెచ్'లన్నారు. అనుభవంలోంచి స్వీకరించిన కథలు కనుక ఆయన కథాకథనశైలి సహజంగా వుంటుంది. ఆయన కథలకు తెలంగాణా మాండలికం ఆదనపు అలంకారం.

తెలంగాణా మాండలికంలో సీతారాంగారు రాసిన తొలికథ 'మారాజు'లో పెద్దగా కథేం లేదు. పల్లెటూరి వెర్రిబాగుల రంగడు బొంబాయి వెళ్ళిరావడం కథాంశం. డబ్బు పోగొట్టుకుని బెంబేలెత్తిన రంగన్ని అతని అన్న వెళ్లి తీసుకొస్తాడు. కథలోని కొసమెరపువల్ల కథకు సంపూరణత చేకూరింది. తాటికల్లు అమ్ముకునే నారిగాడి బ్రతుకులోని సాధకబాధకాలు నేపథ్యంగా గల మంచికథ 'నారిగాడి బతుకు'. 'రంగడు' కథ కృతజ్ఞతాభావాన్ని ప్రకటించే కథ. చాలాకాలం క్రితం తన గ్రామాన్ని వదిలిపెట్టి వెళ్లిపోయిన రంగడు, ఓసారి జన్మభూమిని చూసిపోదామని వస్తాడు. తనను కాపాడి అన్నం పెట్టిన దొర భార్యకు కృతజ్ఞతలు చెప్పుకోవాలని వచ్చిన రంగడికి ఆమె మరణించినట్లు తెలుస్తుంది. రంగడు బాధపడి తిరిగివెళ్లి పోవడంలో మానవ ప్రవృత్తిలోని పాజిటివ్ సైడ్‌ను చిత్రించింది. భారతీయ సంస్కృతి మౌలిక లక్షణానికి దర్పణం ఈ కథ. పాశ్చాత్యధోరణుల వ్యామోహంలో పడి దాంపత్యధర్మాన్ని విస్మరించిన రాజమ్మ కథ 'రాజమ్మ రాజరీకం'. అమెరికావ్యామోహం'లో పడి కొట్టుకుపోతున్న నేటి యువతకూ ఈ కథ వో కనువిప్పు.

'లచ్చి' పెద్దకథ, గొప్పకథ. పట్నంలో ఏదో సంపాదించేద్దామని వ్యామోహంతో వెళ్లి చివరికి ఓడిపోయి, పాతజీవితాన్నే ఆరంభిద్దామనుకుంటారు. ఒక జంట. కథ ముగింపును నేటి దృష్టితోకాక, ఆనాటి దృష్టితో చూడటం అవసరం. అనుమానాలూ, అహంకారాలవల్ల దాంపత్యం విచ్ఛిన్నం చేసుకోకూడదని చెప్పే కథలు 'దెబ్బ తిన్న అహంకారం, అబ్బాయి–అమ్మాయి, పెళ్లీ–ప్రేమ'.

గూడూరి సీతారాం గారి కథల్లో గుబాళించే సంస్కారం ఆయన వ్యక్తిగతజీవితంలోనూ కనిపిస్తుంది. సమకాలికులూ, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డా. సినారెను గురించి రాస్తూ సీతారాం గారు, 'డా. సినారె గారి చిన్ననాటి సాహచర్యం, గురుత్వం నా రచనావ్యాసంగానికి జీవంపోసి స్ఫూర్తినిచ్చేయి. వారి మార్గదర్శనంలోనే కథారచయితగా ఎదిగేను' అంటారు. కనపర్తి గారితో కలిసి జానపదగీతాలు సేకరించేరు.

సీతారాంగారి పిల్లలంతా జీవితంలో స్థిరపడ్డారు. ఆయన రిటైర్మెంట్ జీవితం గడుపుతున్నారిప్పుడు. రచయితలతో, కవులతో ఇష్టాగోష్ఠులూ, సమావేశాల్లో పాల్గొనటం, యువకులకు సలహాలివ్వటం, సహాయం చెయ్యటం సీతారాం గారి ప్రస్తుత వ్యాపకాలు. సిరిసిల్లలోని మానేరు రచయితల సంఘం అధ్యక్షుడుగా కొత్తతరం రచయితలతో గాఢానుబంధం ఏర్పరచుకొన్నారు.

గూడూరి సీతారాంగారు రచయితగా మట్టిపరిమళాన్ని పాఠకులకు పంచేరు. తన సంస్కారసుగంధాన్ని పాతకొత్త తరాలను ప్రభావితం చేసిన వ్యక్తి.

వ్యక్తిగా, రచయితగా కూడా కరీంనగర్ జిల్లా ఆణిముత్యం సీతారాంగారు!

– కప్పగంతుల మల్లికార్జునరావు

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 11 నవంబర్, 2000)



డా. దేవరాజు మహారాజు, ఎం.ఎస్సీ, పిహెచ్.డి.
6-83, కృషి నిలయం, మధురనగర్,
నగరం-ఇసిఐఎల్, హైదరాబాదు
ఫోను : 27120534, సెల్ : 9849370501

తెలంగాణ తొలితరం రచయిత గూడూరి సీతారాం గారితో నా అనుబంధం

1987లో మిత్రుడు ఆర్వీ రామారావు ఓ రోజు మా ఇంటికొచ్చాడు. అప్పుడతను ఆంధ్రభూమి రెసిడెంట్ ఎడిటర్‌గా విశాఖలో ఉన్నాడు. త్వరలో తాము ఒక పేజి సాహిత్యానికి కేటాయిస్తున్నామని, అది 'అక్షరభూమి' పేరుతో ప్రతి శనివారం వస్తుందని చెప్పాడు. అందులో-రాయడం ఆపేసిన ముందుతరం రచయితల గూర్చి 'మట్టిలో మాణిక్యాలు' శీర్షికను ప్రచురించాలని ఉందని చెప్పాడు. తెలంగాణ ప్రాంతపు రచయితల జీవిత విశేషాలు వెలికి తీయడంలో నా సహాయం అడిగాడు. గూడూరు సీతారాం గారిపేరు మా సంభాషణలో అప్పుడు చాలా సీరియస్‌గా చోటు చేసకుంది. దాంతో పాత తరం రచయితల అనుభవాల్ని రికార్డు చేయాల్సిన ఆవశ్యకతను మిత్రుడు ఆర్వీ ఆరోజు నొక్కి చెప్పినట్లయ్యింది.

అంతకు ముందు ఒక దశాబ్దం క్రితం నా 'కడుపుకోత' (1978) కథా సంపుటికి ముందుమాట రాస్తూ దాశరథి రంగాచార్య, గూడూరి సీతారాం గురించి ఓ మాట చెప్పారు. తెలంగాణ ప్రజల భాషలో కథలు రాసిన వాళ్ళున్నారు గానీ, ఎవరూ సంపుటిగా తేలేదని, బహుశా 'కడుపుకోతే' తొలి సంపుటి అవుతుందని అన్నారు.

తెలంగాణ తొలితరం రచయితల గూర్చి అక్షరభూమిలో నేను కొన్ని పరిచయ వ్యాసాలు రాశాను. కొన్ని ఇతర మిత్రులతో రాయించాను. ఆ పనిలో భాగంగా గూడూరి సీతారాం గారి వివరాలు సేకరించమని సిరిసిల్ల ప్రాంతంలో వున్న రచయిత మిత్రులకు ఉత్తరాలు రాశాను. ఎవరూ వివరాలు పంపలేదు. ఒక మిత్రుడు మాత్రం గూడూరి సీతారాం సిరిసిల్లలో ఉన్నారని, అయితే ఆయన ఏదో వ్యాపారపు పనుల్లో ఉంటారని, తాను రచయితనన్న విషయం కూడా మరిచిపోయారని చెప్పాడు. పైగా ఆయన రాసిన

కథలు కూడా ఆయన దగ్గర లేవని తెలియజేశాడు-నేను ఆశ్చర్యపోయాను! అద్దంకి తిరుమల సుప్రసన్నాచార్య అనే యువరచయిత అప్పట్లో నా దగ్గరికి తరచూ వస్తుండేవాడు. అతనికి అలనాటి తెలంగాణ పత్రికల లిస్టు, పాతతరం రచయితల పేర్లూ రాసిచ్చి, వారి రచనల కోసం గ్రంథాలయాలు వెతకమన్నాను. ఆ రకంగా దొరికిన కొన్ని రచనలు వివిధ పత్రికల్లో పునర్ముద్రణ చేయించాను. ఓ రోజు మా సుప్రసన్న గూడూరి సీతారాం గారి కథ 'స్రవంతి' పాత సంచిక లోంచి రాసుకొచ్చాడు. ఆ కథపేరు 'నారిగాని బతుకు' ఒక చిన్న ఉపోద్ఘాతం రాసి నేను దాన్ని పునర్ముద్రించాను.

ఆ ఉపోద్ఘాతం ఇక్కడ ఇస్తున్నాను-

★ ★ ★

ముందుతరం తెలంగాణ రచయితల్లో తప్పక చెప్పుకోదగ్గవారు గూడూరి సీతారాం. ఆయన 1935 ప్రాంతంలో కరీంనగర్ జిల్లా హనుమాజీ పేటలో జన్మించారు. హైస్కూల్ విద్యార్థిగా ఉన్నప్పటి నుండే కథారచన ప్రారంభించారు. మొదటి కథ 'స్త్రీ స్వాతంత్ర్యం' 1953లో అచ్చయిన సమయానికి ఆయన ఎనమిదవ తరగతి విద్యార్థి. ఆ కథలో అద్భుతమైన శిల్పం ఉంది. తొలికథలోనే అంతటి శిల్ప సామర్థ్యాన్ని సాధించారంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఆ కథని తెలంగాణా రచయితల సంఘం సిరిసిల్ల వారు తమ 'నినాదం' (1953) సంచికలో ప్రచురించారు. వట్టికోట ఆళ్వారుస్వామి తమ సంపాదకత్వంలో వెలువడ్డ 'పరిసరాలు' (1954) కథల సంకలనంలో వీరి 'చీకటి గొడుగులు' కథని చేర్చారు. ఆ రోజుల్లోనే వెలవడ్డ తెలుగు దేశం పత్రిక (ఇప్పటి తెలుగుదేశం పార్టీ కాదు) వీరి మరికొన్ని రచనల్ని ఆచ్చేసింది. ముఖ్యంగా స్రవంతి-సాహిత్య పత్రిక వీరి కథల్ని యాభైయవ దశకంలో విరివిగా ప్రచురించింది. 1953 నుండి ఒక దశాబ్దం పాటు ఆయన ఎనభై మూడు కథలు రాశారు. అన్నీ తెలంగాణ జాతి జీవనాన్ని సజీవంగా చిత్రించినవే!

తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి 1931లో కథానికా రచనకు శ్రీకారం చుట్టడంతో ఆ తర్వాత వచ్చిన జి. రాములు, జి. సురమౌళి, పొట్లపల్లి రామారావు, కాళోజి నారాయణరావు, కాంచనపల్లి చిన వెంకటరామారావు, గూడూరి సీతారాం వంటి వారు ఆ ప్రక్రియలో విశేషంగా కృషి చేశారు. జి. రాములు, గూడూరి సీతారాంలు మాత్రం మరుగున పడిన మాణిక్యాల్లా మిగిలిపోయారు.

తెలంగాణ జనజీవితానికి, జనఘోషకు, జనభాషకు సుమారు అర్ధశతాబ్దికి పూర్వమే సాహిత్య గౌరవం తెచ్చిన కథకుడు గూడూరి సీతారాం! ఎన్నో కారణాల వల్ల ఆయన రచనలు ఆయన నిర్లక్ష్యానికే గురయ్యాయి. ఎన్నో ప్రయత్నాల తర్వాత 1954 స్రవంతి సాహిత్య పత్రిక అచ్చేసిన 'నారిగాని బతుకు' కథ నేను సంపాదించగలిగాను. ఇది ఒక విశిష్టమైన కథ. ఇందులోని కథా నాయకుడు నారిగాడు గీత కార్మికుడు. సాదాసీదాగా

సాగిన అతడి జీవిత వర్ణనే ఈ కథ. ఊరికే చదువుకుంటూ పోతే, ఈ కథలో ఆర్థికాంశం, దోపిడి, సిద్ధాంతం ఏదీ కనబడదు. కాని కొంచెం లోపలికి వెళ్ళి లోతుగా ఆలోచిస్తే అన్నీ కనబడుతాయి. 'జీవితం' కేంద్రకంగా వచ్చిన కథ కాబట్టి, అంశాలన్నీ వాటికవే రచయిత ప్రమేయం లేకుండానే ఇందులో స్థానం సంపాదించాయి.

గీత పరిశ్రమలో స్త్రీ పనిచేయడం, భర్తకు చేదోడు వాదోడుగా ఉండడం ఉంది. దాన్ని ఆసరాగా తీసుకుని, కొందరు శారీరక దోపిడికి ప్రయత్నించడం తరతరాలుగా జరుగుతూ వచ్చింది. మరోవైపు నైతికంగా దిగజారిన నారిగాడి రెండోభార్య డబ్బుదోచుకుని, గుర్రాలయిన కోరికలతో లేచిపోయిన అంశం కూడా ఇందులో ఉంది. తెలుగు సాహిత్యంలో అటు ఉన్నత వర్గాల వారి జీవితం, ఇటు అట్టడుగు వర్గాల వారి జీవితం బాగా గ్రంథస్థమైంది. కాని, మధ్యలో నలిగిపోయిన అనేక కులాల వారి సమస్యలు అంతగా వెలుగు చూడలేదు. ఈ కథలో సీతారాం గారు గీత కార్మికుల జీవితంలోకి దృష్టి సారించారు. అరవై ఆరేళ్ళ వయసులో సిరిసిల్లా పట్టణంలో విశ్రాంతి జీవనం గడుపుతున్న ఈ రచయిత-మిత్రుల, బంధువుల సహాయంతో తమ కథల సంపుటి త్వరలో వెలువరిస్తారని ఎదురు చూద్దాం! (ఆదివారం విశాలాంధ్ర 16.12.2001)

★ ★ ★

ఇది జరిగిన కొంత కాలానికి గూడూరి గారి కథలు తాము సేకరిస్తున్నామని, సేకరించిన వాటి జిరాక్స్ కాపీ పంపుతున్నానని పత్తిపాక మోహన్ ఉత్తరం రాశాడు. చాలా సంతోషించాను. డా. మోహన్ పూనుకోవడం వల్ల నేను మరికొన్ని కథలు చదవగలిగాను. సీతారాం గారికీ, నాకూ మధ్య ఉత్తరాలు, ఫోన్లూ నడిచాయి. ఫోన్‌లో మాట్లాడుకోవడానికి, ముఖపరిచయం కావడానికీ మధ్య-మరో ఆరునెలలు గడిచి పొయ్యాయి. ఒక దశాబ్దానికి పైగా ఆయన గురించి, ఆయన కథల గురించి ఆలోచిస్తున్నందువల్ల కాబోలు ఆయన పరిచయమైనప్పుడు ఒక కొత్త వ్యక్తి పరిచయమైనట్లుగా అనిపించలేదు. సిరిసిల్ల నుండో 'హిమాయత్‌నగర్ నుండో అప్పుడప్పుడు ఆయనఫోన్ చేస్తుండేవారు. నేను కూడా గుర్తుంచుకుని పలకరిస్తుండే వాణ్ణి. మా కుటుంబానికి ఆయన ఆత్మీయుడయ్యారు. మామధ్య గొప్ప సాహిత్యచర్చలేం జరిగేవి కావు. కాని క్షేమ సమాచారాలు తెలుసుకోవడం, ఆత్మీయతలు పంచుకోవడం జరుగుతూ ఉండేది. సిరిసిల్లకు రమ్మని ఒకటి రెండుసార్లు అడిగారు. నేను వస్తానన్నాను. హఠాత్తుగా ఓరోజు దుర్వార్త మోసుకుని, సిరిసిల్ల నుండి ఫోన్ మోగింది. గూడూరి గారి సహచరిణి ఇకలేరని జూకంటి చెప్పాడు. ఇంట్లో అందరం బాధపడ్డాం. ఈ వయసులో ఆయన పరిస్థితి ఏమిటి? అని వారం పదిరోజులు మదన పడ్డాను. ఏదో బరువు. ఏదో బాధ. మనసు తేలిక పరుచుకోవడానికి కాగితంపై ఏదో గిలుగుతూ పోయాను. అది 'ఒంటరి గూటి పక్షి' కవితగా రూపుదాల్చింది.

కాలం మరికొంత ముందుకు నడిచింది. మానేరు రచయితల సంఘం-సిరిసిల్ల

వారు కథా సాహిత్యంలో నేను చేసిన కృషికి 'సురమౌళి స్మారక పురస్కారం' ప్రకటించారు. 2002 జులై 14న సిరిసిల్లకు బయలుదేరాము. సభ ఆరోజు సాయంత్రం ఉంది. జూబ్లీ బస్ స్టేషన్లో ఎక్స్‌ప్రెస్ ఎక్కగానే అందులో గూడూరి సీతారాం గారు కనిపించారు. నల్లటి మనిషి, తెల్లటి బట్టలు-ధోవతి ఖమీజు, నుదుటి ఎర్రనిబొట్టు, మర్యాద మన్ననలతో కూడిన మెత్తని బొంగురుగొంతు, ప్రయాణం కబుర్లతో హాయిగా సాగింది. ఆ సాయంత్రం సభ చాలా బాగా జరిగింది. ఒక ముందు తరం తెలంగాణ రచయిత (సురమౌళి) పేర ఇచ్చే అవార్డు, మరో ముందుతరం రచయిత (గూడూరి సీతారాం) చేతుల మీదుగా అందుకున్నాను. తెలంగాణ భాషకు సాహిత్య గౌరవం తెచ్చిన ముందు అందుకున్నాను. తెలంగాణ భాషకు సాహిత్య గౌరవం తెచ్చిన ముందుతరం రచయితల అడుగుజాడల్లో తెలియకుండానే చాలాదూరం నడిచివచ్చానని అనిపించి, సంతృప్తిపడ్డాను. గర్వపడ్డాను.

మరునాడు కూడా సిరిసిల్లలో ఉన్నాము. మరమగ్గాలు చూస్తూ వాటిమీద పనిచేస్తున్న కార్మికులతో మాట్లాడుతూ గడిపాము. మధ్యలో నేనూ, నా శ్రీమతి గూడూరి సీతారాం గారింటికి వెళ్ళాం. ముందుగదిలోనే శ్రీమతి గూడూరి కౌసల్య గారి ఫోటో కనిపించింది. కొన్ని నెలల క్రితం వరకు ఆ ఇల్లు ఎంతో వైభంగా కళకళలాడుతూ ఉండి ఉంటుందని అర్థమైంది. అంత పెద్ద ఇల్లు బోసిపోయి ఉంది. ఒక శూన్య గృహంలా అనిపించింది. బహుశా ఆ శూన్యాన్ని భరించలేకే సీతారాం గారు హైదరాబాదులో కొడుకు దగ్గర ఉంటున్నారేమో! సిరిసిల్లలో ఇంటి చుట్టూ బంధువులు, ఊరినిండా వ్యాపార రంగానికి చెందిన స్నేహితులు, మరోవైపు పత్తిపాక మోహన్, జూకంటి జగన్నాథం, తవుటు నాగభూషణం వంటి సాహితీ మిత్రులు. సిరిసిల్లలో కూర్చుంటే ఆయనకు కాలక్షేపానికి కొదవలేదు. పట్టణంలో ఏ కార్యక్రమం జరిగినా ఆయన సలహా సంప్రదింపులు లేకుండా జరగవు. మరోవైపు వేములవాడ ఆలయ కమిటీలో ముఖ్యపాత్ర. నిజానికి ఎన్నో రకాల పనులతో ఆయనకు తీరికే ఉండదు. ఇతరులకు సహాయపడే సహృదయత. గర్వంలేకుండా అన్ని స్థాయిల వారితో ఆత్మీయంగా మాట్లాడడం ఆయన సహజ లక్షణాలు. అందుకే కాబోలు అక్కడ అందరూ ఆయనను ఇష్టపడతారు. బయట ఎన్ని ఉన్నా ఏమిలాభం? ఇంటి కొస్తే ఒంటరి గూటి పక్షి. నలభైయేళ్ళు అనురాగాన్ని పంచి హఠాత్తుగా ఒంటిగాన్ని చేసిపోయిన ఆయన శ్రీమతి ఎదురుగా ఫోటో!

★ ★ ★

గూడూరి సీతారాం గారి కోసం రాసిన కవిత-'ఒంటరి గూటి పక్షి' ఇది ఆయనకే అంకితం-

నిశ్శబ్దం లోంచి శబ్దంలోకి రావటం-పుట్టుక
శబ్దం లోంచి నిశ్శబ్దం లోకి పోవటం-చావు
ఇవి సహజాలని అందరికీ తెలుసు
అయినా ఒక్కోసారి అసహజాలని భ్రమిస్తాం!

వాస్తవాల్ని అంగీకరించం-
కలలు, ఊహలు, భ్రమలు మనిషి ఔన్నత్యానికి కొలబద్దలు
అవి కాలంతో పెనవేసుకు పోయేవి
కాలానికి అల్లుకుపోయిన కలే-జీవితం
ఆ కల కరిగిపోవటమే-కాలం చెయ్యటం

అనూహ్యంగా, ఆకస్మాత్తుగా జీవిత భాగస్వామిని కోల్పోవటం
బతుకులో కరెంట్ పోవటమే! శాశ్వత అంధత్వమే!!
మరీ వయసు పైబడినప్పుడు ఆ బాధ శూన్యాతి శూన్యంగా...
మరింత లోతుగా, మరింత గాఢంగా మరింత చిక్కగా-

ప్రేమ, అనుబంధం, అనురాగం ఉన్న ఫళాన తెగిపోతే
తపించే ఏ హృదయమూ తట్టుకోలేదు
బిగుసుకునే పిడికిలోంచి భాగస్వామి ఇసుకలా రాలిపోతే
ఒంటరితనం ఒంటిమేడై పెరిగిపోతుంది
భవిష్యత్తు భయపెడుతుంది

స్మృతిని ఊతకర్రగా చేసుకుని
ముందుకు నడిచిపోవటం చెప్పినంత తేలికకాదు
మొక్కవోని ధైర్యసాహసాలు కావాలి, గుండె రాయి కావాలి.
ఏళ్ళకేళ్ళ దాంపత్య జీవితం తర్వాత
ఏర్పడ్డ వెలితిని ఎలా పూడ్చుకుంటారు ఎవరైనా?

జ్ఞాపకాల్ని అదిమిపెట్టి, తోడుని తనలోనే భావించుకుని
ఇద్దరిగా కనిపించటం మాటలా?
అలాంటి ద్విపాత్రాభినయం మృత్యుసమానమే కదా?
మేతకోసం దేశ విదేశాలకు ఎగిరపోయిన పిట్టలు
కబురు పెడితే మాత్రం..?
తను ఎగిరేదెలా? వారితో ఇమిడేదెలా?

ఆమాట, ఆ అలికిడి, ఆ చెవిలో ఇల్లు, ఆ స్పర్శ,
ఆ చూసుకోవటం, ఆ పంచుకోవటం
మనసున మనసై కొట్టుకోవటం..?
మారుమూల పల్లెలో వేసవి మధ్యాహ్నంలో
తోడులేని తనంలో నిశ్శబ్దంలో
ఇప్పుడిక జీవితపు అగాధాలు ఎవరితో పంచుకోవటం?
బతుకులో లేని తీపిని, ఆశని ఎవరికళ్ళలో చూసుకోవటం?

పరిచితాలన్నీ ఆపరిచితాలై పోవటం
తనింట్లో తానే అవసరం లేని అతిథై పోవటం
బతుకు రథం కృంగి పోతున్న-సంకేతం
కర్ణుడంతటి వాడికే ప్రాణాలాదిలేయాల్సిన-సందర్భం
కాలానికి నమస్కరించే నిబ్బరం తప్ప,
అప్పుడు మరొకటి పనికిరాదు-

చీకటిని మించిన చీకటి-ఒంటరితనం
మరణాన్ని మించిన మహా విషాదం-తోడు లేకపోవటం. (13.05.2002)

★ ★ ★

గూడూరి సీతారాం గారు ఇటీవలి కాలంలో ఎక్కువగా హైదరాబాదులో ఉంటున్నారు. సాహిత్య సభలకు వెళ్తున్నారు. పత్రికలు చదువుతున్నారు. 'గూడూరి సీతారాం కథలు' శీర్షికన పుస్తకం ప్రచురించారు. కనీసం 30-40 ఏళ్ళ క్రితం రావాల్సిన పుస్తకం ఇప్పటికైనా వచ్చినందుకు సంతోషించాలి. సాహిత్యరంగంలో మళ్ళీ చురుకుగా కనిపిస్తున్నారు. మారసం-ఇతర మిత్రులూ కలిసి ఆయన 'సాహిత్య జీవిత స్వర్ణోత్సవం' జరుపుతున్నారు. ఆలస్యంగానైనా కొన్ని కార్యక్రమాలు చకచకా జరుగుతున్నాయని ఆనందిస్తున్నాను. ప్రశాంత విశ్రాంత జీవితంలో కొంతభాగం యువరచయితలను ప్రోత్సహించడానికి, వారికి సరైన మార్గం నిర్దేశించడానికి కేటాయిస్తారని ఆశిస్తూ, బంగారు పండగ-జరుపుకుంటున్న సందర్భంగా ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను.



రెడ్డి హాస్టల్‌లో సిహెచ్. హనుమంతరావు, జె. బాపురెడ్డి గార్లతో గూడూరి సీతారాం



కాసుల ప్రతాపరెడ్డి

303, నార్త్‌బ్లాక్, డ్రీమ్‌హోమ్,
శాలివాహన టవర్స్, శాలివహననగర్,
మూసారం బాగ్, హైదరాబాద్-36

ఆనాటి సీతారాం కథలు ఈనాడు

అన్ని వర్గాలూ, కులాల నుంచి రచయితలు పుట్టి నవలలు రాస్తే మనకు జీవితం గురించి సరైన అవగాహన వుంటుందని కొడవటిగంటి కుటుంబరావు అంటుంటే వారిని బోయ జంగయ్య గురించి రాస్తూ పురాణం సుబ్రహ్మణ్యం అన్నారు. బోయ జంగయ్య రచనలు చదివినప్పుడు అది ధృవపడింది. ముఖ్యంగా దళిత, బహుజన రచయితల నుంచి వెలువడిన సాహిత్యం అంతకు ముందు సాహిత్యంలో వ్యక్తం కాని పలు కోణాలను మన ముందుంచుతుందనడంలో సందేహం లేదు. గూడూరి సీతారాం 1953 నుంచి 1965 వరకు 85కు పైగా కథలు, రెండు నవలికలు రాశారట. ఆ కాలంలో అన్ని కథలు గూడూరి సీతారాం నుంచి రావడం విశేషం. ఆయన కథలు ఆనాటి ప్రముఖ పత్రికలన్నింటిలో అచ్చవుతూ వచ్చాయి. ఆ కథలను ఆచ్చేసిన చాలా పత్రికలు నేడు లేవు. నిన్న మొన్నటి దాకా నేటి తరం సాహిత్య అభిమానులకు ఆయన అజ్ఞాత జీవే. ఇలా ఎందుకు జరిగింది? ఇది వేరే ప్రశ్న. తెలంగాణ సాహిత్య పునరాలోకన ప్రారంభమయ్యేసరికి, ముందు తరాలను వెతుక్కునే దేవులాటలో పడేసరికి సీతారాం, ఆయన కథలూ ముందుకు వచ్చాయి. చిరునవ్వులు చిందిస్తూ తన వయస్సులో సగం వయస్సు కూడా లేని వారితో కలిసిపోయే సీతారాం తన కథా రచన గొప్పతనాన్ని ప్రదర్శించుకోవాలనే ప్రయత్నం చేయలేదు.

దొరికిన పద్నాలుగు కథలతో కరీంనగర్ జిల్లా మానేరు రచయితల సంఘం గూడూరి సీతారాం కథల పుస్తకాన్ని ప్రచురించింది. తాను రాయదల్చుకున్నదేదో రాసి పత్రికలకు పంపిన సీతారాం తన కథలు అచ్చయిన పత్రికలను దాచుకోవడానికి ప్రయత్నించినట్లు లేదు. దీంతో కథల వెతుకులాట ప్రచురణ కర్తలకు కనాకష్టమైపోయింది. ఏమైనా ఇన్నేళ్ళ తర్వాతనైనా గూడూరి సీతారాం కథలు రావడం ప్రస్తుత సందర్భానికి ఒక చేర్పు. కొకు ఆశించిన సాహిత్యం 50వ దశకంలోనే తెలంగాణ నుంచి వచ్చిందనడానికి

సీతారాం కథలు నిదర్శనం. సీతారాం కథల్లో వివిధ బహుజన కులాల ఆశలు, ఆకాంక్షలు, జీవిత పోరాటాలు, గెలుపూ ఓటములు మనకు కళ్లకు కట్టినట్లు దర్శనమిస్తాయి. అప్పుడప్పుడే తయారవుతున్న చదువుకున్న మధ్యతరగతి రూపురేఖలు మనకు గీత గీసినట్లు కనిపిస్తాయి.

సమాజంలో అప్పుడప్పుడే పాదుకొల్పుకుంటున్న మార్పుల ప్రభావం బహుజన కులాల ప్రజలపై ఎలా పడిందనే విషయాన్ని సీతారాం కథలు పట్టిస్తాయి. 'రాజమ్మ రాజీరికం' కథ ఇందుకు చక్కని ఉదాహరణ. అప్పుడప్పుడే ప్రవేశించిన సినిమాలు రేపుతున్న ఆశల సుడిగుండంలో చిక్కుకుని ఒక స్త్రీ తనను తానే ఎలా పోగొట్టుకుందో చెప్పే కథ ఇది. వెనక్కి రావడానికి కూడా వీలు లేని పరిస్థితిని రాజమ్మ ఎలా కల్పించుకుందో ఈ కథ చెప్తుంది. ఆనాటి రాజమ్మలను, సాంస్కృతిక రంగంలోని నాటి సంధి దశను ఈ కథ పట్టిస్తుంది. అప్పుడప్పుడే తెలంగాణా పల్లెలకు కూడా పాకుతన్న సినిమా సంస్కృతి అలంకరణ వస్తు సామాగ్రిపై, పైపై మెరుగులపై ఎలా మోజు పెంచుతుందో, ఆ కొత్త ఆశల మోజులతో యువత దారి తప్పడానికి ఎలా అవకాశం వుందో చెప్తుందీ కథ. అలాగే కొకు మాటలను సార్థకం చేస్తూ తెలుగు సాహిత్యానికి కింది కూలీల జీవితాల పసరు రాస్తూ గూడూరి సీతారాం కథలు రాశారు. 'నారిగాని బతుకు', 'లచ్చి' అలాంటి కథలే ఇందుకు నిదర్శనం. లచ్చి కథ డాక్టర్ కేశవరెడ్డి 'చివరి గుడిసె' నవలికను తలపిస్తుంది. సంచార జీవులకు సంబంధించిన కథ 'లచ్చి'. సామాజిక నిచ్చెనమెట్ల శ్రేణిలో కేవలం దిగువ కులానికి చెందడం వల్ల ఆకారణంగా దొంగతనం మోపబడి జీవితంలో స్థిరనివాసం ఏర్పరచుకుందామనుకున్న ఒక కుటుంబాన్ని ఎలా చిన్నాభిన్నం చేస్తుందో 'లచ్చి' కథ చెప్తుంది.

సీతారాం కథలు రాసేనాటికి, ఈనాటికి పరిస్థితి ఏమీ మారలేదని మనకు ఈ కథలు చదువుతుంటే అర్థమవుతుంది. పల్లెపట్టుగొమ్మల కింద శిశిరం తాండవమాడుతుంటే ప్రజలు వలసలు పోవడానికి సిద్ధపడుతున్న వైనాన్ని సీతారాం కథలు చిత్రీకరించాయి. బతుకుదెరువు కోసం బొంబాయి వెళ్లిన వారి జీవితాలను, వెళ్ళాలని తాపత్రయపడే వారి ఆశలను, కన్నీళ్లను ఆయన పలు కథల్లో చిత్రీకరించారు. మారాజు, రంగడు, పిచ్చోడు అలాంటి కథలు.

ఇక, స్త్రీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఆకాంక్షిస్తూ రాసిన కథలు వున్నాయి. స్త్రీలకు స్వేచ్ఛ ఇవ్వడానికి పురుషుల మనసులు ఎలా ఇచ్చగించావో, ఈ విషయంలో పురుషులు ద్వంద్వ ప్రవృత్తిని ఎలా ప్రదర్శిస్తారో స్త్రీ స్వాతంత్ర్యం, అందని ఆకాశం, దెబ్బతిన్న అహంభావం. పెళ్లీ-ప్రేమ కథలు వివరిస్తాయి. మరో విషయం అప్పుడప్పుడే తెలంగాణాలో చదువుకున్న మధ్య తరగతి ఆవిర్భవిస్తున్న తీరు, వారి కలలు, ఆశలు విచ్చుకుంటున్న తీరు మనకు సీతారాం కథలు పట్టిస్తాయి ఇటువంటి కథల్లో సీతారాం బావుకత కవిత్వ భావాలను అద్దుకుంటుంది. స్త్రీ పురుషుల ఆశలు మనకు దర్శనమిస్తాయి. శిల్పరీత్యా


చూస్తే వీటిని పూర్తిస్థాయి కథలుగా చెప్పడం సాధ్యం కాకపోవచ్చు. అవి భావచిత్రాలు మనస్సులో ఉవ్వెత్తున ఎగిసిపడే భావాల మబ్బుతునకలకు సీతారాం అక్షరరూపం ఇచ్చారు.

మొత్తం మీద ఇప్పుఇకైనా సీతారాం కథల పుస్తకం వెలువడినందుకు సంతోషించాల్సిందే. కాళోజీ కథల పుస్తకాన్ని చూసినప్పుధు కలిగిన ఆనందమే నాకు గూడూరి సీతారాం కథల పుస్తకాన్ని తాకినప్పుడు కలిగింది.

భాష గురించి కూడా ఒక విషయం చెప్పుకోవాలి. ఆధునిక భావజాలానికి సంబంధించిన కథలు రాసినప్పుడు శిష్ట వ్యావహారికం వాడిన సీతారాం పల్లెపట్టుల బహుజనుల జీవితాలను చిత్రించే సమయంలో తెలంగాణా భాషను వాడారు. తెలంగాణా ప్రజలు నాలుకల మీద ఆడే నానుడులు, పలుకు బళ్లు మనకు సీతారాం కథల్లో తగిలి హృదయానికి ఆహ్లాదం కలుగుజేస్తాయి.

'మరో విమోచన కొరకు ప్రస్తుతం సాహిత్యం సాంస్కృతిక రంగాలలో తెలంగాణా కవులు. రచయితలు మొత్తం తాకత్ కూడతీసుకు కదలబారుతూ కదులుతున్న జులూస్‌లో గూడూరి సీతారాం కథలు ఒక మూలమలుపు. ఒక చేత్తో పట్టుకున్న ప్లేకార్డు. గొంతెత్తిన తడి నినాదం' అనే జూకంటి జగన్నాథం మాటలు అక్షరసత్యాలు.

('మాభూమి' సౌజన్యంతో)



కాంగ్రెస్ యువజనోత్సవంలో ఏఐసిసి అధ్యక్షులు శ్రీ నీలం సంజీవరెడ్డి గారితో గూడూరి సీతారాం తదితరులు



డా. వడ్డేపల్లి కృష్ణ ఎం.ఏ.,పిహెచ్.డి.
సినీ దర్శకులు, గేయ రచయిత
లలితాశ్రీ నిలయం, 1-5-62/3,
చైతన్యపురి, హైదరాబాదు.

మంచికథల సీతారాం - మాండలికపు 'తాతారాం'

రచనాపరంగా నేను కలంపట్టని రోజుల్లో, నాబాల్యం కొంతకాలం గూడూరి సీతారాం గారి యింట్లోనే గడిచిపోవడం, ఆ తర్వాత కాలక్రమేణ ఆయన గురువుగారైన ఆచార్య సి. నారాయణరెడ్డి గారితో నా గేయరచనాభ్యాసం-లలితగీత విన్యాసం ప్రగాఢంగా అల్లుకుపోవడం తలచుకుంటే ఇది ఏనాటి అనుబంధమో, ఆత్మీయసుమగంధమో అనిపిస్తుంది.

బాల్యంలో (1957లో అనుకుంటాను) తొలిసారిగా నేను సిరిసిల్ల హైస్కూల్ 'సావనీర్'గా వెలువడిన 'మల్లెమొగ్గలు'లో 'పిచ్చోడు-గూడూరి సీతారాం' అని అచ్చయిన కథానికను చూసి విస్తుపోయాను. 'పిచ్చోడు' అనే కథారచయిత గూడూరి సీతారాం అనే విషయాన్ని అర్థం చేసుకోలేక 'అయ్యో! గూడూరి సీతారాం పిచ్చోడని' ప్రచురించారని నవ్వుకున్నాను. అలా ఆయన తొలికథలతో నాకు బాల్యపరిచయం జరిగింది. రానురాను రచనల విషయం, ఆతర్వాత ఆయన కథల్ని ఆంధ్రప్రభ వారపత్రికల్లో చదివి ఆనందించడమే గాక రసాస్వాదనం చేసుకునే మనోవికాసం కలిగింది. క్రమక్రమంగానేనూ కథల్ని, కవితల్ని, లలిత గీతాల్ని, కథాకావ్యాల్ని, నాటికల్ని-గేయనాటికల్ని రచించి రాణించే స్థాయికి చేరుకున్నాను.

గూడూరి సీతారాం రచనల్లో, అప్పట్లో నేను చదివిన కథ 'పిచ్చోడు' అయితే, ఇప్పట్లో 'ప్రజాతంత్ర' వారపత్రికలో నేను చదివిన కథ 'రాజమ్మ రాజీరికం' ఒక విధంగా చెప్పాలంటే రాజమ్మ కూడ ఈ కథలో ఒకసోకుల పిచ్చిదే కావడం విశేషం!

ఈ కథలో సింగారాలకు-సోకుల వ్యవహారాలకులోనై, మట్టిమనిషిగా భావించిన భర్తకుదూరమై 'ఆవాసేరుక'ని (షికారుకని) 'సెల్కల'కు (చేలలోకి) వచ్చిన 'సేరుదారు' కొడుక్కి చేరువై 'రాజమ్మ' ఎలా చెడిపోయిందో చాలా చక్కగా-చిక్కగా సీతారాం గారు చెప్పారు. తెలంగాణా మాండలికంతో పల్లెపడుచు అంతరంగాన్ని విప్పారు. రచనాశైలిలో,

కథాకథన శిల్పంలో ఎదిగి ముగింపులో అంతర్లీన సందేశాన్ని పొదిగినట్లు కనిపిస్తారు.

ఇది గూడూరి సీతారాం గారి కథలకు మచ్చుతునక మాత్రమే! ఆయన ఇలాంటి కథలెన్నో రచించి-రాణించి తొలినాళ్లలో విజృంభించి, హఠాత్తుగా మలినాళ్లలో చాలాకాలం కలాన్ని ఎందుకు త్యజించారో ఇప్పటికీ నాకు అర్థంకాని విషయమే! అయినప్పటికీ మళ్లీ రాస్తూ, 'మారసం'ను ముందుకు నడిపిస్తూ, సాహితీ స్వర్ణోత్సవం జరపుకోవడం ఆనందించదగ్గ విశేషమే! ఈ స్వర్ణకాంతులతో-సరికొత్త కథలతో సీతారాంగారు చిరకాలం వర్థిల్లాలని మనసరా ఆశిస్తున్నాను.

ఆత్మీయకవిగా యిలా అభినందిస్తున్నాను -

తెలంగాణ మాండలికపు
తేజోనిధి సీతారాం!
తేటతెల్లముగరచించు
కథకులకే తాతారాం!

తొలినాళ్లలొ తనకలాన్ని
ఉలిలాగా పదునుపెట్టి
వెల్లువెత్తుభావాలతొ
పల్లెసీమ గుండెతట్టి
మాండలికపు నుడికారం
ప్రతికథతో ఎక్కుపెట్టి
మంచితనపు మమకారం
మనసారా పంచిపెట్టి
వర్థిల్లిన గూడూరి-
సీతారాం ధన్యులు!
సాహితీ స్వర్ణోత్సవ
స్నాతలుగా మాన్యులు!
ఆయనకభినందనం!
అనురాగపు చందనం!!

- వడ్డేపల్లి కృష్ణ

జింబో
305, సౌందర్య రెసిడెన్సి,
రోడ్ నెం. 8, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 29.



తెలంగాణా బతుకు చిత్రాలు

తెలంగాణాలో కవులు ఎక్కువ కథకులు తక్కువ అన్నది అపవాదు మాత్రమే. అయితే తెలంగాణ రచయితలు తమ రచనలని పుస్తక రూపంలో వేసుకోవడంలో వెనుకబడి వున్నారు. సురమౌళి, గూడూరి సీతారాం కథలు తమ రచనలని పట్టించుకోలేదు. మరో రకంగా చెప్పాలంటే నిర్లక్ష్యం చేశారు. ఈ కారణాలవల్లే తెలంగాణాలో కథా రచయితలు తక్కువనే అపవాదు రావడానికి అవకాశం ఏర్పడింది. చొప్పకట్ల చంద్రమౌళి కూడా ఇదే కోవలోకి వస్తారు. ఆయనా తన కథలని, కవిత్వాన్ని నిర్లక్ష్యం చేశారు. గూడూరి సీతారాం 1953 సంవత్సరం నుండి 1965 వరకు దాదాపు ఎనభై అయిదు కథలు, రెండు నవలలు రాశాడు. అన్ని కథలు దొరకలేదు. దొరికిన 14 కథలను కలిపి గూడూరి సీతారాం కథల పేరుతో కథల సంపుటిని ప్రచురించారు. కనీసం ఇప్పటికైనా ఈ పుస్తకాన్ని వెలుగులోకి తెచ్చినందుకు మిత్రులని అభినందించక తప్పదు. ఈ రకంగా ఆనాటి రచయితలు వెనుకబడి వున్నారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. ఇప్పుడు తెలంగాణా రచయితలు అలా వెనుకబడి లేరు. ముందంజలో వున్నారు. ఒక్క కరీంనగర్ జిల్లానుంచే ఈ ముప్పై రోజుల్లో ముప్పై పుస్తకాలు వచ్చాయి. అన్ని ప్రక్రియల మీదా పుస్తకాలు వెలువడ్డాయి. ఆరు కథ సంపుటాలు వెలువడ్డాయి. అవి గూడూరి సీతారాం కథలు, బివిఎన్ స్వామి-నెలపొడుపు, పి.చంద్, జులుం కథలు, పంజాల జగన్నాథం-మట్టి వాసనలు, జూకంటి జగన్నాథం-వైపని, బి.ఎస్.రాములు-పాలు, నా కథల సంపుటి. అందుకు ముందే వచ్చిన పెద్దింటి అశోక్ కుమార్-వలస బ్రతుకులు-ఇవీ ఈ సంవత్సరం కరీంనగర్ నుంచి వెలువడిన కథా సంపుటాలు. తెలుగు కథా సాహిత్యానికి ముఖ్యంగా కరీంనగర్ జిల్లాకి ఇదొక గొప్ప సందర్భం. ఈ సంవత్సరాంతానికైనా సురమౌళి కథల పుస్తకం వస్తే ఈ సందర్భానికి సార్థకత వస్తుంది.

తెలంగాణా భాషని సమర్థవంతంగా వాడుకున్న కథకుడు సీతారాం. టీవీలు, నగరాలు దగ్గరై నేడు పల్లె పదాలు పద బంధాలు ఎన్నో మరుగునబడ్డాయి. వాటిని ఉపయోగించే వారు కరువైపోయినారు. ఆ పల్లె పదాలు పద బంధాలు సీతారాం కథలనిండా కన్పిస్తాయి. 'కచ్చురం మంచిగ పోయినట్టే పోయి ఒక్కసారే బొందల పడేదాకా తెలువదు.

రాచ్చససొంటోళ్ళు నిండా నూరేండ్లు బతుకుతరు. గోవసోంటోళ్ళు మాయెల్లమే జత్తరు' లాంటి వాక్యాలు ప్రతి కథలో కన్పిస్తాయి.

'నారిగాని బతుకు' కథలో నారిగాని జీవిత చిత్రణ వుంటుంది. తెలంగాణా పల్లెటూళ్లలో గౌండ్లోల్ల స్థితిగతులు ఈ కథలో కన్పిస్తుంది. ఆ కథ ఇలా మొదలవుతుంది.

'పొద్దు గూకస్తుంది. గౌండ్లోల్ల నారిగాడు మంచంల కెల్లి లేచి అవతలి మొకాన పోవల్ననుకుంటున్నడు. కండ్లు మూసి తెరిసే సరికి అయిపోయింది. నారిగాని కోడలు కల్లు అంచుతుండగ అంచుతుండగనే, చేతిలోని ఆకును కింద పారేసి దాని కొంగు వట్టి గుంజె కల్లు తాగెటోడు. అది లబ్బదిబ్బ మొత్తకుంది. ఆనికి పక్కను కూసున్న మింకోడు జట్టన లేచి దౌడ మీద కెల్లి యియ్యర బయ్యర నాలుగుతికిండు'. దీని తరువాత నారిగాని కండ్లు బైర్లు కమ్మి గత స్మృతులోకి పోతాయి. అతని చిన్నప్పుడే అతని అన్నదమ్ములు వేరు పడటం, పెళ్లి అంటే ఏమిటో తెలియక ముందే పెళ్ళి కావడం, భార్య ఆకస్మాత్తుగా చనిపోవడం, కల్లు పోస్తూ పోస్తూ మార్యానం తెచ్చుకున్న రెండవ భార్య లేచిపోవడం, మూడవ భార్యను చేసుకోవడం అన్ని గిర్రున తిరుగుతాయి. కథ ఇలా ముగిస్తాడు రచయిత.

ఇక అప్పట్నుంచి నారిగాని కొడుకు ఎట్లెట్ల పెద్ద పెరిగిండో, అట్లట్ల ఆని మూలద్రవ్యం తరుగుడు పెట్టింది. కల్లు అమ్ముడు రోజురోజుకు తగ్గిపోయింది. యిరువై తాళ్ళకెల్లి ఆఖరికి మూడు చిక్కనయి కొడుకు చేతికచ్చేవరకు, నారిగాడు తన కొడుకును తనోలెగాకుండా చూడాలని చాలా జేసిండు. మూడు తాళ్ళున్నా నిజాయితీగా బతుకు మన్నడు. కల్లును ఆడోళ్ళు అమ్మద్దన్నడు. కాని కొడుకు యినలే! ఈ ముసలోని మాట యిని గిట్ల కూటికి ఎవరు జత్తరు. కల్లమ్మెటోల్లంతా గట్లనే ఉంటరా! అని కొడుకు సవాల్. ముసలోడైండు నారిగాడు ఏం చేత్తడు. యాల్లకు యింత పడేస్తే తింటడు. ఓ మూలకు పంటడు. అంతే నారిగాని బతుకు.

ఈ చిన్న కథలో నారిగాని బతుకు చిత్రం కన్పిస్తుంది. నారిగాని జీవితంలోని విషాదం కన్పిస్తుంది. ఇ లా ప్రతి కథా కొనసాగుంది. సీతారాం కథల నిండా తెలంగాణ భాష వెల్లువై పారుతుంది. అయితే ఈ కథలను అప్పటి కాల పరిస్థితులను పరిగణలోకి తీసుకుంటే ఎక్కువ ఆస్వాదించడానికి అవకాశం ఏర్పడుతుంది. ఎందుకంటే ఇప్పుడు రాసే కథకులు నారిగాడు అని తరచూ కథలో అనకపోవచ్చు.


సీతారాం కథల్లో ప్రేమ వుంది. భాషా సంస్కృతులు, కులవృత్తులు మనుషుల ప్రవృత్తులు అన్నీ కన్పిస్తాయి. కథతో పాటు శైలీ శిల్ప నైపుణ్యత కన్పిస్తుంది.

ఇన్ని కథలు రాసిన సీతారాం ఆగిపోవడానికి కారణం ఏమిటీ? తన కథలని ప్రచురించకపోవడానికి కారణం ఏమిటీ? ఉద్యోగమా? వ్యాపారమా? జీవిత ప్రయాణంలో రచయితను దూరంగా నెట్టిన సీతారాం మళ్ళీ రచయితలతో బతుకుతున్నాడు. తన రచనలతో బతుకుతున్నాడు. బతకాల మరి. మరిన్ని మంచి కథలు అందించి ఇంకా వెలగాలి.

– జింబో

('గుండెతడి' ఆంధ్రభూమి సౌజన్యంతో)

మధురకవి, సుకవిసుధాకర **దూడం నాంపల్లి**
ప్రధాన కార్యదర్శి, సిరిసిల్ల సాహితీ సమితి
ప్రగతినగర్, సిరిసిల్ల-505301.



జై సీతారాం!

సీతారాం! జై సీతారాం!
సీతారాంజీ సీతారాం!
సిరిసిల్ల మల్లె సీతారాం
సిరికతల ముల్లె సీతారాం ॥సీ॥

తొలితరం తెలుగు కథా కవులలో
తొలితరచయితగా వెలిగినవాడు
తెలంగాణకే వెలుంగు తెచ్చిన
కలం యోధుడు కథాకావ్యుడు ॥సీ॥

సినారెగారీ చిరత్న మిత్రం
హనుమాజిపేట అద్భుతరత్నం
మూలవాగు ముచ్చట్లను చేకొని
మానేరొడ్డున మకాము పెట్టిన ॥సీ॥

రమణి 'రాజమ్మ రాజీర్కము'ను
'నారిగాని బతు'కారిపోవుటను
'చీకటి గొడుగు'ల చిత్రమనస్సును
'ఎర్రని పువ్వూ' ఎరుపెరిగించిన ॥సీ॥

పల్లె జనాల బడుగు బతుకుల
నాడిని దెలసీ నవలరాసిన
తెలగాణ యాసబాసకే రవి
శ్రీశాలపురీ 'సిరివెలుగు'ల కవి ॥సీ॥



పెద్దింటి అశోక్ కుమార్

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బండలింగంపల్లి,
మం॥ ఎల్లారెడ్డిపేట, జి॥ కరీంనగర్.

మా మట్టి కతలకు సాలువోసిన-సీతన్న

ఇప్పుడు గూడూరి సీతారాంను గుర్తుచేయడమంటే మట్టి అంటిన మాణిక్యాన్ని చూపడమే! సీతారాం కథలు చదవడమంటే తెలంగాణ మట్టి బతుకుల్ని కెలుకడమే. మూడుకోట్ల బలుగముండి ఎక్కడివాళ్లక్కడ అలక్టర్‌గా ఉండి ప్రసార మాధ్యమాలు, ప్రయాణ సాధనాలున్న ఈ కాలంలోనే తెలంగాణ బాషమీద ఇంత వివక్షత ఉంది. ఇక 1950-60 ప్రాంతంలో ఎంతగా ఉంటుందో చెప్పనక్కరలేదు. అదిగో అప్పుడే ఒంటరిగా బయలుదేరాడు సీతారాం. మారుమూల సిరిసిల్ల ప్రాంతంనుండి వాదాలకు వివాదాలకు దూరంగా ఒకచేత్తో తెలంగాణ జీవభాషను పట్టుకుని మరో చేత్తో తెలంగాణ జీవితాన్ని వెదికిపట్టుకున్నాడు. ప్రజలవైపు నుంచి ప్రజల భాషలో యాసలో గొంతెత్తినాడు.

మారుతున్న రాజకీయ, అణిచివేతలదృష్ట్యా 1945 ఆ ప్రాంతంలో తెలంగాణ ప్రాంతం తెలంగాణేతర ప్రగతి శీల రచయితలకు ఒక కథావస్తువుగా మారింది. ఇక్కడి పోరాటాలు, జీవితం మీద కథలు, నవలలువచ్చాయి. పరాయికథకుల కథలలో తెలంగాణ అనేక అవాస్తవ చిత్రీకరణలకు గురయింది. ఆళ్వారుస్వామి 'పరిసరాలు' కథలసంపుటి గమనిస్తే ఈ విషయం తెలుస్తుంది. అదే సంకలనంలో సీతారాం 'చీకటి గొడుగులు' కథతో గొంతుకలిపాడు. అది 1954 ప్రాంతం. అప్పుడే ఒక కొత్త శిల్పాన్ని ఆవిష్కరించాడు గూడూరి. కథంతా చైతన్య స్రవంతికి దగ్గరగా ఉన్న శిల్పంతో సాగిపోతుంది. స్త్రీ స్వేచ్ఛను అప్పుడే స్థూలంగా ప్రశ్నించాడు కథలో.

తెలంగాణ సాయుధపోరాంటం విరమించినాక తెలంగాణ వస్తువును ఆశ్రయించి రచనను కొనసాగించిన స్థానికేతరులు సినిమారంగంవైపు మొగ్గుచూపారు. తెలంగాణ వొకవైపు ఆంధ్రప్రదేశ్‌లో కలిసి సర్దుకుంటూ అస్థిత్వాన్ని కోల్పోతున్న క్రమం హైదరాబాద్‌ను ఆక్రమిస్తున్న వలస మనుషులు, పెట్టుబడిదారులు, తెలంగాణ జనాన్ని ఉక్కిరి బక్కిరి చేస్తున్నారు. అంతా వడ్లు పెరుగు కలిపిన పరిస్థితి. అప్పుడు ప్రజలవైపు నుండి ప్రజల భాషలో రాసిన కథకుడు సీతారాం. అప్పుడే పుట్టిన వలసకథలు మారాజు, రంగడు.

'మారాజు' కథలో తెలంగాణ పల్లె కనిపిస్తుంది. అమాయకులైన మనుషులు కనిపిస్తారు. మారుతున్న మానవ సంబంధాలు కనిపిస్తాయి. నగరజీవితం పట్ల మోజు,

మోసాలు, యాంత్రిక నాగరికథ అప్పుడే పసిగట్టి రికార్డు చేశాడు సీతారాం. రంగడు బొంబాయి వోయి రావడంతో కథ ముగుస్తుంది. ముగింపు వాక్యం చదివినాక పాఠకునిలో ఆలోచన మొదలవుతుంది. 'నీకొడుక్కేందవ్వ, బతికి బయటవడ్డడు' అంటూ ముగిస్తాడు రచయిత. నరకకూపంలాంటి నగర జీవితాన్ని ఒక్కమాటలోనే తేల్చిచెప్పాడు.

రంగడు కథలోనైతే దొరల ఆకృత్యాలు కళ్లకు గట్టినట్టు కనిపిస్తాయి. పల్లెల్లో మార్పులను అప్పుడే పసిగట్టాడు సీతారాం. అదే మార్పును కథల్లో రికార్డు చేశాడు. రంగడు బిలాయి నుండి పల్లెకు వచ్చేసరికి పల్లె రూపు రేఖలే మారిపోతాయి. 'ప్రపంచీకరణ' అని మనం ఇప్పుడంటున్నాము. ఆపదం అప్పట్లో లేదుకానీ దాని వాసనలు సోకిన పల్లెను సీతారాం మాత్రం అప్పుడే పసిగట్టాడు. అందుకే సూత్త సూత్తుండంగనే ఏందో ఏందో మారిపోతుంది. ఎట్లెట్లనో అయితున్నాయి దినాలు' అంటాడు.

సీతారాం ప్రజల పక్షం మనిషి. అదీ అట్టడుగు వర్గాల పక్షం మనిషి 'లచ్చి' కథ చదివితే ఈ విషయం తెలస్తుంది. అది 1957లో రాసిన కథ. బిచ్చగాళ్ల కథ వాళ్ల ఆచారాలను, జీవితాలను పట్టి ఇచ్చిన కథ. నగర జీవితం మనిషిలో ఎలాంటి మార్పులను తెస్తుంది. పట్నము సుఖవంతమైన జీవితం వెనుక ఎంతటి విషాదం దాగి ఉన్నది చెబుతుంది. బిచ్చమెత్తె రంగడు రిక్షా కొనుక్కోవడం, తాగుడుకు బానిసకావడం, లచ్చిని అనుమానించడం. తప్పు తెలుసుకుని తనమార్పుకు కారణమైన రిక్షానువదులుకుని మామూలు జీవితం గడపాలనుకుంటాడు. 'లచ్చి' జీవితంలో ఎన్నెన్నో మార్పులను చూపించాడు. ప్రతీమార్పులోనూ ఎప్పడూ వాస్తవికతను దాటిపోలేదు సీతారాం. సరళమైన శైలి వేగవంతమైన కథా కథనం కథను గొప్ప కథగా నిలబెట్టాయి. నిజంగా ఈ కథ ఆకాలంలో మరే ప్రాంతంనుంచి వచ్చినా గొప్ప కథ వరుసలో చేరిపోయేది. దీనికున్న ఒకే ఒక మైనస్ పాయింట్ తెలంగాణ వాసనే! అందుకే ఈ కథ మరుగున పడిపోయింది.

వ్యాపార ప్రకటనల హోరు వస్తు వ్యామోహపు జోరు మనం ఇప్పుడు చూస్తున్నాము. వస్తు వ్యామోహంలో పడ్డ రాజమ్మ జీవితాన్ని పాడు చేసుకోవడం ఆనాడే రికార్డు చేసాడు సీతారాం. 'రాజమ్మ రాజీరికం' కథలో పూసలోల్ల రాజమ్మ సినిమాలపై, అత్తరు, పౌడరు, స్నోలపై మోజు పెంచుకోవడం, చివరకు బిచ్చమెత్తుకుని జీవితం గడపడం, అదేదో రోగం తగడం (అప్పటికి ఎయిడ్స్ లేదు) రాజమ్మ జీవితాన్ని పూస గుచ్చినట్టు చెబుతాడు సీతారాం.

సీతారాం కథలకున్న మరోగొప్ప లక్షణం క్లుప్తత. అది కథలోనే కాదు. కథలకు పెట్టే పేర్లకు కూడా ఈ లక్షణం ఉంటంది. పెద్ద పెద్ద కథలు వస్తున్న కాలంలోనే చిన్న కథల ప్రయోజనం గుర్తించారాయన. ఈ చిన్న కథల్లోనైనా ఒక సంఘర్షణను ఎత్తిచూపిస్తాడు. చెప్పే విషయం సూటిగా చెబుతాడు. ఎత్తుగడతోనే కథను ఎత్తుకుంటాడు. మొదటి వాక్యంతోనే కథలోకి లాక్కుపోతాడు. 'పిచ్చోడు' కథను మొదలుపెడుతూ' ఆనాడు పొద్దు వంకరగా గూకింది. గాందీతాత కడుపులనుంచి నెత్తురు సిల్లినట్టు అంటూ కథలోకి

లాక్కుపోయి రేఖామాత్రంగా కథలోని సంఘర్షణను, వస్తువును సింబాలిక్‌గా చెబుతాడు.

సీతారాం కథల్లో మనోవిశ్లేషణ ఉంటుంది. ఫిలాసఫిక్ టచ్ ఉంటుంది. 'అబ్బాయి-అమ్మాయి' కథలో యవ్వనపు తొలివాకిట్లో ఉన్న యువతీయువకుల మనోభావాలను చక్కగా విశ్లేషిస్తాడు. అనవసరవర్ణనలుండవు. అవసరంలేని ఒక్కమాట కూడా ఉండదు. కథలన్నీ స్పైడర్ మాన్‌కు వేసిన తొడుగులాగు తెలంగాణ తననుతాను అవిష్కరించుకుంటున్న దశలో సాహిత్య వాతావరణాన్ని కొత్తగా నిర్వచించి, తనవంతు పాత్రను నిర్వహించిన సంస్థల్లో తెలంగాణ రచయితల సంఘం ఒకటి, వాళ్లు వేసిన 'నినాదం' సంచికలో చదువ దగ్గకథ 'స్త్రీ స్వాతంత్ర్యం' అది 1953లో సీతారాం రాసినకథ. స్త్రీ స్వేచ్ఛపేరుతో స్త్రీలను ఆటబొమ్మలుగా చూసే పురుషుల బండారాన్ని ఆనాడె బద్దలుకొట్టిన కథ ఇది. కథ చదివితే మేకతోలు కప్పుకున్న పులుల నిజరూపం కనిపిస్తుంది.

ప్రేమ ముసుగులో దాగిన కామవాంఛలను, యువత ఆధునికపోకడలను అప్పుడే ఖండించాడు సీతారాం. పెళ్లి తర్వాత భార్యను ప్రేమించలేని మనిషి కథను 'పెళ్లీ-ప్రేమ' కథలో హృదయానికి హత్తుకునేలా చెబుతాడు. కేవలం మూడేమూడు పేజీలున్న ఈ కథ జీవిత సత్యాన్ని శోధిస్తుంది. ఇందులో కూడా శిల్ప నవ్యత, పరిణితి కనిపిస్తుంది. కథ తపు సంఘర్షణ మొత్తాన్ని రేఖామాత్రంగా సృజించిన గూడూరి ఒకే ఒక వాక్యం "అతడు ప్రేమించడానికి వెళ్తున్నాడు తాను పెళ్లాడిన అమ్మాయిని" అంటూ కథను మలుపుతిప్పి ఆలోచనను రేకెత్తిస్తాడు. కథ చదివాక బరువుగా నిట్టూర్పు విడుస్తాం. కథ కింది తేదిని చూస్తే తప్ప అది ఇప్పుడు రాసిన కథనే అనుకుంటాం. ఈ ఒక్క కథనే కాదు. పుస్తకంలో ఉన్న ఐదారు కథలు నవ్యతగా కనిపిస్తాయి. అందులోని ఎత్తుగడ, క్లుప్తత అలాంటిది. అందుకే సీతారాం కథలు కొన్నింటిని ముందుగా తేదీ చూసి కథలు చదవాలి. కొన్నింటికి కథలు చదివినాక తేదీలు చూడాలి. అప్పుడుగానీ కథల్లోని గొప్పతనం బయటపడదు.

'80 దశకంలో సాధించిన శిల్పనైపుణ్యం, మెలోడ్రామాతో కథను సాగించడం అప్పుడే సాధించాడు సీతారాం'. 'ఎర్రనిపువ్వు' సీతారాం శిల్ప పరిణితికి తార్కాణం. శిల్పవైవిద్యం గల కథలకు తొలినాళ్లలోనే పునాదులు వేసిన ఈ రచయిత వస్తువును, నేపథ్యాన్ని, వాస్తవికతను ఏనాడూ వదిలిపెట్టలేదు. అదే ఈ కథలను ఇంతవరకూ నిలబెట్టాయి. పచ్చని పకృతిలో ఒదిగిపోయి ఎర్రనిపువ్వులతో నేనూ నిండుగా నవ్వుతున్నానన్నాడు. అది తెలంగాణ వారసత్వపు పోరాటానికి గుర్తు.

సీతారాం కథల్లో సాధించిన మరో మంచి లక్షణం వాక్య నిర్మాణం. అతని వాక్యాలు చాలాచిన్నవి. చిన్నచిన్న వాక్యాల్లోనే ఆయన పెద్దపెద్ద అర్థాలను సింబాలిక్‌గా చెప్పాడు'. బస్సు కదిలింది' కథను మొదలు పెడుతూ 'బస్సు ఆగింది. పదిగజాలు పరుగెత్తలేక ఆగింది. నామనసూ అంతే! అంటాడు. ఈ రెండు వాక్యాలతోనే చాలు పాత్ర ఎంత సంఘర్షించుకుంటుందీ పాఠకులు గుర్తిస్తారు. ఆ సంఘర్షణతో మమేకమై లోపలికి వెళ్ళిపోతారు. అతడి వాక్యాలకు ఆ ఆకర్షణ శక్తి ఉంది. చెంచాతో కొద్దికొద్దిగా మత్తు

తాగిస్తున్నట్టుగా అవి గమ్మత్తుగా తనలోకి లాక్కుపోతాయి. ఇదే కథతో 'అంతేనా..? అంతే! అ అర్థంలేని జీవితానికి ఇంత కన్నా ఎక్కువనా! అంటాడు. కథ మొదలూ చివరా చదవకపోయినా ఈ వాక్యాలు చాలు. ఒక తాత్విక చింతనలోకి లాక్కుపోవడానికి 'నాకు నమ్మకంలేదు. సౌఖ్యం మీద' ఉన్నదొక్కటే సఖ్యం మీద' అని కథను ముగిస్తాడు. ఈ రెండు వాక్యాలే కథకు గుంభీరమైన ముగింపును ఇస్తాయి.

ఏదిఏమైనా సీతారాం మంచికథకుడు. గొప్ప శిల్పనైపుణ్యతను సాధించినవాడు. పరిణితి గల రచయిత. ఆత్మకథల్లాగే అతడూ సీదాసాదాగా, అప్పుడప్పుడు గంభీరంగా కనిపిస్తాడు. అతడు తెలంగాణ భాషను. నేపథ్యాన్ని, జీవితాన్ని సమర్థవంతంగా చిత్రించిన రచయిత. ఊరు ఊరంతా నిద్రపోయాక అర్థరాత్రి వాడవాడనూ కాపలాగాసిన గూర్ఖా. నిద్రపోయేముందు, ఎవరికీ కనిపించడు. నిద్రలేచాక ఎవరికీ కనపించడు. అతడి కథల కట్టె చప్పుడు మాత్రమే లీలగా వినిపిస్తుంటుంది. తెలంగాణా అస్థిత్వపు ఉనికి కోల్పోయినప్పుడు సీతారాం కనిపించడు. ప్రాంతీయ ముద్రతో అస్థిత్వం కోసం పోరాటాలు ముదిరినప్పుడు కనిపించడు. ఆ మధ్యకాలంలో ప్రజలమనిషిగా మమేకమై కనిపిస్తాడు.

ఇప్పుడు సీతారాం గురించి ఎంతచెప్పినా అది అర్థసత్యమే అవుతుంది. ఎందుకంటే ఆయను సంపూర్ణంగా అంచానావేసే చాలాకథలు అందుబాటులో లేవు. ఎనభైఐదు కథలు, రెండు నవలికల్లో కేవలం 14 కథలు మాత్రమే దొరికాయి. సగంలో సగమైనా దొరకని కథలలోని ఇంత విలక్షణమైన వైవిద్యం కనిపస్తుంటే పూర్తిస్థాయిలో కథలు లభ్యమైతే నిజంగా అవి సాహిత్యంలో తూనికరాళ్లవుతాయి. ఈ విషయంలో పత్తిపాక మోహన్ కృషి ప్రశంసనీయం. కాలగర్భంలో కలిసిపోనున్న రత్నాల్లాంటి కథలను వెలకితీసాడు. ఈ పుస్తకంతో అతడి బాధ్యత మరింత పెరిగింది. సీతారాంను పూర్తిస్థాయిలో పట్టి ఈతరం వారికి పరిచయం చేస్తే సాహితీలోకం అతడికి ఎంతో ఋణపడిఉంటుంది.



మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు గారితో గూడూరి సీతారాం, కె. శ్రీనివాస్, ముదిగంటి సుజాత రెడ్డి, ఉప్పల నరసింహం, బియస్. రాములు, ఆచార్య ముదిగంటి గోపాల్‌రెడ్డి గార్లు



డా. జి. లక్ష్మణరావు

అధ్యక్షులు, సాహితీ గౌతమి, కరీంనగర్

10-3-363, వివేకానందపురి, కరీంనగర్-1.

సీతారాం కథలు బతుకు పునాదులు

గూడూరి సీతారాం కథలకు యాభయ్యేళ్ళు. అప్పుడే దాదాపు ఎనభైకి పైగా కథలు రాశారు. ప్రముఖ దిన, వార, మాసపత్రికల్లో అచ్చయ్యాయి. తెలంగాణ ప్రాంతం నుండి కవులే కాదు కథకులు కూడా ఉన్నారని ఆ రోజుల్లో నిరూపించారు. ఆయన కథలది మా వయస్సు. ఇప్పుడు సీతారాం కథలు చదివితే మా ఊరు, మా చిన్నతనం, మా చుట్టుపక్కల బతుకులు, మా చదువులు, కొద్దిగా పట్నవాసపు వాసనలు గుర్తుకు వస్తున్నాయి. బహుశః తెలంగాణలో మా వయసులోని వారు ఎవరు చదివినా ఇవి తమ ఊరి కథలే అనుకుంటారు. ఇంతకీ ఈ కథల్లో ఒక పల్లెటూరి బతుకులు, మాటలు, పద్ధతులు, ఆచారాలు మొదలయినవి చూపడమేకాదు బతుకులకు పునాదులు కూడా చూపడం అసలు ప్రాణం.

జీవితాలెవరివయినా కష్టాలు, ఘర్షణలు, అవాంతరాలు ఎదురుకావడం ప్రధానంగా రెండు విషయాలపై ఆధారపడి ఉంటాయి. ఒకటి ప్రేమ. రెండవది ధనం. ఈ రెండూ జీవితాల్లో కొరవడినపుడు, ధనం కొరవడితే ప్రేమ ఆ వెలితిని నింపుతుంది. ప్రేమ కొరవడినపడు ధనం ఆ వెలితిని నింపదు కాని సర్దుబాటు జరిగే అవకాశాలుంటాయి. ధనం ఉండి ప్రేమలు లేనపుడు అంటే మానవ సంబంధాలు కొరవడినపుడు వ్యక్తులు, సమాజం వక్రమార్గాలు త్రొక్కే అవకాశాలు ఎక్కువ. సీతారాం తన పరిసరాలైన సిరిసిల్ల నుండి సిరిగల జీవితాలను, చిల్లలైన జీవితాలను, పారేమానేరు తీరునూ, ఊరిచెరువునూ, ఊరినుండి నాలుగుదిక్కులా సాగే దారులనూ ఈ కథల్లో చూపించారు. ఎక్కడా కృతకాలు కన కనిపించవు. ఊహలులేవు. కల్పనలు పగటికలలు, భ్రమలు అవాస్తవాలు లేవు.

ప్రేమలు, సంబంధాలు పునాదులుగా వెలసిన కథల్లోనుండి ప్రస్తుతం ఒక చిన్న సంపుటిని రూపొందించి కథా సాహిత్య చరిత్రలో ఒక అధ్యాయాన్ని మరుగున పడకుండా చూశారు మానేరు రచయితల సంఘం సిరిసిల్ల వారు. ఈ సంపుటిలో 14 కథలున్నాయి.

(ఈ పుస్తకం నాకు పంపిన తరువాత మరికొన్ని కథలు దొరికాయని డా. పత్తిపాక మోహన్ అన్నారు కాని ప్రస్తుతం వాటిని చూసే అవకాశం దొరకలేదు). రచయిత సీతారాం ఈ కాలం రచయితలవలె, కవులవలె అచ్చయిన వెంటే అపురూపంగా దాచుకునే అలవాటు ఉన్నవాడు కాదు. పైగా ఈ కథలవల్ల ఎనలేని కీర్తి ప్రతిష్ఠలు సంపాదించాలని, బిరుదులు పురస్కారాలు అందుకోవాలని ఆశించినవాడు కాదు. కనుక ఆయన రచనలు ఆయన దాచుకోలేదు. తన ఆలోచనలు, అనుభవాలు, తన రచనలు నలుగురికి పంచాలనుకోవడం తప్ప ఏదీ ఆశించినవాడు కాదు. ఇంత నిరపేక్షంగా ఉండడం తెలంగాణ ప్రాంతంలోని కవులకు, రచయితలకు ఇటీవలి వరకు ఉండేది. అందుకే ఎందరో గొప్ప కవులూ, రచయితలూ సాహిత్య చరిత్రలో మరుగున పడిపోయారు.

ఈ 14 కథల్లో ఇతివృత్తాలు ప్రధానంగా పల్లెటూళ్లలు చెందినవే. కొన్ని మాత్రం పట్టణాల్లో జరిగినట్లు అనిపించినా వాటి అంతర్యాల మూలాలు పల్లెటూళ్లనే పట్టిస్తాయి. యాభయేళ్ల క్రితం జరిగిన ఏ విషయం గురించి మాట్లాడినా అది ఇప్పటి వాళ్ళకు కథగానే అనిపిస్తుంది. కాని ఆనాడే కథగా చెప్పడం గొప్ప ప్రతిభ. అప్పటికి తెలుగు కథకు గొప్ప చరిత్రగాని, విస్తృతిగాని అంతగాలేవు. సీతారాం కూడ కథారచయితలమీద, రచనలమీద పరిశోధనలు చేసిన విద్యార్థి కాదు. ఆనాడు సీతారాం తెలంగాణ భావి కథారచనలకు అద్భుతమైన, సుస్థిరమైన పునాదులు వేశాడు. ఒక విధంగా ఉత్తమ సృజన తప్ప కాలక్షేపం కథలు పనికిరావనే నేపథ్యాన్ని తయారుచేశాడు. ఇప్పటికీ తెలంగాణ కథకులు ఈ పునాదులమీదనే కథల గూళ్లు నిర్మిస్తున్నారు.

రాజిరికానికిపోయి బంగారమసొంటి రాజి పనికిరాకుండా పోయినతీరు, చిన్నప్పుడు ఒకపూట చూపించిన ఆప్యాయతను మరచిపోని రంగని మనస్తత్వం, ఏదైనా చేసి సంపాదించాలని ఆ ప్రయత్నంలో ఎన్నో కష్టాలు, నష్టాలు ఎదుర్కొని ప్రేమలతో జీవితాన్ని జయించిన లచ్చి వంటి ఇల్లాలు జీవితం, ఎదుగుతూ పడుతూ చెట్టు ఎక్కిదిగినట్టుగా గడిపిన నారిగాని బతుకు, వలస భ్రమలో పడిపోకుండా ఆగిపోయిన మారాజు, ఇవన్నీ ఊడి చెరువు కడుపులోనుంచి పొంగిన అలలు. కట్టుమీద కనిపించే గలగలలు.

ఈ కథల్లో ప్రేమకు, దంపతుల అన్యోన్యతకు, కన్నతల్లిపైనా ఉన్న ఊరుపైనా వీడని మమకారానికి పెద్దపీట వేశారు. రాజి కథలో పై మెరుగులకు మోసపోయి భర్తకు దూరంగా వెళ్ళిపోయి జీవితం వ్యర్థం చేసికోవడం కనబడుతుంది. లచ్చి కథలో ఊరిమీద దొరికే తిండికి పరిమితం కాక పట్టణంలో రిక్షా త్రొక్కి సంపాదించాలనుకున్నా అక్కడా మోసపోయి-భార్యాభర్తల్లో మునుపటి ఆప్యాయత నశించి చివరికి రిక్షా సంపాదన మానుకుని ఆనంద బాష్పాల్లో తడిసిపోయారు. ఆ రోజుల్లో రిక్షా కూడా ఒక యంత్రం. సంపాదన నెపంతో పల్లెల్ల జీవితాలకు అదొక ఆశాయంత్రంగా కనిపించింది. యంత్రం జీవితంలో ప్రవేశించి క్రమంగా ప్రేమలను దూరంచేస్తుందనే సూచన ఆనాడే సీతారాం

ఈ కథలో వ్యంజింపజేశారు. ఇది సీతారాం దూరదృష్టి.

తెలంగాణ పోరాటాల్లో సాధారణంగా కనిపించే భూస్వాముల యజమానుల దౌష్ట్యాలు కాక ఒక దొరసాని ఒక పనివాణ్ని ఆదుకొని అమ్మవలె ఓదార్చి అన్నం పెట్టడం-అది ఎంతో ఎదిగిన రంగడు గుర్తు పెట్టుకుని ఆమె నొక్కసారి చూడాలని తాను వలసపోయిన దూరప్రాంతం నుండి రావడం అరుదైన విషయమే. ఇక్కడ అన్నం పెట్టిన తల్లినీ, తాను దూరమయినా తన చిన్నప్పటి ఊరు తల్లినీ మరువలేని మనసు ఆరాటం సీతారాం గొప్పగా చిత్రించాడు. నారిగాని బతుకు కథలో నారిగాడు బాగా సంపాదించడానికి, సమాజంలో గౌరవం పెరగడానికి తన కృషితోపాటు తన భార్య సహకారం ఎంతో చూపించారు. ఒకరు గాదు ముగ్గురు. మొదటి భార్య, మూడవభార్య సానుకూలురుకాగా రెండవ భార్య కేవలం అవకాశం కోసం చూసి డబ్బు ఎత్తుకొని మరొకడితో లేచిపోయిన మోసగత్తె. అయితే అనుకూలవతిగాని భార్యతో జీవితం భ్రష్టమయి, అనుకూలవతులయినపుడు సవ్యమయిన పార్శ్వాలు స్పష్టంగా కనబడతాయి. తన వృత్తి నిర్వహణలో భార్య పాలుపంచుకోవడం, కల్లుతాగడానికి వచ్చిన వాళ్ళకు వంచడం చేస్తున్న భార్యవల్ల తాను ఎదిగిపోవడం, బార్యతో ఆ పని మాన్పించిన తరువాత తాను బలహీనుడు కావడం కథలో స్పష్టంగా కనబడుతుంది. ఇక్కడ పల్లెల్లో ఏ వృత్తిలో ఉన్నా ఆలుమగలు పనిచేసినపుడే అభివృద్ధిలోకి వస్తారు అనే యథార్థం కనబడుతుంది.

ఇట్లా కథల్లో దాంపత్యంలో స్త్రీల ప్రాధాన్యతను పాత్రల చిత్రీకరణలోనే చూపారు.


ఈ పల్లెటూరి ఇతివృత్తాలతోపాటు మరికొన్ని కథలు ఎర్రపువ్వు, పెళ్ళీ-ప్రేమ, స్త్రీ స్వాతంత్ర్యం, అబ్బాయి-అమ్మాయి వంటి కథలు కొద్దిగా పట్టణజీవిత ప్రభావంతో నడిచినవి. వాటి రచనా విధానంలో, భాషలో ఆ ప్రభావం కనబడుతుంది. అప్పుడు సాధారణంగా పత్రికల్లో కనిపించే రచనల ధోరణి కూడా కనబడుతుంది. అయితే కొన్ని చిన్న వ్యాసం రాసినట్లుగా కొన్ని సిద్ధాంత గర్భితంగా, కొన్ని మనస్తత్వాలకు అద్దం పట్టినట్లుగా సాగినాయి. రచయిత మునిమాణిక్యం రచనలు చదివి ఉంటారు. అందుకే ఒక చోట మునిమాణిక్యం దృశ్యాలు గోడవతల కనిపించాయి అంటాడు. అండీ ప్రయోగాలు, కాఫీలు త్రాగటాలు ఇవన్నీ అప్పటి రచనల తీరును తలపిస్తున్నాయి.

పల్లెటూళ్ళ నేపథ్యంతో రాసిన కథల్లోని భాష అచ్చమైన అసలైన తెలంగాణ భాష. ఎంతమాత్రం కృతకం లేదు. పట్టి పట్టి తెలంగాణ మాటు ఇరికించినట్లు, అతికించినట్టు లేవు. అదొక ఊట కాలువ ఉరికినట్టు జలజలా సాగిపోతుంది. ఇప్పటి తెలంగాణ కథకులు కూడా ఇంత మంచి పల్లెభాషను, జీవభాషను రాయలేకపోతున్నారు. ఎన్నో జాతీయాలు, సామెతలు, నుడికారాలు అలవోకగా అతిసహజంగా దొర్లుతుంటాయి. పట్టన తెల్లారింది. ముత్తెమంత, మాసుకంత, మొదలయిన పదాలు పుట్టలు పుట్టలుగా కనబడతాయి. యియ్యరమయ్యర, గజ్జ గజ్జ, లబ్బలిబ్బ మొదలయిన వాడుకలు సందర్భోచితంగా వాడడం విశేషం. ఇంకా ఎన్నో ఆచారాలు, అలవాట్లు ఈ కథల్లో

మాటల్లో కన్పిస్తాయి. నిజానికి ఇప్పటి రచయితల కథల్లోని తెలంగాణ భాషలో ఇంత జీవం కనిపించదు. దానికి కారణం ఇప్పటి భాష బాగా మాసిపోయింది. దుమ్ము దులిపి అక్కడిదొకటి, ఇక్కడిదొకటి యాదికచ్చిందొకటి తెచ్చిపెట్టుడేకాని అసలు భాష ఈనాటి కథకుల్లో ఒదగడం లేదు. దానిక కారణం రచయితలు కాదు మారిన కాలం భాష.

మొత్తం కథలలో మరోకోణం నుంచి చూస్తే స్త్రీల జీవితాలు కనిపిస్తాయి. స్త్రీలు ఎన్నివిధాల ఆకర్షింపబడతారు, ఎన్నివిధాల ఆలంబనాలౌతారు అనే వైవిధ్యంతో చూపారు. ఈ దృక్పథంతో విశ్లేషించే అవకాశముంది.

సీతారాం కథ జీవన మూల్యాలను, మూలాలను చిత్రించిన కథలు. ఎక్కడా అనవసరమైన వర్ణలుగాని, అసందర్భ పదప్రయోగాలు గాని, పొద్దుబోగొట్టడానికి ముచ్చట్లుగాని లేవు. అందుకే ఆయన కథలు అవి తెలంగాణ బతుకులైనా ఏ ప్రాంతం వారి బతుకు పునాదుల మీద నిర్మించిన కథలు



నిజాం కళాశాల సారస్వత సంచిక సంపాదక మండలి: కూర్చున్నవారు యస్.వి. రామారావు, కె. రాఘునాథన్, శ్రీ కె.గోపాలకృష్ణారావు (ఆచార్యులు) శ్రీ రావాడ సత్యనారాయణ (ప్రిన్సిపాల్), గూడూరి సీతారాం (ముఖ్య సంపాదకుడు), డా.సి. నారాయణరెడ్డి (హితవరి), ప్రమీలా శాస్త్రి, నిల్చున్నవారు: యం.కృష్ణారెడ్డి, శ్రీరాములు, శ్యామ్‌సుందర్, టి. సుబ్బిరామిరెడ్డి(ప్రస్తుత కాంగ్రెస్ నాయకులు), పాండురంగ ప్రసాద్, కె.వై. రెడ్డి.



ఆడెపు నారాయణ

అధ్యక్షులు, సిరిసిల్ల సాహితీ సమితి, సిరిసిల్ల

ఆత్మీయాభినందనలు

గూడూరి సీతారాం కలంనుండి
జాలువారిన కథలు పసిడి కథలు
ఆటపాటల హనుమాజి పేటలో
కవుల గడ్డలో సినారె ఊరిలో సీతారాం పుట్టిండు
పెద్దవాగుకు అవాసిర్ బోయినప్పుడు
కసికెలేరుకుంటూ గవ్వలేరుకుంటు కథలు రాసిండు

సినారే కనపర్తి కయితలు రాత్తే
సీతారాం కథలు రాసిండు
వాళ్లు కవితలు రాశి పుస్తకాలు అచ్చుగొడితె
సీతారాం కథలు రాసి పత్రికలకు వంపిండు
పల్లెబాసలో తెలంగాణ యాసలో
'రాజమ్మ రాజీరీకం' గౌండ్ల నారిగాని మీద
లస్కుమీద కథలు రాసిండు
మూలవాగు ముచ్చట్లను ముల్లెగట్టుకొని
మానేరు ఒడ్డున మకాం బెట్టగానే
కథలన్ని అడుగున వడ్డయి
మల్ల ఇప్పుడు యాభై ఏండ్లకు
'మోహన'రూపం దాల్చి
పుస్తకంగా తయారయ్యి
బంగారు పండుగ జేసుకుంటుండు.

సీతారాం కలంనుండి జాలువారిన కథలు
పసిడి కథలు పల్లెకథలు సహజమైన కథలు
సాహితీ స్వర్ణోత్సవ వేళ
నా ఆత్మీయాభినందనలు

- ఆడెపు నారాయణ

వంగాల శంకర్‌రెడ్డి

కార్యనిర్వహణాధికారి & సంయుక్త కమీషనర్,
శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, వేములవాడ.

అభినందన

తొలితరం కథారచయిత శ్రీ గూడూరి సీతారాం గారు మా దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులుగా సేవలు అందించారు. మంచికి మారుపేరు. సేవాతత్పరతకు సహృదయత సౌమ్యాలకు నిదర్శనం అయిన సీతారాం గారు మళ్లీ మంచి రచనలు చేయాలి. తన కలంతో ఉత్తమ సాహితీ సృజన ఎల్లకాలం చేస్తూనే ఉండాలని ఆశిస్తున్నాను. వారికి భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కొరుకుంటూ..

సీతారాం గారి సాహితీ జీవిత స్వర్ణోత్సవ సందర్భంగా హృదయ పూర్వక అభినందనలు.

- వంగాల శంకర్‌రెడ్డి



డా. తిరుమల శ్రీనివాసాచార్యులు

అరవిందనిలయం
8-73, గౌతంనగర్ కాలనీ,
దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాదు-500060

'అభినందన సుమమాల'

మానుమాజీపేట పేటిలోని రవ్వగా
సిరిసిల్లా సిగలో కులికేటి పువ్వుగా
సీతారాం! తెలగాణా కథాశాలనే
వెలిగించితివయ్య ఆరిపోని దివ్వెగా

లక్ష్మమ్మకు లక్ష్మయ్యకు రాగఫలంగా
కౌసల్యాప్రణయమృదుల చలదనిలంగా
జీవనయానం చేసే ఓ సీతారాం!
స్నేహం పంచావు కుసుమ పరిమళంగా

మల్లెవంటి పల్లెవంటి మంచిమనసు నీది
పసిపాపని నవ్వులాంటి పసిడి నవ్వునీది
సీతారాం! ముసిరిన చీకట్లను తరిమేసి
దెసలను వెలిగించే చిరుదివ్వెచూపునీది

మట్టిని పుట్టిన పేదల మనస్సులను చూస్తివి
కన్నీటను మునిగిన పలుకతలను రాసేస్తివి
తెలంగాణ పల్లెబాసయాస సువాసనలను
సీతారాం! కథల పలుకు పలకున నింపేస్తివి

నీ కతలను చదవుతుంటె ఎవనిగుండె కరిగిపోదు?
'అబ్బా! ఏం రాసిండ'ని ఎవని మనసు పొంగిపోదు
అచ్చంగా మన పల్లెల లచ్చిని రాజమ్మలనూ
అక్షరాల నిల్పిన నీ లక్ష్యం రతనాల పాదు.

నీ ఆశయరూపం ఒక 'మారస'మై
నీ ఆదర్శమే 'కళాసాగర'మై
కొత్తకొత్త లేఖినులకు సీతారాం!
దారిచూపుతాయి కాంతిగోపురమై

నీ స్వాంతం మయూరమై నర్తించెనులే శివమై
నీ సాహితి మానేరై అలలెత్తెను అభినవమై
సీతారాం! నీ తపస్సు మహానంద మరందాలు
చిలికెను నీదు సాహితీ జీవిత స్వర్ణోత్సవమై

నా తలపును దారంగా చేశాను
నా పలుకుల పూలుగుచ్చివేశాను
వాడిపోని వన్నెపోని మాల ఇది!
సీతారాం! నీకోసం చేశాను

స్వర్ణోత్సవ నవ్యహేల
సరసంగా సాగువేళ
అందుకొమ్ము సీతారాం!
అభినందన సుమమాల

– డా. తిరుమల శ్రీనివాసాచార్య

కథానిలయం

కాళీపట్నం రామారావు

కథానిలయం,
గ్రామీణ బ్యాంకు 'ఏ' కాలనీ,
శ్రీకాకుళం-532001

అభినందనలు

డా. పత్తిపాక మోహన్ గారికి నమస్కారం,

తెలంగాణ తొలితరం కథకులు సర్వశ్రీ సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, వట్టికోట ఆళ్వారు స్వామి ప్రభృతుల సమకాలికులు శ్రీ గూడూరి సీతారాం గారి సాహితీ జీవిత స్వర్ణోత్సవం (1953-2003) సందర్భంగా వెలువరిస్తోన్న గూడూరి సీతారాం కథలకు, అభినందన సంచికకు తెలుగు కథాలోకం ఆహ్వానం పలుకుతోంది.


మాన్యశ్రీ గూడూరి సీతారాం గారికి, వారి కథలకు ఈ సందర్భంగా మా మనఃపూర్వక అభినందనలు తెలియజేసుకుంటున్నాను.

డెబ్బై ఏళ్ల పైబడిన సుదీర్ఘ జీవితానుభవంతో వారు చేయగల సాహితీ కృషికోసం తెలుగు పాఠకలోకం ఎదురుచూస్తూ ఉంటుంది.

- కాళీపట్నం రామారావు

డా. కోవెల సంపత్కుమారాచార్య, ఎం.ఎ.,పిహెచ్.డి.
రిటైర్డ్ ప్రొఫెసర్ (కాకతీయ యూనివర్శిటి)

సాహితీ, ప్లాట్ నం. ఎ-341, గ్రీన్ పార్క్ కాలనీ,
6వ రోడ్, సరూర్‌నగర్ ట్యాంక్ ఏరియా, హైదరాబాదు-500035,
ఫోన్ : 4071444



సీతారాం...తెలంగాణా రచయితల సంఘం... జ్ఞాపకాలు

సీతారాం, నేనూ ఇంచుమించు కాదు, సరిగ్గా 1953లోనే సాహిత్యరంగం మీదికి ప్రవేశించాం. రచనలారంభించాం. అందుకని మరొక విధంగా చెప్పితే ఇది నా సాహిత్య స్వర్ణోత్సవంగూడా కావచ్చు. ఇది అసలు రహస్యం-ప్రస్తుతం అది మర్యాదమాట కాదనటంలో ఇవాళ్ల 'ఒక' మర్యాదగా ఆయన్ను సీతారాంగారు అనటంతప్ప ఆయనతో నాకు యాభయ్యేళ్లనాడు కలిగిన పరిచయం, స్నేహంబట్టి, ఆయన నాకు సీతారాం, నేనాయనకు సంపత్‌ను. సి.నారాయణరెడ్డి గారు కూడా నన్ను నాటికీ, నేటికీ 'సంపత్' అనే అంటున్నా నా కవితల వెలువరింపులో నన్ను సంపత్కుమారగా నిబంధించింది సినారె. (ఈనాటి మర్యాద నారాయణరెడ్డి గారు అనటం. ఆనాడాయన సినారె). సీతారాం (గారి)తో నా పరిచయం యాభయ్యేళ్ల నాటిది. అయితే, ఆనాటి నుంచి ఈనాటి దాకా అవిచ్ఛిన్నంగా పెంపొందిందని చెప్పలేను. ఇంచుమించు ఆనాటికీ ఈనాటికీ మా పరిచయం/మైత్రి యాభయ్యేళ్ల కన్నా కొంచెం తక్కువవడం. ఈ సుదీర్ఘ మధ్యకాలంలో ఏ ఒకటి రెండు సందర్భాల్లోనో ఏ సభలలోనూ కలుసుకొని ఉంటాం. అప్పుడు 'వెనుకటి' విషయాలు కలబోసుకొని ఉత్సాహపడిఉంటాం.

'తెలంగాణా రచయితల సంఘం' (ఆ రోజుల్లో కొందరు అసూయాపరులు దీన్ని తెర సంఘం అని వెక్కిరించారు. తొలివార్షికోత్సవాలు 1953లో ఎంతో వైభవంగా హైదరాబాదులో కోఠి లాల్ మహల్ హోటల్ ఎదురుగా (ఆనాడు) ఉన్న పెద్ద మైదానంలో జరిగినయి. అతిథులకు మైసూర్ కేఫ్ (ప్రస్తుతం అది హైదరాబాదు యూనివర్సిటీ అధీనంలోకి వచ్చింది)లో వసతి ఏర్పాటు. అప్పుడు తెలంగాణేతర తెలుగు ప్రాంతం నుంచి శ్రీశ్రీ ఆరుద్ర, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి పుట్టపర్తి నారాయణాచార్య మొదలయిన వారు వచ్చారు. చివరి రోజున బ్రహ్మాండంగా కవి సమ్మేళనం జరిగింది. అందులో నేనూ పాల్గొన్నాను. అందులోనే సినారె 'నవ్వని పువ్వు' నృత్య సంగీత రూపకం గిడుతూరి సూర్యం అధ్వర్యంలో ప్రదర్శించబడింది. కవి సమ్మేళనం... వందలాదిమంది శ్రోతలు, పెద్దగోల. కాళోజీ అధ్యక్షుడు. పుట్టపర్తి కవితచదువటానికి వచ్చారు. పెద్దగొల. గోల చేస్తే తాను చదువనన్నాడు. ఆ మాటకు మరింతగోల. అప్పుడు ఆయన వెళ్లిపోయాడు. అప్పుడు కాళోజి శ్రోతలను తన ధోరణిలో కోప్పడి ఆయన గొప్పతనం చెప్పి ఆయన

చదివాక మీకు బాగనిపించకపోతే గోల చేయండి అని పుట్టపర్తిని సాదరంగా మళ్లీ తీసుకువచ్చాడు. అప్పుడు పుట్టపర్తి 'శివతాండవం' మొదలు పెట్టాడు. అంతే. సభలో జడీభూతమయింది. పిన్‌డ్రాప్ సైలెన్సు. ఆయన పూర్తిచేయగానే చప్పట్లు మిన్నంటినయి. అప్పుడక్కడ పొందిన ఆ అనుభవం ఎప్పటికీ మరువరానిది. ఇదంతా ఎందుకు ప్రస్తావిస్తున్నానంటే సినారెతో నా ప్రథమ పరిచయం ఆ సభల సందర్భంలోనే. ముఖ పరిచయమే అయినా అది ఎంతో ఆత్మీయమయింది.

నా తొలి ఉద్యోగపురోజులవి. సిద్దిపేటలో మూడు నెలలుండగా భోనగిరికి చేబదలా అయ్యాను. సినారెతోటి పరిచయంతో హైదరాబాదుకు వస్తూండేవాడిని. ఆయన ఆరోజుల్లో ఈనాటి ఓల్డ్ ఎం.ఎల్.ఎ. క్వార్టర్స్‌లో బహుశః అది కె.వి. నారాయణరెడ్డి క్వార్టరని ఒక గుర్తు. అందుకని హైదరాబాదుకు వచ్చినప్పుడల్లా అదే నా వసతి. అక్కడే నా భోజనం. సీతారాంతో విరివిగా నా కలిమిడి కూడా అక్కడే. నాకు స్మృతి పథంలో ఆనాడు చువ్వలాగా ఉండే రూపమే తిరుగాడుతుందిప్పటికీ. చాలా ఏండ్ల తరువాత మేం కలుసుకున్నప్పుడు ఆయన రూపంలో మార్పు వచ్చిందిగాని, ఆయన మనస్సులో, ఆప్యాయతలో మార్పురాలేదని తెలిసింది. మొదట ఆయన్ను గుర్తించలేకపోయాను. ఈయన సీతారామేనా అనిపించింది. రూపంలో ఎంతమార్పు! మోహన్ వెలువరించిన ఆయన కథల సంకలనం చివరిపుటమీద ఆ కుంకుమ బొట్టుతో కన్పించే వ్యక్తి అప్పటి సీతారాం కాదు. నేను మాత్ర ం అప్పటి సంపత్ నేనా? ఆ నాళ్లలో నా ఉంగరాల జుట్టును, బక్కపలుచగా ఉండటాన్ని బట్టి కొందరు నన్ను సినారె తమ్ముడని భ్రమపడ్డారు. నిజానికి అది ఒకవిధంగా భ్రమ. ఒకవిధంగా కాదు. ఇవాళ్ల అప్పటిలాగా ఎవరయినా నన్ననుకోగలరా? సినారేలో మాత్రం ఎంతమార్పు రాలేదు! నిజానికి శారీరకమయిన మార్పు వయో లక్ష్మణం. మనస్సులు అప్పటికన్నా ఎంతో పరిపక్వమయినయి.

సీతారాంతో వెనుకటివి కలబోసుకొన్నప్పుడు-ఆ క్వార్టర్‌లో మేమంతా కలిసి భోజనం చేయటం, కవులను కవిత్వాలను గూర్చి సీరియస్ గానూ, ఆత్మీయంగానూ, వినోదంగానూ ఎన్నో విషయాలను గూర్చి మాట్లాడుకోవటం, 'సెవన్ ఇయర్స్ ఇచ్' వంటి ఇంగ్లీషు మ్యాట్నీలు చూడటం, రిక్షాల్లో తిరుగటం-మద్రాసు కవుల సంగతులు మాట్లాడుకోవటం-ఎన్నో ఎన్నో. ఆ క్వార్టర్‌లో కూర్చొని 'స్రవంతి' పత్రిక కోసం (దాని సంపాదక వర్గంలో సినారె ఒకరు) అయాచితుల హనుమచ్ఛాస్త్రి హిందీ సాహిత్య చరిత్ర గ్రంథాన్ని సమీక్ష రాసియ్యటం.. ఇట్లా ఎన్నో...ఇప్పుడు సీతారాం కథలు చదువుతుంటే కొన్నింటిలో 'అంబరాలు చుంబించటం' అనే ఫ్రేజ్ కన్పిస్తుంది. అది ఆనాటి సినారె ఒక కవితారంభం, 'అంబరాల చుంబించే, అంతరాల స్పర్శించే, జలధరాల అధరాంచల చలదింద్ర ధనుర్విచిత్ర హాసం ప్రతిబింబించే గీతం రాయాలి గీతం' అంటూ ఆ కవిత మొదలయితుంది. ఆ తరువాత ఆ గీతమే 'విశ్వగీతి' అనే ఒక దీర్ఘ 'కావ్యం'గా వెలువడింది. ఆ కావ్యాన్ని తెలంగాణేతరు డొకాయన దండగ్గా 'విమర్శిం'చాడు. నేను 'సమాధానం' రాసాను. అది 'గోలకొండ పత్రిక'లో ప్రచురింప జేయబడింది. బహుశః అట్లాంటి వాటిల్లో

నాది తొలి 'వ్యాసం' అనుకుంటాను. (అంతకుముందే అట్లాంటి వ్యాసం (?) కృష్ణా పత్రికలో వచ్చిందని గుర్తు). అదంతా వేరే విషయం. అదంతా ఎట్లా ఉన్నా 'అంబరాల...' అప్పటికీ నాకు గుర్తున్న సినారె కవిత. ఆ పదబంధం. ఈ కథల్లో కన్పించేటప్పటికి ఇదంతా నాకు గుర్తుకచ్చింది.

1948 సెప్టెంబరు తరువాతిది తెలంగాణా తొలితరం అనుకునేట్టయితే సీతారాం, కనపర్తి, వేముగంటి, సుప్రసన్న మొదలయిన వారంతా తెలంగాణా తొలితరం రచయితలే. విముక్త తెలంగాణం తొలితరం అనటం మరింత సమంజసంగా ఉంటుందనుకుంటాను. మా కొందరి రచనలు నాటికి నేటికి చాలానే వచ్చాయి. కానీ సీతారాం రచనలు ఇంతవరకు రాలేదు. ఇప్పటికయినా సీతారాం కథలు ఒక సంకలనంగా వెలువరించటం అభినందించదగిన అంశం.

ఆ రోజుల్లో తెలంగాణా మాండలికంలోనే కథలు రాయాలన్న 'నిష్ఠ' ఉండినట్టనిపించదు. కవితలు, వ్యాసాల వంటి వాటిలో అసలున్నట్టు లేదు. సీతారాం కథల్లో మాండలిక (భాషా) కథల కన్నా కానిదే ఎక్కువనిపిస్తుంది. ఈ రెండు విధాల కథల్లోనూ ఆనాటి మా మనస్సులలోని అమాయకత, ప్రేమభావన, పల్లెప్రేమ వంటి వాటితో బాటు కొన్ని వాస్తవాలు నేరుగా కథలయినవి కూడా ఉన్నాయి. ఎర్రని పువ్వవంటి గల్పికలు గూడా ఉన్నయి. పెళ్లి-ప్రేమ వంటివి ఊహా వైఫల్యచిత్రంలాగా అనిపిస్తుంది. రంగడు, లచ్చివంటి కథలు విలక్షణమయినయి. రాజమ్మ రాజీరికం వాస్తవమయిన 'కథ' అనుకుంటాను. ఈ కథలన్నీ మాండలికాలయినా, అ మాండలికాలయినా తెలంగాణా 'పలుకుబడి' విరివిగా ఉండటం గుర్తించవలసిన అంశమనిపిస్తుంది. కథావస్తు విషయంగా ఆనాటి ఆలోచనలకీ, ఈనాటి ఆలోచనలకీ చాలా తేడా ఉంది. ఇది ప్రత్యేకం విశదీకరించుకోవలసిన అంశం. 1955 తరువాత సీతారాం 'కథలు' రాయటం మానివేసాడో తెలియదుకాని, రాసిఉంటే కరీంనగరం ఆలోచనా పరిణామ క్రమం కొంత తెలిసి వచ్చేదనుకుంటాను. ఈనాడు 'తెలంగాణా కథలు రాస్తున్నవారి 'ఆనాటి' వారు కారు. 'ఆనాటి' వీరు రాయటం ఆపేసారు. అందుకని క్రమపరిణామరీతిని అనుశీలించటానకి మరో ఆధారాలకు సంపాదించుకోవలసి ఉంటుందనుకుంటును.

ప్రస్తుతం వ్యాసం రాసే పరిస్థితిలో నేను లేనని మీకు తెలుపుకుందామని మొదలు పెట్టిన ఈ ఉత్తరం దారిలోనో, తప్పిన దారిలోనో ఇట్లాసాగింది. బహుశః ఇది సీతారాంను నా ఎదుట నిలబెట్టటం కలిగించిన ప్రేరణ అయి ఉంటుందనుకుంటున్నాను.

ఏదేమయినా ఆనాటి నా మనస్సును పునర్జాగృతం చేసి ఈనాటికి ఈ జ్ఞాపకాలు బయటికి లాగినందుకు, ఆ విధంగా ఒక విధమయిన 'హాయి' నాకు కలిగించినందుకు పత్తిపాక మోహన్‌కు సీతారాంకూ నా మనః పూర్వకమయిన అభినందనలు.

– కోవెల సంపత్‌కుమారాచర్య, ఎం.ఎ.,పిహెచ్.డి.

సంగిశెట్టి శ్రీనివాస్
14-11-1130, బీర్పన్‌బాగ్,
బేగం బజార్, హైదరాబాద్-12.

ఆయన యాది తెలంగాణ సమాచార నిధి

ఎన్కటి సంది సాహిత్య రంగంలో తెలంగాణకు వొల్లంత సేవ చేసిన బోలెడు మంది ఇప్పటోళ్ళ కెవ్వర్కీ తెల్వకుంట వోయింగ్రు. తెలంగాణోళ్ళకు తెలుగే రాదని, తెలివి లేనోళ్ళనీ, సైసకుండ ఆంధ్రపత్రికలు, సాహిత్యకారులు నామ్, నిషానీ మిఠాయించింగ్రు. ఇక్కడోళ్ళ ఆస్తిత్వాన్ని రద్దు చేసింగ్రు. ఉనికిని గుర్తించలేదు. ఊపిరున్నా లేనోళ్ళ కిందనే జమచేశింగ్రు.

అన్నింట్ల దగాపడ్డ తెలంగాణ తన మూలాల్ని తాను వెతుక్కుంటున్న దశలో దొరికిన తీగే గూడూరి సీతారాం. ఈ బంగారు తీగెను సాగదీస్తే మరుగునపడ్డ తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్రను నగిషీలు చెక్కి ధగ ధగ మెరిపించొచ్చు. అందర్నీ మెప్పించొచ్చు. స్వయంగా కవి, కథకుడు, నవలాకారుడు, నాటకరచయిత అయిన సీతారాం ఆదినుంచి తెలంగాణ నుడికారంలో రాస్తూ, తాను పుట్టిన గడ్డకు చేసిన సేవ మరవలేనిది. సాహితీ రంగంతో పాటు సహకార రంగంలో కూడా ఆయనది అందె వేసిన చేయి. తెలంగాణ జానపదాలు, గేయాలు మరుగున పడకుండా రికార్డు చేసి ఇక్కడి మట్టి వాసనను పట్టిచ్చిన పల్లెమనిషి. నిన్నటి తరానికి నేటి తరానికి వారధిగా నిలిచిన సీతారాంతో మాట్లాడితే చాలు ఎన్కటోళ్ళ అనెక్‌డోట్స్ జాలువారుతాయి. 50 ఏండ్ల ఆయన సాహితీ యాది మనందర్కి కావాల్సిన సమాచార నిధి. పోయి తెచ్చుకున్న తెలంగాణ పైథాన్లు, సైతాన్లు మింగిన తమ సాహిత్యాన్ని మతికి తీసుకొస్తుంది.

1952-53లో హైదరాబాదులో దాశరథి కృష్ణమాచార్య, వట్టికోట ఆళ్వారుస్వామి, బిరుదురాజు రామరాజు, కాళోజి నారాయణరావు తదితరులు 'తెలంగాణ రచయితల సంఘం' ఏర్పాటు చేసింగ్రు. ఈ సంఘం తరపున 'మంజీర' అనే సాహిత్య సంచికను వెలువరించడమే గాకుండా 'ఉదయ ఘంటలు' అనే కవితా సంకలనాన్ని కూడా ప్రకటించారు. ఆళ్వారు స్వామి, దాశరథి, బిరుదురాజు, పల్లా దుర్గయ్య, సి. నారాయణరెడ్డి

అంతా ఆ కాలంలో నారాయణగూడాలో ఒకే ఆవరణలో నివాసముండేవారు. వీరితోపాటే నివాసముండి, వారితో కలిసి మెలిసి తిరిగిన గూడూరి సీతారాం 1953లో 'తెలంగాణ రచయితల సంఘం' సిరిసిల్ల శాఖను ఏర్పాటు చేసిండు. అప్పటికీ 'తె.ర.సం.'కు మరెక్కడా శాఖలు లేవు. ఇదే మొదటిది. కనపర్తి లక్ష్మీనరసయ్య, గూడూరి శంకరంలతో కలిసి ఏర్పాటు చేసిన ఈ శాఖ ఆనాడు సిరిసిల్ల ప్రాంతంలో, కరీంనగర్ జిల్లాలో చేసిన విశేషమైన కృషి ఎన్నదగింది. మాడపాటి హనుమంతరావు, జి. రాములు, సురమౌళిల అండదండలతో సాగిన ఈ ఉద్యమంలో భాగంగా 'నినాదం' అనే సాహిత్య సంచికను వెలువరించాడు.

సిరిసిల్ల మట్టిలోనే ఉద్యమం, సాహిత్యం కలుపుకొని ఉన్నాయనిపిస్తుంది. మాడపాటి హనుమంతరావు అధ్యక్షతన 1935 చివర్లో జరిగిన నాలుగో ఆంధ్రమహాసభ మొదలు సిరిసిల్ల, జగిత్యాల జైత్రయాత్రల వరకు ఈ ప్రాంతం ఎన్నో ఉద్యమాలకు ఊపిరులూదింది. మరెందరో సాహితీకారులకు జీవం పోసింది. తెలంగాణ రచయితల సంఘం నుంచి నేటి మానేరు రచయితల సంఘంతో తెలంగాణ సాహితీ రంగంలో తనకంటూ ఒక స్థానాన్ని ఏర్పర్చుకున్న గూడూరి సీతారాం గురించి ఎంత చెప్పినా తక్కువే. స్కూల్ స్థాయిలోనే సాహిత్యం పట్ల అభిరుచి ఏర్పర్చుకుని సిరిసిల్ల పాఠశాల తరపున 'తరంగిణి' (1954) అనే పత్రికను వెలువరించాడు. అలాగే 1954లోనే వెలువరించిన నినాదం ప్రత్యేక సంచిక తెలంగాణలో ముఖ్యంగా కరీంనగర్ జిల్లాలో వెల్లివిరుస్తున్న సాహితీ ప్రతిభను వెలికి తీసుకొచ్చింది. వట్టికోట, సి. నారాయణరెడ్డి లాంటి పెద్దల రచనలే గాకుండా గూడూరి, కనపర్తి, టి. రంగాచార్యులు లాంటి వారు తెలంగాణ ఆస్తిత్వాన్ని తమ రచనల ద్వారా పట్టించారు. అలాగే ఆర్. అనంతరావు వకీల్, టి. నరసింహాచార్యులు, జి.ఆర్. నర్సయ్య, సి. భూమయ్య, మునుగోటి కృష్ణమూర్తి తదితరుల ప్రోత్సహంతో తన మిత్రుడు కనపర్తి లక్ష్మీనరసయ్యతో కలిసి 'మెఱుపు తీగెలు' గేయ సంపుటిని వెలువరించాడు. విద్యార్థి దశలోనే ఒక గేయ సంపుటిని వెలువరించడం అంటే మాటలు కావు. ఈ సంపుటిలో జె. వెంకటరామారావు, కనపర్తి, ఎం. రాంరావు, జి. జ్ఞానానందం, ఆరె మాధవరావు, ఎం. నర్సింహాచారి, జి. రాజనరసయ్య, యు.వి. నరసింహారెడ్డి, కె. మల్లయ్య తదితరుల కవితలు చోటు చేసుకున్నాయి. అలాగే గూడూరి కవిత 'పగిలిన దీపం' కూడా చోటు చేసుకుంది.

జానపద గేయ వాఙ్మయానికి గూడూరి చేసిన సేవ పూర్తిగా విస్మరణకు గురయింది. 1954-60 సంవత్సరాల మధ్యకాలంలో సిరిసిల్ల, హనుమాజిపేట చుట్టుపక్కల ఊళ్ళు తిరిగి సేకరించిన జానపద వాఙ్మయం బిరుదురాజు రామరాజు పరిశోధనకు ఎంతగానో ఉపయోగ పడింది. ఆ తర్వాత బిరుదురాజు వెలువరించిన 'త్రివేణి' సంపుటిలో కొన్ని గేయాలు చోటుచేసుకున్నాయి. అయితే వందలు, వేలసంఖ్యలో హాబీగా, అదే యావగా వట్టికోట, బిరుదురాజు, నేదుమారిల ప్రభావంతో సేకరించిన గేయాలు పుస్తక రూపం దాల్చక పోవడంతో చాలా వరకు తెరమరుగయ్యాయి. టేప్‌రికార్డులేని కాలంలో పంటపొలాల్లో, బుక్కూ, పెన్నూ పట్టుకొని ఊరివారి నుంచి సేకరించిన ఈ జానపద

సంగిశెట్టి శ్రీనివాస్
14-11-1130, బీర్బన్‌బాగ్,
బేగం బజార్, హైదరాబాద్-12.

ఆయన యాది తెలంగాణ సమాచార నిధి

ఎన్కటి సంది సాహిత్య రంగంలో తెలంగాణకు వొల్లంత సేవ చేసిన బోలెడు మంది ఇప్పటోళ్ళ కెవ్వర్కీ తెల్వకుంట వోయింద్రు. తెలంగాణోళ్ళకు తెలుగే రాదని, తెలివి లేనోళ్ళనీ, సైసకుండ ఆంధ్రపత్రికలు, సాహిత్యకారులు నామ్, నిషానీ మిటాయించింద్రు. ఇక్కడోళ్ళ ఆస్తిత్వాన్ని రద్దు చేసింద్రు. ఉనికిని గుర్తించలేదు. ఊపిరున్నా లేనోళ్ళ కిందనే జమచేశింద్రు.

అన్నింట్ల దగాపడ్డ తెలంగాణ తన మూలాల్ని తాను వెతుక్కుంటున్న దశలో దొరికిన తీగే గూడూరి సీతారాం. ఈ బంగారు తీగెను సాగదీస్తే మరుగునపడ్డ తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్రను నగిషీలు చెక్కి ధగ ధగ మెరిపించొచ్చు. అందర్నీ మెప్పించొచ్చు. స్వయంగా కవి, కథకుడు, నవలాకారుడు, నాటకరచయిత అయిన సీతారాం ఆదినుంచి తెలంగాణ నుడికారంలో రాస్తూ, తాను పుట్టిన గడ్డకు చేసిన సేవ మరవలేనిది. సాహితీ రంగంతో పాటు సహకార రంగంలో కూడా ఆయనది అందె వేసిన చేయి. తెలంగాణ జానపదాలు, గేయాలు మరుగున పడకుండా రికార్డు చేసి ఇక్కడి మట్టి వాసనను పట్టిచ్చిన పల్లెమనిషి. నిన్నటి తరానికి నేటి తరానికి వారధిగా నిలిచిన సీతారాంతో మాట్లాడితే చాలు ఎన్కటోళ్ళ అనెక్‌డోట్స్ జాలువారుతాయి. 50 ఏండ్ల ఆయన సాహితీ యాది మనందర్కి కావాల్సిన సమాచార నిధి. పోయి తెచ్చుకున్న తెలంగాణ పైథాన్లు, సైతాన్లు మింగిన తమ సాహిత్యాన్ని మతికి తీసుకొస్తుంది.

1952-53లో హైదరాబాదులో దాశరథి కృష్ణమాచార్య, వట్టికోట ఆళ్వారుస్వామి, బిరుదురాజు రామరాజు, కాళోజి నారాయణరావు తదితరులు 'తెలంగాణ రచయితల సంఘం' ఏర్పాటు చేసింద్రు. ఈ సంఘం తరపున 'మంజీర' అనే సాహిత్య సంచికను వెలువరించడమే గాకుండా 'ఉదయ ఘంటలు' అనే కవితా సంకలనాన్ని కూడా ప్రకటించారు. ఆళ్వారు స్వామి, దాశరథి, బిరుదురాజు, పల్లా దుర్గయ్య, సి. నారాయణరెడ్డి

అంతా ఆ కాలంలో నారాయణగూడాలో ఒకే ఆవరణలో నివాసముండేవారు. వీరితోపాటే నివాసముండి, వారితో కలిసి మెలిసి తిరిగిన గూడూరి సీతారాం 1953లో 'తెలంగాణ రచయితల సంఘం' సిరిసిల్ల శాఖను ఏర్పాటు చేసిండు. అప్పటికీ 'తె.ర.సం.'కు మరెక్కడా శాఖలు లేవు. ఇదే మొదటిది. కనపర్తి లక్ష్మీనరసయ్య, గూడూరి శంకరంలతో కలిసి ఏర్పాటు చేసిన ఈ శాఖ ఆనాడు సిరిసిల్ల ప్రాంతంలో, కరీంనగర్ జిల్లాలో చేసిన విశేషమైన కృషి ఎన్నదగింది. మాడపాటి హనుమంతరావు, జి. రాములు, సురమౌళిల అండదండలతో సాగిన ఈ ఉద్యమంలో భాగంగా 'నినాదం' అనే సాహిత్య సంచికను వెలువరించాడు.

సిరిసిల్ల మట్టిలోనే ఉద్యమం, సాహిత్యం కలుపుకొని ఉన్నాయనిపిస్తుంది. మాడపాటి హనుమంతరావు అధ్యక్షతన 1935 చివర్లో జరిగిన నాలుగో ఆంధ్రమహాసభ మొదలు సిరిసిల్ల, జగిత్యాల జైత్రయాత్రల వరకు ఈ ప్రాంతం ఎన్నో ఉద్యమాలకు ఊపిరులూదింది. మరెందరో సాహితీకారులకు జీవం పోసింది. తెలంగాణ రచయితల సంఘం నుంచి నేటి మానేరు రచయితల సంఘంతో తెలంగాణ సాహితీ రంగంలో తనకంటూ ఒక స్థానాన్ని ఏర్పర్చుకున్న గూడూరి సీతారాం గురించి ఎంత చెప్పినా తక్కువే. స్కూల్ స్థాయిలోనే సాహిత్యం పట్ల అభిరుచి ఏర్పర్చుకుని సిరిసిల్ల పాఠశాల తరపున 'తరంగిణి' (1954) అనే పత్రికను వెలువరించాడు. అలాగే 1954లోనే వెలువరించిన నినాదం ప్రత్యేక సంచిక తెలంగాణలో ముఖ్యంగా కరీంనగర్ జిల్లాలో వెల్లివిరుస్తున్న సాహితీ ప్రతిభను వెలికి తీసుకొచ్చింది. వట్టికోట, సి. నారాయణరెడ్డి లాంటి పెద్దల రచనలే గాకుండా గూడూరి, కనపర్తి, టి. రంగాచార్యులు లాంటి వారు తెలంగాణ ఆస్తిత్వాన్ని తమ రచనల ద్వారా పట్టించారు. అలాగే ఆర్. అనంతరావు వకీల్, టి. నరసింహాచార్యులు, జి.ఆర్. నర్సయ్య, సి. భూమయ్య, మునుగోటి కృష్ణమూర్తి తదితరుల ప్రోత్సహంతో తన మిత్రుడు కనపర్తి లక్ష్మీనరసయ్యతో కలిసి 'మెఋపు తీగెలు' గేయ సంపుటిని వెలువరించాడు. విద్యార్థి దశలోనే ఒక గేయ సంపుటిని వెలువరించడం అంటే మాటలు కావు. ఈ సంపుటిలో జె. వెంకటరామారావు, కనపర్తి, ఎం. రాంరావు, జి. జ్ఞానానందం, ఆరె మాధవరావు, ఎం. నర్సింహాచారి, జి. రాజనరసయ్య, యు.వి. నరసింహారెడ్డి, కె. మల్లయ్య తదితరుల కవితలు చోటు చేసుకున్నాయి. అలాగే గూడూరి కవిత 'పగిలిన దీపం' కూడా చోటు చేసుకుంది.

జానపద గేయ వాఙ్మయానికి గూడూరి చేసిన సేవ పూర్తిగా విస్మరణకు గురయింది. 1954-60 సంవత్సరాల మధ్యకాలంలో సిరిసిల్ల, హనుమాజిపేట చుట్టుపక్కల ఊళ్ళు తిరిగి సేకరించిన జానపద వాఙ్మయం బిరుదురాజు రామరాజు పరిశోధనకు ఎంతగానో ఉపయోగ పడింది. ఆ తర్వాత బిరుదురాజు వెలువరించిన 'త్రివేణి' సంపుటిలో కొన్ని గేయాలు చోటుచేసుకున్నాయి. అయితే వందలు, వేలసంఖ్యలో హాబీగా, అదే యావగా వట్టికోట, బిరుదురాజు, నేదుమారిల ప్రభావంతో సేకరించిన గేయాలు పుస్తక రూపం దాల్చక పోవడంతో చాలా వరకు తెరమరుగయ్యాయి. టేప్‌రికార్డులేని కాలంలో పంటపొలాల్లో, బుక్కూ, పెన్నూ పట్టుకొని ఊరివారి నుంచి సేకరించిన ఈ జానపద

గీతాలు చాలా వరకు తర్వాతి కాలంలో సినిమా పాటలుగా రూపాంతరం చెందాయి.

'రామచంద్రులు', 'స్త్రీ స్వాతంత్ర్యం' లాంటి నాటికలు, 'పాత-కొత్తలు' లాంటి నవలికలు, 80కి పైగా కథలు రాసిన గూడూరికి 'ఆంధ్ర' సాహిత్యంలో తగినంత గుర్తింపు రాలేదు. 1954-ఫిబ్రవరి నాటి సారస్వత జ్యోతిలో వెలువరించిన వివరణాత్మకమైన 'నాగొడవ' సమీక్షతో తెలుగు సాహిత్య రంగంలోకి అడుగిడిన గూడూరి అన్ని ప్రక్రియల్లో తన ప్రతిభను ప్రదర్శించాడు. తాను రాసిన కథలను తెలంగాణ సోయి అధికమైన ప్రస్తుత తరుణంలో ప్రచురించాలని ప్రయత్నిస్తే 16 కథలకంటే ఎక్కువ దొరకలేదు. ప్రజామత, తెలుగుదేశం పత్రికల్లో వెలువడ్డ కథలు దొరకలేదు. పాత కథల వెతుకులాట వెతలు తెలంగాణ వాళ్ళకే ఎక్కువ. ఆంధ్రప్రాంత కథకుల కథలు చాలా వరకు పుస్తక రూపంలో రావడమో లేదా, కథకులు, లేదా వారి సంబంధీకులు జాగ్రత్త చేయడం జరిగింది. కానీ తెలంగాణాలో అలా జరగలేదు. ప్రస్తుతం తెలంగాణ కథానిధిని పరిరక్షించే కార్యక్రమంలో వరుసగా పాత తరం నాటి కథలు పుస్తక రూపంలో వెలువరించడం జరుగుతోంది. మరుగున పడ్డ తొలితరం తెలంగాణ కథకుల్లో ఒకరైన గూడూరి గురించి ఈ తరానికి తెలియజెప్పాల్సిన అవసరముంది. తెలంగాణ భాషలో కథలు రాసిన తొలి కథకుల్లో ఒకరైన సీతారాం చరిత్రను రికార్డు చేయాల్సిన అవసరముంది. ఆయన కథలు రాసిన కాలం నాటి సమాజం గురించి, హైదరాబాదు-సిరిసిల్లల మధ్య ఏర్పడ్డ సాన్నిహిత్యం, సాహజత్యం గురించి తెలులుసకోవాలి.

నిష్కల్మషుడు, నిర్మల హృదయుడు, నిరాడంబరుడైన గూడూరి సీతారాం లాంటి వ్యక్తులు ఈ కాలంలో చాలా అరుదు. తన కలుపుగోలు తనంతో బెట్టు చేప్పేవాన్ని కూడా ఓ మెట్టుదించే 'కాక' పంచెకట్టు, బొట్టు, ఆయన బట్టల్లాగే తెలంగాణ స్వచ్ఛతను 'తెలుపు'తాయి. వట్టికోట ఆళ్వారుస్వామి మొదలు ఈనాటి పత్తిపాక మోహన్ వరకు అనేక మంది సాహితీవేత్తలతో ఆయనకు గల సాన్నిహిత్యాన్ని రికార్డు చేసి చరిత్రను పరిపుష్ఠం చేసుకోవాలి.

- సంగిశెట్టి శ్రీనివాస్

బి.ఎస్. రాములు
విశాల సాహితి
2-2-647/ఎ/57, సాయిబాబానగర్,
హైదరాబాద్-35.



గూడూరి సీతారాం సాహిత్యంలో సమాజ చిత్రణ

1

స్వాతంత్ర్యానంతర తెలంగాణ తొలితరం కథకుడు :

గూడూరి సీతారాంగారి జీవితం, సాహిత్యం స్వాతంత్ర్యానంతరం ఎదిగిన తెలంగాణ జీవితాలకు ఒక ప్రతీక. ఆనాటి పల్లెటూరి బతుకు నుండి బయల్దేరి నగర జీవితందాకా ఎదిగిన ప్రస్థానాలకు గూడూరి సీతారాంగారి జీవితం, సాహిత్యం ఒక సజీవ సాక్ష్యం.

తెలుగు ప్రేంచంద్ గూడూరి సీతారాం :

స్వాతంత్ర్యానంతర తెలంగాణ తొలి కథలకు దిక్సూచి గూడూరి సీతారాం. డా॥ సి. నారాయణరెడ్డిగారు తెలుగు కవిత్వానికి 50 ఏళ్ళ నిలువెత్తు సంతకంగా ఒక ప్రతీక. గూడూరి సీతారాంగారు ఇప్పుడు తన కథల పుస్తకంద్వారా తెలంగాణా కథాసాహిత్యానికి 50 ఏళ్ళ నాటి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. గురజాడ కథల సంపుటికన్నా ఎక్కువ కథలతో ఎక్కువ సమకాలీనతతో వీరి కథలు ఉండడం ఆసక్తిని కలిగిస్తుంది. తెలంగాణ కథాసాహిత్యంలో పేదకులాల జీవితాలను, భాషను అక్షరబద్ధంచేసి వస్తు వైవిధ్యంలోను, సజీవ భాష చిత్రణలోను గూడూరి సీతారాం ఒక విప్లవ పరిణామం.

రష్యాలో ఒక చెహోవ్. భారతదేశంలో ఒక ప్రేంచంద్, తెలంగాణాలో ఒక గూడూరి సీతారాం. తెలుగు సాహిత్యంలో ఒక గురజాడ, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, ఒక మా.గోఖలే, ఒక చాసో, ఒక వట్టికోట ఆళ్వారుస్వామి, ఒక సురవరం ప్రతాపరెడ్డి ఎవరికి వారు మహనీయులు. అలాగే తెలంగాణా అధ్యాయానికి గూడూరి సీతారాం ఒక ప్రతినిధి.

తెలంగాణా సాహిత్యంలో గూడూరి సీతారాం ఒక విప్లవం :

తెలంగాణ భాషలో బడుగువర్గాల జీవితాల గురించి కథలు రాసిన తెలుగు కథకుడు గూడూరి సీతారాం. దస్త్రమ్ అనే పుస్తకంలో సంగిశెట్టి శ్రీనివాస్ 1910 నుండి 1956 వరకు వివిధ పత్రికలలో పుస్తకాల్లో అచ్చయిన తెలంగాణ రచయితల కథలను దొరికినమేరకు 850 కథలు, కథల పట్టికను, రచయితల వివరాలను, ఇతర విశేషాలను అందించారు. స్వాతంత్ర్యానంతరం తెలంగాణ భాషలో కథలు రాసిన తెలంగాణ కథాసాహిత్య విప్లవ పరిణామానికి ఆద్యుడు గూడూరి సీతారాం.

బ్రిటిషాంధ్ర భాష ఆధిక్యత పెరిగిన క్రమం :

1953 నుండి గూడూరి సీతారాంగారు కరీంనగర్ జిల్లాకు చెందిన తెలంగాణ భాషలో కథలు రాయడం ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగిస్తుంది. 1953 నాటికి బ్రిటిషాంధ్ర భాష పెత్తనం తెలంగాణలో పెద్దగా లేదని ఇది నిరూపిస్తుంది. 1956 నవంబరు 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత సుమారుగా 1960 నుండి క్రమక్రమంగా బ్రిటిషాంధ్ర సినిమాలు, బ్రిటిషాంధ్ర పత్రికలతోపాటు, పాఠ్యపుస్తకాలు, బ్రిటిషాంధ్రవారి భాషలో మొదలైన రేడియో ప్రసారాలు, ఉపాధ్యాయులుగా, ఉద్యోగులుగా బ్రిటిషాంధ్ర ప్రాంత మధ్యతరగతి తెలంగాణకు వలసరావడం మొదలైన వాటివల్ల కృష్ణా, గుంటూరు జిల్లాల భాష పాఠ్యపుస్తకాల భాషగా రుద్దినప్పటినుండి బ్రిటిషాంధ్ర భాష ఆధిపత్య భాషగా తెలంగాణ భాష అధీన భాషగా అణిచివేయడం ప్రారంభమైందని చెప్పవచ్చు. ఎందుకంటే, నేను తెలంగాణ భాషలో కథలు, వ్యాసాలు, కవితలు, గేయాలు రాయడానికి 1964 నుండి 1977 వరకు ఎంతో సంకోచించాను. ఎలాంటి అరమరికలు లేకుండా గూడూరి సీతారాంగారు 1953 నుండి 1960 దాకా తాను మాట్లాడే తెలంగాణ భాషలోనే కథలు, వ్యాసాలు రాయడం విశేషం.

గూడూరి సీతారాం ముందు తెలంగాణ కథకుల భాష :

బ్రిటిషాంధ్ర సాహిత్యంతో సంబంధంలో ఉన్న మాడపాటి హనుమంతరావు మొదలుకొని సురవరం ప్రతాపరెడ్డి దాకా సరళ గ్రాంధిక భాషను, అటు తర్వాత బ్రిటిషాంధ్ర భాషను వట్టికోట ఆళ్వారుస్వామి తన రచనల్లో ఉపయోగించారు. తెలంగాణ భాషను పత్రికాభాషగా ఎదిగించే ప్రయత్నాలు కొన్ని జరిగినట్లుగా కనపడుతుంది. కానీ, అది పూర్తి రూపం ఆనాటికి సంతరించుకోలేదు. అణా గ్రంథమాల తరఫున వెలువడిన పుస్తకాలు, వట్టికోట ఆళ్వారుస్వామి దేశోద్ధారక గ్రంథమాల తరఫున వెలువరించిన పుస్తకాలు, గోలకొండ పత్రిక, మీజాన్ పత్రిక, దాని సంపాదకులు అడివి బాపిరాజు, ఆంధ్ర మహాసభ వెలువరించిన సాహిత్యం నడిపిన గ్రంథాలయ ఉద్యమం, కమ్యూనిస్ట్ ఉద్యమం తెలంగాణలో సరళ గ్రాంధిక నుండి తెలంగాణ పదాలను కలుపుకుని సాగిన భాషా పరిణామం తెలంగాణ పత్రికా భాష రూపొందే క్రమంనుండి మలుపుతిరిగి బ్రిటిషాంధ్ర పత్రిక భాషగా మారిపోవడం గమనించవచ్చు.

సీతారాంగారు ఆనాడే తెలంగాణా భాషలో, యాసలో కథలు రాసే ఆత్మవిశ్వాసానికి ఒక చారిత్రక పునాది వుంది. హైదరాబాదులోని బషీర్‌బాగ్ నిజాం కాలేజిలో డిగ్రీ చేస్తున్నప్పుడు గూడూరి సీతారాంగారు పెద్ద రచయితల సమూహంలో రూపుదిద్దుకున్నారు. కాళోజీ, పల్లా దుర్గయ్య, బిరుదురాజు రామరాజు, దాశరథి సోదరులు, వట్టికోట ఆళ్వారుస్వామి మొదలైన వాళ్ళంతా నేటి నారాయణగూడ దీపక్ టాకీస్ పక్కసందులో కేశవ మెమోరియల్ హైస్కూలుకు వెళ్లేదారిలో ఉండేవారు. ఇంకా ఎంతోమంది అక్కడ కలుసుకునేవారు. డా॥ సి. నారాయణరెడ్డి చిన్నప్పటినుండీ గురుమిత్రులు. ఇలా గూడూరి సీతారాం రచయితగా ఎదగడంలో తెలంగాణలోని మొత్తం సాహిత్య సామాజిక ఉద్యమం వాటి పరిణామాలు పెనవేసుకొని ఉన్నాయి. గూడూరి సీతారాం 1953లో అనగా 16వ ఏట 8వ తరగతి చదువుతున్నప్పుడు కథలు రాయడం ప్రారంభించారు. 1953-56 మధ్య సుమారు 30 కథలు, స్కెచ్‌లు రాసారు. అటుతర్వాత రచనలు మరింత వేగం పుంజుకున్నాయి. మొత్తం సుమారు 85 కథలు, స్కెచ్‌లు రాసినట్టుగా తెలుస్తున్నది. సంగిశెట్టి శ్రీనివాస్ 25 కథల వివరాలను సేకరించగలిగారు. మిగతా వివరాలను ఇంకా సేకరించాల్సి ఉన్నది.

నిజాం కాలేజీలో తీసే మేగజైన్‌కు కూడా గూడూరి సీతారాం సంపాదకులుగా పనిచేసారు. పి.వి.రంగారావు వంటి ఎందరో రచనలను పరిశీలించి ఎన్నికచేసే అవకాశం సీతారాంకు లభించింది. అలాగే వట్టికోట ఆళ్వారుస్వామి అచ్చేసే పుస్తకాల ప్రూఫులు చూసేపని అవకాశం లభించింది. కాలేజీ చదువుతున్నప్పుడే వట్టికోట ఆళ్వారుస్వామి, కాళోజీ, పల్లా దుర్గయ్య, కె.సి.గుప్త, బిరుదురాజు రామరాజు, దాశరథి కృష్ణమాచార్య, దాశరథి రంగాచార్య, సి.నారాయణరెడ్డి, 'స్రవంతి' తెలుగుదేశం పత్రికా సంపాదకులు మొదలైనవారు అందరూ దగ్గరయ్యారు.

నిరంతరం సాహిత్యగోష్ఠులు. శ్రీకృష్ణ దేవరాయ ఆంధ్రభాషా నిలయంలోను, వట్టికోట ఇంట్లోను, నారాయణగూడ చౌరస్తాలోని హోటల్‌లోను వారు కలుసుకోవడమే ఒక సాహిత్య సభగా గుభాళించేది. ఆ వాతావరణంలో చాలామంది కవులు వుండేవారు. వట్టికోట, సురమౌళి, గూడూరి సీతారాం, హీరాలాల్, పి.యశోదరెడ్డి, నెల్లుట్ల కేశవస్వామి, మొదలైన కొద్దిమంది కథలు వచనం రాసేవారు. ఆ ఉరవడిలో దాశరథి, సి.నారాయణరెడ్డి కూడా కొన్ని కథలు రాశారు.

గూడూరి సీతారాంగారు తెలంగాణ భాషలో, కథను రాసే పద్ధతిలో కాకుండా కథను చెప్పే పద్ధతిలో శ్రవ్య శైలిలో మౌఖిక సాంప్రదాయంలో రాయడం సాధ్యపడింది. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి ఇంగ్లీషు సాహిత్యం చదవకపోవడంవల్ల అసలుసిసలైన తెలుగు భాష, శైలి, శిల్పం, వస్తువు విశిష్టంగా చిత్రించడం జరిగిందని మనకు తెలుసు.

తెలంగాణ చారిత్రక నేపథ్యం :

నిజాం రాజు టిప్పు సుల్తాను, మరాఠా రాజులతో చేసిన యుద్ధాల్లో సహకరించినందుకు కప్పం కింద 1768లో బ్రిటిష్ ఆంధ్రను, 1798లో దత్త మండలాన్ని ఆంగ్లేయులకు ధారాదత్తం చేశాడు. వారి రాజధాని అయిన కలకత్తా నుండి మద్రాసు వరకు రోడ్డు, రైలు మార్గాల కోసం వారి పరిపాలనా సౌలభ్యం కోసం కొన్ని అభివృద్ధి పనులు చేపట్టారు. సర్ ఆర్థర్ కాటన్ కరువు నివారణ ఆనకట్టలు నిర్మించాడు. దాంతో నవ్విన నాపచేను పండింది. ప్రజలకు సంపద పెరిగింది. కోస్తాలో ప్రభుత్వానికి పన్నులు పెరిగాయి. అయినా మద్రాసు రాష్ట్రంలో చాలా బాధలు అనుభవించారు. పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతో చివరకు 1953లో కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది.

ప్రత్యేక హైదరాబాద్ రాష్ట్రంలో భాగంగా ఉన్న తెలంగాణ నుండి బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా ఉండేవారు. తెలంగాణాను ఆంధ్రలో కలపడాన్ని ప్రజలు చాలామంది వ్యతిరేకించినా, నెహ్రూ, అంబేద్కర్ వ్యతిరేకించినా బూర్గుల రామకృష్ణారావు రెండు ప్రాంతాలతో (తెలంగాణాలోని రెడ్ల మీద వ్యతిరేకతతో) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటుకు అంగీకరిరించారు. 1956 నవంబర్ 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది.

గూడూరి సీతారాం మొదటే చెప్పినట్టు నిజాం ప్రాంత సమాజ చరిత్రకు, సాహిత్య చరిత్రకు ఒక ప్రతీక, ప్రతినిధి. ఆయన నిజాం పరిపాలనలో పుట్టారు. ఆంధ్ర మహాసభ ఎదుగుదలతోపాటు ఎదిగారు. బూర్గుల రామకృష్ణరావు ముఖ్యమంత్రిగా మూడేళ్ళు స్వతంత్ర రాష్ట్రంగా కొనసాగిన నైజాం రాష్ట్రాన్ని చూసారు. అప్పుడు జరిగిన ఇతోధిక అభివృద్ధి గూడూరి సీతారాం తెలంగాణ భాషలో తెలంగాణ జీవితాన్ని రాయడానికి పునాది. అటుతర్వాత నైజాం రాష్ట్రం స్వతంత్ర ప్రతిపత్తిని కోల్పోయి బ్రిటిషాంధ్ర పరిపాలకుల చేతుల్లోకి మారిపోయింది. దాంతో తెలంగాణ భాషలో వచ్చే సాహిత్యం క్రమక్రమంగా ఆగిపోయింది.

అన్ని రంగాల్లో బ్రిటిషాంధ్రుల ఆధిపత్యం వ్యాప్తి పెరిగాయి. తెలంగాణ నుండి సాహిత్యవేత్తలు ఎదగడం క్రమక్రమంగా తగ్గుతూవచ్చింది.

1953లో గూడూరి సీతారాం కథలు రాయడం ప్రారంభించారు. అప్పటికి ఆయన వయసు 16 ఏళ్ళు మాత్రమే. అప్పుడు సిరిసిల్లలో 8వ తరగతి చదువుతున్నారు. 8వ తరగతినుండే స్కూలు మేగజైనుకు సంపాదకుడిగా మూడేళ్ళు పనిచేసారు. జి.ఆర్.నర్సయ్య అని పిలువబడే గుండేటి రాజనర్సయ్య ప్రధానోపాధ్యాయులుగా ఉన్న ప్రతిచోటా స్కూలు మేగజైను తీయడం వారి కర్తవ్యాల్లో ఒకటిగా పెట్టుకున్నారు.

తెలంగాణ కారా గూడూరి సీతారాం :

గూడూరి సీతారాం ప్రేంచంద్ వలెనే రచయితల సంఘాలను నడిపించడంలోను, యువ రచయితలను ప్రోత్సహించడంలోను మొదటినుండి ముందున్నారు. 1994 నుండి తెలంగాణ కథ కోసం ఉత్తరాంధ్రలోని కాళీపట్నం రామారావులాగా తెలంగాణలో ఎంతో కృషిచేస్తున్నారు. నా కథలతో పాటు జూకంటి జగన్నాథం, పెద్దింటి అశోక్ కుమార్, చైతన్య ప్రకాశ్, పంజాల జగన్నాథం, ఎన్నెం సత్యం, నలిమెల భాస్కర్, కె.వి.నరేందర్, దార్ల రామచంద్ర, బెజ్జారపు వినోద్‌కుమార్, నల్లాల లక్ష్మీరాజం, జాజుల గౌరి, నేరెల్ల శ్రీనివాస్‌గౌడ్, కొక్కుల భాస్కర్, వనమాల చంద్రశేఖర్, కాలువ మల్లయ్య, ఆడెపు లక్ష్మీపతి, పి.చంద్, పత్తిపాక మోహన్, అన్నవరం దేవేందర్, పులుగు శ్రీనివాస్, గూడూరి అమరావతి, కందుకూరి రమేష్, కాసుల ప్రతాపరెడ్డి, గూడ అంజయ్య, సుద్దాల అశోక్‌తేజ, స్కైబాబా మొదలైన యువరచయితలకు ఎప్పటికప్పుడు ఎన్నో విలువైన సూచనలను చేస్తున్నారు.

ఇక నా మాటకొస్తే గూడూరి సీతారాం, నేను 1997లో మొదటిసారి కలుసుకున్నాం. ఉద్యోగరీత్యా సిరిసిల్లకు బదిలీ అయిన తర్వాత మా సాన్నిహిత్యం బాగా పెరిగింది. నేను సిరిసిల్ల బదిలీ అయ్యాక అక్కడ సాహిత్య కార్యక్రమాల్ని విస్తృతం చేయడం జరిగింది. అక్కడ ఆంధ్ర మహాసభ, జి.రాములు, సి.నారాయణరెడ్డి కాలంనుండి ఒక సాహిత్య వాతావరణం కొనసాగుతున్నది. జాషువా జయంతి, కళాసాగర్ కార్యక్రమాలు, మానేరు రచయితల సంఘం కార్యక్రమాలతో నిరంతరం ఏదో ఒక చర్చ సాగుతూ ఉండేది. వారి ఇల్లు గాంధీ చౌక్‌లో ఉండడంవల్ల వారిల్లే ఒక సాహిత్య కేంద్రంగా సాహిత్య గోష్ఠుల నిలయంగా కొనసాగేది. ఆయన, నేను కొన్ని వేల గంటలపాటు ఉదయం నుండి రాత్రిదాకా వాళ్లింట్లోనూ, మా కార్యాలయంలోనూ ప్రపంచంలోని సాహిత్య సామాజిక రాజకీయ విషయాలను కలబోసుకున్నాం. కథలబడి కథాసాహిత్య అలంకారశాస్త్రం (1997) తొలిపాఠకుడు సంపాదకుడు ఆయనే. అలా ఆయనలో ఒక మంచి రచయితతోపాటు ఒక గొప్ప సహృదయ పాఠకుడు కూడా ఇప్పటికీ కొనసాగడం విశేషం.

ఇంగ్లీషులో ప్రతీ గొప్ప రచయితకు సినిమాల్లోలాగే ఒక గొప్ప ఎడిటర్ తోడుగా ఉంటారు. తెలుగు సాహిత్యంలో ఈ సాంప్రదాయం చాలా తక్కువ. గూడూరి సీతారాం తెలంగాణాలో ఒక గొప్ప ఎడిటర్‌గా యువతరానికి చేయూతనిచ్చారు. నేను రాసిన 'స్మృతి' కథల సంపుటి (1997), 'మమతలు మానవసంబంధాలు' కథలసంపుటి, (2000), 'వేపచెట్టు' కథలసంపుటి (2004), మొదలుకుని 'పాలు - సదువు' కథలు (2005), ఇటీవల వెలువరించిన 'తేనెటీగలు' కథలసంపుటి (2005) దాకా ప్రతి రచనని ఆయనతో చర్చించడం జరుగుతూ వచ్చింది. విశాలసాహితి ప్రచురించిన కరీంనగర్ జిల్లా కథలు రెండవ సంపుటి, భారతీయ సాహిత్యం తెలుగు కథలు, ఒడ్నాలసూర్య కవితలు, సమగ్ర సామాజిక కథ-50

ఏళ్ళ తెలుగు కథ తీరుతెన్నులు, బహుజనతత్వం, బీసీలు ఏంచేయాలి?, భారతీయ సమాజం-రాజకీయ సామాజిక పరిణామాలు, జాజుల గౌరి - మన్నుబువ్వ, అంబల్ల జనార్దన్ కథలు మొదలైన ప్రచురణలో సంపాదకవర్గ సభ్యులుగా విశాలసాహితి, సామాజిక విశ్వవిద్యాలయంలో నేడు మాతో కలిసి చేస్తున్నారు. విశాల సాహిత్య అకాడమి బి.ఎస్.రాములు కథాపురస్కారాలకు న్యాయనిర్ణేతగా కర్తవ్యం నిర్వర్తిస్తున్నారు. ఇటీవల తెలుగు విశ్వవిద్యాలయంలో ఆగస్టు 27 - 29, 2004లో నిర్వహించిన మూడు రోజుల కథావర్క్‌షాప్ నిర్వహణకు నిజాం వెంకటేశంతోపాటు, యువ రచయితలతోపాటు పోటీపడి కృషిచేశారు. నిరంతర కృషీవలుడు గూడూరి సీతారాం.

నా 50వ జన్మదిన సభలకు, ఆహ్వానసంఘం అధ్యక్షులుగా, జన్మదిన స్వర్ణోత్సవ సంచికకు సంపాదకులుగా ఎన్నో కార్యక్రమాలు ముందుండి నిర్వహించారు. కథలు రాయకపోయినా ఒక కాళోజీ లాగా ఒక కాళీపట్నం రామారావులాగా తెలంగాణ యువతరం కథకులకు తెలంగాణ సాహిత్య సమాజంతో నిరంతరం సంబంధంలో వుంటూ వారికి చేయూతనిస్తూ ప్రోత్సహిస్తూ వస్తున్న సీనియర్ కథకులు. 1953లో తెలంగాణ రచయితల సంఘానికి కార్యదర్శిగా పనిచేయడం ప్రారంభించి మధ్యలో సాహిత్యాన్ని వదిలేసినప్పటికీ 1994 నుండి తిరిగి నిరంతరం సాహిత్యం గురించి తపించే సాహిత్య జీవిగా ఎన్నో కార్యక్రమాలను ముందుండి నడుపుతున్నారు. వారు తన మనవల వయసుగల రచయితలతో కూడా కలిసి పనిచేయడం యువతరానికి గొప్ప ఆదర్శం.

2

గూడూరి సీతారాం కథలు, కథనరీతులు

ఇక గూడూరి సీతారాం కథలను, కథనరీతులను పరిశీలిద్దాం. తెలుగు సాహిత్యంలో వాటికి గల విశిష్టతను తెలుసుకుందాం. ఆ కథలు సమాజ చరిత్రను ఒక కాళనాళికలా నిక్షిప్తం చేసుకున్న తీరును విశ్లేషిద్దాం.

గూడూరి సీతారాం కథల సంపుటి ముందుమాటలో జూకంటి జగన్నాథం అన్నట్టు "సీతారాం కథలను, నవలికలను సేకరించి ప్రచురించాలనే యత్నం జరుగుతున్నప్పుడు తెలుగు సాహిత్యం అందులో తెలంగాణ సాహిత్యాన్ని పదిలపరచుకోవడంలో మనుషులే కాక మన గ్రంథాలయాల దుస్థితి వైఫల్యం వెనుకబాటుతనం కొట్టొచ్చినట్టు కనిపించింది. గత ఐదారు సంవత్సరాలుగా కథలను ప్రోదిచేయడంలో ఇక సఫలీకృతం కాలేమోనని నిర్ణయానికి వచ్చి ఇదిగో దొరికిన అందుబాటులోనున్న కథలను అచ్చులో తీసుకువచ్చిన ఈ చిరుపుస్తకం - అసంతృప్తిగా ఉన్నా కేవలం ఇప్పటికి సర్దుకుపోయే ప్రయత్నమే ఇది... ఇదిగో ఇప్పుడు గూడూరి సీతారాం కథల పుస్తకాన్ని చూస్తే తెలంగాణా రాష్ట్రం తెలుగు కథా సాహిత్యపు నిండైన ప్రవాహంలో నిండి మునిగి ఒక చేత్తో 'ఎరుక'గా పైకెత్తి పట్టుకున్న గొప్ప భరోసాతో ఈవలిఒడ్డుకు సమీపిస్తున్న అనుభూతి కలుగుతుంది."

తెలంగాణా కథాసాహిత్య చరిత్ర గురించిన 'దస్త్రమ్' :

సంగిశెట్టి శ్రీనివాస్ 'దస్త్రమ్' ముందుమాటలో కె.శ్రీనివాస్ అన్నట్టు "తెలంగాణ కథ గురించి అవాకులు చెవాకులు మాట్లాడేవారికి ముదిగంటి సుజాతారెడ్డి 'తెలంగాణ తొలితరం కథల గుణాత్మకతను ప్రదర్శించడానికి ప్రతిఫలించింది. సంగిశెట్టి 'దస్త్రమ్' తెలంగాణ కథల పరిమాణాత్మక స్థాయిని చెప్పదలచుకున్నది. ఈ పుస్తకం వచ్చిన తరువాత, తెలుగు కథను సమీక్షించేవారు, వ్యాఖ్యలు చేసేవారు పూర్వంలా వ్యవహరించడానికి కుదరదు. నిజంగానే

సమాచారం లేక, అర్ధసత్యాలను నమ్మి ప్రచారం చేసినవారు – సరిదిద్దుకోవచ్చు. సమాచారం లేదే అని తెలంగాణ కథల జోలికి రానివారు, ఈ ప్రాథమిక సమాచారం ఆధారంగా, ఇందులో చెప్పిన కథలను విశ్లేషించడమో, వ్యాఖ్యానించడమో, చరిత్రలోని ఇతర అంశాలతో అన్వయంచేసి సందర్భీకరించడమో చేయవచ్చు."

రాజమ్మ రాజీర్కం – ఫెమినిజం :

గూడూరి సీతారాం కథలు సంపుటిలోని మొదటికథ 'రాజమ్మ రాజీర్కం'. రాజమ్మ స్వతంత్ర వ్యక్తిత్వం గల బాలిక. ఎనిమిదేండ్ల వయసులో పెళ్లయింది. రాజమ్మకు పెళ్లిచేసిన బాలుడు జాముపొద్దున్నే లేచిపోయి సాకల్ది ఊరు తిరిగేయాల్లకు ఇంటికొచ్చే ఆయనతో ముడేయించింధ్రు. రాజమ్మ అత్తగారోల్లు తోలుకపోను మూడుసార్లు వచ్చింధ్రు. కానీ, రాజమ్మ పోనని మంకుపట్టి పట్టింది. రాజమ్మ మొగునికి ఇంకో లగ్గమైంది. కానీ అది సప్పుడు చెయ్యలేదు. రాజమ్మకు మళ్లా లగ్గం కాలే. రాజమ్మ సవితికి అప్పుడే ఇద్దరు పోరగాండ్లు పుట్టింధ్రు. దాని మొగుడు కూడా సాన మారిండు. ముందు ఆరానికి ఒక్కసారి పెయ్యి కడుక్కునెటోడు ఇప్పుడు దినం జేత్తుండు." రాజమ్మ బతుకు ఆగమైపోయింది. ఇక గిప్పుడు దినాం పొట్ట పోసుకొను సిప్ప వట్టుకుని తిరుగుతుంది."

ఫెమినిజం రాకముందు రాసిన కథ ఇది. ఫెమినిజం కోణంలో రాజమ్మ జీవితం అలా మారడానికి పురుషాధిపత్య సమాజం సామాజిక అంతరాలు పేదరికం, ఆధునిక అభివృద్ధి గ్రామాల్లోకి విస్తరిస్తున్న క్రమం స్వంత వ్యక్తిత్వం గల రాజమ్మని బతుకనీయకుండా ఎలా చేశాయో విశ్లేషించడం అవసరం. రాజమ్మ వంటి స్వంత వ్యక్తిత్వం గల బాలికలు, స్త్రీలు వందలాదిమంది గ్రామీణ ప్రాంతాల్లో బావుల్లో పడి ఆత్మహత్యలు చేసుకునేవాళ్ళు. పట్టుదల ఉన్న మనిషి కావడంవల్ల రాజమ్మ ఆత్మహత్య చేసుకోకుండా దిగజారిపోయిన బతుకు కూడా బతుకగలిగింది. పనిపాటలు చేసుకుని బతికే కులాల గ్రామీణ ఆడపిల్లల స్వంత వ్యక్తిత్వం ప్రతి తరంలో ఎలా నాశనం చేయబడుతూ వచ్చిందో ఎవరి శవాల పెంటపోగుమీద 'ఆదర్శవంతమైనదిగా పిలువబడే కుటుంబ వ్యవస్థ' నిలదొక్కుకుంటూ వస్తున్నదో ఈ కథ ద్వారా హృదయవిదారకంగా గమనించవచ్చు. ఈ పరిస్థితి గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ మారలేదు. ఒక స్థాయి మధ్యతరగతికి ఎదిగి పల్లెలు వదిలి పట్టణాలకు చేరి ఆర్థికంగా స్వతంత్ర జీవితం జీవిస్తున్న బాలికలకు, స్త్రీలకు రాజమ్మకు పట్టిన దుస్థితి స్థాయినుండి ఎదిగి సామాజిక గౌరవంతో అందరితో సమానంగా జీవించే హక్కు సాధ్యపడుతున్నది. స్త్రీవాదులు తమ పూర్వీకుల కడగండ్లను తెలుసుకోవడానికి రాజమ్మ రాజీర్కం కథను చదవడం అవసరం.

ఈ కథ మౌఖిక పద్ధతిలో ఎదురుగా ఉన్న మిత్రులకు, ప్రేక్షకులకు, శ్రోతలకు కథ చెప్తున్న యక్షగానం, ఒగ్గు కథ సాంప్రదాయిక కథ చెప్పే పద్ధతిలో కథ సాగుతుంది. కథ ప్రారంభం పాటతో మొదలవుతుంది. మిద్దె రాములు అంతర్జాతీయ కళాకారుడుగా ఎదగడానికి ఆనాడు ఈ కథను పాటతో ప్రారంభించడానికి ఈ కథన శ్రవ్య శిల్పానికి మధ్య అంతస్సంబంధం వుంది. అది మౌఖిక భాషలో ఎదుగుతున్న గ్రామీణ సమాజ అభివ్యక్తి.

తెలంగాణా స్త్రీల భాష – అభివ్యక్తి – పి.యశోదారెడ్డి

తెలంగాణా పురుషుల భాష – అభివ్యక్తి – గూడూరి సీతారాం :

తెలంగాణా స్త్రీల భాష అభివ్యక్తికి డా॥ పి.యశోదారెడ్డి కథలు, తెలంగాణా పురుషుల భాష – అభివ్యక్తికి గూడూరి సీతారాం కథలు ఒక నిదర్శనం. 'రంగడు' కథ "తెల్లారుతాంది...

పొద్దుగూకుతాంది... మనుషులు నాత్రి పడుకుండుంధ్రు. తెల్లారినాంక లేత్తుంధ్రు. దినాలు ఎడ్ల చక్రం గీరలోలె తిరుగుతున్నయి. సూత్తుండె, సూత్తుండెంగనే ఏందో ఏందో మారిపోతాంది. ఎట్లెట్లనో అయితున్నయి దినాలు" అని ప్రారంభమవుతుంది. ఈ ప్రారంభమే అద్భుతమైన కథ చెప్పే గ్రామీణ తరతరాల కథన శిల్పాన్ని చెప్పకనే చెప్తుంది. పి.యశోదారెడ్డి మా వూరి ముచ్చట్లు, ఎచ్చమ్మ కథా సంపుటాల్లో ఇలాంటి కథన శిల్పమే తీసుకున్నారు. అయితే, యశోదారెడ్డి కథన పద్ధతి స్త్రీలు, అమ్మ, అమ్మమ్మ, నానమ్మ, కోడలు చెప్పే స్త్రీలదైన ప్రత్యేక కథనా రీతిలో స్త్రీల దయిన ప్రత్యేక భాషలో, సంస్కృతిలో సాగుతాయి. గూడూరి సీతారాం కథల్లో నాన్న, తాత, యువకులు, మగవాళ్ళు చెప్పే గ్రామీణ కథన రీతి, మగవాళ్ళ భావాలు ఆలోచనావిధానం అనుసరించి వ్యక్తమయ్యే భాష సంస్కృతి కథన శిల్పాన్ని కథ ప్రారంభం ముగింపులను ప్రభావితం చేసాయి.

రంగడు – దొరసాని – జ్ఞాపకాలు :

రంగడు దొరలదగ్గిర పనికాడు. ఆరేండ్ల వయసప్పుడే దొరల గోదలను కాసేవాడు. దొర చిత్రహింసలు, దొరసాని మంచితనం ఈ కథలో చూడవచ్చు. ఆ వూరి నుండి పారిపోయి ఏదో ఒక బతుకు బతికి జీవితంలో స్థిరపడ్డతర్వాత తిరిగి మా మంచి దొరసాని ఎట్లుంటదో చూసి కృతజ్ఞతలు చెప్పుకొందామని బిలాయ్ నుండి తన పల్లెటూరికి బయలుదేరడంతో కథ ప్రారంభమవుతుంది. ఈలోపు మారిన గ్రామాన్ని, మనుషులను చూసి "ఇక ఆడ ఉండబుద్ధిగాలె. పదిగేనురోజులు రజాదిచ్చుకున్న రంగడు తెల్లారే బిలాయ్‌కి పయనంగట్టిండు." అని కథ ముగుస్తుంది. కథా శిల్పం అద్భుతంగా సాగుతుంది. ప్రపంచంలోని చాలా కథలు ఒక ప్రాంతంలో ఒక నిర్దిష్ట కాలంలో వచ్చిన పరిణామాలను చెప్పడానికి ఇలాంటి కథా శిల్పాన్ని ఎన్నుకుంటారు. సీతారాం కూడా చాలా సులువుగా ఈ కథనశిల్పంలో బోలెడంత కథను నిలువెత్తు జీవితాన్ని చిన్న కథలో ఇమిడ్చాడు.

సంచార పిచ్చుకుంట్లు జీవితాల్ని చిత్రించిన 'లచ్చి' కథ :

సంచార జీవితం జీవించే పిచ్చుకుంట్లు కులాల జీవితాల్ని వారి కుటుంబ సంబంధాలను, అందులోని క్రూరమైన మగ పెత్తనాన్ని లచ్చి కథలో గొప్పగా చిత్రించారు. బొంబాయి వలస గురించి మారాజు కథ రాశాడు. ఈ కథ 1956లో ఆంధ్రప్రభ వీక్లీలో ప్రచురించబడి ఇటీవలే తిరిగి అదే పత్రికలో పునర్ ముద్రించబడింది. ఇది కరీంనగర్ జిల్లా కథల సంపుటి మొదటి సంపుటిలో చేరింది. ఆయన 'రంగడు' కథలో మారుతున్న భూస్వామ్య జీవితాన్ని, "రాజమ్మ రాజీరుకం" కథలో విలాసవంతమైన జీవితం పట్ల ఆకర్షింపబడి మోసిపోయి, బిక్షగత్తెగా మారిన స్త్రీ గురించి, చీకటి గొడుగు కథలో లైంగిక సంబంధాల గురించి చిత్రించారు. అందని ఆకాశం, అమ్మాయి అబ్బాయి, దెబ్బతిన్న అహంభావం, రామచంద్రులు, ఎర్రపువ్వు, బస్సచ్చింది వంటి కథలు రాసిన గూడూరి సీతారాం తెలంగాణా కథల్లో ఒక ముత్యాల పేరు. హిందీలోని ప్రేంచంద్, మా గోఖలే, కరుణకుమార, చింతాదీక్షితులు సరసన చేర్చవలసిన గూడూరి సీతారాంగారి పేరు 1950–60, 1960–70 దశాబ్దాల కథాసంకలనాల్లో అసలు కనిపించకపోవడం గమనార్హం.

'లచ్చి' కథ తెలుగు సాహిత్యంలో గొప్ప కథల్లో ఒకటి. ఫెమినిస్టుల దృష్టితో చూసినా, సామాజిక పరిణామాల చరిత్రగా చూసినా, లచ్చి కథ తెలుగు సాహిత్యంలో ఒక క్లాసిక్ కథ. పల్లెలో బతుకు లేక పట్టణంలో బతకాలని బయలుదేరిన కూలినాలి కుటుంబం ఎలా చితికిపోయిందో, భర్త తాగుబోతుగా మారడంతో కుటుంబం ఎదుర్కున్న సమస్యలు, అప్పులు,

సంసార భారమంతా లచ్చి మోయాల్సిరావడం మొదలైనవన్నీ ఈ కథలో చూడవచ్చు. తెలంగాణ నుండి 1957లో ఇలాంటి కథ రావడం గొప్ప విషయం. బిచ్చగాళ్ళుగా, చాపలల్లేవాళ్ళుగా బతికే సంచార కులాల జీవితాలు ఎలా సమాజంలో ఆధునిక అభివృద్ధిలో చితికిపోయాయో ఈ కథ ఒక సాక్ష్యం. అయితే, రచయిత ఆశావాది. "పచ్చని కాపురంలో చిచ్చుపెట్టిన రిక్షా నాశనపయిందిలే! ఇక ఎప్పటిలాగా పాత జీవితాన్నే ఆరంభిద్దాం' అన్నాడు రంగడు. లచ్చి పొరలిపోతున్న ఆనందబాష్పాలనాపలేకపోయింది."

1962లో వెలువడిన శివరామ కరంత్ నవల "తిరిగి మరల సేద్యానికి" ముగింపు కూడా ఇలాగే ప్రారంభించిన చోటుకే ఐదు తరాల తర్వాత మునిమనవరాలు సరస్వతి పట్టణ జీవితానికి విసిగిపోయి తిరిగి ఐదు తరాలనాటి పల్లెను వెతుక్కుంటూ బయలుదేరడంతో నవల ముగుస్తుంది. గుజరాతీలో వెలువడిన ఒక అంతరంగం కథ అనే నవలలోనూ మట్టిమనుషులు అనే ఒరియా నవలలోనూ, ప్రేంచంద్ నవలలోనూ, తిరిగి పల్లెలకు బయలుదేరే క్రమాలను చూడవచ్చు. పట్నం బాధలు భరించలేక తిరిగి ప్రకృతిఒడిలో సేదదీరాలని ఆనాటి మనుషులు సమాజం రచయితలు భావించారు. ఇప్పుడు ఈ స్థితి మారిపోయింది. పల్లెల్లోనే బతకాలని పుంఖానుపుంఖాలుగా కథలు, వ్యాసాలు రాసే కాలువ మల్లయ్య, పాటలు రాసే గోరటి వెంకన్న చివరకు రచయిత గూడూరి సీతారాం కూడా ఇప్పుడు పట్నాల్లోనే బతుకుతున్నారు. పల్లెలు హాలీడే రిసార్ట్స్‌లా విశ్రాంతి కేంద్రాలయ్యాయి. సమాజం ఎవరికి ఇష్టం వున్నా లేకపోయినా పట్టణీకరణవేపు ముందుకు సాగుతూనే ఉంది. పల్లెలన్నీ పట్టణ నాగరికత సంస్కృతి జీవన విధానానికి చేరువైపోయాయి.

నవలంత కథను చిత్రించిన గౌడ కులాల 'నారిగాని బతుకు' :

నారిగాని బతుకు కథలో గౌడ కులానికి సంబంధించిన ఒక నవలంత జీవితం చిత్రించబడింది. ఇది కూడా కథను చెప్పే పద్ధతులో వివరించిన మౌఖిక కథాశిల్పంలో సాగుతుంది. తెలుగు కథాసాహిత్యంలో ఇది మరొక ఆణిముత్యం. స్రవంతి మాసపత్రికలో 1954లో దీన్ని ప్రచురించారు. పద్మపీఠం మాసపత్రికలో 1990లో పునర్ముద్రించబడింది. కల్లుగీత కార్మికులైన గౌడుల జీవితం కుటుంబం సంబంధాలు, గౌడ కులంలోని స్థితిగతులు ఇందులో తెలంగాణ భాషలో చక్కగా చిత్రించారు. ఈ కథ ఇప్పటికీ కొత్త కథలాగే కనబడుతుంది. చెహోవ్ కథలాగా సంక్షిప్తంగా జీవిత సత్యాన్ని ఈ కథ ఆవిష్కరించింది. తెలుగు స్వతంత్ర తెలుగుదేశం, స్రవంతి వంటి మాసపత్రికల్లో విస్తృతంగా రచనలు చేసిన గూడూరి సీతారాం తన కథల్లో తెలంగాణా మాండలికానికి, ఇక్కడి సామాజిక జీవితానికి పట్టం కట్టారు. ఆయన నారిగాని బతుకు కథలో గౌడుల కులవృత్తితోపాటు సామాజిక సమస్యల్ని, కుటుంబ సమస్యల్ని ఎంతో అద్భుతంగా చిత్రించారు. సరిగ్గా ఇలాంటి గౌడ వృత్తి గురించి మరోకోణంలో జి.రాములు పెరటిచెట్టు అనే పెద్ద కథ రాశారు.

1953-55లో సిరిసిల్ల పాఠశాల సంచికకు సంపాదకులు. బ్లాక్ ప్రోగ్రెసివ్ అసిస్టెంట్‌గా పనిచేసి దాన్ని వదిలేసి వస్త్రవ్యాపారంలో స్థిరపడ్డారు. ఇప్పుడు దాన్నించి రిటైరయ్యారు. 1953లో తెలంగాణా రచయితల సంఘం సంయుక్త కార్యదర్శి. ప్రస్తుతం మానేరు రచయితల సంఘం అధ్యక్షులు. 1953 నుండి 1970 దాకా 80 కథలు ఆనాటి ప్రముఖ పత్రికలు భారతి, ప్రభ, గోల్కొండ, యువ, తెలుగుదేశం, ప్రజామతలో అచ్చయ్యాయి. తెలంగాణ తొలితరం కథకుల్లో వీరొకరు. వీరి 'కొత్త పాతలు' నవల 'తెలుగుదేశం.' పత్రికలో సీరియల్‌గా వచ్చింది.

మారాజు కథ పల్లెల నుండి బొంబాయి మిల్లు కార్మికులుగా వలసవెళ్ళే ప్రస్థానాలను చిత్రిస్తుంది. కథ అమాయకమైన రంగడు బొంబాయికి పోయి రావడంతో ప్రారంభమవుతుంది. "రంగడు బొంబాయికోయచ్చింద్రు. ఆడెప్పుడో బొంబాయిదాకా యెళ్ళకుంట ఉండడని చానామంది అనుకున్నరు. యెర్రిబాగులోడు ఆ పిచ్చోడు బొంబాయి దాకా ఒక్కడే యెట్లా యెల్లిండా అనే తర్కాల పడ్డరు. గా నడుమ అదేదో పెద్ద సోపాల సదువంతా సదువుకున్న దొరగారి పిల్లగాడు లష్కర్ బోయిండట. పాపం ఆయన సదువుకున్నోడే కాని పట్నం గిట్నం ఎన్నడూ తిరగలేదట. పొంగ సోపతిగాళ్లు గా ఇంటికి పోవాల్నని పత్తా జెప్పింద్రంట. ఉట్టి నోటి మాట్నే సెప్పలేదట. ఓ కాయితం మీన రాసి కీసల వెట్టింద్రట. ఇక ఆయన రైలెక్కిండు. అనుకున్న దగ్గర్నే దిగిండు. ఆ టేషన దాటంగనే పెద్ద సముద్రంల పడ్డట్టైంది. ఎటు వోవాల్నో దోసలేదు." అని కథలో ప్రారంభమవుతుంది. ఇంటికి క్షేమంగా చేరవచ్చినందుకు... "ఆనాడు రంగనింట్ల తీర్థం సాగింది. సీమల బారోలె వూళ్ళోళ్లందరు అచ్చి జూసింద్రు. రంగని తల్లి కంటికి మంటికి ఏకదారోలేడ్చింది. "నీ కొడుక్కేందవ్వ, బతికి బయటపడ్డడు. మారాజు" చూడచ్చినోళ్లందరు గదేపాట పాడింద్రు." అని కథ ముగుస్తుంది. ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో 1957లో ఈ కథ అచ్చయింది.

పురాణం - వాకాటి - డి.రామలింగంగార్ల అల్పదృష్టి :

దక్షిణభారత హిందీ ప్రచారసభ ప్రచురించే స్రవంతి మాసపత్రిక భారతి తర్వాత అందరూ చదివే మాసపత్రిక. స్రవంతిలో 1957 జనవరి సంచికలో అచ్చయిన లచ్చి, సెప్టెంబరు 1959 సంచికలో రంగడు, 1960 జనవరి సంచికలో అచ్చయిన నారిగాని బతుకు, 1954 ఆంధ్ర సచిత్ర వారపత్రికలో అచ్చయిన పిచ్చోడు మొదలైన కథలు ప్రభుత్వం డబ్బుతో అచ్చేసే సంకలనకర్తలకు ఎందుకు కనపడకుండాపోయినట్టు? 1969లో తెలంగాణ ఉద్యమం సాగుతున్నప్పుడు ఎన్నిక చేసిన తెలుగు కథా సంకలనంలో సంపాదకులుగా ఉన్న వాకాటి పాండురంగారావు, పురాణం సుబ్రహ్మణ్యశర్మలకు పదేళ్ల ముందు స్రవంతిలో, ఆంధ్రప్రభలో అచ్చయిన కథలు కూడా కనపడలేదా? గూడూరి సీతారాంగారికి స్నేహితుడే అయిన డి.రామలింగం సంపాదకుడిగా అచ్చేసిన సంకలనాల్లోనైనా గూడూరి సీతారాం కథలు హీరాలాల్ కథలు ఎందుకు ఎన్నిక చేయలేదు? ఇప్పటికీ అద్భుతంగా పఠనీయతను, సామాజిక పరిణామాలను చిత్రించే గొప్ప కథలుగా కనపడుతున్నప్పటికీ ఆనాడు ఎందుకు సంకలనాల్లో చేర్చలేదో ఆశ్చర్యం. డి.రామలింగం నా 'పాలు' కథను 'ఒక తరం తెలుగు కథ' కథల సంపుటిలో ఎన్నిక చేయడానికి నిరాకరించి ఆ సంపుటి పరిధిలో చేర్చడం సాధ్యం కాదని నిరాకరించిన మహానుభావుడు. వీళ్ళు కొందరు పైరవీకారుల కథలను చేర్చిన తీరు సంకలనకర్తల చిత్తశుద్ధిని శంకింపజేస్తుంది.

ఆనాటి స్త్రీ స్వాతంత్ర్యం - చలం - గూడూరి సీతారాం :

స్త్రీ స్వాతంత్ర్యం అనే కథలో స్త్రీ స్వాతంత్ర్యాన్ని అద్భుతంగా చర్చించారు. చివరకు "ఇక రాస్తామంటే పెన్నులేదు. దాంతోపాటు మెదడు కూడా కాళీ అయింది. ఆగలేని నా కోపం ఇంతవరకూ రాసిన కాగితంను పొట్టపెట్టుకుంది అని కథను ముగించారు. కథన శిల్పం జీవితమంత వాస్తవికంగా ఎలా చిత్రించవచ్చో స్త్రీ స్వాతంత్ర్యం, ఎర్రని పువ్వు, బస్సు కదిలింది, చీకటి గొడుగులు కథలు స్పష్టం చేస్తాయి. యువతరం కథకులకు కథలు ఎంత సులువుగా రాయవచ్చో గూడూరి సీతారాం కథలు ఒక గొప్ప స్ఫూర్తినిస్తాయి. కొండంత విషయాన్ని అద్దంలో చూపినట్టు చిన్న కథల్లో రాసిన తీరు గూడూరి సీతారాంగారిని ప్రేంచంద్ సరసన నిలబెడుతుంది.

పిచ్చోడు కథలో కవి కథకుడు మాట్లాడే శిల్ప నైపుణ్యం కథనరీతి మొదటి పేరానే పాఠకులను పట్టుకుని చివరిదాకా ఉత్కంఠతో చదివింపజేస్తుంది. కథ ఎలా ప్రారంభమయిందో చూడండి - "ఆనాడు పొద్దు వంకరగా గూకింది. గాంధీతాత కడుపులనుండి నెత్తురు చిల్లినట్టు పడమటి ముఖాన మొగుల్నుండి ఎర్రటి ధారలు జారినయి. తెప్పలు నీళ్లకోసం జెప్పజెప్ప ఉరుకుతున్నయి."

పల్లెకు పట్టణానికి మధ్య నలిగిన గ్రామీణ సంస్కృతి :

రంగడు ఒకసారి బొంబాయి పోవాలని అన్నగానితో తయారైండు. వట్టి గొర్రె మంకు. రంగడు గిన్నాలనుండి పావల పైసలు చేతులనుండి ఖర్చుపెట్టి ఎరగడు. తనను అందరు హీనంగా జూస్తరు. ఎందుకో! పిచ్చోడంటరు. అమాయకుడంటరు. జెరమొక సుట్ట కొట్టి సుట్ట అట్టించి తాగుడు మొదలెట్టిండు. రైలు సప్పుడు విని రంగడు గజ్జుమన్నడు. కామునిభూతమోల్గె గుంజుకబోయి మోటార్లు ఎటెటో కనపడ్డయ్. రంగడు పొలికేకేసి ఉరుకవోయి కింద వడ్డడు దగ్గర నించోన్నోళ్లు నవ్వుకుంట రైలెక్కిన్రు." "1954లో ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో అచ్చయిన ఈ కథ పల్లెలకు, పట్టణాలకు మధ్య రాకపోకలు పెరుగుతున్న క్రమంలో పల్లెటూరికి వాళ్ళు పట్టణ అభివృద్ధిని రవాణా సౌకర్యాలని టెక్నాలజీని అర్థంచేసుకునే క్రమంలో ఎదుర్కునే సమస్యలను అర్థం కాని వాళ్ళు హీనంగా చూడబడే పరిణామం పల్లెటూరిబైతులు అని, పిచ్చోళ్ళు అని హేళనచేసే సంస్కృతి 1954 నాటి వరకే వేళ్ళూనుకుందని ఈ కథ స్పష్టం చేస్తుంది. పట్టణపు ప్రభావం పల్లెటూరి జీవనవిధానం మీద వారి ఆలోచన మీద ఎలా స్వారీ చేస్తున్నదో ఈ కథలో అపూర్వంగా చిత్రించారు.

సీతారాం - గోపీచంద్ - బుచ్చిబాబు - చీకటి గొడుగులు :

చీకటి గొడుగులు కథ గోపీచంద్ రాసిన చైతన్య ప్రవంతి శిల్పంలో సాగుతుంది. 1954లో ఈ కథ అచ్చయింది. సురమౌళి అదేకాలంలో ఇటువంటిదే వలయం అనే కథను రాసారు. ఆ కాలంలో బుచ్చిబాబు, గోపీచంద్, చలం ఇలాంటి మనస్తత్వ చిత్రీకరణ కథలు రాసేవాళ్ళు. మనస్సులోని అవును కాదు అనే రెండు భావాలను తప్పొప్పుల మధ్య జరిగే మానసిక సంఘర్షణను నీతి నిజాయితీలకు సాంస్కృతికి అరిషడ్వర్గాల వ్యామోహానికి మధ్య ఉండే సంఘర్షణని అద్భుతంగా చిత్రించిన కథ చీకటి గొడుగులు. గూడూరి సీతారాంతో పాటు ఆనాటి యువకులు ఉమ్మడి కుటుంబ జీవితాలనుండి స్వంతంగా వ్యక్తిగత జీవితం, వ్యక్తిగత కుటుంబం గురించి, వ్యక్తిగత ఆలోచనలు మారుతున్న క్రమాన్ని మధ్యతరగతిదిగా మారుతున్న మనస్తత్వాల తీరును చీకటి గొడుగులు కథ మనకు పట్టిస్తుంది. ఈ కథ గూడూరి సీతారాం కథనరీతిలో కొత్త కోణాన్ని వెలికితెస్తుంది.

ఎదుగుతున్న తెలంగాణా విద్యార్థి యువజన మధ్యతరగతి జీవితాల కథలు :

'ఎర్రని పువ్వు' కథ కూడా ఫస్టు పర్సన్‌లో ఉత్తమ పురుషలో ప్రారంభమవుతుంది. "కాలేజీ ఆవరణలోనే తిరుగుతున్నాను. చాలామంది మిత్రులు చేతులు కలుపుతూ వెళ్లిపోతున్నారు. అందరూ వెళ్లిపోతున్నారు. నా కాళ్లూ కదలుతూనే ఉన్నాయ్యి. ఎందాకా కదలుతున్నాయో, గమ్యస్థానమేదో, సోపానమేదో తెలియదు. కళ్లకూ, కాళ్లకూ ఇవేవీ అక్కరేనట్లున్నాయి. పోతూనే న్నాయి. గాజుల గలగల చప్పుళ్లూ, బూట్ల టకటక ధ్వనులూ ఏవీ వినిపించడంలేదు." అని ప్రారంభమవుతుంది. మధ్యలో ఒక వాక్యం చూడండి. "నిన్నటిదంతా గాలికి వయ్యారంగా కదులుతున్న ఎర్రని పువ్వు చిరునవ్వుతో జ్ఞాపకం చేసింది. ఏంచేస్తే ఏం?" నాకా పువ్వును తెంపుకోవాలన్పించింది" కవితాత్మకంగా సాగిన ఈ కథ

వెనుక అమలిన శృంగారం తాలూకు కవితా ఉద్యమాల ప్రభావం స్పష్టంగా కనపడుతుంది. బసవరాజు అప్పారావు, కృష్ణశాస్త్రి, ఎంకి సుబ్బారావు మొదలైనవాళ్లతో పాటు దాశరథి కృష్ణమాచార్య ఎప్పుడూ పాడే గాలిబ్ గీతాలు, సినారె, కర్పూర వసంతరాయలు, అలాంటి వాతావరణంలో రాసిన కథలే చీకటి గొడుగులు, బస్సు కదిలింది, ఎర్రని పువ్వు. అప్పుడప్పుడే పడుతున్న సినిమాల ప్రభావం కూడా ఈ కథలో వస్తువు శిల్పాన్ని ప్రభావితం చేయడాన్ని గమనించవచ్చు.

సామాజిక తత్వవేత్తగా గూడూరి సీతారాం :

అబ్బాయి అమ్మాయి కథలో రచయిత యువకుడుగా ఉన్న నాటి ఆలోచనలు కథారూపంలో వ్యక్తమయ్యాయా? అన్పిస్తుంది. తెలుగుదేశం పత్రికలో 24-12-1953 సంచికలో అచ్చయిన ఈ కథలో యువతరంలో ఉండే స్త్రీ పురుషుల మధ్యన ఆకర్షణే పదహారేళ్ళ పరువపు చక్కిలిగింతలు మునుమాణిక్యం దృశ్యాలు ఈ కథలో కనపడతాయి. "నల్లని ముంగురులను దువ్వుకుని జడ వేసుకుంది ఆవిడ. అధరాలపై సూర్యునిచుట్టూ ఉన్న కాంతిధారలు కన్పించాయి. ఆమె తియ్యగా మాట్లాడుతుంటే ఎడతెరిపిలేకుండా చూస్తూనే నిలుచున్నాడు అబ్బాయి. అబ్బాయి ఇల్లు అమ్మాయి ఇంటికన్నా కొంచెం ఎత్తుగా ఉంది. ఆ ఇంటికీ ఈ ఇంటికీ మధ్య ఒక మట్టిగోడ ఉంది." ఈ మేరకు ఎవరైనా సులువుగా కథ చెప్తారు. రచయిత గడుసుతనం, రచనాచమత్కృతి ఎక్కడుందంటే "అబ్బాయి ఇంటినుండి చూస్తే అమ్మాయి ఇల్లంతా కనపడుతుంది. అమ్మాయి ఇంటివాళ్లు నూతిచుట్టూ తెరలు కట్టుకున్నారు. అయినా నిదానంగా చూస్తే కనిపించందంటూ లేదు." అదీ రచయిత చమత్కృతి. మిగతా కథ ఇక పాఠకులే ఎన్ని రకాలుగోనో ఊహించుకుంటూ ముందుకు సాగవచ్చు. వాళ్ల ఊహలకు అనుగుణంగా కథ కూడా నడుస్తుంది. "గోడ అవతల అమ్మాయి జాకెట్టు ఆరవేసుకుంది. ఎప్పుడో గాలికి విమానంలా లేచివచ్చి అబ్బాయివైపు పడిపోయింది." ఇంతే చెప్తే రచయిత ప్రత్యేకత ఏముంది? ఇంకా ఏమంటాడంటే "ఎందుచేతనోగాని, ఆ సమయానికి అబ్బాయి కూడా అక్కడే ద్వారంలోనే నిలుచున్నాడు." అదీ సంగతి. ఇక మిగతా కథ కథల పుస్తకంలోనే చదువుకోవాలి. సరసమైన కథ అని ఈ మధ్యన స్వాతి వారపత్రికవాళ్లు ప్రత్యేకంగా ప్రచురిస్తున్నారు. 50 ఏళ్ళ నాటి ఈ కథ, అలాగే మునిమాణిక్యం నర్సింహారావు కథలు స్వాతి వారపత్రికలో సరసమైన కథల కింద అందిస్తే సాహిత్య సేవ చేసిన పేరుగూడా లభిస్తుంది.

అందమైన ఆకాశం నగర జీవితం :

అందమైన ఆకాశం కథలో రచయిత జీవితంలాగే అందలి పాత్ర కూడా, "అబ్బాయి పల్లెటూరికి స్వస్తి చెప్పాలనుకున్నాడు. చదివింది కొంచమైనా నాగరిక భావాలు నిలువునా మూర్తీభవించాయి. బస్తీకి రెండుమూడుసార్లు ప్రయాణం చేశాడు. అక్కడ ఉన్నన్నిరోజులు హాయిగా వాళ్ల వాళ్ల సంసారాలు సాగిపోవడం కళ్లారా చూసాడు. మెయిన్ రోడ్లపై తిరిగే అమ్మాయిలపై విలాస దృక్కులను సారించే అప్టుడేట్ ప్రవరాఖ్యులను చూచాడు. ఇక అబ్బాయికి పల్లెటూరిలో ఉండడం గిట్టుతుందా?"

పట్నంలో "ఈ ఉద్యోగంలో అబ్బాయికి సముద్ర మథనం చేస్తే దొరికిన అమృతంలాగా ఆనందం అగుపిస్తుంది. జవరాండ్రు కరస్పర్శ కాగానే నరనరాల్లో విద్యుత్ ప్రవాహం ప్రాకిపోయేది. ఇంతలోనే పక్కనున్న యువకుడు అబ్బాయిని బలంగా చెంపకాయమీద అంటించాడు. జనం గొల్లుమని నవ్వుల కరపత్రాలు విసిరారు."

"ఆ నవ యువకునికి ఎంత గొప్ప ఆశయాలున్నవో చూడండి. "బీదవాళ్ళను నవయువకులు పెళ్లిచేసుకుని నేడు కట్నాల పేరుతో పెరిగిపోతున్న బ్లాక్ మార్కెట్టును అంతం చేయాలని, స్త్రీలను అమ్మడం మహచెడ్డ అని అబ్బాయికి ఒక ఆశయం ఉంది. ఆ ఆశయాన్ని ఆచరించాలని అబ్బాయి హృదయం దృఢపరచుకుంది. ఆ రాత్రే తల్లికి ఉత్తరం వ్రాశాడు. "అమ్మా నాకు ఇంతవరకుంటున్న పెళ్లాం నాకు నచ్చలేదు. కనుక ఆమెను విడిచిపెట్టి మరో అమ్మాయితో వివాహం చేసుకోడానికి నిశ్చయించుకున్నాను. కనుక నీవు తొందరగా రాగలవు." ఈ పెళ్లి వార్తను అమ్మాయికి గూడా చెపుదామనుకున్నాడు కాని చెప్పలేదు."

మౌఖిక జానపద కళల కథనరీతులు :

వెనకట వదినా మరుదుల, వదినా ఆడపడుచుల వరసైన సరసాలు ఉండేవి. మాటలతో హాయిగా నవ్వుకునేవారు. ఇప్పుడా సంస్కృతి కాలగర్భంలో కలిసిపోయింది. అలాంటి సంస్కృతి ఉన్నకాలంలో ఉండే ఆటపట్టించే పద్ధతి హాస్యపూరిత నిష్కల్మష సంభాషణాతీరును పై పేరాలో కథనరీతిగా చూడవచ్చు. ఇప్పుడు ఇంత నిర్మలంగా స్పష్టంగా ఇదే కథలోని భావాలను ఇలా వ్యక్తంచేయడం సాధ్యమా? కాదనే చెప్పవచ్చు. ఎందువల్ల? ఎందువల్లనంటే, భావాలను ఇంత స్పష్టంగా చెప్పే సమాజంగాని, వాటిని స్వీకరించే సమాజంగాని లేవు. పై పేరాలో చిత్రించిన అబ్బాయి ఆలోచనావిధానం తెలంగాణలో అప్పుడే రూపుదిద్దుకుంటున్న మధ్యతరగతి తన గ్రామీణ వేళ్లను పెళ్లగించుకొని, కొత్తగా పట్టణంలో కొత్త జీవితం ప్రారంభించాలనే దృష్టిని తెలుపుతుంది. నిజానికి అది చెడ్డదిగా ఇప్పుడు కనపడవచ్చు. పల్లెటూరి బాల్యవివాహ భార్యను వదిలించుకుని పట్టణపు షోకులను జీవితంలో భాగం చేసుకుని నాగరికంగా బతికే అమ్మాయిలను పెళ్లాడాలని కొన్ని వందల, వేల విడాకుల పంచాయతీలు ఆనాటి సమాజంలో కొనసాగాయి. కొందరు రాజీపడిపోయారు. కాలక్రమంలో పల్లెటూరి భార్యలు కూడా తమను తాము మార్చుకున్నారు. తొమ్మిది గజాల గోచి చీర నుండి ఆరు గజాల చీరకు ఒక విప్లవం చేసినంత సంఘర్షణతో మారడం జరిగింది. తొమ్మిది గజాల గోచి చీర నుండి ఆరు గజాల చీరకు మారిన స్త్రీలను పాతభావాల్లో ఉన్నవారు గేలిచేసేవారు. ఇలాంటి ఎన్నో విషయాలను సామాజిక పరిణామాలను గూడూరి సీతారాం కథలు గుర్తుచేస్తాయి.

"దెబ్బతిన్న అహంభావం" కథ "అందని ఆకాశం" కథకు తరువాయి భాగంలా కనపడుతుంది. కథ ప్రారంభం కూడా అలాగే జరిగింది. కానీ, ఈ కథ అందని ఆకాశం కన్నా రెండు నెలల ముందే తెలుగుదేశం పత్రికలో 25-2-1954 సంచికలో అచ్చయింది. "అబ్బాయి హృదయం నిరాశా నిస్పృహలతో నిండిపోయింది. వయసు మాత్రం చిన్నదే! ఏదో జీవితంలో అంతులేని గాయాలు తగిలి మూల్గి మూల్గి నిరాశ జెందాడంటే లెక్కలేనిదిగాదు. జీవితంలో ఎన్ని సంఘటనలు అలలలాగా రావా? పోవా? ఇది అబ్బాయికి తెలుసు! ఐనా ప్రతిదీ ఎందుకు జరిగింది? అని స్థనశల్య పరీక్షచేస్తే ఏముంటుంది?


ప్రేమించి పెళ్లి చేసుకున్న అమ్మాయి. చక్కని కాపురం అయినా ఎందుకు అసంతృప్తి? ఇది ఇప్పటికీ చాలామంది స్త్రీ పురుషులు ఎదుర్కొంటున్న సమస్య. ఇది ఎందువల్ల జరుగుతున్నదో రచయిత పద్దెనిమిదేళ్ళ వయసులోనే ఒక సామాజిక శాస్త్రవేత్తలాగా ఇలా స్పష్టం చేస్తాడు. "పెళ్లయ్యాక అమ్మాయి సర్వవిధాలా తనదైపోయిందనే అహంభావం అబ్బాయిలో చెలరేగింది. సహజంగా వుండే అమ్మాయిలోని ఏ కొద్దిపాటి తప్పిదమైనా అబ్బాయికి కొండంతగా కన్పించసాగింది ఆఖరుకు."

చక్కని కోడలిని ఇంటికి తీసుకురాకుండా ఏవేవో చెప్తున్న కొడుకును చూసి తల్లి

హృదయం బాధతో మూల్గుతుంది. చివరికి అమ్మాయే ఉత్తరం రాస్తుంది. కథ సుఖాంతం అవుతుంది. ఈ కథలో పురుషాహంకారం దానికి వుండే పశ్చాత్తాప గుణం అయినా బయటపడని స్వభావం, స్త్రీలు రాజీపడి తిరిగి సంసారాన్ని నిలబెట్టుకోవడం చిత్రించారు. చిన్నసమస్యను పెద్దదిగా పెంచుకుని తిరిగి చిన్న సమస్యగా పరిష్కరించుకోవడం సాధ్యం కాక ఎన్నో కాపురాలు సంఘర్షణకు నిలయమవుతున్నాయి. దీన్ని పసికట్టిన రచయిత పద్దెనిమిదేళ్ళ వయసులోనే పరిష్కారాలు చూపడం ఆసక్తికరమైన విషయం.

తెలంగాణా సామాజిక చరిత్రకు నిలువెత్తు సాక్ష్యం గూడూరి సీతారాం కథలు :

తెలంగాణా సామాజిక చరిత్రకు నిలువెత్తు సాక్ష్యం గూడూరి సీతారాం కథలు. ఇవి ఆనాటి తెలంగాణ సమాజాన్ని పలుకోణాల్లో చిత్రించాయి. ప్రస్తుతం దొరికినవి 14 కథలే. మొత్తం 80 కథలు దొరికితే ఇంకెంత వైవిధ్యపూరితంగా ఉంటాయో! ఈ దొరికిన కథల్లో కూడా తెలంగాణ జీవితంలోని సామాజిక పరిణామాలు అద్భుతంగా చిత్రించబడ్డాయి. గ్రామీణ స్త్రీలు, రైతులు, పేదలు, గ్రామీణ విద్యార్థులు, పట్నపు విద్యార్థులు, ప్రేమలు, ప్రేమ పెళ్లిళ్ళు, నిరుద్యోగం, పట్నపు సంస్కృతి, కులవృత్తుల జీవితాలు, సుబ్బ పొదరు, రైలు, బస్సు, జీవితంలో ప్రవేశిస్తున్న తీరు అవి గ్రామీణ, పట్టణ ప్రజలను ప్రభావితం చేస్తున్న తీరును అపూర్వంగా ఈ కథల్లో ఒడిసిపట్టారు. ప్రకృతి అంత సహజంగా పల్లెలంత సహజంగా ఇందులోని భాష కథనరీతులు, జీవితాలు మన హృదయాలకు హత్తుకుంటాయి. తెలంగాణ సాహిత్య చరిత్రలో ఇలాంటి గొప్ప గొప్ప కథలెన్నో చరిత్ర అడుగున దాగి వున్నాయి. వాటిని వెలికితీసి సాహితీ చరిత్రను పునర్ నిర్మించవలసివున్నది. తెలంగాణ కథా సాహిత్యానికి గొప్ప చేర్పును అందించి తెలుగులో ప్రేంచంద్ లేని లోటును తీర్చిదిద్దారు. తెలుగు సాహిత్య వారసత్వం వారిని, వారి కృషిని చూసి ఇప్పుడు సగర్వంగా తలెత్తుకుని తిరుగుతుంది. సాహితీ స్వర్ణోత్సవం సందర్భంగా గూడూరికి తెలుగు సాహిత్యం జేజేలు పలుకుతున్నది.



'ఉష' సంపాదక వర్గం పి. సత్యనారాయణ, యం.తిమ్మారెడ్డి, డా.సి.నారాయణరెడ్డి(హితవరి), గూడూరి సీతారాం(ముఖ్య సంపాదకుడు), కె. అంజల్‌రెడ్డి (1961)



'ప్రజాకవి' **సిహెచ్. రాజలింగం**
జెండాదగ్గర, పోస్టాఫీసు లైను, సిరిసిల్ల.

సిరిమువ్వల సీతారాం

మాది ఉద్యమాల పురిటిగడ్డ కోనరావుపేట. ఒక పున్నమిరాత్రి నాడు మా ఇంటి వాకిట్ల పడుకుని ఆకాశం దిక్కుచూస్తూ ఒక పాట రాయాలని ఆలోచిస్తున్నాను. అదే సమయంలో ఇద్దరు బోడదాసరి, అమ్మాయిలు, కూనిరాగంతో చక్కని భాణీతో పాడుతున్నపాట వినిపించింది.

పాట : సిరిమల్లె చెట్టుకింద రాములమ్మో రాములమ్మా
నువ్వు చిన్నబోయి కూసున్నవెందుకమ్మా ఎందుకమ్మా

దరువు : కదుపులో నొప్పిరో లంబడయ్యో లంబడయ్యో
నువ్వు కమ్మైన సెయ్యవురో లంబడయ్యో లంబడయ్యో

ఇది సిరిగల పాట. ఈ పాట నా ప్రస్థానానికి ముందు మాటయింది. నా జీవితానికి ఈ పాట అచ్చంగా మెరుగులు దిద్దింది. అక్షరాల్ని దిద్ది ఆయుధాన్ని పట్టిన నా చేతుల్లో ప్రాణంగా దాచుకున్న చిరుగజ్జెలు, కంజెరతీసుకుని సిరిసిల్ల వచ్చి స్థిరపడ్డాను.

అదే సమయంలో పెద్దబజారులోని హనుమాన్ దేవాలయం వెనుక జంగాల ఇంట్లో హనుమాజి పేటకు చెందిన సింగిరెడ్డి నారాయణరెడ్డి నివసిస్తూ పాఠశాల విద్యను అభ్యసిస్తుండేవారు. ఒకరోజు వారితో పరిచయభాగ్యం కలిగింది. అదే సమయంలో గోలకొండ పత్రిక విలేఖరిగా ప్రజాశక్తిలో ప్రచురితమైన నా గేయాన్ని వారికి చూపించాను. వారు గేయాన్ని చదివి చూపించిన ప్రేమ అభిమానము నా రచనా జీవితానికి స్ఫూర్తినిచ్చాయి. కొంతకాలంలోనే వారు పైచదువులకు కరీంనగర్, హైదరాబాదులకు వెళ్ళారు. ఇంతలోనే మరో యువమిత్రుడు అదే హనుమాజిపేట నుండి ఆయన వారసత్వాన్ని తీసుకుని సిరిసిల్లకు వచ్చాడు. ఆ యువకుడు గూడూరి సీతారాం. ఆయన రాకతో సిరిసిల్లలో ఒక నూతన అధ్యాయానికి అంకురార్పణ జరిగింది.

మరో కొంతమంది యువమిత్రులు సిరిసిల్లకు వచ్చి చేరటంతో మానేరు తీరంలో సాహితీ చైతన్యానికి కొత్త ఊపువచ్చింది. కనపర్తి లక్ష్మీనర్సయ్య, గూడూరి శంకరం, ఆదిరెడ్డి, బద్దం వేంకటరేడ్డి, దుగ్యాల మోహన్, సిద్దిరెడ్డి, బి. బిక్షపతి, మధుసూదన్ వీళ్లంతా ఆనాటి మా సాహితీ మిత్రమండలికి సిరిమువ్వలు. సిరివెలుగులు.

ప్రతిరోజు సాయంత్రం నాలుగు అయిదు గంటల ప్రాంతంలో మానేరు వాగులో సమావేశమయ్యేవాళ్ళం. సాహితీ సమాలోచనలు. చర్చలు, గోష్ఠులు రాత్రయ్యేవరకు సాగేవి. ఆనాడు సిరిసిల్ల నుంచి వెలువడిన 'తరంగిణి' తెలంగాణా రచయితల సంఘం పత్రిక 'నినాదం'లో గూడూరి సీతారాం కథ, జి. రాములు కథ, కనపర్తి పద్యాలు అచ్చయినయి.

అప్పుడే ఏర్పడ్డ తెలంగాణా రచయితల సంఘానికి అధ్యక్షులు మహాకవి దాశరథి గారు, ప్రధాన కార్యదర్శిగా సి. నారాయణరెడ్డి గారు ఎన్నుకోబడ్డారు. తెలంగాణంలోని అన్ని ప్రాంతాలు విస్తృతంగా పర్యటించి సభలు, సమావేశాలు నిర్వహించి ఎందరో యువకులకు స్ఫూర్తిని కలిగించేవారు. వేలాదిమంది రచయితలను మేల్కొలిపి ఒక నూతన వాతావరణానికి, అంకురార్పణ చేశారు. ఈ సాహిత్యోద్యమంలో భాగంగా సిరిసిల్లలోని యువకులు కూడా చిరుగజ్జెలతో నాట్యమాడి చిందులు తొక్కినారు. సీతారాం అదే స్ఫూర్తితో విరివిగా కథలు రాయడం ప్రారంభించి వివిధ పత్రికల్లో ప్రచురించేవారు. ఈ సమయంలో ప్రజామత పత్రికలో వచ్చిన కథలు సీతారాంకు కథారచయితలుగా ఆంధ్రప్రదేశమంతటా గుర్తింపును తెచ్చిపెట్టాయి.

సిరిసిల్లలో జి. రాములు, ఆచి వేంకటాచార్యులు వంటి వారి ప్రోత్సాహంతో తెలంగాణా రచయితల సంఘం శాఖ ఏర్పాటుచేశాం. దానికి కనపర్తి అధ్యక్షులు, గూడూరి నేను కార్యదర్శులం. మార్కండేయ వీధిలోని సీతారాం పాత యింటిలోని మేడపై సంఘ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నాం.

1922లో మాడపాటి హనుమంతరావు గారిచే ప్రారంభింపబడి మూతబడిన 'వెలిగందుల నారయ ఆంధ్ర భాషానిలయం'ను తిరిగి పునరుద్ధరించి నడిపించాలన్న సాహస నిర్ణయాన్ని తీసుకుని సంఘం పక్షాన పాత పోస్టాఫీసు లైనులో అద్దె ఇంటిలో నిర్వహించడం ప్రారంభించాము.

కీ.శే. కె. భూమయ్య వకీలు గారి ప్రోత్సాహంతో సభలు సమావేశాలు జరిపేవాళ్లం. సంఘం పక్షాన భూమయ్య వకీలు షష్టిపూర్తి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించి ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం, దివాకర్ల వేంకటావధాని, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, పల్లా దుర్గయ్య, వేముగంటి, చిత్రకారులు బలరామాచారి, కాపు రాజయ్య, దాశరథి, నారాయణరెడ్డి గార్లను ఆహ్వానించి సంభలు నిర్వహించాము. సీతారాం అన్నింటాతానై నిలిచేవాడు.

ఇదే సమయంలో సినారె పిలుపు పై చదువుల కోసం సీతారాం హైదరాబాదుకు

వెళ్ళి కాలేజీలో చేరారు. ఆంధ్ర అభ్యుదయోత్సవాలు, తెలంగాణా రచయితల మహాసభ, అప్పటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, అధ్యక్షతన కోటి పార్కులో జరిగిన సభలకు సీతారాంతో పాటు నేను కార్యకర్తగా పనిచేశాను.

అలంపురములో జరిగిన తెలంగాణా రచయితల మహాసభలను భారత ఉప రాష్ట్రపతి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు ప్రారంభించారు. దేవులపల్లి రామానుజరావు అధ్యక్షతన జరిగిన సభల్లో 'చలో అలంపురం' కార్యక్రమంలో సీతారాంతో పాటు ఇక్కడి యువకులమందరం పాల్గొన్నాం. కవులందరికోసం కాచిగూడ స్టేషన్నుండి ఒక ప్రత్యేక రైలు బయలుదేరగా దారిపొడుగునా స్వాగత తోరణాలు, భోజనాలు, అల్పాహారాలు ఏర్పాటుచేశారు.


సంపత్‌కుమార జ్వాలరి నృత్యం, నటరాజ రామకృష్ణ ఆంధ్రనాట్యం, సత్యనారాయణ భామా కూపం ఉత్సవాల్లో హైలెట్‌గా నిలిచాయి. శ్రీశ్రీ, విశ్వనాథలను చూసే అవకాశం ఈ సందర్భంగా లభించింది. నిజాం కాలేజీ విద్యార్థిగా 'ఉష' సంచికకు సంపాదకత్వం. రెడ్డి హాస్టలు సారస్వత సంఘం నిర్వాహణ, రేడియో నాటికలు ప్రతి పత్రికలో కథలు వేములవాడలో సినారె అభినందన సభ ఇలా అన్నింటా తానే అయిన సీతారాం కార్యక్రమాలు నిర్వహించి ఆనాటి యువతరాన్ని స్ఫూర్తిగా నిలిచారు.

మళ్లీ సుదీర్ఘ విరామంతర్వాత పదేళ్లుగా మారసం అధ్యక్షులుగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు సిరిసిల్లలో మళ్లీ యాభై యేండ్ల క్రిందటి కార్యక్రమాలకు తలపిస్తున్నాయి. తెలంగాణా తొలితరం రచయితగా విశేష సాహితీ సృజన చేసిన సీతారాం కథలు రాసి యాభై యేండ్లయిన సందర్భంగా చేస్తున్న స్వర్ణోత్సవం ఒక్క సీతారాంకే కాదు మా అందరికి దక్కిన గౌరవంగా భావిస్తున్నాం. గూడూరి సీతారాంకు నా హృదయపూర్వక అభినందనలు.



కళాసాగర్ సిరిసిల్ల ప్రారంభోత్సవంలో గూడూరి సీతారాం, రాళ్ళపల్లి, డా. యం.ఎస్. రెడ్డి, శికారి విశ్వనాథం, రుద్ర రవి గార్లు

ఎం. నారాయణ శర్మ
2-10-1275, చైతన్యపురి,
కరీంనగర్, సెల్ : 9848348502



గూడూరి కథల్లో భాషా ప్రయోగాలు

సాధారణంగా ప్రతి రచయితకి, కవికి తనదంటూ ఒక శైలి ఉంటుంది. నిజానికి వస్తువు మీదా, సిద్ధాంతం మీద ఒకింత నిబద్ధతతో రాసేవాళ్లలో కూడా తనవంతుగా భాష ఒక ప్రత్యేకతను చూపుతుంది. సాధారణంగా రచయితలకు ఉద్దేశ్యాలు, భావాలు, ఆలోచనలు మొదలైనవాటి మీద ఎక్కువ దృష్టి ఉంటుంది. ఇవన్నీ చేరడానికి భాష ఒక వాహకం మాత్రమే. తెలుగు కథా స్రవంతిలో భాష ఒక ప్రధానంశం, పూర్వ రచయితలు తమ రచనల్లో తమకంటూ ఒకశైలిని తమ రచనల్లో కనబరిచారు. ఒక రచయిత తాను రాసే రచనకు సంబంధించిన భాషని ఎన్నుకుంటాడు. సన్నివేశానికి, సందర్భానికి ముఖ్యంగా పాత్ర స్వభావానికి సంబంధించిన భాషని ప్రయోగిస్తాడు.

ఒకనాటికి వచనానికి గణాలు, యతిప్రాసలు లేవనే కాని అవి పద్యరచనలకు ఏ మాత్రం తీసిపోనివి. మన పూర్వకవులు రాసిన వచనాన్ని ఇప్పటికీ రాగయుక్తంగా పాడేవాళ్లున్నారు. సుమారుగా ఇరవయ్యో శతాబ్ది తొలి, మలిదశల్లో భాష విషయంలో, వస్తువు విషయంలో రచయితల్లో శ్రద్ధ కనిపిస్తుంది. పద్యంలోనైనా, గద్యంలోనైనా రచయితకు సంభాషణలని చెప్పడానికి ఒక పద్ధతి ఉంటుంది.

తెలుగు రచయితల్లో చాలామందికి ఒక ప్రత్యేక భాష, శైలి ఉన్నాయని చెప్పుకుంటారు. 1953-65 మధ్యకాలంలో సుమారుగా ఎనభై కథలు, రెండు నవలికలు రాసిన గూడూరిలో కూడా భాష విషయంలో తనకంటూ ఒక పద్ధతి కనిపిస్తుంది. ప్రస్తుతం తెలంగాణా భాషలో ఎన్నోకథలు, కవితలు శీర్షికలు వస్తున్నాయి. ఇప్పుడు తెలంగాణా కవులు, రచయితలు ప్రజాభాషలో రాయడాన్ని తమ బాధ్యతగా భావిస్తున్నారు. మాండలికం పైన ఒక స్పష్టమైన అభిప్రాయం లేని సమయంలో కూడా చాలామంది మాండలికాన్ని వాడుకున్నారు. ఆ విధంగా వివిధ కాలాల్లో మాండలికానికి పట్టం కట్టిన రచయితల్లో మొదటి వరుసలో చెప్పుకోవలసింది గూడూరి సీతారాం గురించి.

గూడూరి భాష గూర్చి వాక్య నిర్మాణ పద్ధతి గూర్చి చెప్పుకోడానికి ప్రస్తుతం మనకు లభిస్తున్న గూడూరి కథలు ఒకింత ఉపయోగపడతాయి గాని, ఆయన భాషకున్న విస్తృతిని, వైశాల్యాన్ని సమగ్రంగా అధ్యయనం చేయడానికి ఉపయోగపడకపోవచ్చు.

తొలినాళ్లలోనే కథలు రాసినప్పటికి గూడూరి రెండు రకాల భాషారూపాలను అనుసరించాడు. అనాటికి ఇంకా గ్రాంథికం, సులభ గ్రాంథీకాల ప్రభావాలు రచయితలపై బలంగానే ఉన్నాయి. ఆ బంధనాల్లోంచి గూడూరి తనదైన గొంతుకని వినిపించాడు. ఆయన కథల్ని చూసినప్పుడు స్వభావోచితంగా భాషను ప్రయోగించడం గూడూరి భాషకి మొదటి లక్షణంగా కనిపిస్తుంది. గూడూరికన్నా కాస్తముందు సురమౌళి, జి. రాములు వంటి రచయితలు మాండలికాన్ని సమర్థవంతంగా ప్రయోగించారు. తన శైలి చేత, పద ప్రయోగాలచేత, తెలంగాణాభాషని, తెలుగుభాషని ప్రభావితం చేసిన ఘనత గూడూరిది.

ప్రాథమికంగా గూడూరిలో కనిపించేది ఆయనరాసే స్పెల్లింగులు. ఉచ్చారణను ప్రతిబింబించే పద నిర్మాణం గూడూరిది. ఉచ్చారణకు అతి దగ్గరగా పద రూపాలను రాయాలన్న తపన ఆయనలో కనిపిస్తుంది.

'గ్యాపకం' 'జూషినాంక' 'కచ్చరం' 'గీరలోలె' 'సూత్తుండె' 'తీర్తం' 'టేషను' 'ఇసుపేటు' 'జార్నె' లాంటి పదాలు అందుకు ఉదాహరణ. వర్గంలోని మొదటి అక్షరాల స్థానంలో మూడో అక్షరాలని రాయడం. పదాలను అక్షరాలుగా విడగొట్టి రాయటం నాటి ఆకృతిని విస్తృత పరవడం కలిపేయడం. అల్ప ప్రాణాల స్థానంలో మహాప్రాణాలని రాయటం కనిపిస్తుంది.

గూడూరి పదాలలోల ప్రధానంగా కొన్నిటిని గమనించవచ్చు. 'వలె' అన ప్రత్యయం స్థానంలో 'వలె' 'లా' అని కొన్ని చొట్ల 'మొలిగె' అంటూ కొన్నిచోట్ల వాడతారు.

'దయ్యమొలిగె' వొర్రె బొంగులుంటాయి (పిచ్చోడు 53)

'పామోలిగె' (పిచ్చోడు)

గూడూరి రాసే క్రియల్లో కొన్నిచోట్ల అవిరూపపరంగా అసమాపకాల్లా ఉంటాయి. పూర్తి సమాపకక్రియల్లా అర్థాన్నిస్తాయి.

'ఇంట్లుందంతా ఆముండ చేతుల వెట్టె' (పే. 9)
'దోమలు గరుసుడాయె' (పే. 9)
'తోలి సదువు జెప్పియ్యాలె' (పే. 2)
'ఏం తినాల్నో తెల్వలే' (పే. 30)

ఇలాంటి అసంపూర్ణ క్రియలు గూడూరి మూడు కాలాల్లోనూ ప్రయోగించారు.

పెట్టె (భూతకాలం)
కరుసుడాయె (వర్తమానం)
చెప్పియ్యాలె (భవిష్యత్కాలం)

కథల్లో అక్కడక్కడా ఇంగ్లీషు పదాలు రాసే అలవాటు గూడూరికి కూడా ఉంది.

'నా రెస్పెక్ట్' నంతా బూడిదలో పోస్తుంది (పే. 50)
'అప్టుడేట్ గర్ల్' తయారు చేస్తే (పే. 50)
పిన్ లేదు (పే. 51)

కొన్ని ఇంగ్లీషు పదాలు తెలుగులో వాడుతున్నప్పుడు అచ్చంగా తెలుగు పదాలే అనిపిస్తాయి. వాటికి వ్యవహారంలో అంత ప్రయోగావసరం ఉండటమే కారణం కావచ్చు. 'ఆఫీసు' 'బస్సు' 'జాకెట్టు' ఇటువంటిని అందుకు ఉదాహరణలు.

ఎక్కువ శాతం వాక్యాలను చూసినపుడు అందులో కర్త భిన్న వ్యాపారాలను అసమాపకాలుగా చూపుతూ అందులో చివరి క్రియను సమాపకంగా ముగిస్తారు కాని గూడూరిలో ఎక్కడో ఒకచోట తప్ప ఒక అసమాపక క్రియను ప్రయోగించడం కనిపించదు. విషయాన్ని కథనాన్ని చిన్న చిన్న వాక్యాలుగా చెప్పటం వలన ఇలా జరిగి ఉండవచ్చు. మొత్తంగా అసమాపకాలు అతితక్కువ అసమాపకం చెప్పే అవకాశం ఉన్నచోట కూడా సమాపకాన్ని చెప్పడం కనిపిస్తుంది.

లచ్చి మనసులో నవ్వు దొరలింది.
కళ్లపాపలను ఆనంద భాష్పాలతో గిలిపింది (పే. 20)
కన్నీరు కొంగుతో తుడుచుకుంది.
రంగని ముఖమంతా ఆ కొంగుతోనే అద్దింది (పే. 20)
తెచ్చిన నగలు కుదువవెట్టిండు
రెండుతాళ్లను తీసుకొన్నడు (పే. 23)

'నవ్వుదొరలి, కళ్లపాపలను......' 'కొంగుతో తుడుచుకుని, రంగని ముఖ......' 'తెచ్చిననగలు కుదువెట్టి, రెండు....' అంటూ అసమాపకాలని చెప్పొచ్చు. కాని గూడూరి పూర్తిభాషలో వచ్చి తెచ్చివంటి కొన్ని తప్ప అసమాపకాలు ఎక్కువగా కనిపించవు. వాక్యాల విషయంలోనూ గూడూరికి ఇటువంటి అలవాట్లున్నాయి. వాక్యం మధ్యలో ఒకపదాన్ని రెండుసార్లు చెప్పడం గానీ, సమాంతర భావాన్ని, స్థాయిని కలిగించే వేరువేరు పదాల్ని చెప్పడం గాని కనిపిస్తుంది.

'కల్లు అమ్ముతుండంగ, అమ్ముతుండగానే పాణం విడిసింది' (పే. 23)
'పని జేత్తు జేత్తు చచ్చిపోయింది' (పే. 23)
'అప్పులవాడు వచ్చి డబ్బోడబ్బని పీక్కుతింటున్నాడు'
'రంగడొక్క దుంకు దుంకిండు' (పే. 28)
నవ్వు పొరలు పొరలుగా పొరలిపోయింది' (పే. 34)
'ఏడ్పు దొంతరలు దొంతరలుగా దొర్లిపోయింది' (పే. 64)
'అవసరముంటే నాలుగో అయిదో యిచ్చి లెక్కదుగంతున్నాడు' (పే. 28)
'మా ఉంటే పదమూడు పద్నాలుగేండ్లు ఉండవచ్చు' (పే. 21)
'గుంజినోన్ని నాలుగైదు తన్నిండు'

నిజానికి పైన ఉన్న వాక్యంలో ఉన్న రెండు పదాల్లో ఏదో ఒకటి ఉన్నా అర్థానికి, అవగాహనకి కష్టమేమీ లేదు. కాని రెండుసార్లు ప్రయోగించడం వల్ల ఒక అనుకోని సంఘటనను వ్యక్తీకరించడం, వాక్యంలో ఉన్న సామర్థ్యాన్నిపెంచడం కనిపిస్తుంది. కింద చెప్పిన వేర్వేరు పదాల ప్రయోగం వల్ల కూడా వాక్యంలో నిర్దిష్టత, ప్రయోజానికి కలిగే ఇబ్బందేమీ లేదు. కానీ నిర్దిష్టంగా ఒకే పదాన్ని చెప్పడంవల్ల, ఉరామరికగా రెండు పదాల్ని చెప్పడం వల్ల కలిగే ఊనిక కలుగదు.

కథకుల్లో చాలామందికి ప్రశ్నల ద్వారా విషయాన్ని చెప్పే అలవాటు ఉంటుంది. దీనివల్ల పాటకుడికి విషయమే అర్థమౌతుంది. ఉదాహరణకి –

'నన్ను నాకాళ్లు, కళ్లు లాక్కొస్తాయా?' ఇందులో 'లాక్కురావు' అంటూ సమాధానమే ఉంటుంది. ఇలా ప్రశ్నలతోనే సంభాషణలు చెప్పే అలవాటు చాలామంది రచయితల్లా గూడూరికీ ఉంది. అయితే గూడూరి ప్రశ్నలని పేరాగ్రాఫులుగా రాసి విషయాన్ని దృష్టికి తేవడం కనిపిస్తుంది. ఇటువంటి దాన్ని విమర్శకులు వాక్యగుంఫన శైలి అన్నారు. ఈ అలవాటు ఎక్కువగా చలంలో కనిపిస్తుంది.

'అమ్మాయి పరపురుషునితో ఏం మాట్లాడుతుందో? అలా ఎందుకు మాట్లాడుతుందో? తేడా తెలుసుకుంటే ఇంతదూరం జరిగేదా కథా? చిన్ననాటి నుండి ప్రేమించుకుని ఇంతవరకు ఆనందాన్ని అందించిన అమ్మాయిని అకారణంగా అనడం ఏంబాగుంది? పోనీ! ఒక్కళ్లు తప్పుచేస్తే, ఒకళ్లు దిద్దుకోరాదా? ఇంత చిన్న విషయానికే అమ్మాయి వెళ్లిపోయి ఏం సుఖపడుతుంది?'

ఇలా వాక్యాల్ని ప్రశ్నలు ప్రశ్నలుగా ప్రయోగించడంలో సమాధానాలు స్ఫురిస్తూ ఉండటమే కాకుండా, ఒకింత అసహనాన్ని, ఉద్వేగాన్ని, ఉద్రేకాన్ని, తపననూ, ఆరాటాన్ని వెలిగక్కుతాయి. సంభాషణల్లో ఉత్కంఠతనం వెలిగక్కడం ఒక పద్ధతి. పూర్వ రచయితల్లో చాలామందికి ఉంది. క్రింది వాక్యాలు చదివితే గూడూరికి ఇటువంటి ప్రయోగాలు చేయడంలో ఎంతటి సమర్థుడో అర్థమవుతుంది.

'అంతేనా?
అంతే!
చాలదూ?
ఈ అర్థంలేని జీవితానికి అంతకన్నా ఎక్కువనా' (పే. 38) సంభాషణకి రకరకాల వ్యక్తీకరణలు వాడుకున్న వారిలాగే గూడూరి కూడా చిన్న చిన్న సంభాషణలు రాసి భావాన్ని వ్యక్తీకరించారు. ఒక్కోసారి ఉద్వేగంగా మాట్లాడుతున్నవారి భాషలో ఒక చురుకుదనం ఒక ఆదుర్దా. ఓ అంతర్ముఖత్వం ఇవన్నీ ఉంటాయి.

గుండెలో గుండు పడ్డది బస్సుమళ్లీ అగుతుందేమో? ఆశ! వెర్రి ఆశ!
ఆగలేదు నడకసాగింది.
అప్పుడెన్నో చెప్పాలని, దానివెంట పరుగెత్తాలని
నెత్తురు ఒత్తిడి,
ఏదీ నరాల సత్తువ......(పే. 38)

మైకం, ఆవేశం, అసంపూర్ణ పదాలని పలికిస్తాయి. 'బస్సు కదిలింది' అనే కథలో గూడూరి రకరకాల ఉద్వేగాలని వ్యక్తీకరిస్తారు.

'ఆమెను, అతన్నీ...కాదు, ఆమెను హుఁ....హుఁ...అతన్నీ, అయ్యోకాదు'

ఏ వాక్యాన్ని సంపూర్ణం చేయలేని ఓ పరవశం. ఆదుర్దా. ఇటువంటి పదాలు వాక్యాలు పాఠకుల్లో రచయితకున్నంత ఉద్వేగాన్ని, ఉద్రేగాన్ని కలిగిస్తాయి. కొన్ని చోట్ల వ్యవహార బద్ధంగాని భాషను వాడుతుంటారు. ఒకరకంగా ఇదీ ఉద్వేగమే. ఇటువంటి

వాక్యాలు శాస్త్ర అసంబద్ధతని చూపించినా ఇవి వాక్యాల్లో ఇమడాల్సిన భావోద్రేకాలకం స్పష్టమైన న్యాయాన్ని చేస్తాయి.

రంగనికి పైసలు రాకేం తక్కువలేదు' (పే. 14)

గూడూరి కథల్లో ఒకటి రెండు కథల్లో పూర్తిగా ఒక ఉద్రేకం తొందర ఉంటుంది. ఒక అసహనం, ఒక తిరస్కారం ఇవన్ని వాక్యరూపాన్ని వేగవంతం చేస్తాయి. ఇందులో సాధారణంగా చదువుతుంటేనే పఠనం వేగవంతమౌతుంది. అది వాక్య నిర్మాణంలో ఉన్న శక్తే. దీన్ని మరో స్థాయిలో చదివితే ఆ అనుభూతి కలుగదు. ఇందులో కొన్ని వాక్యాలను చూస్తుంటే గూడూరి ఎంత బలమైన వాక్యప్రయోగం చేయగలడో గ్రాంథికాన్ని రాసికూడా ఎలా తృప్తిపరచగలడో అర్థం అవుతుంది.

'ఎందుకలా మనసు పారిపోయింది. కోమల కరాలు హృత్పుటాలను కదిలిస్తుంటే ప్రాణం ఆమె ప్రాంగణంలోకి ప్రాకిపోయిందా? అరుణాధరాల నిండి దొంతరలు దొంతరలుగా దొర్లిన జలపాతంలో కొట్టుక పోయిందాహృదయం?'

ఇంత నెమ్మదిగా వాక్యం చెప్పగల గూడూరి చేతిలో వాక్యం ఎలా వేగంగా రూపుదిద్దుకుందో ఈ వాక్యం చూస్తే తెలుస్తుంది.

'ఉద్రూత లూగుతున్న హృదయానికి ఇవన్నీ ఎందుకు? అప్పుడు కావలసింది ఆనందం! మహదానందం! వెచ్చని సుఖం అంతే! అంతే!'

ఇలాంటి వాక్యాలు చూసినప్పుడు తను సంభాషణలో ఎంతగా లీనమవుతారు. పాత్రోచితంగా కసిని, ఆనందాన్ని ఉల్లాసాన్ని ఉద్వేగాన్ని ఎలా వ్యక్తీకరిస్తారు. ఎంతలోతుగా అనుభవిస్తారు అనేది తెలుస్తుంది.

గూడూరి కథల్లో రెండు రకాల భాషలు జీవం పోసుకున్నాయి. తెలుగుదనంలో ఉండే సొగసును, తెలంగాణా భాషలో ఉండే స్థైర్యాన్ని భాషను భావాన్ని దూరం చేయలేని ఓ కలివిడితనాన్ని బాగా ఉపయోగించుకున్నారు గూడూరి. వాక్యాలని చిన్నచిన్నగా చెప్పడం. మూడు నాలుగు చిన్న వాక్యాల తర్వాత ఓ పోలికని చెప్పడం ఉచ్చారణా సంప్రదాయాన్ని అనుసరించి రాసేస్పెల్లింగులు వాక్యరచనలో అనుభవించే రకరకాల అనుభూతులు ముఖ్యంగా 'జూసిండు, తెచ్చిండు, పెట్టుకుండు, బయలుదేరిండు, ఆలోసించిండు' లాంటివి గూడూరి శైలిని పట్టించే భాషా ప్రయోగాలు.

గూడూరి కథలు చదువుతున్నంతసేపు ఆయన చాతుర్యం భాషమీద ఆయనకున్న ప్రేమ. ఒక సంపూర్ణ అనుభవాన్ని, అనుభూతిని వెళ్లగక్కడానికి ఆయన పడే శ్రమ అర్థమౌతుంది. గూడూరి సీతారాం లాంటి కథకుల భాషమీద మరిన్ని వ్యాసాలు రావడం, మరింత పరిశీలన జరగడం తెలుగును తెలుగువారు గౌరవించుకోవడమే.



డా. గూడూరి రాఘవేంద్ర
జగిత్యాల

స్వ-గతం

జీవనగమనము, గతీ ఎటు తిరిగిపోతుందో తెలీని వయస్సు అంటే ముప్పై నలభై సంవత్సరాల క్రితం జ్ఞాపకాల పుటలని తిరిగేయడం కష్టమైన పని మరి!

మూడో నాలుగో తరగతి వరకే పల్లెలో ఆకాలం చదువులు. ఆ తరువాత పట్నాలకెళ్లాల్సిందే ఆపైచదువులకి సెలవుల్లో పండగలకి పబ్బాలకి వొచ్చిన వేసవి సెలవుల్లో మాత్రం ఊళ్ళోకి రావడం తప్పనిసరి. మరీ ఆనందించేది కూడాను. అలా వేసవిలో హన్మాజిపేటకు నారాయణరెడ్డిగారు వొచ్చేవారు. కవితా వ్యాసంగం సాగించేవారూనూ. నిజాం కాలేజీలో లెక్చరరు గూడాను. అన్నయ్యా, కనపర్తిగారు ఆదిరెడ్డి, నేనూ అందరం సాయంకాలం కాగానే వారింటికి చేరేవాళ్ళం. సరదాగా కబుర్లాడుతూ నది ఒడ్డుకుచేరి ఇసుకలో కూర్చొవడం పరిపాటి. నారాయణరెడ్డి గారేమో వారి కవితల్ని వినిపించడం కబుర్లు చెప్పడం జరిగేది. అలా సాహిత్యంపై అందరిలోను బీజం పడింది. కనపర్తి గారేమో కవితలవైపు, అన్నయ్యేమో కథలవైపు దృష్టిసారించారు.

పదవతరగతిలోనే అన్నయ్య సిరిసిల్ల పాఠశాల వార్షిక సంచికకు సంపాదకులై దాన్ని నిర్విఘ్నంగా వెల్లడించారు. ఆ తరువాత గ్రాడ్యుయేషన్‌కు హైదరాబాదుకి వెళ్ళారు. రెడ్డి హాస్టల్ వార్షిక సంచికకు సంపాదకులై తన సాహిత్య పిపాసకు సానబెట్టడం జరిగింది. అప్పుడే జానపదగేయాల సేకర్తగా కొన్నివందల గేయాల సేకరణ చేశారు.

గ్రాడ్యుయేషన్ కాగానే ఉద్యోగరీత్యా సాహిత్యంపై దృష్టి కాస్త మరుగునపడిపోయింది. నారాయణరెడ్డి గారి సాన్నిహిత్యం తగ్గడం కూడా ఓ కారణమై ఉండోచ్చు. మేమందరం అన్నయ్యతో సహ కనపర్తి గారు జీవన ప్రవాహంలో సాహిత్యానికి దూరంగా కొట్టుకు పోయాం.

తిరిగి అన్నయ్య యాభయ్యో అరవయ్యో ఏట సిరిసిల్లలో ఎగిసిన సాహిత్య కెరటాలకు వెన్నిదన్నుగా నిలిచారు. సాహిత్య సేవలో పూర్తిగా నిమగ్నమై అతి చిన్న వయసులోనే ఎనలేని సాహిత్యసేవ చేస్తున్న మోహన్ ఎన్నో వ్యయప్రయాసలతో అన్నయ్య గారి కథలు, నా కథలు వెదికి వెదికి పట్టుకొని 'గూడూరి సీతారాం కథలు' పేర అందంగా ముద్రించి పాఠకలోకానికి అందించారు. అభినందనీయలు. శ్లాఘనీయలునూ.

అన్నయ్య కథలని చదువుతుంటే సాఫీగా దొర్లిపోయేవాగులా గలగలా పారే సెలయేరులు స్ఫురిస్తాయి. ఆ పాత్రలు మన ప్రక్కనే కదిలినట్లుగా మనకెక్కడో పరిచయమున్నట్లుగా తోస్తాయి. పట్నంలోని ద్రాక్షలా కాకూండా పల్లెలోని రేగుపళ్ల కమ్మదనాన్ని స్ఫురింపచేస్తాయి కథల్లో కదిలే పాత్రలు.

ఇంత బాగా కృషిచేసిన మా మోహన్‌కు హాట్సాఫ్.

– రాఘవేంద్ర

గుడిపూడి సుబ్బారావు
అన్నవరగూడెం–508212,
జిల్లా : నల్లగొండ.

ఓ జ్ఞాపకం

'మైన రహూంగి, తుమ్ న రహోగే, ఫిర్ భి రహేంగి నిషానియా....'

ఇప్పటి మాటా! అర్థశతాబ్దం దాదాపు కావస్తున్నది–గూడూరి సీతారామ్‌తో నా పరిచయం!!

హైదరాబాదు రెడ్డి హాస్టల్ 'ఇ-బిల్డింగ్' ఫస్ట్‌ఫ్లోర్‌లో వుండేవాళ్లం. ఓ రూంలో నేనూ, అమృతరెడ్డి–మరో రూంలో సీతారాం, మధుసూదన్ (రెడ్డి) అనుకుంటాను. మరో రూంలో డా. అంజల్‌రెడ్డి, డా. చిలుముల రాంచంద్రారెడ్డి, ఎన్. ప్రభాకర్ (!) చదువుతున్న మెడిసిన్ వదలి బియ్యే ఇంగ్లీషు లిటరేచర్ చదివిన అరుదైన వ్యక్తి వుండేవారు.

ప్రతి బుధవారం రాత్రి ఎనిమిది గంటలకు సిలోన్ రేడియో నుండి 'బినాకా గీత్ మాలా' వినడం కోసం రేడియో రూం దగ్గిర కల్సుకునేవాళ్లం అంతగా చదువబ్బని నేనూ, నాతో కూడా తెలివిగల విద్యార్థుల్లో కాబోయే డాక్టర్లు, ఇంజనీర్లు, అడ్వొకేట్లు, గొప్ప గొప్ప క్రీడాకారులు ఎందరో ఎన్నిరకాల మనస్తత్వం కలకాళ్లమో అక్కడ కలుసుకోవడం అక్కడి వాతావరణం ఎంతో ఆహ్లాదంగా మారిపోయేది. నాలాంటి అమాయకులేకాదు–అనామకులేకాదు, అక్కడ కూడిన ప్రతివ్యక్తి–ఆనాటి పాటల రేంకులను విని వుప్పొంగిపోయి వినోదించినవారే! ప్రత్యేకించి 'ఆమీన్ సయాని' వ్యాఖ్యానం వినడం, మరింతగా మాకు వుత్సాహం కల్పించేది. ప్రత్యేకించి అక్కడ పోగయ్యే వారందరూ 'శంకర్-జై కిషన్‌ల' వీరాభిమానులే!–అనిపిస్తుందిప్పుడు–అప్పుడూను.

చిన్నప్పటి నుండీ, ఆనందంగా వుండడం, నవ్వుకోడం అలనాటయిన నాకు, రెడ్డిహాస్టల్లో చేరాక మరింతగా యీ రెండలవాట్లూ పదునైనాయి. అలా ఆ సీరీస్‌లో నాకు పరిచయమయ్యారు మిత్రుడు, తొలితరం తెలంగాణా రచయిత గూడూరి సీతారామ్. చదువుకోసం పెద్దగా కష్టపడింది లేదుకానీ– కురిసిన నవ్వుల్ని, ఆనందించడంలో మేం డాక్టరేట్ చేసినంత కృషిచేశాం.

సీతారాంను ఎప్పుడు చూసినా–నవ్వుతూనే మాట్లాడేవాడు. ప్రతిమాటా–నవ్వుతోనే మొదలు. డైనింగ్‌హాల్‌కు వెళ్లేప్పుడు–తిరిగి వచ్చేప్పుడూ–చదువుకునేటప్పుడు–ఎప్పుడూ నవ్వుకోడమే మాపని. మొదటి బ్యాచ్‌లో తినడానికి వెళ్లే మిత్రుడు (పేరు మర్చిపోయాను) రెడ్డి 'సిరికం జెప్పడు, శంఖుచక్ర' పద్యం చదువుతూ పోతున్నప్పుడు–మేమెంతనవ్వుకునే

వారమో! అసలు నవ్వుకోడం కోసమే హైదరాబాద్‌కు, ప్రత్యేకించి రెడ్డి హాస్టల్‌కు వచ్చామా అనిపిస్తుందిప్పుడు.

రేడియో రూమ్ తరువాత-రీడింగ్ రూంలో కలవడం-మా పరిచయానికి-దారులు సుగమం చేసివుంటాయి.

ఎందుకో చిన్నప్పటినుండీ నాపేరు అచ్చులో చూసుకోవాలన్న తపనవుండేది! ఏడవ తరగతి చదువుతున్నప్పుడే 'బాల' మాసపత్రిక నుండి ఓ కథని కాపీచేసి స్కూల్ మెగజైన్‌లో నాకథ 'సత్యమే జయం' జీ. సుబ్బారావు VII A అని అచ్చులో చూసి మురిసిపోతున్న మరుక్షణం, నేనుచేసిన తప్పుడు పనికి మా అన్నయ్య (భవిష్యత్తులో ఐ.ఏ.ఎస్. వరకు పెరిగాడు) శ్రీనివాసరావు ఎక్కడ తంతాడోనన్న భయం-నన్ను మరింతగా భయపెట్టేది. ఆ భయాన్ని పోగొట్టుకోడానికి అవకాశం దొరికితే స్వంతంగా ఓ కథ రాయాలని ఆరాటపడ్డాను మరోమూడు నాల్గు సంవత్సరాలవరకు. రెడ్డి హాస్టల్‌కు వచ్చాక నాస్వంతకథ అచ్చులో చూసుకుని మురిసిపోయాను ఎంతగానో. రెడ్డి హాస్టల్ కార్యవర్గం ప్రతిసంవత్సరం 'ఉష' అనే ఓ సంచిక వెలువరించేవారు. దాని సంపాదకులుగా గూడూరి సీతారాం బాసాని సుదర్శన్‌రెడ్డి ఉండేవారు. సీతారాం ఫుల్‌షర్టు పైజామతోను బాసాని టాక్‌టిక్‌గా కొంచెం ఎక్కువ పోజులై పెడుతున్నాడు అనుకునేవాళ్లం అప్పట్లో. ఎడిటర్‌ననో, రచయితననో ఎదో ఒక యిగో ఉండేది అనుకునేవాళ్లం.

రెడ్డి హాస్టల్ రేడియోలోనే మొదటిసారిగా సినారే గారి 'రామప్ప దేవాలయం' శ్రవ్యనాటిక వినడం, ఆ నాటికలో విన్నపాట 'రాయిలో ఏముంది మబ్బులో ఏముంది' అన్న పాటను పేరడిచేసి జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రుల శిష్యపరంపర అయిపోయేవాళ్లం. ఆ చిన్నవయసులో అప్పుడే సీతారాంను గురించి నారాయణరెడ్డిగారి పుస్తకం ముందుమాటలో ప్రత్యేకించి నన్నోమాట ఆలోచింపజేసింది. నన్ను ఆ కోరిక కోరుకునేటట్లు చేసింది.

ఆ మాటలు 'నేనీపుస్తకాన్ని మీముందుంచడంలో నాతోపాటుగా సావు ప్రతినందించడంలోను, ప్రూఫులు దిద్దడంలోనూ కృషిచేసిన గూడూరి సీతారాంకు కృతజ్ఞతలు'. అబ్బ! గొప్పకవి నారాయణరెడ్డి గారి పుస్తకానికి సీతారాం ప్రూఫులు దిద్దిపెట్టాడా? నాకిజన్మలో ఈ అవకాశం దొరుకుతుందా? ఎంత అదృష్టవంతుడు సీతారాం. ఇలా పదేపదే ఆలోచించాను. ఆ పసితనాన నాకు ఇదో విషయంగానూ, కోరికగానూ కన్పించేది. సరే తర్వాత్తర్వాత ప్రూఫులుదిద్దే కోరిక కథకుడిగా పబ్లిషర్‌గా తీరింది.

చాలాకాలం సీతారాం కథకుడిగా నాకు పరిచయమే కాలేదు. సీతారాం కథకుడిగా తెలిసింతర్వాత నాలోవున్న మరో సుబ్బారావు నన్ను పోట్లు పొడుస్తూ రంగప్రవేశం చేశాడు. ప్రశ్నించాడు- విసిగించాడు. ఫలితంగా రెడ్డి హాస్టల్ 'ఉష'లోనూ సూర్యదేవర రాజ్యలక్ష్మమ్మ గారి 'తెలుగుదేశం' పక్షపత్రికలోనూ నా కథలో మూడువచ్చాయి. సీతారాం కథలు 'తెలుగుదేశం' పత్రికలో చూసిన కారణాన-నామనసంతా ఏదో పోగొట్టుకున్నవాడిలా కృంగిపోయింది. మది ఎంతగానో ఘోషించింది. ఏంరా భడవా! నీవు ఆ మాత్రం రాయలేవా? ఇలా ఓ కథ. చల్‌చల్! రాయి-రాయి నేనున్నాగా అంటోంది. నేనధైర్యంతో వున్నప్పుడు 'సాహసం సేయరా

ఢింభకా' అంటోంది. నిమిషనిమిషమూ-రాయమని ప్రేరేపిస్తోంది. చదువెటు పోయిందో!-ఏమయింది?-చట్టుబండలయింది. మనస్సులోకి వచ్చిందంతా రాశాను. తెలుగుదేశం, పార్టీ కాదయ్యా బాబు-పత్రికకు పంపడం-వాళ్లు రెండు దఫాలుగా వేయబోతున్నామని వుత్తరం రాయడం గమ్మత్తుగా జర్గిపోయింది. నాకానాడు, అదో గొప్పనిపించలే! నేనిద్దరం ముగ్గురికి ఆలేఖ చూపించాను. నా మిత్రులు, మెచ్చుకోలుగానైనా ఓ మాటయినా అన్నవాళ్లు కాదు. పైగా, ఎంతోనిర్దాక్షిణ్యంగా ఆకార్డును నావైపు విసిరేశారు. నా పసిమనసు ఎంత బాధపడిందో-ఎవరికి చెప్పుకోను? ఏమని సంతోషించను? మరేమని గర్వించను?? పంపిన పదిరోజులకు కథ అచ్చెవచ్చింది. నాలుగు కాపీలుకొని మిత్రులకు యిచ్చినా వాళ్లు ఆ కథను చదివిన పాపాన్నైనాపోలేదు. ఇహనన్ను వారు ప్రోత్సహించేదెప్పుడు? మెచ్చుకునేదెప్పుడు? ఇదీ నా మిత్రల పరిస్థితి. అప్పుడాలోచించాను. సీతారాంకు పెద్దపెద్ద రచయితలతో స్నేహాలున్నాయి. అతనేది రాసినా ప్రోత్సహించేవాళ్లున్నారు, కాళోజీవున్నాడు. దాశరథి, నారాయణరెడ్డి, సురమౌళి యిలా ఎందరెందరోవున్నారు. మరిమనం ఎక్కడ? నాపేరు అచ్చులో వచ్చిందన్నా చూసేవాళ్లులేరు. ఇకా నేను రాసిన కథ చదివేదెవరు? సరేలే అనుకుని మరోకథరాశాను. అదీ అచ్చెంది! అంతేకాదు. ఆ సంచికలోనే నా మిత్రులవికూడా రెండు కథలచ్చయ్యాయి. నాకెంతో ఆశ్చర్యం. మరి నామిత్రుల్ని ఎలా మెప్పించను-నారచనల్తో! దీనికంతటికీ కారణం, నేను నల్లగొండ జిల్లా వాన్నాయినప్పటికీ, ఖమ్మం జిల్లాలో చదవడం, మా గ్రామానికి కృష్ణా జిల్లా పదిమైళ్ల దూరంలోనే వుండడం, ఖమ్మం జిల్లా ప్రజలపైన కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల ప్రభావం వుండడం-ఫలితంగా నామాట కోస్తా ఆంధ్ర ప్రాంతపువాడిదిలా వుండడం, నన్ను నా మిత్రులంతా ఆంధ్రప్రాంతపు వాన్ననుకోవడం- నామిత్రబృందంతో రచయితలెవరూ లేకపోవడం, రచయితలతో పరిచయాలు లేకపోవడం-నా పరిస్థితి యిలా వుండడానికి కారణమైందనుకుంటాను. ఆ తరువాత 'ప్రజామత'లోనూ ఓకథ అచ్చయింది. కానీ- అప్పటికే ఓ అభిప్రాయానికొచ్చేశాను. చదువుకోకుండా-అచ్చులోపేరు చూసుకోవడం కోసం-చదువును నిర్లక్ష్యం చేసి, కథలు రాయడానికి, రాత్రంతా మేల్కొని వుండడం నాకేమి మంచిపద్ధతిగా తోచిందికాదు. ఛ..ఛ! ఇకా కథలురాయవద్దు. వాటిజోలికేపోవద్దు. 'రాస్తే 'శరత్‌బాబు'లా రాయాలి. లేదా-మంచి పాఠకుడిగా మిగిలిపోవాలి. అంతే! ఆ తర్వాత్తర్వాత, జీవితం నేర్పినపాఠం ఏమిటంటే 'శరత్‌లాకాదురా వాజమ్మా'- మంచికథకుడిగా రాణించడానికి, తెల్లవారల్లా నిద్రలేకుండా జాగారణ చేయడం, సిగరెట్లు తాగడం కాదురా కావల్సిందల్లా కృషి-సృజనాత్మకత- పరిశీలన, అభ్యాసం యిలా చాలా కావాలనిపించి రచనా వ్యాసంగానికే 'వాలేకుం సలామ్' చెప్పేశాను. ఈ పరిస్థితుల్లో సీతారాంతో ముచ్చట్లలో భాగస్థుడనైనాను కానీ, ఆతని రచనల్తో యింకే సంబంధమూ పెంచుకోలేకపోయాను.

ఇవ్వాళ్లేదో తెలంగాణా భాషకి వికృతార్థాలూ-విపరీతార్థాలూ తీస్తున్నారుకానీ, భాషలోని మార్దవం-మాధుర్యం ఎరిగినవాడికి మాండలికాలు, నుడికారాలూ తెలవడం లేదనుకోడానికి కారణం దొరకదు. మరీ-మూర్ఖులు-మందమతులూ, తెలంగాణా 'యాస'ను

పరిపరివెక్కిరిస్తున్నారుకానీ, ఆ-యాసలోని గుబాళింపు, మాట ప్రయోగం తీరుతెన్నులు తెలిసినవారికి, ఆ తీపిదనం అనుభవంలోకి వస్తుంది. విశ్వనాథ సత్యనారాయణ గారోమారు-అచ్చ తెలుగు కొంతవరకైనా వినాలంటే తెలంగాణా పల్లెల్లో ముఖ్యంగా దళితవాడల్లో వినిపిస్తుందన్న మాట కూడా వీరికి తెలిసింది కాదు. సీతారాం రాసిన మొదటి కథల్లో మనప్రాంతాల్లోలేని ఎన్ని మాండలికాలు దొర్లాయో-చదివినప్పుడు వళ్లు పులకరిస్తుంది. ఆ వయస్సున, కొన్ని అర్థమయ్యి, కొన్నర్థంగాకపోయి కథను ఆనందించలేకపోయినా మళ్ళీప్పుడిప్పుడు చదువుతుంటె, మనసంతా, ఆనందంతో తేలికైపోవడం, మనసుకు ఏదో తెలియని సుఖం కలగడం-మరింతగా పఠనాసక్తి పెరగడాన్ని మనం గమనించవచ్చు.

బాల్యంలో రచయితల్తో పరిచయం లేకపోవడంకొంతా-ఖమ్మం ప్రాంతాల్లో రచయితలెవరో తెలియని అజ్ఞానంకొంతా-రచనాసక్తి వున్నవారు ఆ ప్రాంతాల్లో, అరుదవడం వల్ల కాబోలు-నారచనా-వ్యాసాంగాన్ని అభివృద్ధి పరచుకోలేక పోయినమాట మటుకువాస్తవం. 'ఆహో-ఓహో' అని మెచ్చుకుని-ప్రోత్సహించేవాళ్లుకూడా లేరు. మరింకెందుకు నేను రాయడం? ప్రతీకారంగా-ఏం చేయలేక రెడ్డిహాస్టల్ లైబ్రరికి బానిసనయ్యాను. చదువులో అంతంతమాత్రం చదువుకొని ఏంచేయాలో-ఒక ధ్యేయం మంటూలేని మనస్తత్వం. చదువుకుంటున్నట్లుగా యాక్షన్ చేయడం కోసం రెడ్డి హాస్టల్ లైబ్రరీకి అవాటయ్యాననుకుంటాను. దొరికిన ఫిక్సనంతా చదివేశాను. అయినా, తిరిగి రచన చేయాలన్న అభిలాష చల్లారిపోయింది. ఎన్నని రాయను? ఎన్నని ఫేర్ చేయను? పత్రికలకు పంపినట్లుగానే కొన్ని తిరిగిరావడం-మరికొన్ని స్టాంపులులాగేసుకుని చెత్తబుట్టలోకి వెళ్లిపోవడం జరిగేవి! దాంతో-విసుగు-అసంతృప్తి. ఇదిగో ఆ పరిస్థితుల్లో జన్మతః మలయాళాయుడై - తెలుగునేర్చుకుని అన్ని పత్రికల్లో 350 కథలకు పైగా రాసిన ఆర్.ఎం. చిదంబరం కథలు; కథల్లోని ఆశ్చర్యకరమైన ముగింపు, తోచని ముగింపు నన్నుక్కిరిబిక్కిరి చేశాయి. ఉహుఁ! అరెస్ట్ చేశాయి. మరో! ఇహకథలు చదవడంతప్ప-ఎవర్రాస్తే నాకేం-కథలు చదవడమే నాకార్యక్రమం అయింది. మరింకా క్లాసుపుస్తకాలు పడితే ఒట్టు! నన్ను తన కథా ముగింపులతో ఆశ్చర్యంతో ముంచివేసిన చిదంబరం కథల్ని కాళీపట్నం రామారావు, డా. వెలగా వెంకటప్పయ్యల సహకారంతో సేకరించి ప్రచురించడం, ఆకథా సంపుటికి కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు రావడము పాతజ్ఞాపకంగా మిగిలిపోయింది.

తరువాత చాలా సంవత్సరాలకు, ఇష్టంలేని-ఇష్టంకానీ వ్యాపారం చేయవలసిరావడం-అందులోనూ కృతకృత్యున్ని కాలేకపోవడం-అలా దిగులుగా వుంటున్న రోజుల్లో-ఓరోజు సీతారాంజీ-ఖమ్మం వీధుల్లో కనిపించారు. అరే భయ్! ఎక్కడి కరీంనగర్? మరెక్కడి ఖమ్మం ఎలావచ్చారు? ఏంపనిమీద వచ్చారు? ప్రశ్నల వర్షం కురిపించాను. అన్నిటికీ ఒక్కటే సమాధానం!-వ్యాపారం పనిమీదవచ్చానని.

20వ శతాబ్దం గడిచిపోయింది. 21లోకి ప్రవేశించటం. ఎన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. ఎక్కడిబాల్యం-మరెక్కడి వృద్ధాప్యం. సీతారామ్‌ను కలవాలి. ఆనాటి

పరిచయస్థులు, మిత్రుల గురించి 'ఆజాపజా' కనుక్కోవాలి. మనసు ఆరాటపడుతోంది.

ఓరోజు జయధీర్ తిరుమలరావు గారితో ప్రసంగవశాత్తు-గూడూరి సీతారాం నాకు బాల్యమిత్రుడేనని చెప్పాను. వారెంత ఆశ్చర్యపోయారో? సీతారామ్ సాహిత్యకృషిని ప్రచురిస్తున్నారు. మీ మిత్రుడు సీతారాం సాహితీ జీవిత స్వర్ణోత్సవం జరుపబోతున్నారు. మీ జ్ఞాపకాలను ఓ వ్యాసంలో నెమరువేయండి-అన్నారు.

ముబారక్ హో సీతారాంజీ! ముబారక్‌హో!!

సీతారాం నవ్వు వెన్నెలలు కురిపిస్తుంది. అమాయకతను ఎదుటివారికి చూపిస్తుంది. భోళాశంకర్! ఫక్కున గలగల నవ్వుతాడు. ఆనందంతో కళ్లు మూసుకుపోయాయి. ఈ వయస్సులోనూ! మాయిద్దరికీ ఒకే ఒక విషయంలో సామీప్యత-సన్నిహితత్వం వున్నది. అదే-నవ్వుకోడం-నవ్వించడం. మామీద మేం జోకులు వేసుకోడమే, మేం సాధించింది.

నేనిప్పటికీ అనుకొంటూ వుంటాను. ఉగాదిరోజు వ్యవసాయం సాగిస్తే సంవత్సరమంతా వ్యవసాయం ఏ అడ్డంకులు లేకుండా కొనసాగుతుందని. అందుకనుగుణంగా ఆరోజు వుదయాన్నే శుభ్రస్నాతున్నయి చేలకు వెళ్లి పోలాలు పరిశీలిస్తున్నప్పుడు, కాలుజారి ఎక్కడో ఓచోట కాలుజారి కిందపడిపోతాను. లేచి, నేను కిందపడిపోవడం ఎవరైనా చూశారేమోనని, అటూ యిటూ చూసి, ఎవరూ లేరని నిర్ధారణ చేసుకున్నాక నాకునేనే, కిందపడడం ఎవరూ చూడనందుకు నూతన సంవత్సరాదినాడు నావ్యవసాయపు తీరు తెన్నులు యిలా వున్నందుకు నవ్వుకుంటాను. నవ్వుకోక ఏం చేస్తాడు? అదీ మాసెన్సాఫ్ హ్యూమర్ ఔనా!

సీతారాం గారూ! నాదోమాట. పండినపండు రాలకతప్పదు. 40 సంవత్సరాల దాంపత్య జీవితాన్ని కాదని-తొలిగా సమంగళిగా మిమ్ముల ఒంటరిగా కదలి ఈ లోకంనుండి, మీ కన్నుల ముందే వెళ్లిపోవాలని ఎంతమంది దేవుళ్లకు మొక్కిందో! మీ అర్ధాంగి ఎక్కడకూ వెళ్లలేదు. మీ కళ్లముందే-మీ మస్తిషంతో మీరు కనులుమూసుకున్నప్పుడల్లా-మీరు కావాలనుకోవాలేకానీ మీరుకోరుకున్నప్పుడల్లా- మీముందు ప్రత్యక్షమవుతారు-ఎన్ని జ్ఞాపకాలతోనో! వారందించిన ఫలాలతో-యింకేంకావాలి? కానీ- సీతారాంజీ! మనం అనుకుంటాం; మనం ఈ లోకం వీడాకనే మన అర్ధాంగులు మనవెనుక బయలుదేరాలని! నిజమే. మన ఆంతర్యం, మన భాష-మన బాధ, మన అవసరాలూ, ఉన్నా ఆడవాళ్లకే కదా తెలుస్తాయి. అన్నీ మనం అనుకున్నట్లు జరిగితే బాగానేవున్ను. మన జీవితాలు-సుఖంగా తెల్లారిపోను. కానీ, విధిముందు మనం ఎంతటివారం? చిన్ననాడు-రెడ్డిహాస్టల్ రేడియో రూంలో బినాకా గీత్‌మాలాలో శంకర్ జైకిషన్‌ల పాట విన్నాంగుర్తుందా?

"మైన రహుంగి, తుమ్ న రహోగే, ఫిర్ భి రహేంగి నిషానియా..." అనికదా! ఔనా!

– గుడిపూడి సుబ్బారావు

నిజాం వెంకటేశం
హైదరాబాదు

సీతన్న కథల తెలంగాణా

తెలంగాణ రచయితల సంఘం సిరిసిల్లశాఖ కార్యదర్శిగా గూడూరి సీతారాం 1955లో 'చిరుగజ్జెలు' 'మల్లెమొగ్గలు' అనే సంకలనాలను తీసుకవచ్చిండు. కరీంనగర్ జిల్లా సాహితీ వాతావరణానికి రూపుకల్పించిండు. మళ్ళీ ఇన్నేళ్ళ తర్వాత మానేరు రచయితల సంఘం కార్యదర్శి పత్తిపాక మోహన్ దొరికినకాడికి సీతన్న కథలను ఒక సంపుటిగా తీసుకువచ్చిండు.

ఈమధ్య 50 ఏళ్ళు గడిచిపోయాయి. సిరిసిల్లలో సాహితీజ్వాల నిరంతరం వెలుగుతూనే వుంది. 1953 నుండి కథలు రాయడం మొదలుపెట్టిన సీతన్న 1962లో ఉద్యోగంలో చేరాక కూడా అలాగే కొనసాగించాడు. 1965 వరకే సుమారు 85 కథలు, 2 నవలికలు రాశాడు అంటే సామాన్యమైన విషయమా? 1962 నుండి ఊపిరిసలపని ఉద్యోగం చేసిన సీతన్న 1983లో ఉద్యోగం మానుకుని, బిజినెస్‌లో స్థిరపడి పోయారు. మళ్ళీ అందులో నుండి ఫ్రీ అయి హైద్రాబాదు కొచ్చిండు. హైద్రాబాదుకు వచ్చేముందు 1995 నుండి సిరిసిల్లలో సాహితీ వాతావరణానికి దోహదం చేస్తూ, సభలు, సమావేశాలు క్రమంతప్పకుండా నడవడానికి కృషిచేశాడు. స్వర్గీయ రుద్ర రవితో కలిసి కళాసాగర్ ద్వారా ఎన్నో సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాడు. అందులో పత్తిపాక మోహన్, సలీం, సుద్దాల బాలయ్య, తవుటు నాగభూషణం, జక్కని వెంకట్రాజం, దేవత సుధాకర్, జి. లక్ష్మణ్, గరిపెల్లి అశోక్, ఇతర మారసం సభ్యులు అందరినీ తనతోపాటు ముందుకు తీసుకువెళ్ళాడు.

మా చిన్నప్పటినుంచీ ఏ సాహితీ సమావేశం జరిగినా జి. రాములుసారు వస్తుండె. ఊర్లె వున్నడు కాబట్టి సాయంత్రాలు ఆయన ఫ్రీగా వుండేవాడు. సీతన్న బయట తీరికలేని ఉద్యోగం, రాజకీయనాయకుల స్నేహితం, అలా కొన్నిరోజులు ఈ వాతావరణానికి దూరం.

మధ్యలో మేము 1982లో కరీంనగర్ బుక్ ట్రస్టు కార్యక్రమాలు చేపట్టినప్పుడు, 'దిక్సూచి' 14 సంచికలు తీసినపుడు, యువసాహితీ సమితి కార్యక్రమాలు నిర్వహించినపుడు వడ్డెపల్లి కృష్ణ, కుడిక్యాల లింగయ్య, జక్కని వెంకట్రాజం, కనపర్తి సారు, జూకంటి జగన్నాథం బాధ్యతలు తీసుకునేవారు. మేము సీతన్నను దూరంనుంచే చూసేవాళ్ళం.

ఆ తర్వాత కాళీపట్నం రామారావు మాస్టారు తెలంగాణా జానపద గేయాలు విందాము, రికార్డు చేద్దామన్నప్పుడు కనపర్తి సారు మాట సరిపోయింది. మల్లారంలో ఒక రోజంతా ఆదిరెడ్డి సారు మొత్తం ఇంతెజామ్ చేసిండు. సత్తెమ్మ గంటల తరబడి గొంతెత్తి పాడుతుంటె ఆదిరెడ్డి సారు సీతన్న సేకరించిన జానపదగేయాల గురించి చెప్పిండు. రామరాజుగారికి సీతన్న వందల కొలది జానపదగేయాలు సేకరించి ఇచ్చిన సంగతి చెప్పిండు.

మళ్ళీ ఒకరోజు జూకంటి జగన్నాథం సీతన్నను ఇంటర్వ్యూచేసి, ఆంధ్రభూమిలో వేసేదాకా మేము సీతన్నను మరిచేపోయాము.

★ ★ ★

సీతన్న కథాసంకలనంలోని రాజమ్మ రాజీరికం, రంగడు (1959), నారిగాని బతుకు (1960), మారాజు (1957), పిచ్చోడు (1954) కథలు మొత్తం కరీంనగర్ యాసలోనే రాశాడు సీతన్న. కథ, కథనం మొత్తం తెలంగాణా భాషలోనే సాగింది. ఆంధ్రప్రభ, స్రవంతి, తెలుగుదేశం, ప్రజామత లాంటి పత్రికల సంపాదకులు వీటిని ఇదే రూపులో ప్రచురించారు. ఆనాటి సమాజం దీన్ని ఒప్పుకుంది. అంటే ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డ మొదటి సంవత్సరాల్లో, ఆంధ్ర పెత్తనం మొదలుకాకముందు, ఈ కథల ప్రచురణకు ఎలాంటి అభ్యంతరాలు రాలేదు. సీతన్న ఇచ్చిన ఈ అద్భుత ప్రారంభాన్ని ఇతర తెలంగాణా కథకులు ఎందుకనో కొనసాగించలేకపోయారు.

అందుకే, ఎన్నో ఏళ్ల తర్వాత 79, 80లలో అల్లం రాజయ్య కథ, కథనం పూర్తిగా తెలంగాణా యాసలో రాస్తే, కోస్తా నుండి తీవ్ర ప్రతిఘటన ఎదురయ్యింది. సీతన్న కథలు రాసిన పద్ధతి అలాగే కొనసాగితే ఈ అవాంతరం తప్పిపోయేది

★ ★ ★

ఇందులోని కథలను చూసినా, సీతన్న 1960 దాకా కథ పూర్తి తెలంగాణా యాసలో రాశారని గమనిస్తాము. అప్పటి కథనశైలి వేరు. పాత్రల మధ్యసంభాషణలు లేవు. కథకుడే కథ చెపుతుంటాడు. పాత్రల బాధలు, బరువులు, వాళ్ళ స్పందనల గూర్చి కథకుడే చెప్తుంటాడు. 'చందమామ' కథల్లో పిల్లలకు చెప్పినట్లుగా, కరీంనగర్ యాసలో కథకుడే పెద్దవాళ్ళకు కథలు చెపుతుంటాడు. భాష ఇక్కడిది. కథనపద్ధతి ఇక్కడిది. మౌఖిక సాహిత్యానికి దగ్గర, ఆ కథనం మనలో ఎన్నో ఆలోచనలను రేకెత్తిస్తుంది. పాత్రల పట్ల ఎంతో సానుభూతిని సృష్టిస్తుంది. తన వెంట మనను తీసుకువెడుతుంది.

తర్వత్తర్వాత మన కథల గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో తెలిసకోవడానికి 70–80ల మధ్య విప్లవ కథకులు ఊళ్ళలోకెళ్లి, జనం మధ్యలో కూచుని, కథలు వినిపించి వాళ్ళు ఎలా మమేకమవుతున్నారో, ఎలా ప్రతిస్పందిస్తున్నారో తెలుసుకున్నారు. ఇక్కడి జనం ఈ భాషను, కథనాన్ని ఒప్పుకున్నారు. సంతోషించారు. బయటి జనంతోటే బాధంతా.

సీతన్న కథనాన్ని, 'పలుకుబడి'ని ఒప్పుకున్న జనంవేరు. అల్లం రాజయ్యను అదేభాషలో రాస్తే ఆక్షేపించిన జనం వేరు. ఈ మధ్య తెలుగు సాహిత్యాన్ని శాసించడం నేర్చుకున్న ఆంధ్ర ఆధిపత్యపు నీడలు దీనితో చాలా స్పష్టంగా తెలుస్తాయి.

★ ★ ★

మా ఇంట్లో నాకంటే చదువులో సీనియర్ మా బావ రామచంద్రం. అంతకంటే సీనియర్ పెద్దబావ నారాయణ, ఒకరోజు వాళ్ళు చదువుకునే రూములో చూశాను. 'తరంగిణి' స్కూల్ మ్యాగజైన్ 'మల్లెమొగ్గలు' కథాసంపుటి. పాఠ్యపుస్తకాలు కాక, నాకు తెలిసి నేను మొట్టమొదటిసారి శ్రద్ధగా చదివినవి ఇతర పుస్తకాలు ఇవేనేమో? అందులో సీతన్న రాసిన 'పిచ్చోడు' కథ బహుశః

నేను చదివిన మొదటి కథనేమో! గూదూరి సీతారాం, గూదూరి శంకరం, గూదూరి రాఘవేంద్ర అందులో కనిపించిన పేర్లు. తెలంగాణా మాండలికంలో సాగిన ఆ కథ చాలా తేలిగ్గా అర్థమయింది. అలా నా సాహిత్య ప్రవేశం సీతన్న ద్వారా జరిగింది. తర్వాత్తర్వత ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ వీక్లీలు చదివి అలా అలా సాహిత్యంలో మమేకమైనాను. ఇన్నిరోజుల తర్వాత ఆ రోజులు గుర్తుచేసుకుంటే సీతన్న నిలువెత్తు సాహిత్య వ్యక్తిత్వం తలుచుకోకుండా వుండలేకపోతున్నాను. తనుకూడా తర్వాతికాలంలో ఆంధ్ర వ్యావహారిక భాషలో కథలు రాయడం పెరిగిపోతున్న ఆంధ్రపెత్తందారీ ప్రభావాన్ని తెలుపుతుందనుకుంటాను.

★ ★ ★

'తెలంగాణా తొలితరం కథలు' సంకలనంలో కరీంనగర్ జిల్లా నుండి నలుగురు కథకులు గూదూరి సీతారాం, జి. సురమౌళి, జి. రాములు, పి.వి. నరసింహారావు గారల కథలున్నాయి. ఇందులో నుండి ఇప్పుడు 'సీతన్న' కథల సంకలనం వస్తున్నది కాబట్టి మిగతా ముగ్గురి కథా సంకలనాలు కూడా సీతన్న 'ముందుమాట'లో తీసుకురావాల్సిన అవసరం వుంది. మన సాహితీ చరిత్రను మనమే తిరిగి రాసుకోవాల్సిన అవసరం వుంది. ఈ పనిని పూనుకోవడం, సాహిత్యాభిమానులందరి బాధ్యత చలం, కొ.కు, శ్రీపాద, చా.సో. కథల్లో కనిపించే మధ్యతరగతి అప్పటికింకా తెలంగాణాలో లేదు. అందుకే సీతన్న తనకథల్లో తనకు తెలిసిన పరిసరాలను, జీవితాన్ని ఎన్నుకున్నాడు. అందుకే పూసలోల్ల రాజమ్మ, గౌండ్ల నారిగాడు, పిచ్చుకుంట్ల లచ్చి, బొంబాయికి బతుకుతెరువు కోసంపోయే రంగడు ప్రధానపాత్రలయినారు. సీతన్న కథల్లో, దొర, దొరసాని కూడా తొంగిచూస్తారు. అక్కడక్కడా తెలంగాణా కథనం ఎంత తియ్యగావుంది. అప్పటికే ఎంతగా అభివృద్ధి చెందింది? ఆర్చీవ్స్ నుంచి నాటి జీవితాల్ని తీసి పరిశీలిస్తున్నట్లే వుంది, ఈ కథల్ని చూస్తుంటే 1953-65ల మధ్య తెలంగాణా జీవితం కళ్ళకు కట్టినట్లుగా చిత్రించాడు సీతన్న. మరుగున పడిపోయిన ఈ కథలను మళ్ళీ వెతికి పుస్తకంగా తేవడంలో కృషిచేసిన పత్తిపాక మోహన్, మారసం పాత్రలను నిజంగా అభినందించాలి.

ఈ యాభైయేళ్ల రచనా జీవితంలో నలుభైయ్యేళ్లపాటు సీతన్నతో కష్టసుఖాలు కలసి వెళ్లదీసిన 'జీవిత సహచరి స్మృతికి ఈ పుస్తకాన్ని అంకితమివ్వడం చూస్తే కళ్లు చెమర్చకమానవు.

★ ★ ★

'నిన్న వదలిన పోరాటం
నేడు అందుకోక తప్పదు
అందుకో ఈ చాచిన హస్తం'

అని సీతన్న తెలంగాణా కథకులకు పిలుపునిస్తున్నట్లుగా వున్న ఈ సంకలనం తెలంగాణా కథా సాహిత్యానికి మూలములుపుగా, ముందు మార్గం చూపే దివిటీగా, ఎంతో స్ఫూర్తిని కలిగించే నినాదంగా ఉపయోగపడుతుందని నేను భావిస్తున్నాను.

సీతన్న! అందుకో నా అభినందనలు!!

– నిజాం వెంకటేశం



చొప్పకట్ల చంద్రమౌళి
వేములవాడ-505302.

చిన్ననాటి సీతారాం

అది 1951-52 సంవత్సరాల అకాడమిక్ ఇయర్ నేనూ కనపర్తీ ఏడవ తరగతిలో ఉన్నాం. గూదూరి సీతారాం ఆరవ తరగతి. కనపర్తీ, సీతారాం, ఆదిరెడ్డి ఇంకా ఇతర విద్యార్థులు కొందరు మల్లారం భాస్కర్ ఇంట్లో వేములవాడలో కిరాయకు తీసుకుని వండుకుని తింటూ చదవుకుంటున్నారు-మేమంతా స్నేహితులం. స్కూలు చుట్టీ అయినాక గ్రౌండుకు వెళ్ళి ఫుట్‌బాల్‌కానీ, హాకీకాని ఆడుకునేవాళ్ళం. విద్యార్థి సంఘంలో కూడా ప్రముఖపాత్రలు వహించి చురుకుగా పాల్గొనేవాళ్ళం. విద్యార్థుల సమస్యల గురించి సమ్మెలూ, ఉద్యమాలవంటి వ్యతిరేక చర్యలు నిర్వహించే వాళ్ళం.

ఇకమాకు సాహితీ వాతావరణం ఏర్పడడానికి వేములవాడలో ఆనాటి సాహితీ, సాంస్కృతిక నేపథ్యం చెప్పవలసి ఉంటుంది. అది చెప్పందే ఇది సమగ్రంగాదు. అదే సంవత్సరం హెచ్‌ఎస్సీ పాసై సురమౌళి గారు మాకు హిందీ టీచర్‌గా వచ్చారు. మరోవైపు ప్రతాప మృత్యుంజయంగారు ఆంగ్లబోధకులుగా, కె. సాంబయ్యసారు, తెలుగుబోధకులుగా, గంగారావు, గంగారెడ్డి లెక్కలు, చరిత్ర బోధకులుగా ఉండేవారు. స్వాతంత్ర్యం వచ్చి అదివరకు నాలుగు సంవత్సరాలు గడిచింది. ఈ ఉపాధ్యాయులంతా అభ్యుదయ భావాలు గలవారు, యువకులు, అందులో సురమౌళి, ప్రతాపసార్ సాహిత్యంతో సంబంధాలు కలవారు. ప్రతాపసార్ కవితలు రాసేవారు. ఆనాటి ఏడవతరగతిలో కోర్సు, విద్యాబోధన చాలావరకూ ఈనాటి డిగ్రీస్థాయిలో ఉన్నంతగా చాలా అంశాలు ఉండేవి.

ఇక సురమౌళిగారు కరీంనగర్‌లో విద్యార్థిగా ఉన్నప్పటినుండీ నాస్తిక భావజాలంతో, సాంఘికాభివృద్ధి కార్యక్రమాలతో ఉండేవారు. లవణంతో తరచుగా ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతుండేవి. ఆయన తరగతులలో మూడనమ్మకాలకూ, గుడ్డినమ్మకాలకూ వ్యతిరేకంగా విద్యార్థులను చైతన్య పరచేవారు. విద్యార్థులలో విద్యార్థిగా కలిసిపోయి ఆటపాటలలోకూడా పాల్గొనేవాడు. రోజూ మాతో గ్రౌండ్‌కు వచ్చి హాకీ ఆడేవాడు. అలా ఏర్పడిన అనుబంధం

పెరిగి ఎబిసి (ఎథీస్ట్ బాయ్స్ క్లబ్) రూపొందడానికి దోహదపడంది. దాని ద్వారా మూఢవిశ్వాసాలను దూరం చేయడానికి సభలూ సమావేశాలూ నిర్వహించే వాళ్ళం. వీరేశలింగం వర్ధంతినిర్వహణ మొదలైన కార్యక్రమాలు సురమౌళి అధ్వర్యంలో జరిగేవి.

ఇక మరోవైపు తరచుగా సి. నారాయణరెడ్డి వస్తూ పోతూ ఉండేవారు. హనుమాజీపేటకు వెళ్ళడానికి ఈ విద్యార్థుల నివాసాన్ని ఒక మజిలీగా చేసుకునేవాడు. మమ్మల్ని కవితారచనకూ, ఇతర రచనాప్రక్రియలకూ ప్రోత్సహించేవాడు. అతని సలహాపైననే 'విద్యోదయ' అనే లిఖిత మాసపత్రికను నిర్వహించేవాళ్ళం. కనపర్తి, నేనూ, సీతారాం సంపాదకవర్గంలో ఉండేవాళ్ళం. కనపర్తి, నేనూ కవితలు రాస్తే, సీతారాం కవితలూ, వ్యాసాలు రాసేవాడు. సీతారాం దస్తూరీ మా అందరికన్నా బాగుండేది. కనుక ఎక్కువగా కష్టపడి లిఖిత పత్రికలను తనే రాసేవాడు. ఆ రాత అభ్యాసం అలాగే కొనసాగి నారాయణరెడ్డి పరిశోధనాగ్రంథం 'ఆధునికాంధ్రకవిత్వం-సంప్రదాయాలు, ప్రయోగాలు' రాసేవరకూ కొనసాగింది. ఎ టు జడ్ అందపెద్ద గ్రంథాన్ని నిర్దుష్టంగా, నిర్దిష్టంగా రాయడం సామాన్య విషయంకాదు.


'విద్యోదయ'ను సంవత్సరం తర్వాత వార్షిక సంచికగా అచ్చువేయించడం. నారాయణరెడ్డి వచ్చినప్పుడల్లా ఏదో ఒక కార్యక్రమం ఆయన అధ్వర్యంలో జరిగేది. 'విద్యోదయ' ప్రేరణగా ఆ తర్వాత వేములవాడలో 'భాను', సిరిసిల్లలో 'తరంగిణి' కరీంనగర్‌లో 'విద్యార్థి' వెలువడినాయి.

ఆ తర్వాత సీతారాం 'చేనేత'లో చాలా కథలు రాశాడు. మళ్ళీ ఉద్యోగిగా వేములవాడ పంచాయితీ సమితిలో చాలాకాలం పనిచేశాడు. అదివరకే రచనా వ్యాసంగాన్ని పూర్తిగా మరచిపోయాడు. కళాసాగర్ అనుభవాలు తెలిసినవే.

సీతారాం స్నేహశీలి, సహృదయుడు, అవివాదాస్పదుడు. ఆయన నిండుగా నవ్వే నవ్వు పండువెన్నెలనూ, ఆయన నిండుమనసునావిష్కరిస్తూ ఉంటుంది.

మళ్ళీ మరోమారు కలం ఝుళిపించి విజృంభిస్తే అంచెలంచెలుగా ఎన్నో కథలను పండించగలడు. ఆ దారితో కథలుతాడని ఆశిస్తూ....

– చొప్పకట్ల చంద్రమౌళి



పి. చంద్రశేఖర్ అజాద్

కథారచయిత

యువతకు స్ఫూర్తి గూడూరి సీతారాం

మిత్రుడు శ్రీ బి.ఎస్. రాములు ద్వారా గూడూరి సీతారాం గారు పరిచయమయ్యారు. అలాగే నిజాం వెంకటేశం గారు. ఎప్పుడు కనిపించినా ఆ ముగ్గురి ముఖాల్లో చిరునవ్వు, ప్రశాంతత కనిపిస్తాయి. ప్రాంతాలకతీతంగా మేము కలుసుకున్నప్పుడు ఓ సహజమైన ఆప్యాయత పెనవేసుకుంటుంది. నేను తెలంగాణా రచయితనుకాదు. అయినా పై ముగ్గురు నన్ను ప్రేమిస్తారు. నా రచనలను అభిమానిస్తారు.

గూడూరి సీతారాం గారు తన కథల పుస్తకం పంపించారు. ఆ కథలు చదువుతుంటే ఏభై సంవత్సరాల క్రితం రాసిన కథలా అనే ఆశ్చర్యం కలిగింది. ఇవి కేవలం తెలంగాణా కథలు అని నేను అనుకోవడం లేదు. తెలుగు కథలు. 'రాజమ్మ రాజీరికం'లోని రాజమ్మల్ని నేను మాప్రాంతంలో చూసాను. ఇక్కడ భాష, యాస తెలంగాణాది కావచ్చు. కానీ ఈ కథను ఒక ప్రాంతానికి పరిమితం చేస్తే రచయితకు చాలా అన్యాయం చేసినట్లు అవుతుంది. ఈ కథ చదివాక మన కళ్లు రోడ్లమీద కనిపించే ఎందరో రాజమ్మల మీద క్షణకాలం దృష్టిసలుపుతాయి. ఈమె జీవితం వెనకకూడా ఏదో కథ వుందనే, వీలయితే ఆ జీవితపు లోతుల్లోకి వెళ్లాలనీ అనిపిస్తుంది. ఈకథ చివర్లో 'రాచ్చససోంటోళ్లు నిండా నూరేళ్లు బతుకుతరు. గోవసోంటోళ్లు మాయెల్లమే జత్తరు' అంటాడు రచయిత. కుర్రకారుని ఉపేసిన రాజమ్మ జీవితం ఎలా చిద్రమైందో రచయిత అత్యంత సహజంగా చిత్రిస్తాడు. రంగడు కథలో రంగడు బతుకు దెరువుకోసం 'బిలాయి' వెళ్తాడు. చిన్నప్పుడు తనను ప్రేమగా చూసిన దొరసానిని చూద్దామని వస్తాడు. ఆమె అప్పటికే చనిపోయింది. ఆమెతోపాటు దొరతనం పోయింది. ఆ కుటుంబం చిన్నాభిన్నం అయింది. ఇంక ఆ ఊళ్లో వుండలేక రంగడు బిలాయి వెళ్లిపోతాడు. ఈ కథ చదివాక కూడా రంగడిలో మనల్నిమనం చూసుకుంటాం. మనం ఎన్నో జ్ఞాపకాల్తో మన ఊర్లో అడుగుపెట్టినప్పుడు అక్కడ ఉహించని పరిణామాలు ఎదురైతే ఎంత చలించి పోతామో ఈ కథలు చూడవచ్చు. ముఖ్యంగా అత్యంత ప్రత్యేకంగా, ఎలాంటి నినాదం లేకుండా 'దొర'తనాలు ఎలా కూలిపోతాయో

చెప్పటం సీతారాం గారి ప్రత్యేకత. 'లచ్చి' నారిగాని బతుకు' మారాజు' కథలు జీవితంలో మనకు కనిపించే సజీవ పాత్రలు. ఈ కథలన్నింటా సీతారాం గారి నిరాడంబరత సూటిగా కథ చెప్పటం కనిపిస్తుంది.


మిగతా కథల్లో అప్పటికే పత్రికారంగంలో వస్తున్న మార్పుల ప్రభావం సీతారాం గారిమీదా కనిపిస్తుంది. ఆయన 85కు పైగా కథలు రాస్తే దొరికినవి చాలాతక్కువే. ముఖ్యంగా ఆయన నవలలు చదవాల్సివుంది.

జీవితాన్ని యదాతథంగా చిత్రించటంలో తనదైన భాషలో కథను చెప్పటంలో సీతారాంగారు విజయం సాధించారు. 'వట్టికోట ఆళ్వారుస్వామి' లాంటి రచయితలు తలపుకోస్తారు.

తెలంగాణా రచేయితలు మాత్రమేకాక మొత్తంగా యువరచయితలందరూ 'సీతారాం' గారిలాంటి సీనియర్ రచయితల నుండి నేర్చుకోవలసింది ఎంతోవుంది.

నా వరకు నాకు ఆయనలో కనిపించే నమ్రతా-సుదీర్ఘమైన జీవితానుభవం, తమదైన అస్తిత్వం కోసం ఆరాటపడుతూనే మానవీయ విలువలకోసం ఆరాటపడే వారి పట్ల చూపించే ప్రేమా నచ్చుతాయి.

ఆయన సాహితీ స్వర్ణోత్సవాల సందర్భంగా నా హృదయపూర్వ శుభాకాంక్షలు అందజేస్తున్నాను. పెద్దాయనికి నమస్సులందచేస్తూ...



కళాసాగర్ సిరిసిల్ల పక్షాన కార్గిల్ సైనికులకోసం జిల్లా కలెక్టర్ దేవబ్రత కంఠ గారికి విరాళమందిస్తున్న అధ్యక్షులు గూడూరి సీతారాం, రుద్ర రవి, సి.హెచ్. సుధీర్‌రావు, సుద్దాల బాలయ్య, గూడూరి ప్రవీణ్, యం.డి. సలీం, జి. మధన్‌మోహన్ గార్లు

డా. నలిమెల భాస్కర్
9-5-191, శివనగర్,
లారెల్ స్కూల్‌రోడ్, కరీంనగర్-505 215.



బతుకు, భాషల మారాజు

గూడూరి సీతారాం కథల మారాజు. మాలేస్క గప్పట్లనే ఎనుభైదాక కథలు రాసిండట. మా అంటె కొనాకు దొర్కినయి ఏడేడు పద్నాలుగు కథలు. అవ్వీటిని మారసం కథల వయ్యి రూపంగ చెపాయించింది. అండ్ల ఏడేడు పద్నాలుగు లోకాలు లేకపోవచ్చు గని దగ్గర దగ్గర తెలంగాణయితె కనవడుతది. సీతారాం నికాలస్ కథలు రాసిండు. నిలువెత్తు చిత్రాలు గీసిండు. అవ్వి చదివినంక నాకు పుల్లగుర్రమెక్కినంత సంబురమైంది. అండ్లదండ్ల భాష ఎంత ప్యూర్‌గ వున్నది! నా చిన్నప్పటి మాటలు ముచ్చట్లు, పాటలన్ని యాదికచ్చినయి. మన జయశంకర్ సార్ సాహిత్య సభలల్ల ఎప్పుడు చెప్తుతుంటడు. 1956 నుంచి తెలంగాణకు అన్ని రంగాలల్ల అన్యాయం జరిగింది. నష్టం కలిగింది. ఈ నష్టాన్ని ముందుముందు ఎట్లనో ఓ అట్ల కూడ్చుకోవచ్చు. కని సాహిత్య భాషారంగాలకు జరిగిన నష్టాన్ని ఎట్ల కూడ్చుకుంటరు? అందుకే రచయితలు ఇప్పటికైనా కండ్లు దెరువాలె అని. ఆ పెద్దమనిషి చెప్పింది అవద్దం గాదు. ఇష్టం లేకున్నా అంద్రోల్లు పొత్తుల వుందామన్నరు. మీ పప్పు మా పొట్టు కల్పుకుని ఊదుకొని తిందామన్నారు. నమ్మితిమి. నష్టపోతిమి. జోటపట్టుకుని వుంటమన్నరు. మనల్ని కాటకలిపింద్రు. మనభాష మంచిది గాదని మనచేతనే అనిపించెటట్టు చేసింద్రు. నేనయితె సీతారాం కథలు చదివినంక మొదాలు భాషనుజూసి యిచ్చంత్రపోయిన. ఒల్లెన్ని మాటలు... పట్టేన్ని పదాలు.. పదబంధాలు, సామెతలు, శాస్త్రాలు. ఆ కథలల్ల వస్తువెంత ముద్దుగ వున్నదో భాష అంత కమ్మగ వున్నది. బేత్రీన్‌గ వున్నది. బొంబాట్‌గా వున్నది. బంగారానికి ఎలిగారం అతికినట్లు వస్తువుకు భాష మంచిగ అచ్చింది. కథల పేర్లు జూడుంద్రి; రాజమ్మ రాజీరికం, రంగడు, లచ్చి, నారిగాని బతుకు, పిచ్చోడు ఇక్కన్నే రచయిత ప్రజలతోని ఎంతబాగ కలిసిపోయిండో తెలుస్తున్నది. గా దినాలల్లనే ఊరూరుదిర్గే సంచార జాతి బిచ్చపొల్ల గురించి కథ రాసిండు. నిజంగనే ఆయన మారాజు. మనిషిని జూస్తె మాసుకంతయినా గర్వం కనవడది. ఎప్పుడు జూసినా నవ్వుకుంటనే వుంటడు.

చెప్పటం సీతారాం గారి ప్రత్యేకత. 'లచ్చి' నారిగాని బతుకు' మారాజు' కథలు జీవితంలో మనకు కనిపించే సజీవ పాత్రలు. ఈ కథలన్నింటా సీతారాం గారి నిరాడంబరత సూటిగా కథ చెప్పటం కనిపిస్తుంది.


మిగతా కథల్లో అప్పటికే పత్రికారంగంలో వస్తున్న మార్పుల ప్రభావం సీతారాం గారిమీదా కనిపిస్తుంది. ఆయన 85కు పైగా కథలు రాస్తే దొరికినవి చాలాతక్కువే. ముఖ్యంగా ఆయన నవలలు చదవాల్సివుంది.

జీవితాన్ని యదాతథంగా చిత్రించటంలో తనదైన భాషలో కథను చెప్పటంలో సీతారాంగారు విజయం సాధించారు. 'వట్టికోట ఆళ్వారుస్వామి' లాంటి రచయితలు తలపుకోస్తారు.

తెలంగాణా రచయితలు మాత్రమేకాక మొత్తంగా యువరచయితలందరూ 'సీతారాం' గారిలాంటి సీనియర్ రచయితల నుండి నేర్చుకోవలసింది ఎంతోవుంది.

నా వరకు నాకు ఆయనలో కనిపించే నమ్రతా-సుదీర్ఘమైన జీవితానుభవం, తమదైన అస్తిత్వం కోసం ఆరాటపడుతూనే మానవీయ విలువలకోసం ఆరాటపడే వారి పట్ల చూపించే ప్రేమా నచ్చుతాయి.

ఆయన సాహితీ స్వర్ణోత్సవాల సందర్భంగా నా హృదయపూర్వ శుభాకాంక్షలు అందజేస్తున్నాను. పెద్దాయనికి నమస్సులందచేస్తూ...



కళాసాగర్ సిరిసిల్ల పక్షాన కార్గిల్ సైనికులకోసం జిల్లా కలెక్టర్ దేవబ్రత కంఠ గారికి విరాళమందిస్తున్న అధ్యక్షులు గూడూరి సీతారాం, రుద్ర రవి, సి.హెచ్. సుధీర్‌రావు, సుద్దాల బాలయ్య, గూడూరి ప్రవీణ్, యం.డి. సలీం, జి. మధన్‌మోహన్ గార్లు



డా. నలిమెల భాస్కర్

9-5-191, శివనగర్,
లారెల్ స్కూల్‌రోడ్, కరీంనగర్-505 215.

బతుకు, భాషల మారాజు

గూడూరి సీతారాం కథల మారాజు. మాలేస్క గప్పట్లనే ఎనుభైదాక కథలు రాసిండట. మా అంటె కొనాకు దొర్కినయి ఏడేడు పద్నాలుగు కథలు. అవ్వీటిని మారసం కథల వయ్యి రూపంగ చెపాయించింది. అండ్ల ఏడేడు పద్నాలుగు లోకాలు లేకపోవచ్చు గని దగ్గర దగ్గర తెలంగాణయితె కనవడుతది. సీతారాం నికాలస్ కథలు రాసిండు. నిలువెత్తు చిత్రాలు గీసిండు. అవ్వి చదివినంక నాకు పుల్లగుర్రమెక్కినంత సంబురమైంది. అండ్లదండ్ల భాష ఎంత ప్యూర్‌గ వున్నది! నా చిన్నప్పటి మాటలు ముచ్చట్లు, పాటలన్ని యాదికచ్చినయి. మన జయశంకర్ సార్ సాహిత్య సభలల్ల ఎప్పుడు చెప్పుతుంటడు. 1956 నుంచి తెలంగాణకు అన్ని రంగాలల్ల అన్యాయం జరిగింది. నష్టం కలిగింది. ఈ నష్టాన్ని ముందుముందు ఎట్లనో ఓ అట్ల కూడ్చుకోవచ్చు. కని సాహిత్య భాషారంగాలకు జరిగిన నష్టాన్ని ఎట్ల కూడ్చుకుంటరు? అందుకే రచయితలు ఇప్పటికైనా కండ్లు దెరువాలె అని. ఆ పెద్దమనిషి చెప్పింది అవద్దం గాదు. ఇష్టం లేకున్నా అంద్రోల్లు పొత్తుల వుందామన్నరు. మీ పప్పు మా పొట్టు కల్పుకుని ఊదుకొని తిందామన్నారు. నమ్మితిమి. నష్టపోతిమి. జోటపట్టుకుని వుంటమన్నరు. మనల్ని కాటకలిపింద్రు. మనభాష మంచిది గాదని మనచేతనే అనిపించెటట్టు చేసింద్రు. నేనయితె సీతారాం కథలు చదివినంక మొదాలు భాషనుజూసి యిచ్చంత్రపోయిన. ఒల్లెన్ని మాటలు... పట్టేన్ని పదాలు.. పదబంధాలు, సామెతలు, శాస్త్రాలు. ఆ కథలల్ల వస్తువెంత ముద్దుగ వున్నదో భాష అంత కమ్మగ వున్నది. బేత్రీన్‌గ వున్నది. బొంబాట్‌గా వున్నది. బంగారానికి ఎలిగారం అతికినట్లు వస్తువుకు భాష మంచిగ అచ్చింది. కథల పేర్లు జూడుంద్రి; రాజమ్మ రాజీరికం, రంగడు, లచ్చి, నారిగాని బతుకు, పిచ్చోడు ఇక్కన్నే రచయిత ప్రజలతోని ఎంతబాగ కలిసిపోయిండో తెలుస్తున్నది. గా దినాలల్లనే ఊరూరుదిర్గే సంచార జాతి బిచ్చపొల్ల గురించి కథ రాసిండు. నిజంగనే ఆయన మారాజు. మనిషిని జూస్తె మాసుకంతయినా గర్వం కనవడది. ఎప్పుడు జూసినా నవ్వుకుంటనే వుంటడు.

గప్పుడే ఊర్లిడిసి పట్నాలకు పోతె ఎన్నితిప్పలు వుంటయో పూసగుచ్చినట్టు రాసిండు. ఇప్పుడు మనం అనుకుంటున్న నాగరికత మన కండ్ల ముందటనే ఎంత నాశినగాలం తెచ్చిపెట్టిందో మొదాలే పసిగట్టిండ్రు. ఆ రాతలుపూతలు అప్పుడాయన నెత్తురు తడిపి రాసిన కథలు. తెలంగాణోనికి భాషనే బతుకు. బతుకే భాష. మన భాషల మనం కడుపునిండ మాట్లాడుకుంటెనే తృప్తి. మన ఆటలు మనం ఆడుకుంటెనే తుర్తి. మన తిండి మనం తిని, మన బతుకు మనం బతకాలె. సీతారాం మారాజ్ అసోంటోల్ల పాతకాలం రచయితల కథలు, ఎతలు అన్నీ అచ్చుగొట్టాలె. ఇప్పటిదాక పోడగొట్టుకున్నయన్ని మల్ల కూడ వెట్టుకోవాలె. భాషావేత్తలను తెలంగాణా పల్లెల్లకు తరలించాలె. అప్పుడుగాని మనభాష, మన బతుకు యితరులకు మనస్సు వట్టయి.

ఇంత మంచియాల్లల నాకో ముచ్చట చెప్పాలని వున్నది. మా రచయితలు కాళోజి, గూడూరి అసోంటోల్లను చూపి తెలంగాణ భాషల్నే రాయాలె. గూగి ఏం చేసిండో మనందరికీ ఎరికే. అంతెందుకు మన దేశంల ఏ భాషల ఉన్న రచయిత అయినా తన భాషలనే రాస్తున్నడు.. మరి మనమెందుకు మన తెలంగాణ భాష రాయొద్దు. అట్లయితె మన భాషల అన్ని పదాలున్నయా అంటరు కొందరు. ఉన్నయి చూడుండ్రి. గోధూళి వేళకి బరులు గోజలొచ్చేయాల్ల, భవిష్యత్తుకు బదులు ముందు ముందు, సుమారుకు మారుగా దగ్గర దగ్గర, స్థూలకాయానికి పెద్దపెయ్యి, ఎముకలేని చెయ్యికి బదులుగా పెద్ద చెయ్యి, తరాలకు బదులు తంతెలు, ఇట్ల లక్షతొంబై తొమ్మిది చెప్పొచ్చు.

ఒక్కటే సాఫ్‌సీదా ముచ్చట. ఎవలకు తమ భాష తెల్వదో వాళ్ళకు మనగోస తెల్వది. మన పాట తెల్వది. పదం తెల్వది. సామెత తెల్వది. శాస్త్రం తెల్వది. ప్రజలే తెల్వరు. వాళ్ళ దుఃఖం తెల్వది. సంబురం తెల్వది. ఇవ్వి తెల్వకుండ రాస్తె అది ఎల్లకాలం నిల్వది. భాషంటే కర్త, కర్మ, క్రియ, సర్వనామం, నామవాచకాలు గిట్ల అనుకుంటె పొరపాటు. భాషంటె బతుకే! ఏది ఏమైనా సీతారాం కథలు అచ్చుగొట్టాలని జగన్, నేనూ, మోహన్ ఎప్పుడూ అనుకునేటోల్లం. దీని వెనుక మోహన్ చాలా కష్టపడ్డడు. మల్ల యాభై ఏండ్ల సంచికను తీసుకొస్తున్నందుకు మస్తు సంబురంగా వున్నది.

– డా. నలిమెల భాస్కర్

డా. పత్తిపాక మోహన్
రాష్ట్రప్రభుత్వ యువ విశిష్ట సాహిత్య పురస్కార గ్రహీత
పత్తిపాక వీధి, సిరిసిల్ల - 505 301.
సెల్: 9440022075 (ఇ) 08723-233899

మాండలికానికి పట్టంకట్టిన తెలంగాణా తొలితరం కథకులు గూడూరి సీతారాం

తెలంగాణా కథకు పట్టం కట్టిన తొలితరం కథకులు గూడూరి సీతారాం. మలితరం రచయితల్లో ఆయనది ప్రత్యేకస్థానం. నిఖార్సయిన తెలంగాణా గ్రామీణ భాషలో 1950 నుండి 63 వరకు ఒక దశాబ్దకాలం పాటు ఎనభైకి పైగా కథలురాశారు. నాలుగు దశాబ్దాల క్రితం రాసినవే అయినా కథా వస్తువు నేటికి నిత్యనూతనంగా నిలవడం ఆయన రచనల్లోని సార్వకాలీనతకు నిదర్శనం. తన తరం వారినే కాక ముందు తరాలవారు కూడా ఆశ్చర్యపోయేలా రాయగలిగిన గూడూరి చావు బతుకుల పోరాటంలో అనుక్షణం తల్లడిల్లుతున్న తెలంగాణ పల్లె జీవితాల్ని, ఆలోచనల్లో ఉండే వైరుధ్యాల్ని వస్తువైవిధ్యంతో సృజన చేశారు. సాయుధ పోరాటం ఉవ్వెత్తున ఎగిసి పడుతున్న కాలంలోఅభ్యుదయ కవులు, రచయితలు ఆ పోరాటాన్ని చిత్రించే కవితలు, కథలు, గేయాలు రాశారు. వీరితో పాటు పోరాటంలో పాల్గొన్నవాళ్ళు ఆ స్ఫూర్తితో తరువాత రచయితలుగా ఎదిగిన వాళ్ళు ఎందరో ఉన్నారు. అలా పోరాట ఆశయాలను, అనుభవాలను రచనల్లో పదిలపరిచిన వారిలో జి. రాములు, జి.సురమౌళి, గూడూరి సీతారాం లాంటి ప్రముఖంగా వెలుగుచూడని మంచికథకులు ఉన్నారు.

తెలంగాణ ప్రాంతంలో కథావికాసం అరవయ్యవ దశకం వరకు జరగలేదని కొందరు విమర్శకుల అభిప్రాయం. కాని మాడపాటి హనుమంతరావు పంతులు గారిని మినహాయిస్తే తెలంగాణా ప్రజల జీవితాల్ని, ఉద్యమాల్ని తమదైన శైలిలో జీవిత బాహుళ్యాన్ని తమదైన ఒరవడిలో చిత్రించి తెలుగు కథను నలభైలలోనే దీప్తిమంతంగా మలచారు సురవరం ప్రతాపరెడ్డి, జి. రాములు, గూడూరి, సురమౌళి,పొట్లపల్లి వెంకట రామారావు వంటి కథకులు. ఇంచుమించు 1945 ప్రాంతం నుండి తమ కలానికి మరింత పదును పెట్టారు. జి. రాములు తన 'ఆత్మఘోష' కథను 1943లో పుస్తకంగా తీసుకువచ్చారు. 1945లో 'పద్మశాలి' మాసపత్రికలో 'బ్రహ్మపుత్ర భక్తసమాజం' అన్న సంస్కరణాత్మక కథను రాశారు.

నిజాం తెలంగాణా విముక్తి పోరాటం సాగుతున్న సమయంలో రచయితగా కళ్ళు తెరిచిన గూడూరి, డా. సి. నారాయణ రెడ్డి స్వగ్రామం హనుమాజీపేటలో వారి పక్కింట్లో పుట్టారు. బాల్యం నుండి సి.నా.రె. సన్నిహిత సహచర్యంతో ఎదిగిన గూడూరి తనతోటి

మిత్రులంతా సి.నా.రె. ప్రోద్బలంతో కవిత్వంవైపు వెళితే తాను కథవైపు మొగ్గుచూపారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థిగా ఏడవ తరగతిలోనే తెలంగాణా రచయితల సంఘం ప్రచురించిన ప్రత్యేక సంచిక (సిరిసిల్ల శాఖ) 'నినాదం' (1952)లో స్త్రీ స్వతంత్ర్యం అనే కథను రాశారు గూడూరి. విద్యార్థి దశలోనే స్త్రీ స్వేచ్ఛను గురించి కథ రాసిన ఆయన యువతరం అందుకు ఉద్యమించాలని తాపత్రయపడ్డారు. 'సారస్వత జ్యోతి'లో అదే ఏడు ఒక ఆంగ్లకథ ఆధారంగా 'మూడు ప్రశ్నలు' అనే మరో కథను ప్రచురించారు.

ప్రతి గ్రామీణ ప్రాంత రచయిత తాను పుట్టిన మట్టివాసనలను తన రచనల్లో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రాయకుండా ఉండలేడు. తాను పుట్టి పెరిగిన వాతావరణంలోని నిర్ధిష్టమైన స్థితిగతులు, సామాజిక పరిస్థితులు అనుభవాలు వస్తువులుగా రూపుదిద్దుకుంటాయి. ఆ అనుభవాలకు తన ప్రతిభను జోడించి పాఠకుడి హృదయాన్ని స్పృశించేలా రచయిత తన రచనలను కళాత్మకంగా తీర్చిదిద్దుతాడు. గ్రామీణ జీవితం నేపథ్యంగా కథకునిగా ఎదిగిన గూడూరి సీతారాం తన రచనల్లో సామాన్యుని జీవితవలయాలను దాటే ప్రయత్నం ఎక్కడా చెయ్యలేదు. తెల్లవారింది మొదలు పొద్దుగూకేవరకు పల్లెల్లో కంటికి కనిపించే వృత్తులు, వాళ్ళవాళ్ళ జీవితాలు, జీవన విధానాలు మొదలగు వాటిని సూక్ష్మంగా సీతారాం కథల్లో రికార్డుచేశారు.

మాండలీకంలో 1957లో అచ్చయిన 'మారాజు' అచ్చమయిన తెలంగాణా మాండలికాన్నే కాక జీవన విధానాల్ని జాగరూకతను ప్రతిబింబించిన కథ. 'రంగడు బొంబాయి పోయచ్చిండు. ఆడెప్పుడో బొంబాయి దాకా యెళ్లకుంటా ఉండడని చానామంది అనుకున్నరు. యెర్రిబాగులోడు-ఆపిచ్చోడు బొంబాయిదాకా ఒక్కడే ఎట్లా యెల్లిండా అనే తర్కాల పడ్డరు. గా నడుమ అదేదో పెద్ద సోపాల సదువంతా సదువుకున్న దొరగారి పిల్లగాడు లష్కరు బోయిండట' అంటూ ఈ కథ సరళమైన జనసామాన్య భాషలోసాగుతుంది. 1950లో వలస జీవితాన్ని తన కథల్లో ప్రతిబింబింప చేశారు గూడూరి. పట్నం మోజులో యువతరం ఏవిధంగా కొట్టుకుని పోతుందో ఆయన తన కథల్లో చూపించారు. పట్నంమోజులో అటు వృత్తికి దూరమై, ఇటు మట్టికి దూరమై ఎన్ని కష్టాలనుభవిస్తున్నారో 'మారాజు' కథలో చూడవచ్చు. బాషరాని, బాట తెలియని ఒక అమాయక పల్లెటూరి బైతు పరాయి ప్రాంతంలో పడ్డ సాధకబాదకాలతో ఈ కథ ఆద్యంతం వడుపుతో సాగింది.

'నారిగాని బతుకు' మరో మంచికథ. నారిగాడు వృత్తిరీత్యాగీత కార్మికుడు. కల్లు గీసి తేవడం వాడి దినచర్య. పల్లెల్లో భర్తతో పాటు భార్య, ఇంటిల్లిపాది వృత్తిలో పాల్గొనడం మామూలే. వృత్తిని కేంద్రంగా చేసుకుని గూడూరి ఈ కథలో విభిన్న స్త్రీ మనస్థత్వాలను, గ్రామీణజీవితాల్లో కులవృత్తుల స్థానాన్ని చిత్రీకరించారు. నారిగాని ముగ్గురు భార్యలు లసుము, ఎల్లి, నారిగాని మూడోభార్యతో మూడు రకాల మానవ మనస్తత్వాలు గోచరిస్తాయి. లసుము కుటుంబపరమై వ్యాపారంలో భర్తకు సహకరిస్తూ పరువుగా, బరువుగా బతుకుతుంది. ఎల్లి నారిగాన్ని మోసంచేసి లేచిపోతుంది. ఎల్లి నారిగాన్ని మోసం చేయడంతో తాను నమ్మి మోసపోయాననుకుని నారిగాడు చివరికి మూడోపెళ్లి

చేసుకుంటాడు. తనవృత్తి ధర్మంగా కల్లు వంచుతున్న మూడోభార్యను ఓ వ్యక్తి కొంగుపట్టి గుంజగా నారిగాడు ఆవేశంగా చేయిచేసుకుని భార్యపట్ల అనుచిత ప్రవర్తనను వ్యతిరేకిస్తాడు. ఆశించిన మార్పు ఎంతోకాలం నిలువలేక తన సంతానం విషయంలో మొదటి పద్దతే మల్లీ, పునరావృతం కాగా నారిగాడు కల్లును ఆడవాళ్ళు అమ్మవద్దంటాడు. కానీ కొడుకు వినకపోగా 'ముసలోని మాటయిని గిట్లకూటికి ఎవలుజత్తరు. కల్లెమ్మటోల్లంతా గట్లనే ఉంటారా!' అని సవాలు విసుర్తాడు.

తరాలు మారిపోయి వృత్తిపై యాజమాన్యం సంతానికి సంక్రమించి పూర్వ యజమానిది కేవలం ప్రేక్షకపాత్రే అయినపుడు ఆయన పడుతున్న సంఘర్షణను, మనోస్థితిని, పల్లెజీవిక భూమికగా నిలిచిన కులాల సంస్కృతి మూల బిందువుగా చక్కగా కథనం ద్వారా మెప్పించారు గూడూరి సీతారాం. అంతేకాకుండా శ్రామిక కుటుంబాల్లో ఇల్లాలు భర్తతో పాటు కులవృత్తిలో పాల్గొనే సంస్కృతిని వివిధ కోణాల్లో చూపించారు.

'రాజమ్మ రాజరికం' వెహిక సుఖాలు, కోరికలు, విలాసవంతమైన జీవితం పట్ల ఆకర్షితురాలై మోసపోయి భిక్షగత్తెగా మారిన స్త్రీకథ. కథను ఎత్తుకోవడంలోనే ఒక కొత్త ఒరవడికి నాంది పలికారు గూడూరి. అందరు కథను నేరుగా ప్రారంభిస్తే

'సెన సేన్ల నిలుచుని నీవు
సేయిజాపవే పూసలోల్ల రాజమ్మా!
కందిసేన్ల నిలుసుని నీవు
కన్నుగీటవే పూసలోల్ల రాజమ్మా!'

అంటూ జానపదం ఎత్తుగడతో కథను ప్రారంభిస్తారు.

సంస్కృతిలో వస్తున్న మార్పులతో కొత్తగా వస్తున్న వస్తువుల పట్ల మోజుతో సామాజిక జీవనానికి భిన్నంగా ప్రవర్తించి కట్టుబాట్లని కాదనుకున్న రాజమ్మ తాను పెళ్లి చేసుకున్నా మార్పులకు లొంగని భర్తను కాదనుకుని వికటించిన నాగరికత ప్రభావంతో, కోరికలతో భర్తతో వైవాహిక జీవితానికి దూరమై రెంటికి చెడ్డ రేకడిలా చివరికి బిచ్చెగత్తెలా మారుతుంది. రాజమ్మపాత్ర ద్వారా రచయిత చూపించిన వాస్తవాలు మూడున్నర దశాబ్దాల నాటి సమాజిక, సాంఘీక స్థితిగతులకు అద్దం పడుతుంది.

అదే సమయంలో వచ్చిన మరో రెండు మంచికథలు 'రంగడు', 'లచ్చి' భాష, వస్తువు విషయంలోనే కాక కథలకు శీర్షికల్ని పెట్టడంలో కూడా ప్రాంతీయతపై, భాషపై జీవన విధానంపై గూడూరికి అపారమైన అభిమానం. ఆ అభిమానం అయిన కథల్లో అణువణువునా కనిపిస్తుంది.

'రంగడు' కథలో స్త్రీ మూర్తికి సంబంధించిన అతి సున్నితమైన అంశాల్ని చర్చించే ప్రయత్నం చేశారు రచయిత. రంగడు బాల్యంలోనే బతుకుతెరువుకు బలయిపోయి ఉన్నతంగా ఎదిగి పుట్టిన వారిపై, తన ప్రాణాల్ని కాపాడిన దొరసానిపై గౌరవంతో

తిరిగివస్తాడు. అప్పటికే తాను మిక్కిలి అభిమానించే దొర్సాని కాలం చేస్తుంది. గతమంతా జ్ఞాపకమై కదలాడగా తాను ఏ మాతృమూర్తిని చూడాలని వచ్చాడో ఆమె లేదనితెలిసి నిర్లిప్తతో తిరిగి వెళ్ళేందుకు సిద్ధమవుతాడు. జీవితంలోని విలువల్ని బేరీజు వేసుకుని మూలలకు వెళ్లి గత జీవితంలోని ఆనందాన్ని, తృప్తిని తిరిగి పొందాలనుకున్న రంగని ఆలోచనలు, రంగనిలో కలిగే మార్పులు, చేర్పులు చక్కగా చూపించారు గూడూరి.

అనితర సాధ్యంగా 1957 లోనే అణగారిన దళిత జీవన విధానాన్ని పరిశీలించి రాసిన అరుదైన ఆణిముత్యంలాంటి కథ లచ్చి. సంచార తెగకు చెందిన బిచ్చగాళ్ళ (పిచ్చకుంట్లు) బతుకు తెరువునుగూర్చి సమూలంగా పరిశీలించి అక్షరచిత్రంగా నిర్మించారు, గూడూరి సీతారాం. చాపలు అల్లుకుంటూ, బిచ్చమెత్తుకుని బతికే బిచ్చగాళ్ళ జీవితంలో అకస్మాత్తుగా కలిగిన ఆర్థిక ఎదుగుదల సామాజికంగా ఎదిగేందుకు ఉపకరించక పోగా, ఏ విధంగా నష్టపరిచిందో ఇందులో చూస్తాం. అందరిలాగానే పట్నం జీవితం కోసం వెంపర్లాడి పరిగెత్తి, పరిగెత్తి అపార్థాలకు, అనుమానాలకు లోనై చతికలపడి చివరికి అలసట చెంది పూర్వ జీవితాల్ని మళ్ళీ గెలుచుకున్న క్రమంలో జరిగిన పరిణామాలు, పరిస్థితులు సామాన్యుని జీవితంలో మార్పులు ఎందుకు అనుకూల స్థితిని కలిగించలేక పోతాయె 'లచ్చి' కథ అందుకు మంచి తార్కాణం.

ఇంకా 'అందని ఆకాశం', 'అబ్బాయి-అమ్మాయి', 'దెబ్బతిన్న అహంభావం', 'ఎర్రనిపువ్వు', 'బస్సచ్చింది', 'పిచ్చోడు' వంటి ఎనభైకి పైగా కథల్ని రాశారు గూడూరి.

గూడూరి కథలన్నిటిలో పాత్రోచిత మాండలిక సంభాషణలతో జీవకళ ఉట్టిపడుతుంది. మూడు కథలు ఆ తర్వాత గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన యువ రచయితలకు మాండలిక కథా నిర్మాణానికి ఒక దిక్సూచిగాపనిచేశాయి. కథా సాహిత్యంలోకి నిజాయితీగా, నిస్సంకోచంగా గ్రామీణ పేదల జీవితాలను, వాళ్ళ వృత్తాలను ప్రవేశ పెట్టేందుకు గూడూరి కథలు తోడ్పడ్డాయి. గూడూరి వాడిన మాండలికం ఆ తర్వాతి తరం రచయితలకు, పాఠకులకు కూడా ప్రీతి పాత్రంగా మారిందని చెప్పవచ్చు.

పాత్రయొక్క సామాజిక స్థాయిని మరువకుండా సంభాషణలు రాసిన గూడూరి తన రచనల్లోజాతీయాలు పలుకుబళ్ళను విరివిగా ఉపయోగిస్తారు. కథ నిడి వినిపెంచే వర్ణలకు ఎక్కడా స్థానం కల్పించని ఆయన వస్తువుపట్ల తీసుకున్న శ్రద్ధ పాఠకుణ్ణి తనవైపుకు మరలిస్తుంది.

జీవితంలోని అనుభవాల్ని, అనుభూతుల్ని చేదు జ్ఞాపకాల్ని నేపథ్యంగా చేసుకుని తనకున్న సజీవభాషా సంపత్తితో చక్కని, చిక్కని ప్రయోగాలతో పల్లెజీవనాన్ని చిత్రించారు గూడూరి. తెలంగాణా మాండలికానికి సాహిత్య గౌరవాన్ని, వ్యక్తిత్వాన్ని సీతారాం కలిగించారు. అంతేగాక అప్పటి సామాజిక పరిణామక్రమాన్ని అధ్యయనం చేయడానికి గూడూరి సీతారాం కథలు వాహకాలుగా నిలుస్తాయి.

ఆంధ్రభూమి సోమవారం 11 అక్టోబర్ 2000

చేసుకుంటాడు. తనవృత్తి ధర్మంగా కల్లు వంచుతున్న మూడోభార్యను ఓ వ్యక్తి కొంగుపట్టి గుంజగా నారిగాడు ఆవేశంగా చేయిచేసుకుని భార్యపట్ల అనుచిత ప్రవర్తనను వ్యతిరేకిస్తాడు. ఆశించిన మార్పు ఎంతోకాలం నిలువలేక తన సంతానం విషయంలో మొదటి పద్ధతే మళ్లీ, పునరావృతం కాగా నారిగాడు కల్లును ఆడవాళ్ళు అమ్మవద్దంటాడు. కానీ కొడుకు వినకపోగా 'ముసలోని మాటయిని గిట్లకూటికి ఎవలుజత్తరు. కల్లెమ్మటోల్లంతా గట్లనే ఉంటారా!' అని సవాలు విసుర్తాడు.

తరాలు మారిపోయి వృత్తిపై యాజమాన్యం సంతానికి సంక్రమించి పూర్వ యజమానిది కేవలం ప్రేక్షకపాత్రే అయినపుడు ఆయన పడుతున్న సంఘర్షణను, మనోస్థితిని, పల్లెజీవిక భూమికగా నిలిచిన కులాల సంస్కృతి మూల బిందువుగా చక్కగా కథనం ద్వారా మెప్పించారు గూడూరి సీతారాం. అంతేకాకుండా శ్రామిక కుటుంబాల్లో ఇల్లాలు భర్తతో పాటు కులవృత్తిలో పాల్గొనే సంస్కృతిని వివిధ కోణాల్లో చూపించారు.

'రాజమ్మ రాజరికం' వెహిక సుఖాలు, కోరికలు, విలాసవంతమైన జీవితం పట్ల ఆకర్షితురాలై మోసపోయి భిక్షగత్తెగా మారిన స్త్రీకథ. కథను ఎత్తుకోవడంలోనే ఒక కొత్త ఒరవడికి నాంది పలికారు గూడూరి. అందరు కథను నేరుగా ప్రారంభిస్తే

'సెన సేన్ల నిలుచుని నీవు
సేయిజాపవే పూసలోల్ల రాజమ్మా!
కందిసేన్ల నిలుసుని నీవు
కన్నుగీటవే పూసలోల్ల రాజమ్మా!'

అంటూ జానపదం ఎత్తుగడతో కథను ప్రారంభిస్తారు.

సంస్కృతిలో వస్తున్న మార్పులతో కొత్తగా వస్తున్న వస్తువుల పట్ల మోజుతో సామాజిక జీవనానికి భిన్నంగా ప్రవర్తించి కట్టుబాట్లని కాదనుకున్న రాజమ్మ తాను పెళ్లి చేసుకున్నా మార్పులకు లొంగని భర్తను కాదనుకుని వికటించిన నాగరికత ప్రభావంతో, కోరికలతో భర్తతో వైవాహిక జీవితానికి దూరమై రెంటికి చెడ్డ రేకడిలా చివరికి బిచ్చెగత్తెలా మారుతుంది. రాజమ్మపాత్ర ద్వారా రచయిత చూపించిన వాస్తవాలు మూడున్నర దశాబ్దాల నాటి సమాజిక, సాంఘీక స్థితిగతులకు అద్దం పడుతుంది.

అదే సమయంలో వచ్చిన మరో రెండు మంచికథలు 'రంగడు', 'లచ్చి' భాష, వస్తువు విషయంలోనే కాక కథలకు శీర్షికల్ని పెట్టడంలో కూడా ప్రాంతీయతపై, భాషపై జీవన విధానంపై గూడూరికి అపారమైన అభిమానం. ఆ అభిమానం అయిన కథల్లో అణువణువునా కనిపిస్తుంది.

'రంగడు' కథలో స్త్రీ మూర్తికి సంబంధించిన అతి సున్నితమైన అంశాల్ని చర్చించే ప్రయత్నం చేశారు రచయిత. రంగడు బాల్యంలోనే బతుకుతెరువుకు బలయిపోయి ఉన్నతంగా ఎదిగి పుట్టిన వారిపై, తన ప్రాణాల్ని కాపాడిన దొరసానిపై గౌరవంతో

చేసుకుంటాడు. తనవృత్తి ధర్మంగా కల్లు వంచుతున్న మూడోభార్యను ఓ వ్యక్తి కొంగుపట్టి గుంజగా నారిగాడు ఆవేశంగా చేయిచేసుకుని భార్యపట్ల అనుచిత ప్రవర్తనను వ్యతిరేకిస్తాడు. ఆశించిన మార్పు ఎంతోకాలం నిలువలేక తన సంతానం విషయంలో మొదటి పద్ధతే మళ్లీ, పునరావృతం కాగా నారిగాడు కల్లును ఆడవాళ్ళు అమ్మవద్దంటాడు. కానీ కొడుకు వినకపోగా 'ముసలోని మాటయిని గిట్లకూటికి ఎవలుజత్తరు. కల్లెమ్మటోల్లంతా గట్లనే ఉంటారా!' అని సవాలు విసుర్తాడు.

తరాలు మారిపోయి వృత్తిపై యాజమాన్యం సంతానికి సంక్రమించి పూర్వ యజమానిది కేవలం ప్రేక్షకపాత్రే అయినపుడు ఆయన పడుతున్న సంఘర్షణను, మనోస్థితిని, పల్లెజీవిక భూమికగా నిలిచిన కులాల సంస్కృతి మూల బిందువుగా చక్కగా కథనం ద్వారా మెప్పించారు గూడూరి సీతారాం. అంతేకాకుండా శ్రామిక కుటుంబాల్లో ఇల్లాలు భర్తతో పాటు కులవృత్తిలో పాల్గొనే సంస్కృతిని వివిధ కోణాల్లో చూపించారు.

'రాజమ్మ రాజరికం' వైహిక సుఖాలు, కోరికలు, విలాసవంతమైన జీవితం పట్ల ఆకర్షితురాలై మోసపోయి భిక్షగత్తెగా మారిన స్త్రీకథ. కథను ఎత్తుకోవడంలోనే ఒక కొత్త ఒరవడికి నాంది పలికారు గూడూరి. అందరు కథను నేరుగా ప్రారంభిస్తే

'సెన సేన్ల నిలుచుని నీవు
సేయిజాపవే పూసలోల్ల రాజమ్మా!
కందిసేన్ల నిలుసుని నీవు
కన్నుగీటవే పూసలోల్ల రాజమ్మా!'

అంటూ జానపదం ఎత్తుగడతో కథను ప్రారంభిస్తారు.

సంస్కృతిలో వస్తున్న మార్పులతో కొత్తగా వస్తున్న వస్తువుల పట్ల మోజుతో సామాజిక జీవనానికి భిన్నంగా ప్రవర్తించి కట్టుబాట్లని కాదనుకున్న రాజమ్మ తాను పెళ్లి చేసుకున్నా మార్పులకు లొంగని భర్తను కాదనుకుని వికటించిన నాగరికత ప్రభావంతో, కోరికలతో భర్తతో వైవాహిక జీవితానికి దూరమై రెంటికి చెడ్డ రేకడిలా చివరికి బిచ్చెగత్తెలా మారుతుంది. రాజమ్మపాత్ర ద్వారా రచయిత చూపించిన వాస్తవాలు మూడున్నర దశాబ్దాల నాటి సమాజిక, సాంఘీక స్థితిగతులకు అద్దం పడుతుంది.

అదే సమయంలో వచ్చిన మరో రెండు మంచికథలు 'రంగడు', 'లచ్చి' భాష, వస్తువు విషయంలోనే కాక కథలకు శీర్షికల్ని పెట్టడంలో కూడా ప్రాంతీయతపై, భాషపై జీవన విధానంపై గూడూరికి అపారమైన అభిమానం. ఆ అభిమానం అయిన కథల్లో అణువణువునా కనిపిస్తుంది.

'రంగడు' కథలో స్త్రీ మూర్తికి సంబంధించిన అతి సున్నితమైన అంశాల్ని చర్చించే ప్రయత్నం చేశారు రచయిత. రంగడు బాల్యంలోనే బతుకుతెరువుకు బలయిపోయి ఉన్నతంగా ఎదిగి పుట్టిన వారిపై, తన ప్రాణాల్ని కాపాడిన దొరసానిపై గౌరవంతో

తిరిగివస్తాడు. అప్పటికే తాను మిక్కిలి అభిమానించే దొర్సాని కాలం చేస్తుంది. గతమంతా జ్ఞాపకమై కదలాడగా తాను ఏ మాతృమూర్తిని చూడాలని వచ్చాడో ఆమె లేదనితెలిసి నిర్లిప్తతో తిరిగి వెళ్ళేందుకు సిద్ధమవుతాడు. జీవితంలోని విలువల్ని బేరీజు వేసుకుని మూలలకు వెళ్లి గత జీవితంలోని ఆనందాన్ని, తృప్తిని తిరిగి పొందాలనుకున్న రంగని ఆలోచనలు, రంగనిలో కలిగే మార్పులు, చేర్పులు చక్కగా చూపించారు గూడూరి.

అనితర సాధ్యంగా 1957 లోనే అణగారిన దళిత జీవన విధానాన్ని పరిశీలించి రాసిన అరుదైన ఆణిముత్యంలాంటి కథ లచ్చి. సంచార తెగకు చెందిన బిచ్చగాళ్ళ (పిచ్చకుంట్లు) బతుకు తెరువునుగూర్చి సమూలంగా పరిశీలించి అక్షరచిత్రంగా నిర్మించారు, గూడూరి సీతారాం. చాపలు అల్లుకుంటూ, బిచ్చమెత్తుకుని బతికే బిచ్చగాళ్ళ జీవితంలో అకస్మాత్తుగా కలిగిన ఆర్థిక ఎదుగుదల సామాజికంగా ఎదిగేందుకు ఉపకరించక పోగా, ఏ విధంగా నష్టపరిచిందో ఇందులో చూస్తాం. అందరిలాగానే పట్నం జీవితం కోసం వెంపర్లాడి పరిగెత్తి, పరిగెత్తి అపార్థాలకు, అనుమానాలకు లోనై చతికలపడి చివరికి అలసట చెంది పూర్వ జీవితాల్ని మళ్ళీ గెలుచుకున్న క్రమంలో జరిగిన పరిణామాలు, పరిస్థితులు సామాన్యుని జీవితంలో మార్పులు ఎందుకు అనుకూల స్థితిని కలిగించలేక పోతాయో 'లచ్చి' కథ అందుకు మంచి తార్కాణం.

ఇంకా 'అందని ఆకాశం', 'అబ్బాయి-అమ్మాయి', 'దెబ్బతిన్న అహంభావం', 'ఎర్రనిపువ్వు', 'బస్సచ్చింది', 'పిచ్చోడు' వంటి ఎనభైకి పైగా కథల్ని రాశారు గూడూరి.

గూడూరి కథలన్నిటిలో పాత్రోచిత మాండలిక సంభాషణలతో జీవకళ ఉట్టిపడుతుంది. మూడు కథలు ఆ తర్వాత గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన యువ రచయితలకు మాండలిక కథా నిర్మాణానికి ఒక దిక్సూచిగాపనిచేశాయి. కథా సాహిత్యంలోకి నిజాయితిగా, నిస్సంకోచంగా గ్రామీణ పేదల జీవితాలను, వాళ్ళ వృత్తాలను ప్రవేశ పెట్టేందుకు గూడూరి కథలు తోడ్పడ్డాయి. గూడూరి వాడిన మాండలికం ఆ తర్వాతి తరం రచయితలకు, పాఠకులకు కూడా ప్రీతి పాత్రంగా మారిందని చెప్పవచ్చు.

పాత్రయొక్క సామాజిక స్థాయిని మరువకుండా సంభాషణలు రాసిన గూడూరి తన రచనల్లోజాతీయాలు పలుకుబళ్ళను విరివిగా ఉపయోగిస్తారు. కథ నిడి వినిపెంచే వర్ణలకు ఎక్కడా స్థానం కల్పించని ఆయన వస్తువుపట్ల తీసుకున్న శ్రద్ధ పాఠకుణ్ణి తనవైపుకు మరలిస్తుంది.

జీవితంలోని అనుభవాల్ని, అనుభూతుల్ని చేదు జ్ఞాపకాల్ని నేపథ్యంగా చేసుకుని తనకున్న సజీవభాషా సంపత్తితో చక్కని, చిక్కని ప్రయోగాలతో పల్లెజీవనాన్ని చిత్రించారు గూడూరి. తెలంగాణా మాండలికానికి సాహిత్య గౌరవాన్ని, వ్యక్తిత్వాన్ని సీతారాం కలిగించారు. అంతేగాక అప్పటి సామాజిక పరిణామక్రమాన్ని అధ్యయనం చేయడానికి గూడూరి సీతారాం కథలు వాహకాలుగా నిలుస్తాయి.

ఆంధ్రభూమి సోమవారం 11 అక్టోబర్ 2000

తిరిగివస్తాడు. అప్పటికే తాను మిక్కిలి అభిమానించే దొర్సాని కాలం చేస్తుంది. గతమంతా జ్ఞాపకమై కదలాడగా తాను ఏ మాతృమూర్తిని చూడాలని వచ్చాడో ఆమె లేదనితెలిసి నిర్లిప్తతో తిరిగి వెళ్ళేందుకు సిద్ధమవుతాడు. జీవితంలోని విలువల్ని బేరీజు వేసుకుని మూలలకు వెళ్లి గత జీవితంలోని ఆనందాన్ని, తృప్తిని తిరిగి పొందాలనుకున్న రంగని ఆలోచనలు, రంగనిలో కలిగే మార్పులు, చేర్పులు చక్కగా చూపించారు గూడూరి.

అనితర సాధ్యంగా 1957 లోనే అణగారిన దళిత జీవన విధానాన్ని పరిశీలించి రాసిన అరుదైన ఆణిముత్యంలాంటి కథ లచ్చి. సంచార తెగకు చెందిన బిచ్చగాళ్ళ (పిచ్చకుంట్లు) బతుకు తెరువునుగూర్చి సమూలంగా పరిశీలించి అక్షరచిత్రంగా నిర్మించారు, గూడూరి సీతారాం. చాపలు అల్లుకుంటూ, బిచ్చమెత్తుకుని బతికే బిచ్చగాళ్ళ జీవితంలో అకస్మాత్తుగా కలిగిన ఆర్థిక ఎదుగుదల సామాజికంగా ఎదిగేందుకు ఉపకరించక పోగా, ఏ విధంగా నష్టపరిచిందో ఇందులో చూస్తాం. అందరిలాగానే పట్నం జీవితం కోసం వెంపర్లాడి పరిగెత్తి, పరిగెత్తి అపార్థాలకు, అనుమానాలకు లోనై చతికలపడి చివరికి అలసట చెంది పూర్వ జీవితాల్ని మళ్ళీ గెలుచుకున్న క్రమంలో జరిగిన పరిణామాలు, పరిస్థితులు సామాన్యుని జీవితంలో మార్పులు ఎందుకు అనుకూల స్థితిని కలిగించలేక పోతాయె 'లచ్చి' కథ అందుకు మంచి తార్కాణం.

ఇంకా 'అందని ఆకాశం', 'అబ్బాయి-అమ్మాయి', 'దెబ్బతిన్న అహంభావం', 'ఎర్రనిపువ్వు', 'బస్సచ్చింది', 'పిచ్చోడు' వంటి ఎనభైకి పైగా కథల్ని రాశారు గూడూరి.

గూడూరి కథలన్నిటిలో పాత్రోచిత మాండలిక సంభాషణలతో జీవకళ ఉట్టిపడుతుంది. మూడు కథలు ఆ తర్వాత గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన యువ రచయితలకు మాండలిక కథా నిర్మాణానికి ఒక దిక్సూచిగాపనిచేశాయి. కథా సాహిత్యంలోకి నిజాయితీగా, నిస్సంకోచంగా గ్రామీణ పేదల జీవితాలను, వాళ్ళ వృత్తాలను ప్రవేశ పెట్టేందుకు గూడూరి కథలు తోడ్పడ్డాయి. గూడూరి వాడిన మాండలికం ఆ తర్వాతి తరం రచయితలకు, పాఠకులకు కూడా ప్రీతి పాత్రంగా మారిందని చెప్పవచ్చు.

పాత్రయొక్క సామాజిక స్థాయిని మరువకుండా సంభాషణలు రాసిన గూడూరి తన రచనల్లోజాతీయాలు పలుకుబళ్ళను విరివిగా ఉపయోగిస్తారు. కథ నిడి వినిపెంచే వర్ణలకు ఎక్కడా స్థానం కల్పించని ఆయన వస్తువుపట్ల తీసుకున్న శ్రద్ధ పాఠకుణ్ణి తనవైపుకు మరలిస్తుంది.

జీవితంలోని అనుభవాల్ని, అనుభూతుల్ని చేదు జ్ఞాపకాల్ని నేపథ్యంగా చేసుకుని తనకున్న సజీవభాషా సంపత్తితో చక్కని, చిక్కని ప్రయోగాలతో పల్లెజీవనాన్ని చిత్రించారు గూడూరి. తెలంగాణా మాండలికానికి సాహిత్య గౌరవాన్ని, వ్యక్తిత్వాన్ని సీతారాం కలిగించారు. అంతేగాక అప్పటి సామాజిక పరిణామక్రమాన్ని అధ్యయనం చేయడానికి గూడూరి సీతారాం కథలు వాహకాలుగా నిలుస్తాయి.


ఆంధ్రభూమి సోమవారం 11 అక్టోబర్ 2000

జిందం అశోక్
నిర్వాహక కార్యదర్శి, మానేరు రచయితల సంఘం, సిరిసిల్ల.



'కథల కల్పవృక్షం'

నాకు రూపం లేనినాడు
నీవొక కథల కల్పవృక్షం
నేను బుడిబుడినడకలేస్తున్ననాడు
నీవు తెలంగాణ భాషకు జీవదాతువు
నేను పెరిగి పెద్దగైన రోజుల్లో
నీవు జీవభాషకు 'లగాయిత్'వు
నేను పాఠకుల్లో ఒకడినైనప్పుడు
నీవు వెలుగు వెల్లుతున్న కథల రాజువు
నేను మానేరు తీరంలో అడుగుపెట్టినప్పుడు
నీవు కథలు కథలుగ ప్రవహిస్తున్న మానేరువు
ఇప్పుడు నేను శిష్యమొలకను
నీవు కథల బాటసారులకు నీడనిచ్చే బోధివృక్షానివి.



సంకేపల్లి నాగేంద్ర శర్మ
6-6-1031/1, శివాజీనగర్,
కరీంగనగర్-505 001.

'మౌనజ్ఞాని'

ఆయన సాదాసీదా మనిషి!
తొలితరం మాండలిక కథల సవ్యసాచి!
తెలంగాణా మాగాణంలో
విరబూసిన 'ది గ్రేట్'
హన్మాజీపేట తోటపువ్వు
జ్ఞానపీఠి సినారేతో
సాహిత్య సాన్నిహిత్యాలున్న కథానిధి!
సిరిసిల్లాకు తరగని పెన్నిధి!

కథలకోట 'పట్టికోట'తో
చెట్టాపట్టాలేసుకు తిరిగిన కథల ఘనాపాఠి!
వేములవాడ రాజన్న సన్నిధిలో
వెండి పూలు పూయించిన తోటమాలి
అన్నీ తెలిసి ఏమీతెలయనట్లు
నిరంతరం నేర్చుకొనే బాటసారి
మౌనజ్ఞాని... బహుముఖ ప్రజ్ఞాశాలి.

పగిలిన దీపం

- గూడూరి సీతారాం


దీపం దీర్ఘంగా తిరుగుతుంది
గాలిభయంగా కదులుతుంది
గూట్లో చీకటివణకుతుంది
ఆకలితో నకనకలాడే పురుగులు
ఆనందానికి అంతులేక అల్లరిగా ఆడుతున్నాయ్!
దొరికింది బుక్కని దొరతనంగా పురుగులు
దీపంలో దూకాయ్, అందులోనె అవిరయ్యాయ్!

చిట్టి చిలిపిగా చిటికెలేస్తూ దీపం దరికొచ్చింది
చిరునవ్వును చిలికింది, వొద్దు బాబు అది చెడ్డది
మారణహోమం చేస్తుంది

వొద్దుబాబు వొద్దు! పరవ(?) లేదు నాన్నా!
దీపం కాటేసింది నాన్నా, దుడ్డుకర్ర తే నాన్నా
చిట్టి చీదరిస్తూ ఏడుస్తూ అమ్మనుకౌగిలించుకొంది
జాలిగా చెప్పింది.

దీపం నవ్వింది ?ట్టి పడ్సులోనే బుస్సుమంది
దీపం విరగబడి నవ్వింది
చిట్టికి కోపం తరంగంలా వచ్చింది
ముక్కలు ముక్కలు వక్కలు వక్కలు
ఏం లేకుండా చేసింది, పసికసి చల్లారింది
నాన్నతన్నులిచ్చాడు అమ్మ చీవాట్లిచ్చింది
మంటలో మంట ఏడ్పులో ఏడ్పు
'రాగం తానం పల్లవి'


('మెరుపుతీగెలు' గేయసంపుటి నుండి సేకరించబడింది 1954)




సి.నా.రె. గారి 64వ జన్మదినోత్సవ సభలో సత్కారం అందుకుంటున్న గూడూరి సీతారాం గారు




విశాల సాహితి కథా శిక్షణా శిబిరంలో గూడూరి సీతారాం గారికి జ్ఞాపిక అందిస్తున్న ద్రవిడ యునివర్సిటి వైస్ చాన్సలర్ ఆచార్య రవ్వా శ్రీహరి , మాజీ వైస్ చాన్సలర్ ఆచార్య కొలకనూరి ఇనాక్, బి.యస్. రాములు గార్లు




సిరివెలుగులకు ఆత్మీయ సత్కారం అందుకుంటున్న గూడూరి సీతారాం గారు. చిత్రంలో జిల్లా ఎస్.పి. డా. ఆర్.యస్. ప్రవీణ్ కుమార్ ఐపియస్, కేంద్ర మంత్రి సిహెచ్. విద్యాసాగర్ రావు, యం.ఎల్.ఎ సుద్దాల దేవయ్య, కలెక్టర్ సుమితా డావ్ర ఐఏయస్ గార్లు




వేములవాడ దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యులుగా శాసనసభ్యులు సిహెచ్. రాజేశ్వరరావు గారిచే సత్కరింపబడుతున్న గూడూరి సీతారాం గారు



గూడూరి సీతారాం గారితో కథకులు అంబల్ల జనార్ధన్, చంద్ర, మరాఠి రచయిత లక్ష్మీనారాయణ బొల్లి, డా. పత్తిపాక మోహన్, నిల్చున్నవారు డా. మానేపల్లి, కథారచయిత సలీం గార్లు




గూడూరి సీతారాం గారితో జూకంటి జగన్నాథం, డా. పత్తిపాక మోహన్‌లు




నిల్చున్న వారిలో మధ్యలో
కనపర్తి లక్ష్మీనర్సయ్య,
కూర్చున్నవారు:
బొయినిపల్లి వేంకటరామరావు,
గూడూరి సీతారాం గార్లు




నిల్చున్న వారు
గూడూరి సీతారాం, లక్ష్మారెడ్డి.
కూర్చున్నవారు
డా.సి. నారాయణ రెడ్డి
నెరేళ్ళ వేణుమాధవ్
డా. దాశరథి గార్లు





జీవిత సహచరి కౌసల్య గారితో గూడూరి సీతారాం గారు



కుటుంబ సభ్యులతో గాదూరి సీతారాం దంపతులు

శ్రీ తడక విశ్వనాథం
శ్రీ కరుణాల భద్రాచలం
శ్రీ మచ్చ ఆనంద్
శ్రీ రాపెల్లి సంతోష్
శ్రీ అవధూత శేఖర్
శ్రీ రచ్చ లక్ష్మణ్
శ్రీ బాలసాని నర్సయ్య
శ్రీ బి. వెంకటేశం
శ్రీ పూరడి మల్లికార్జున్
శ్రీ సిద్ధుల మురళి
శ్రీ నాగరాజు
శ్రీ గుజ్జె విజయ్‌కుమార్
శ్రీ జక్కని శ్రీనివాస్
శ్రీ బొట్ల వెంకటస్వామి
శ్రీ చెన్నూరి రమేష్
శ్రీ కాశీనాథ్ , సురేష్

ఈ స్వర్ణోత్సవ సంబరాలు విజయవంతమయ్యేందుకు సహకరించిన అందరికి

కృతజ్ఞతలు...